
'సంక్షేమ పథకాల అమలే
సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 60

బుధవారం 15-11-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కేరళ నుంచి ట్రినిటీ కాలేజీకి

14 ఏళ్లకే లండన్ కాలేజీ ఫెలోషిప్‌కు ఎంపికైన మార్టినా - ఫ్యామిలీలో..



టాప్‌గేర్‌లో టెస్లా దిగుమతులు

భారత్ నుంచి రెట్టింపు కానుంది.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి - 13లో



ఎస్సైని ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపేశారు

బిహార్‌లో ఇసుక మాఫియా ఓ ఎస్సైను ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపేయగా.. ఇది కొత్త కాదని ఆ రాష్ట్ర మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 6లో ▸



డ్రిల్లింగ్ పనుల్లో అంతరాయం

ఉత్తరాఖండ్‌లో సొరంగం కుప్పకూలిన ఘటనలో చిక్కుకుపోయిన కార్మికులను రక్షించే పనుల్లో అంతరాయం ఏర్పడింది.

వివరాలు 6లో ▸



శ్రీలంకలో భూకంపం

శ్రీలంకలో శక్తివంతమైన భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.2గా నమోదైంది.

వివరాలు 6లో ▸



రిషి సునాక్‌కు పదవీ గండం!

బ్రిటన్ ప్రధాని రిషి అవిశ్వాస పరీక్ష ఎదుర్కోవాలని, పదవి నుంచి తప్పుకోవాలని సొంత పార్టీ ఎంపీ ఆండ్రియా డిమాండ్ చేశారు.

వివరాలు 6లో ▸

దశాబ్దాల నిర్లక్ష్యానికి చికిత్స

ఆరోగ్యంలో విప్లవం

వ్యాధిని గుర్తించి ఆరోగ్యవంతులుగా మార్చే వరకు..

ప్రతి ఇంటిని జల్లెడ పట్టి అనారోగ్య సమస్యల గుర్తింపు

- గ్రామ, వార్డు స్థాయిల్లోనే ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణ
- రాష్ట్ర వ్యాప్తంగా 59.30 లక్షల మందికి ఉచితంగా చికిత్స
- అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కింద మెరుగైన వైద్యం
- 86 వేల మందిని వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేసిన వైద్యులు
- వీరికి ఉచిత చికిత్సతో పాటు, రూ.500 చొప్పున అందజేత
- చికిత్సానంతరం వైద్య సిబ్బంది నిరంతరం వాకబు



పల్నాడు జిల్లా యండ్రాయి, ధరణికోట గ్రామాల నుంచి సాక్షి ప్రతినిధి వడ్డే బాలశేఖర్

ఈ ఫొటోలోని షేక్ రిహానాకు ఏడేళ్లు. పల్నాడు జిల్లా అమరావతి మండలం యండ్రాయి గ్రామం. తండ్రి జానీ చిరు వ్యాపారి, తల్లి ఫాతిమా గృహిణి. రిహానాకు పుట్టుకతో గుండె సమస్య ఉంది. దీనికి తోడు రెండేళ్ల వయస్సు వచ్చినా మాటలు రాలేదు. గుండె సమస్య కారణంగా మాటలు రావడం లేదని తొలుత తల్లిదండ్రులు భావించారు. కొద్ది రోజులకు గుంటూరు ఆస్పత్రిలో చూపించగా, పుట్టుకతో వినికిడి లోపం సమస్య కూడా ఉందని తేలింది. పాపకు మూడేళ్లు వచ్చాక గుండెకు సర్జరీ చేయించారు. వినికిడి లోపం సమస్యకు చికిత్స చేయించాలంటే ఎంత ఖర్చు అవుతుందోనని భయపడి ఆగిపోయారు. డబ్బు సమకూర్చుకున్నాక వైద్యం చేయిద్దామనుకున్నారు. ఇలా రోజులు గడుస్తూ

మిగతా 2వ పేజీలో ▶



అదిరిపోయే బ్యాటింగ్ బలగం.. బౌలర్ల అద్భుత ప్రదర్శనతో ఏమాత్రం పోటీ లేకుండా భారీ విజయాలతో ప్రపంచకప్ లీగ్ దశను ముగించిన భారత్.. అసలైన సమరానికి సిద్ధమైంది. నాలుగేళ్ల క్రితం సెమీస్‌లో కివీస్ కొట్టిన దెబ్బకు టీమిండియా తిరిగి దీటుగా బదులిచ్చే సమయం వచ్చేసింది. నేడు ముంబైలో జరిగే సెమీస్ పోరులో న్యూజిలాండ్‌తో రోహిత్ సేన తలపడనుంది.

సెమీస్ 'ప్రతీకార' సమయం

- స్పోర్ట్స్‌లో

సుబ్రతా రాయ్ కన్నుమూత



గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సహారా ఇండియా పరివార్ వ్యవస్థాపకుడు సుబ్రతా రాయ్ కన్నుమూశారు. బిహార్‌లోని అరారియాలో జన్మించిన రాయ్.. ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, మీడియా, హాస్పిటాలిటీతో సహా వివిధ రంగాల్లో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. అయితే నిబంధనలకు వ్యతిరేకంగా దాదాపు రూ.25,000 కోట్లు వసూలు చేశారన్న ఆరోపణలపై ఆయన జైలుపాలయ్యారు.

- వివరాలు 13లో

టీడీపీ ఖాతాలోకి రూ.27 కోట్ల

స్కిల్ స్కామ్ నిధులు

హవాలా మార్గంలో చేరినట్టు గుర్తించిన సీఐడీ

ఇతర కుంభకోణాల నిధులు కూడా చంద్రబాబు పార్టీ ఖాతాలోకే

ఈ నిధుల గుట్టు రట్టు చేసేందుకు విచారణ వేగవంతం

మొదట స్కిల్ స్కామ్‌లో కార్యాచరణకు ఉపక్రమణ

టీడీపీ ప్రధాన కార్యాలయానికి నోటీసులు జారీ.. 18న తాము కోరిన వివరాలతో సిట్ కార్యాలయానికి రావాలని పేర్కొన్న సీఐడీ

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అక్రమ నిధుల తరలింపునకు టీడీపీ ప్రధాన కార్యాలయం కేంద్రబిందువుగా మారిందని సీఐడీ గుర్తించింది. వివిధ కుంభకోణాల ద్వారా కొల్లగొట్టిన అక్రమ నిధులను గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయానికి తరలించినట్టు విశ్వసిస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంతోపాటు చంద్రబాబుపై నమోదైన ఫైబర్ నెట్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్, అసైన్డ్ భూములు, మద్యం, ఇసుక కుంభకోణాల ద్వారా కొల్లగొట్టిన ప్రజాధనం హవాలా మార్గంలో

మిగతా 13వ పేజీలో ▶





బీటెక్ రవి అరెస్టు

మేజిస్ట్రేటు ఎదుట హాజరు పరిచిన పోలీసులు

14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు ఆదేశం

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు.. కానిస్టేబుల్‌పై దాడి కేసులోనూ నిందితుడు

ఈ కేసులోనే అరెస్టు చేసినట్లుగా పోలీసుల వెల్లడి

5లో

టీటీడీ నిధులతో నిర్మాణాలకు పెద్దపీట

స్విమ్స్‌లో నూతన కార్డియో న్యూరో బ్లాక్ నిర్మాణానికి రూ.74.24 కోట్లు

స్విమ్స్ ఆసుపత్రి భవనాల ఆధునికీకరణ, పునర్నిర్మాణానికి రూ.197 కోట్లు

టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయం

మీడియాకు వెల్లడించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



తిరుమల: టీటీడీ నిధులతో వివిధ నిర్మాణాలు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వెల్లడించారు. మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. సమావేశంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు హాజరయ్యారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మీడియాకు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. తిరుపతి సమీపంలోని పుదిపట్ల జంక్షన్ నుంచి వకుళమాత ఆలయం వద్ద జాతీయ రహదారి వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి రూ.21.10 కోట్లతో టెండర్ ఆమోదం. ఇది పూర్తయితే

మిగతా 5వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఏరో స్పేస్ శిక్షణకు విశాఖ విద్యార్థులు



విశాఖలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. 6 నెలల పారిశ్రామిక శిక్షణలో భాగంగా 20 మంది మెకానికల్ విద్యార్థులు బోయింగ్ ఏరోస్పేస్ శిక్షణకు ఎంపికయ్యారు.

వివరాలు 13లో ▸

జగన్‌తోనే నిజమైన సామాజిక సాధికారత



సీఎం జగన్ ద్వారానే రాష్ట్రంలో సామాజిక సాధికారత సాధ్యమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని చెప్పారు. సామాజిక సాధికార యాత్రల్లో సీఎం జగన్ లేకపోయినా జనం వేలాదిగా పాల్గొనడంతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు.

వివరాలు 13లో ▸

నేడు వాయుగుండం.. రేపటికి తీవ్రం



బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది బుధవారానికి వాయుగుండంగా.. గురువారానికి తీవ్ర వాయుగుండంగా బలపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో కొన్నిచోట్ల మోస్తరు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం.

వివరాలు 13లో ▸

గాజా.. మరుభూమి!



గాజాలో విద్యుత్, ఆక్సిజన్ సరఫరా నిలిచిపోవడంతో ఆస్పత్రులన్నీ క్రమంగా మృత్యుదిబ్బలుగా మారుతున్నాయి. ప్రధాన ఆస్పత్రి అల్ షిఫా ప్రాంగణంలో ఏకంగా 179 మృతదేహాలను సామూహికంగా ఖననం చేశారు.

వివరాలు 6లో ▸

ఇదం జగత్



తనని చూసి కాకున్నా.. కనీసం తన మేనిఫెస్టోని చూసి ఓటేయమంటున్నాడు!

అదే పనిగా అసత్యాల 'ఎత్తిపోతలు'

- చంద్రబాబు హయాంలోనే వరికపూడిశెల అయిపోయినట్టు 'ఈనాడు' కలరింగ్
- 2019 ఎన్నికలకు ముందు వరికపుడిశెల పేరుతో ఓట్ల డ్రామా
- అటవీశాఖ అనుమతులు తీసుకోకుండానే ప్రాజెక్ట్‌కు పరిపాలనా అనుమతులు, టెండర్ల నాటకం

3లో

రెండు వర్గాల ఘర్షణపై కుట్రపూరిత రాతలా?

- దళిత లాయర్‌పై వైఎస్సార్‌సీపీ నేతలు దాడి అంటూ ఈనాడు విషపురాతలు
- కొలిమిగుండ్ల గ్రామకంఠం భూమిలో కమ్యూనిటీ హాలు నిర్మించుకుంటున్న దళితులు
- ఆ స్థలాన్ని కబ్జా చేయాలనుకున్న టీడీపీ నేత, లాయర్ విజయ్‌కుమార్

3లో

ఫ్యాక్ట్‌చెక్

బడుల పైనా 'బండ' రాతలే!

- సీఎం జగన్ ఆధ్వర్యంలో అత్యాధునికంగా ప్రభుత్వ స్కూళ్లు
- 'నాడు–నేడు'తో నూతన భవనాలు, అన్ని రకాల సౌకర్యాలు, డిజిటల్ బోధన.. ఇది చూసి తట్టుకోలేక 'ఈనాడు' దుష్ప్రచారం
- పనులు జరుగుతున్న స్కూళ్ల ఫొటోలు వేసి అబద్ధపు రాతలు

3లో

ఆర్టీసీ ఉద్యోగులపై అవాస్తవాలేల!

- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి 52 వేల మందికి మేలు కల్పించింది కనపడదా?
- ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య సేవలు
- ఈహెచ్ఎస్ రిఫరల్ ఆస్పత్రులతో పాటు 21 ఆర్టీసీ ఆస్పత్రుల్లోనూ నాణ్యమైన వైద్యం

3లో

'ఆరడుగుల' వేదన తీరింది!

తరతరాలుగా శ్మశానం కోసం దళితవాడల ప్రజల ఎదురుచూపులు

అంతిమ సంస్కారాలు చేసే చోటు లేక గతంలో అష్టకష్టాలు

శ్మశాన వాటికలు లేని దళితవాడలు ఉండకూడదన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సీఎం నిర్ణయంతో బాపట్ల జిల్లా పెదపాలెంలో సమస్యకు పరిష్కారం

శ్మశాన వాటిక కోసం ఎకరం భూమి కేటాయింపు

రాష్ట్ర వ్యాప్తంగా 1,563 దళితవాడలకు శ్మశాన వాటికలు

951 ఎకరాలను పంచాయతీలకు అప్పగించిన ప్రభుత్వం



బాపట్ల జిల్లా పెదపాలెంలో రోడ్డు పక్కనే ఉన్న సమాధులు



శ్మశానవాటిక కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం మంజూరు చేసిన భూమి

బాపట్ల జిల్లా భట్టిప్రోలు నుంచి సాక్షి ప్రతినిధి బి.ఫణికుమార్

రాష్ట్రంలోని దళితవాడలను తరతరాలుగా ఓ సమస్య వేధిస్తోంది. ఎవరైనా చనిపోతే అంతిమ సంస్కారాలు ప్రశాంతంగా నిర్వహించలేకపోవడమే ఆ సమస్య. వారికి శ్మశాన వాటికలు లేకపోవడమే దానికి కారణం. అలాంటి సమస్య ఉన్న గ్రామాల్లో బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ శివారున పెదపాలెం దళితవాడ ఒకటి. 150 ఇళ్లు ఉన్న ఆ ఊళ్లో ఎవరైనా చనిపోతే వారికి అంత్యక్రియలు ఎక్కడ చేయాలనేది పెద్ద సమస్య. ఆ గ్రామం ఏర్పడి వందల ఏళ్లయినా అక్కడ మాత్రం శ్మశానం లేదు. రోడ్డు పక్కన, చెట్ల చాటున, పొదల మధ్య, కంచెల్లో, బురదలో ఎక్కడో ఒక చోట

మిగతా 13వ పేజీలో ▶

క్లుప్తంగా...

పండిట్ నెహ్రూ సేవలు చిరస్మరణీయం: గవర్నర్

సాక్షి, అమరావతి: దేశ ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. విజయవాడ రాజ్‌భవన్‌లో మంగళవారం పండిట్ నెహ్రూ జయంతిని నిర్వహించారు. పండిట్ నెహ్రూ చిత్రపటం వద్ద గవర్నర్ నివాళి అర్పించారు.

క్షయ వ్యాధి నివారణకు సమన్వయంతో కృషిచేయాలి

క్షయ వ్యాధి నివారణకు సమన్వయంతో కృషి చేయాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. 74వ టీబీ సీల్ సేల్ ప్రచార కార్యక్రమాన్ని విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఆయన మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రంలో క్షయ వ్యాధి నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను గవర్నర్ ప్రశంసించారు. అందుకుగాను రాష్ట్రానికి ఖుషీ రామ్ షీల్డ్ అవార్డు రావడంపై ఆయన అభినందించారు.

నేటి నుంచి కులగణన

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోన్న కులగణన బుధవారం(నేడు) ప్రారంభం కానుంది. శ్రీకాకుళం జిల్లా గార మండలం రామచంద్రాపురం, వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలం అచ్చవల్లి, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆర్‌సీ పురం మండలం నేలపర్తిపాడు గ్రామాలలోని గ్రామ సచివాలయాలతో పాటు విజయవాడ నగర కార్పొరేషన్ పరిధిలోని గుణదల-3వ వార్డు సచివాలయం, నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని అరుంధతివాడ వార్డు సచివాలయాల పరిధిలో పైలట్‌గా కులగణన చేపట్టనున్నారు. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని రెండేసి వలంటీర్ల క్లస్టర్ల పరిధిలో..వార్డు సచివాలయాల పరిధిలో ఒక్కో వలంటీర్ల పరిధిలో, సచివాలయానికి వందేసి ఇళ్లల్లో కులగణన నిర్వహిస్తారు. ఆయా సచివాలయాల సిబ్బంది, ఎంపీడీవోలు, తహశీల్దార్లతో పాటు పట్టణ ప్రాంతంలో నగర, మున్సిపల్ కమిషనర్లకు బుధవారం ఉదయం 11-12 గంటల మధ్య వర్చువల్ విధానంలో కులగణనకు సంబంధించి గ్రామ వార్డు సచివాలయాల శాఖ అధికారులు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం స్థానిక సచివాలయాల సిబ్బంది ఆయా వలంటీర్ల క్లస్టర్ల పరిధిలో కులగణన చేపడతారు.

నిరుపేదల సాధికారతే సమగ్ర కులగణన లక్ష్యం

మంత్రి వేణుగోపాలకృష్ణ

కాకినాడ సిటీ: రాష్ట్రంలో అన్ని వర్గాల్లోని నిరుపేదల సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం బుధవారం నుంచి సమగ్ర కులగణన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం కాకినాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ. ఈ సందర్భంగా ఎదురయ్యే విధానపరమైన అంశాల మేరకు ఏమైనా మార్పులు అవసరమైతే చేసి.. ఆ తర్వాత పూర్తిస్థాయిలో కులగణన చేపడతామని తెలిపారు.

నేడు 'జన జాతీయ గౌరవ దివస్'

సాక్షి, అమరావతి: గిరిజన స్వాభిమాన్ ఉత్సవాలు (జన జాతీయ గౌరవ దివస్)-2023ను బుధవారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం బీచ్‌లో ర్యాలీని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, మంత్రి విడదల రజిని ప్రారంభించనున్నారు. 'వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర' కార్యక్రమంలో భాగంగా గిరిజన స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని నేటి నుంచి 26 వరకు గిరిజన స్వాభిమాన్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించ నున్నారు. ప్రతి రోజూ గిరిజన నృత్యాలు, సంగీతం, గిరిజన కళలు, గిరిజన సంస్కృతి, గిరిజన ఆహారపు ఉత్పత్తులు, అరకు కాఫీ ప్రదర్శన శాల తదితరాలను నిర్వహిస్తారు.

జనజీవితాలు చిగురించేలా!

పల్నాటి సీమ రూపురేఖలను సమూలంగా మార్చే దిశగా సర్కారు అడుగులు

సాక్షి, అమరావతి: పల్నాటి సీమ రూపురేఖలను సమూలంగా మార్చే దిశగా అడుగులు వేస్తూ పల్నాడు జిల్లా మాచర్ల వద్ద వరికపుడిశెల ఎత్తిపోతల పథకం పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం శ్రీకారం చుడుతున్నారు. పల్నాడు, ప్రకాశం జిల్లాల ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ.. 'వైఎస్సార్ పల్నాడు కరువు నివారణ పథకం' కింద రూ.340.26 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వరికపుడిశెల ఎత్తిపోతల పథకానికి కీలకమైన కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖతోపాటు అన్ని అనుమతులు సాధించిన తక్షణమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పనులను ప్రారంభించనున్నారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా వెల్దుర్తి, ఉప్పలపాడు, గొట్టిపాళ్ల, సిరిగిరిపాడు, బొదిలవీడు, గంగలకుంట, కండ్లకుంట గ్రామాల పరిధిలో 24,900 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 20 వేల మంది జనాభాకు తాగునీరు అందించేందుకు జగన్ ప్రభుత్వం సిద్ధమైంది.

పైపులైన్ల ద్వారా నీరందించే తొలి ప్రాజెక్ట్ ఇదే

రాష్ట్రంలో పూర్తిగా పైపులైన్ల ద్వారా నీరందించే తొలి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. 4 పంపుల ద్వారా 281 క్యూసెక్కుల నీటి సరఫరా అయ్యేలా 1.57 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా దీనికి రూపకల్పన చేశారు. ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా నదీ జలాలను మళ్లించి వెనుకబడిన మెట్ట ప్రాంతాల ప్రజల కష్టాలు తీర్చేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..


కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం అమీనాబాదులో పార్టీ జెండాను అందిస్తూ ప్రభుత్వ సంక్షేమాన్ని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పల్నాడు జిల్లా చాగల్లులో సంక్షేమ, అభివృద్ధి పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వర రెడ్డి, మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి తదితరులు


కర్నూలు జిల్లా హాలహర్వి మండలంలోని గూళ్యం-1 సచివాలయం పరిధిలో మంత్రి గుమ్మనూరు జయరాంకు స్వాగతం పలుకుతున్న స్థానికులు


ప్రకాశం జిల్లా చీమకుర్తిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి


చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం గుండ్రాజు కుప్పం సచివాలయ పరిధిలో పతాకాన్ని ఎగురవేస్తున్న మంత్రి ఆర్కే రోజా


విజయనగరం జిల్లా వల్లంపూడి సచివాలయం పరిధిలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో కూడిన డాష్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


విశాఖ జిల్లా పద్మనాభం మండలం బి.ఆర్.తాళ్లవలసలో వైఏపీ నీడ్స్ జగన్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం చేస్తున్న గృహ సారథులు

ఆరోగ్యంలో విప్లవం



▶ మొదటి పేజీ తరువాయి

పాపకు ఏడేళ్లు వచ్చాయి. అందరు పిల్లలు గలగలా మాట్లాడుతుంటే రిహానా మాత్రం మౌనంగా ఉండటం చూసి తల్లిదండ్రులు ఆవేదనకు గురవ్వని రోజంటూ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం వీరికి కలిసొచ్చింది. గత నెల 6న గ్రామంలో సురక్ష క్యాంప్ నిర్వహించారు. తల్లి ఫాతిమా.. రిహానాను ఆ క్యాంప్‌నకు తీసుకెళ్లింది. వైద్యులు పరిశీలించి గుంటూరు జీజీహెచ్‌కు రెఫర్ చేశారు. అక్కడ పలు పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. అవి వాడాక వాస్తే మరికొన్ని పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఫలితాల ఆధారంగా స్పీచ్ థెరపీ ఇవ్వడం లేదంటే కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీ నిర్వహించడమో చేస్తామని తెలిపారు. 'నా బిడ్డ మాట్లాడలేని స్థితిలో ఉండటం చూసి ఏడుపు వస్తోంది. సురక్ష క్యాంప్‌లో వైద్యులు చెప్పారని జీజీహెచ్‌కు వెళ్లొచ్చాను. పాపకు చికిత్స చేసి మాటలొచ్చేలా చేస్తామన్నారు. నా బిడ్డకు మాటలొస్తే చాలు అంతకు మించి ఏమీ వద్దు' అని ఫాతిమా అంటోంది. 'మీరు అధైర్యపడొద్దు. వైద్య పరీక్షలకు వెళ్లండి. ఆశా వర్కర్‌ను మీకు తోడుగా పంపుతాను. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందింది. ప్రభుత్వమే ఉచితంగా పాపకు మాటలు వచ్చేలా చికిత్స చేయిస్తుంది. ఆరోగ్యశ్రీ కింద రూ.12 లక్షల ఖరీదైన రెండు చెవులకు కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీని ప్రభుత్వం ఉచితంగా చేయిస్తోంది' అని అత్తలూరు పీహెచ్‌సీ డాక్టర్ రవిబాబు ఫాతిమాకు ధైర్యం చెప్పారు. ఇలా ఏపీలోని ప్రజలందరి ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అండగా నిలుస్తోంది.

■ ఈ ఫొటోలో వైద్యుడు రవిబాబు పరిశీలిస్తున్న ఉషారాణిది యండ్రాయి గ్రామమే. చిన్నపాటి పాడి రైతు. కొద్ది నెలల క్రితం కాలికి సర్జరీ చేయించుకుంది. అనంతరం కాలు వాపు రావడంతో పాటు, గాయాలు మొదలయ్యాయి. సర్జరీ కారణంగా ఇన్‌ఫెక్షన్ వచ్చిందేమోనని గుంటూరులోని పలు ఆస్పత్రుల్లో చూపించుకుంది. మందులు వాడినా సమస్య తగ్గలేదు. ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించినప్పుడు ఆమె తన సమస్య వివరించింది. ఈ క్రమంలో సురక్ష శిబిరానికి హాజరవ్వమని సిబ్బంది సూచించారు. గత నెల 6వ తేదీన శిబిరానికి హాజరైంది. స్పెషలిస్ట్ వైద్యులు ఆమెను పరిశీలించి బోద వ్యాధి లక్షణాలున్నాయని, అమరావతి సీహెచ్‌సీకి రెఫర్ చేశారు. వైద్య సిబ్బంది సహాయంతో ఆమె అక్కడికి వెళ్లింది. వైద్య పరీక్షల అనంతరం తెనాలిలోని ప్రభుత్వ ఫైలేరియా సెంటర్‌కు రెఫర్ చేశారు. అక్కడ బోద వ్యాధిగా నిర్ధారించారు. ఉచితంగా మందులు అందించారు. ఈ క్రమంలో ఉషారాణి మాట్లాడుతూ.. 'ఊళ్లో ఆరోగ్య సురక్ష క్యాంప్ పెట్టి ప్రభుత్వం నాకు ఎంతో మేలు చేసింది.



లేకుంటే నా సమస్యను ఇంకా నిర్లక్ష్యం చేసేదాన్ని. నేను ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకునే వరకు వైద్య సిబ్బంది రోజూ ఫాలోఅప్ చేశారు' అని సంతోషం వ్యక్తం చేస్తోంది.1250 మంది జనాభా ఉన్న యండ్రాయి గ్రామంలో నిర్వహించిన సురక్ష క్యాంప్‌నకు వివిధ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న 350 మంది హాజరయ్యారు. వీరిలో 88 మంది కంటి సంబంధిత సమస్యలతో బాధ పడుతున్నారు. మిగిలిన వారు గ్యాస్ట్రిక్, బీపీ, షుగర్ వంటి ఇతర సమస్యలతో బాధపడుతున్నారు. కంటి సమస్యలున్న వారిలో 74 మందికి ఆప్తమాలజిస్ట్ సూచన మేరకు కళ్లద్దాల పంపిణీ చేపడుతున్నారు. ఇక రిహానా, ఉషారాణి తరహాలో పలు తీవ్రమైన సమస్యలున్న నలుగురిని ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేశారు. స్పెషలిస్ట్ వైద్య సేవల కోసం ఈ గ్రామస్తులు 25 కి.మీ దూరంలో ఉండే గుంటూరు జీజీహెచ్‌కు వెళ్తుంటారు. దీంతో ఒకసారి గుంటూరుకు పోయి రావాలంటే కనీసం రూ.500 చొప్పున రవాణా, ఇతర అవసరాలకు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ఒక రోజంతా పని మానుకోవాల్సి రావడంతో కూలి డబ్బులు నష్టపోవాల్సి వస్తుంది. ఈ ఖర్చులకు భయపడి ఇదే గ్రామానికి చెందిన దస్తగిరి కొంత కాలంగా మోకాళ్ల నొప్పులు వేధిస్తున్నప్పటికీ మందులు వేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. సురక్ష క్యాంప్‌లో స్పెషలిస్ట్ వైద్య సేవలుంటాయని స్థానిక ఏఎన్ఎం చెప్పడంతో హాజర య్యాడు. తన సమస్యకు వైద్య సేవలు పొందాడు. క్యాంప్‌లోనే ఉచితంగా మందులు ఇచ్చారు. ఆ మందులు వాడినా సమస్య నయం అవ్వకపోతే తదు పరి వైద్యం ఉచితంగా అందిస్తామని చెప్పారు.

సీఎం జగన్ సర్కార్ ఆరోగ్య భరోసా

అనారోగ్య సమస్యలున్నప్పటికీ సుదూర ప్రాంతంలో ఉండే ఆస్పత్రులకు వెళ్లి చూపించుకోలేక కొందరు, నిర్లక్ష్యంతో మరికొందరు ప్రాణాల మీదకు తెచ్చుకుంటుంటారు. ఈ నేపథ్యంలో ప్రాణం విలువ తెలిసిన సీఎం జగన్.. రాష్ట్రంలో ఏ ఒక్కరూ వైద్య సాయం అందక ఇబ్బంది పడటానికి వీల్లేకుండా ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించారు. అయినప్పటికీ ఇంకా ఎవరైనా ప్రజలు వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారేమోనని మరో అడుగు ముందుకు వేసి ప్రతి ఇంటిని జల్లెడ పట్టి.. ప్రజల ఆరోగ్య సమస్యలు, అవసరాలను గుర్తించి ఉచిత చికిత్సలు చేపట్టి, వైద్య పరంగా చేయి పట్టి నడిపించడం కోసం ఆరోగ్య సురక్షకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో అనేక సత్ఫలితాలు కనిపిస్తున్నాయి.

ఉన్న ఊళ్లోనే 59.30 లక్షల మందికి వైద్యం

ఏఎన్ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) నేతృత్వంలోని వైద్య బృందాలు 1.44 కోట్లకు పైగా గృహాలను సందర్శించి ప్రజలను స్క్రీనింగ్ చేపట్టాయి. బీపీ, షుగర్, హెచ్‌బీ, మలేరియా, డెంగ్యూ వంటి ఏడు రకాల పరీక్షలను 6.50 కోట్ల మేర నిర్వహించారు. తద్వారా వివిధ అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారిని గుర్తించి సురక్ష శిబిరాలకు తరలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 9వ తేదీ నాటికి గ్రామాల్లో 9,982, పట్టణాల్లో 2,258 సురక్ష శిబిరాలను ప్రభుత్వం నిర్వహించింది. ఒక్కో శిబిరంలో సగటున 485 చొప్పున 59,30,972 మందికి సొంత ఊళ్లలోనే వైద్య సేవలు అందించారు. ప్రతి శిబిరంలో జనరల్ మెడిసిన్, గైనిక్, పీడియాట్రిక్, ఆప్తమాలజిస్ట్ వంటి స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించారు. ప్రతి శిబిరం వద్ద ర్యాపిడ్ టెస్ట్‌లతో పాటు, ఈసీజీ, ఇతర వైద్య పరీక్షలు నిర్వహణతోపాటు, 172 రకాల మందులను అందుబాటులో ఉంచారు.

ఖరీదైన వైద్యం పూర్తిగా ఉచితం

సురక్ష క్యాంప్‌లకు వచ్చిన వివిధ అనారోగ్య బాధితుల్లో మెరుగైన వైద్యం అవసరం ఉన్న వారిని ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ఇలా 86,108 మందిని ఇప్పటి వరకు రెఫర్ చేయగా వీరందరికీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స చేపడుతోంది. గుండె, కిడ్నీ, మెదడు సంబంధిత జబ్బులు, క్యాన్సర్, ఇతర వ్యాధులకు ఖరీదైన చికిత్సలను పూర్తి ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆఖరికి వీరు ఆస్పత్రులకు పోయి, రావడానికి అయ్యే ప్రయాణ చార్జీలు కూడా ప్రభుత్వమే అందిస్తోంది. ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ఇస్తోంది. ప్రతి రెఫరల్ కేసును స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు, ఏఎన్ఎం, సీహెచ్‌వోల ద్వారా పర్యవేక్షిస్తూ వైద్యం అందించేలా చూస్తున్నారు. ఇలా ఇప్పటి వరకూ 19,934 మంది ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు వెళ్లగా, 1,634 మందికి అడ్మిషన్ అవసరం ఉందని వైద్యులు నిర్ధారించారు. మిగిలిన వారికి మెడికేషన్ అందించారు. అడ్మిషన్ అవసరం ఉన్న వారిలో 1,060 మందికి సర్జరీలు, చికిత్సలు పూర్తయ్యాయి. చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన వారి ఆరోగ్యంపై వైద్య శాఖ నిరంతరం వాకబు చేస్తోంది. కాలానుగుణంగా ఎప్పటికప్పుడు అవసరమైన మందులు, వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతోంది.

ఆరోగ్య సురక్ష ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా బాధితులకు ఊరట లభించింది ఇలా..

కంటి సమస్యల బాధితులు

చికిత్స రకం	వ్యక్తులు
సాధారణ మెడికేషన్	2,80,600
కళ్లద్దాలు అందజేత	5,52,338
క్యాటరాక్ట్ సర్జరీల కోసం రిఫరల్ (3,686 మందికి సర్జరీ పూర్తి)	76,141
ఆస్పత్రుల్లో చికిత్స కోసం రిఫరల్ (247 మందికి చికిత్స పూర్తి)	11,761

కొత్తగా దీర్ఘకాలిక వ్యాధి బాధితుల గుర్తింపు

సమస్య	వ్యక్తులు
రక్తపోటు	2,61,638
మధుమేహం	1,56,274
కుష్టు	10,002
క్షయ	475
పుట్టుకతో వివిధ సమస్యలున్న పిల్లలు	1,350

చాలా సంతోషంగా ఉంది



నాకు 72 ఏళ్లు. రక్తపోటు, మధుమేహం సమస్యతో కొన్నేళ్లుగా బాధ పడుతున్నాను. గతంలో ప్రతి నెలా గుంటూరుకు మెడికల్ చెకప్ కోసం వెళ్లేవాడిని. ఒకసారి గుంటూరుకు పోయి, రావడానికి రూ.వెయ్యికి పైనే ఖర్చు అయ్యేది. ఈ ప్రభుత్వం వచ్చాక మా గ్రామంలోనే వైద్య సేవలు అందుతున్నాయి. ప్రతి నెలా మా గ్రామానికే డాక్టర్ వస్తున్నారు. దీంతో గుంటూరుకు వెళ్లడం మానేశాను. మందులు బాగా పని చేస్తున్నాయి. దీనికి తోడు ఈ మధ్య ఆరోగ్య సురక్ష క్యాంప్ పెట్టారు. గతంలో మేం వైద్యం కోసం వేరే ప్రాంతాలకు వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా వద్దకే వచ్చి వైద్యం చేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– కె. పోలేశు, యండ్రాయి, పల్నాడు జిల్లా

పెద్ద ఊరట కల్పించారు



వయోభారం రీత్యా కాళ్లు, నడుము నొప్పులతో కొన్నాళ్లుగా బాధపడుతున్నాను. పట్టణంలోని ఆస్పత్రికి వెళ్లాలంటే ఎవరో ఒకరు తోడుండాలి. దీనికి తోడు రానుపోను చార్జీలు, ఇతర ఖర్చులు పెట్టుకోవాలి. ఇంట్లో ఎవరైనా పట్టణానికి పోయినప్పుడు తెచ్చి ఇచ్చే మాత్రలు వేసుకుంటూ కాలం వెల్లదీస్తుండేదాన్ని. ఈ పరిస్థితుల్లో గ్రామంలో క్యాంప్ పెట్టారని వలంటీర్ చెప్పడంతో వెళ్లాను. నాకున్న సమస్యలు చెప్పాను. మందులు ఇచ్చారు. అవి వేసుకుంటుంటే నొప్పులు తగ్గాయి. గ్రామంలోనే వైద్య శిబిరం పెట్టి చాలా పెద్ద ఊరట కల్పించారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు నెలనెలా ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేస్తున్నట్టే, వైద్య సేవలను చేరువ చేసి పుణ్యం కట్టుకున్నారు.

– కింతలి రాజేశ్వరమ్మ, తోనంగి, గార మండలం, శ్రీకాకుళం జిల్లా.

ఇంత శ్రద్ధ ఏ ప్రభుత్వం చూపలేదు



ఎనిమిదేళ్ల క్రితం నా గుండెకు స్టెంట్ వేశారు. రోజూ మందులు వాడటంతో పాటు, రెండు, మూడేళ్లకు ఓసారి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. మందులు అయితే వాడుతున్నా కానీ పరీక్షలు చేయించుకోలేదు. మా ఊళ్లో పెద్ద డాక్టర్లతో క్యాంప్ పెడుతున్నారని చెబితే వెళ్లి చూపించుకున్నాను. వాళ్లు ఈసీజీ తీశారు. ఎందుకైనా మంచిదని గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లండని చెప్పారు. వెళ్లాను.. పరీక్షలు చేశారు. అంతా బాగుందని చెప్పారు. ఈ ప్రభుత్వం వచ్చాక మా గ్రామంలోనే బీపీ, రక్తం పలుచబడే బిళ్లలు ఇస్తున్నారు. నెలనెలా డాక్టర్ వస్తున్నారు. వైఎస్సార్ కంటి వెలుగు కింద ఉచితంగా కంటి ఆపరేషన్ చేశారు. ఇన్ని విధాలుగా గతంలో ఏ ప్రభుత్వం మా ఆరోగ్యాలపై శ్రద్ధ చూపలేదు.

– ఎస్.ఆదం, ధరణికోట, పల్నాడు జిల్లా


కిడ్నీ సమస్యను గుర్తించి చికిత్స



కొద్ది నెలలుగా నడుము భాగంలో నొప్పి వస్తుండేది. గుంటూరు వరకు పోయి చూపించుకోలేక ఏవో మందులు తెప్పించుకుని నొప్పి నుంచి విముక్తి పొందేదాన్ని. గ్రామంలో క్యాంప్ పెట్టడంతో వెళ్లాను. వైద్యులకు నా సమస్య వివరించాను. కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. క్యాంప్‌లోనే పలు మందులు ఇచ్చారు. జీజీహెచ్‌కు వెళ్లమని చీటీ ఇచ్చారు. ఆ మందులు వాడాక నొప్పి తగ్గుముఖం పట్టింది. జీజీహెచ్ కూడా వెళ్లొచ్చాను. క్యాంప్‌లో ఇచ్చిన మందులన్నీ వాడాక రమ్మన్నారు.

– మొగల్ సబీరా, యండ్రాయి, పల్నాడు జిల్లా

ప్రతి కేసుపై ప్రత్యేక శ్రద్ధ



పీహెచ్‌సీ పరిధిలోని సురక్ష శిబిరాల్లో ఏడు వేల మంది వైద్య సేవలు అందుకున్నారు. 168 మందిని ఆస్పత్రులకు రెఫర్ చేశారు. ప్రతి రెఫరల్ కేసుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. రెఫరల్ కేసుల్లో సంబంధిత వ్యక్తులను ఆస్పత్రులకు తరలించి, అక్కడ వైద్య సేవలు అందేలా పర్యవేక్షిస్తున్నాం. ఆశా వర్కర్‌ను తోడు పంపి వైద్య సేవలు అందిస్తున్నాం. చికిత్స అనంతరం డిశ్చార్జి అయిన రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యంపై వాకబు చేస్తున్నాం.

– డాక్టర్ రవిబాబు, మెడికల్ ఆఫీసర్, అత్తలూరు పీహెచ్‌సీ, పల్నాడు జిల్లా

నెలలో మండలంలో నాలుగు చోట్ల



నిరంతరాయంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టాలని సీఎం ఆదేశించారు. జనవరి నుంచి ప్రతి మండలంలో నెలలో నాలుగు చోట్ల సురక్ష శిబిరాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇక ఇప్పటికే శిబిరాల నుంచి వచ్చిన రెఫరల్ కేసులన్నింటికీ వంద శాతం మెరుగైన, నాణ్యమైన చికిత్సలు అందించడానికి చర్యలు వేగవంతంగా చేపడుతున్నాం.

– జె.నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్

నేటి నుంచి సామాజిక సాధికార యాత్ర రెండో దశ

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ చేసిన మేలును వివరించనున్న నేతలు
- 39 నియోజకవర్గాల్లో సామాజిక సాధికార యాత్ర
- నేడు నరసన్నపేట, పొన్నూరు, హిందూపురం నియోజకవర్గాల్లో బస్సు యాత్ర

సాక్షి, అమరావతి: నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ అంటూ ఆ వర్గాలను అక్కున చేర్చుకొన్న దేశంలో ఏకైక సీఎం వైఎస్ జగన్. ఆ వర్గాలకు సీఎం జగన్ ప్రభుత్వం అందించిన చేయూతతో రాష్ట్రంలో సామాజిక సాధికారత ఆవిష్కృతమైంది. వైఎస్ జగన్ పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జరిగిన మేలును, సామాజిక న్యాయం, రాజ్యాధికారం పొందిన వైనాన్ని ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర రెండో దశ బుధవారం ప్రారంభమవుతోంది. ఈ నెల 30 వరకు ఈ యాత్ర జరుగుతుంది. బుధవారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట, గుంటూరు జిల్లా పొన్నూరు, శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గాల్లో బస్సు యాత్ర జరగనుంది.

రెండో దశలో 39 నియోజకవర్గాల్లో యాత్ర

వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ యాత్ర తొలి దశలో 35 నియోజకవర్గాల్లో జరిగింది. రెండో దశలో 39 నియోజకవర్గాల్లో జరుగుతుంది. ఈ యాత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు పాల్గొంటారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఈ నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఈ వర్గాల ఆర్థిక సాధికారత కోసం తీసుకున్న చర్యలను, చేసిన మంచిని ఈ యాత్రల్లో నేతలు వివరిస్తున్నారు. అక్టోబర్ 26న ప్రారంభమైన సామాజిక సాధికార యాత్ర మొదటి దశ పూర్తి స్థాయిలో విజయవంతమైంది.

దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్..

సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రజలకు సంక్షేమాన్ని అందించడంలో దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలిచింది. ఈ నాలుగున్నరేళ్లలో రూ. 2.35 (డీబీటీ) లక్షల కోట్లు సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారులకు అందాయి. రూ. 2.34 లక్షల కోట్లు నాన్ డీబీటీ రూపంలో అందాయి. మొత్తంగా రూ.4.69 లక్షల కోట్లను వివిధ రూపాల్లో పేదల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం సీఎం జగన్ అందించారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇంతకు ముందు, ఇప్పుడూ ఇంత పకడ్బందీగా, ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం ప్రజలకు అందలేదు. దీంతో పాటు రాష్ట్రాల అభివృద్ధికి ప్రామాణికంగా నిలిచే జీఎస్డీపీ వద్ధి రేటులోనూ రాష్ట్రం నంబర్ వన్‌గా నిలిచింది.

అమల్లోకి ఏపీ భూ హక్కుల చట్టం

దేశంలోనే మొదటిసారి చట్టాన్ని తెచ్చిన ఏపీ ప్రభుత్వం

సాక్షి, అమరావతి: దేశంలోనే మొట్ట మొదటిసారిగా రాష్ట్రంలో భూ హక్కుల చట్టం (ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్) అమల్లోకి వచ్చింది. ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టం 2023ని ఈ సంవత్సరం అక్టోబర్ 31 నుంచి అమల్లోకి తెస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో నంబర్ 512 జారీ చేసింది. దాని గెజిట్ నోటిఫికేషన్ మంగళవారం విడుదలైంది. ఇటీవలే ఈ చట్టానికి రాష్ట్రపతి ఆమోదం లభించడంతో ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. భూ యజమానులు, కొనుగోలుదారులకు భూమి హక్కులపై పూర్తి భరోసా ఇచ్చేలా ఈ చట్టాన్ని రూపొందించారు. ఇంతవరకు ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి చట్టం లేదు. భూ హక్కుల చట్టం ప్రకారం స్థిరాస్థి హక్కుల రిజిస్టర్ తయారు చేస్తారు. స్థిరాస్థిని యజమాని తప్ప వేరే ఎవరూ విక్రయించే అవకాశం ఉండదు. రాష్ట్రంలోని మొత్తం స్థిరాస్థుల శాశ్వత రిజిస్టర్, వివాద రిజిస్టర్ తో పాటు కొనుగోలు రిజిస్టర్ రూపొందిస్తారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులను సవరిస్తారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారి నేతృత్వంలో ఏపీ ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేస్తారు. ఆ అధికారి కింద మండల స్థాయిలో లాండ్ టైట్లింగ్ అధికారులను నియమిస్తారు. భూమి హక్కులను రిజిస్టర్ చేసే బాధ్యత ల్యాండ్ టైట్లింగ్ అధికారికే ఉంటుంది. పలు దశల తర్వాత టైట్లింగ్ అధికారి భూముల యజమానులను శాశ్వత హక్కుదారులుగా గుర్తించి రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. వీటిపై ఎవరూ కోర్టుకు వెళ్లే అవకాశం కూడా ఉండదు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ ట్రిబ్యునళ్లలో తేల్చుకోవడం తప్ప కోర్టుకు వెళ్లడానికి అవకాశం ఉండదు. రాష్ట్ర స్థాయి ట్రిబ్యునల్ తీర్పు లపైనే హైకోర్టులో సవాల్ చేసే అవకాశం ఉంటుంది.

క్లుప్తంగా...

నాడు-నేడులో వసతి గృహాల అభివృద్ధి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



విద్యార్థినికి కేక్ తినిపిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేసినట్లే, రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాలను అభివృద్ధి చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం తణుకులోని ఎస్సీ కళాశాల విద్యార్థినుల హాస్టల్లో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు

ఢిల్లీ ట్రేడ్ ఫెయిర్‌లో ఏపీ పెవిలియన్ ప్రారంభించిన మంత్రి అమర్‌నాథ్



ఏపీ పెవిలియన్‌ను ప్రారంభిస్తున్న అమర్‌నాథ్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనువైన పరిస్థితులు, విస్తృత అవకాశాలు ఉన్నాయని పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో నిర్వహిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్‌ను మంత్రి అమర్‌నాథ్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని వనరులను సమకూర్చడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఏపీ ఉన్నతాధికారులు కె.సునీత, హిమాన్షు కౌశిక్, మోపర్తి సుధాకర్, భాను సాయిప్రతాప్ పాల్గొన్నారు.

చింతమనేని తీరుపై భగ్గుమన్న దళితులు

ఏలూరులో దళిత సంఘాల ర్యాలీ, ధర్నా



ర్యాలీ నిర్వహిస్తున్న దళిత నాయకులు

ఏలూరు (టూటౌన్): పెదవేగి తహసీల్దార్‌పై దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని దళితులు భగ్గుమన్నారు. దళిత ద్రోహి చింతమనేనిని అరెస్టు చేయాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో నాయకులు, ప్రజాప్రతినిధులు మంగళవారం ఏలూరులో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. చింతమనేని దిష్టిబొమ్మను దహనం చేశారు. కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. పలువురు నేతలు మాట్లాడుతూ పెదవేగి తహసీల్దార్ నాగరాజుపై చింతమనేని అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. తహసీల్దార్ కుటుంబ సభ్యులను సైతం కించపర్చేలా ఎస్సీలకు ఉద్యోగాలు ఎందుకనే విధంగా మాట్లాడటం ఆయనలోని దళిత వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. దళిత నేతలు తేరా ఆనంద్, ఏలూరు డిప్యూటీ మేయర్ సుధీర్‌బాబు, కార్పొరేటర్లు పొలిమేర దాసు, విజయనిర్మల, కో-ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ విజయబాబు, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఢీకొట్టడం మీ వల్ల కాదు!

మాజీ ఎంపీ జోగయ్య

పాలకొల్లు సెంట్రల్: జనసేన-తెలుగుదేశం ప్రకటించిన మినీ మేనిఫెస్టో అంత జనరంజకంగా, ఆకర్షణీయంగా లేదని కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య అన్నారు. మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఒక ప్రకటన చేస్తూ 'ప్రధాన మేనిఫెస్టో అయినా కనీసం 4 కోట్ల జనాభా సంతృప్తి పడేలా ఆకర్షణీయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. కానిపక్షంలో ఢీకొట్టడం మీ వల్ల కాదు. వైఎస్సార్‌సీపీ అందిస్తున్న సంక్షేమ ఫలాలను ఢీకొట్టాలంటే ఉమ్మడి మేనిఫెస్టోలో మార్పులు చేయాలి. ఇరుపార్టీల అధినేతలకు శ్రేయోభిలాషిగా సలహా ఇస్తున్నా' అని పేర్కొన్నారు. ఈ మేనిఫెస్టో కొన్ని వర్గాలకు మాత్రమే అనుకూలంగా ఉన్నట్టుందని అభిప్రాయపడ్డారు.

కులగణన సదస్సులకు రాజకీయ పార్టీలను పిలవాలి

సీఎస్‌కు సీపీఎం నేత శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నిర్వహించనున్న కులగణన సదస్సులకు అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి ఆయా పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆయన మంగళవారం లేఖ రాశారు. కాగా, సీపీఎం కేంద్ర కమిటీ మాజీ నాయకుడు బాసుదేవ్ ఆచార్యకు విజయవాడలోని పార్టీ కార్యాలయంలో శ్రీనివాసరావు ఘనంగా నివాళి అర్పించారు.

బడుల పైనా 'బండ' రాతలే!

సీఎం జగన్ ఆధ్వర్యంలో అత్యాధునికంగా ప్రభుత్వ స్కూళ్లు

- 'నాడు – నేడు'తో నూతన భవనాలు, అన్ని రకాల సౌకర్యాలు, డిజిటల్ బోధన
- ఇది చూసి తట్టుకోలేక ఈనాడు దుష్ప్రచారం
- పనులు జరుగుతున్న స్కూళ్ల ఫొటోలు వేసి అబద్ధపు రాతలు



నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసిన కృష్ణాజిల్లా కంకిపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పేద పిల్లలు కూడా ఉన్నత స్థితిలోకి రావాలని, చదువుల కోసం ఆస్తులు అమ్ముకునే పరిస్థితులు ఉండకూడదని సీఎం వైఎస్ జగన్ విద్యా రంగంలో అనేక సంస్కరణలు తెచ్చారు. 'మన బడి నాడు – నేడు' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ స్కూళ్లను నూతన భవనాలు, అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా తీర్చి దిద్దుతున్నారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నారు. పేద విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిని అందుకొనేలా ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ బోధన అందిస్తున్నారు. చంద్రబాబు జమానాలో పాఠశాలల పైకప్పులు కూలిపోయినా, బెంచీలు, నీరు లేకపోయినా, టెక్స్ట్‌బుక్స్ ఇవ్వకపోయినా కదలని 'ఈనాడు' కలం.. అవే పాఠశాలల్ని అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్న వైఎస్ జగన్ ప్రభుత్వంపై విషం కక్కుతోంది. రెండో దశలో నిర్మాణంలో ఉన్న నాలుగు బడుల ఫొటోలు తీసి ఏమీ జరగడంలేదంటూ కుటిల కథనం ప్రచురించింది.

అసలు వాస్తవాలివీ..

- మనబడి నాడు నేడు రెండో దశలో ప్రభుత్వం రూ.8,000 కోట్లతో 22,344 పాఠశాలల్లో పనులు చేపట్టింది. 8,529 పాఠశాలల్లో 25,154 అదనపు తరగతి గదులు కూడా నిర్మిస్తోంది. వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకు పూర్తి చేసేలా పనులు చేస్తున్నారు.
- ఏలూరు ఆరో డివిజన్‌లోని నగరపాలకొన్నత పాఠశాలలో రెండో దశలో రూ.1.08 కోట్లతో 9 అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతోంది. ఇప్పటివరకు రూ.62 లక్షల విలువైన పనులు పూర్తి చేశారు.
- కర్నూలు జిల్లా కోసిగి జేబీఎం ప్రాథమిక పాఠశాలలో రూ.21.10 లక్షలతో పనులు చేపట్టారు. ఇప్పటివరకు రూ.14.98 లక్షల విలువైన పనులు పూర్తి చేశారు.
- విజయవాడ కృష్ణలంక బాలికల పాఠశాలలో రూ.62.87 లక్షలతో పనులు చేపట్టారు. ఇందులో రూ.19.06 లక్షల విలువైన పనులు పూర్తి చేశారు. ఇదే పాఠశాలలో రూ.58.90 లక్షలతో ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణం కూడా చేపట్టి, రూ.29.73 లక్షల విలువైన పనులు చేశారు. కృష్ణలంకలోనే ఉన్న ఎస్వీఆర్ ఎంసీహెచ్‌లో రూ.62.94 లక్షలతో పనులు చేపట్టి, రూ.27.55 లక్షల విలువైన పనులు పూర్తి చేశారు. ఏపీఎస్సార్ మున్సిపల్ హైస్కూల్లో రూ.81.18 లక్షలతో పనులు చేపట్టి రూ.33.13 లక్షల విలువైన పనులు చేశారు. రూ.47.79 లక్షలతో 4 అదనపు తరగతి గదులను కూడా నిర్మిస్తున్నారు.
- తిరుపతి జిల్లాలోని ఎంజీఎం మున్సిపల్ హైస్కూల్లో రూ.84 లక్షలతో ఏడు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. రూ.19.63 లక్షల పనులు పూర్తి చేశారు.
- విశాఖ జిల్లా గంభీరం ఎంపీపీ పాఠశాలలో రూ.17.82 లక్షలతో చేపట్టిన పనుల్లో రూ.10.81లక్షల విలువైన పనులు పూర్తి చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులపై అవాస్తవాలేల!

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి 52 వేల మందికి మేలు కల్పించింది కనపడదా?

- ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య సేవలు
- ఈహెచ్‌ఎస్ రిఫరల్ ఆస్పత్రులతోపాటు 21 ఆర్టీసీ ఆస్పత్రుల్లోనూ నాణ్యమైన వైద్యం
- అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఆన్‌లైన్‌లో బిల్లులు సమర్పించే అవకాశం
- ప్రభుత్వంపై విషం చిమ్మడమే లక్ష్యంగా 'ఈనాడు' తప్పుడు రాతలు



రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ డిస్పెన్సరీ

సాక్షి, అమరావతి: పచ్చ పత్రిక ఈనాడుకు, దాని అధినేత రామోజీరావుకు ఒకటే ఎజెండా.. నిత్యం రాష్ట్ర ప్రభుత్వంపై ఏదో ఒక రూపేణా విషం చిమ్మడమే. ఇందులో భాగంగానే 'ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యంతో సర్కారు చెలగాటం' అంటూ అవాస్తవాలతో ఒక కథనాన్ని మంగళవారం ఈనాడులో వండివార్చారు. వాస్తవానికి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి ఏ రాష్ట్ర ప్రభుత్వం సాహసించలేదు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఇదంత సులువైన పని కాదని అక్కడ చేతులెత్తేశారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చాలా సులువుగా 52 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశారు. తద్వారా వారికి ప్రభుత్వ ఉద్యోగులకు లభించినట్టే అన్ని ప్రయోజనాలు కల్పిస్తున్నారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)ను ఆర్టీసీ ఉద్యోగులకు కూడా వర్తింపజేశారు. ఆర్టీసీ ఉద్యోగులు తమకు అనారోగ్యం కలిగితే ఈహెచ్‌ఎస్ కింద రాష్ట్రంలో మెరుగైన వైద్యం పొందుతున్నారు. అయినా ఇదంతా కళ్లుండి కూడా చూడలేని కబోధి రామోజీరావు యథేచ్ఛగా విషం కక్కారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ కింద వైద్యం దక్కడం లేదంటూ అవాస్తవాలను అచ్చేశారు. అసలు వాస్తవాలేవో వివరిస్తూ ఈ ఫ్యాక్ట్ చెక్..

- ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసీ ఉద్యోగులకు కూడా ఈహెచ్‌ఎస్ కార్డులను ప్రభుత్వం జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులకు వైద్యం అందిస్తున్న అన్ని రిఫరల్ ఆస్పత్రుల్లో ఆర్టీసీ ఉద్యోగులు కూడా నాణ్యమైన వైద్య సేవలు పొందుతున్నారు. ఎంతోమంది ఉద్యోగులు ఆ సేవలతో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకున్నారు.
- ఈహెచ్‌ఎస్ రిఫరల్ ఆస్పత్రుల్లోనే కాకుండా 21 ఆర్టీసీ ఆస్పత్రుల్లో కూడా ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఓపీ, చికిత్స విషయంలో ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసేందుకు ప్రతి జిల్లాకు ఒక సమన్వయ అధికారిని నియమించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందితే.. ఆ మేరకు బిల్లులను ఈహెచ్‌ఎస్ పోర్టల్‌లో సమర్పించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది.
- ఆర్టీసీ ఉద్యోగులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కార్డియాక్ కేర్ ట్రై-ఓఆర్‌జీ మెషిన్ల ద్వారా గుండెపోటు సమస్యను ముందుగానే గుర్తించి తగిన వైద్యం అందిస్తున్నారు. ఆ విధంగా ఇప్పటివరకు 149 మందికి గుండెపోటు నివారణ చికిత్స అందించారు.
- ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే మౌలిక వసతులను ఆర్టీసీ అభివృద్ధి చేస్తోంది. 5 రకాల వైద్య సేవలు అందించే వైఎస్సార్ ఆర్టీసీ ఏరియా ఆస్పత్రిని కడపలో 2021లోనే నెలకొల్పింది. అనంతపురం, రాజమండ్రిలో ఆర్టీసీ డిస్పెన్సరీలు ఏర్పాటు చేశారు. తిరుపతి, నరసరావుపేట, మచిలీపట్నంలలో కొత్తగా ఆర్టీసీ ఆస్పత్రుల నిర్మాణాన్ని చేపట్టారు.

రెండు వర్గాల ఘర్షణపై కుట్రపూరిత రాతలా?

దళిత లాయర్‌పై వైఎస్సార్‌సీపీ నేతలు దాడి అంటూ 'ఈనాడు' విషపురాతలు

- కొలిమిగుండ్ల గ్రామకంఠం భూమిలో కమ్యూనిటీ హాలు నిర్మించుకుంటున్న దళితులు
- ఆ స్థలాన్ని కబ్జా చేయాలనుకున్న టీడీపీ నేత, లాయర్ విజయ్‌కుమార్
- కమ్యూనిటీ హాలు నిర్మాణంపై సోషల్ మీడియాలో వికృత ప్రచారం
- దీనిపై ఆరా తీసిన వ్యక్తులపై అనంతపురంలో కేసు పెట్టిన విజయ్
- కేసుపై గట్టిగా నిలదీయడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ
- విజయ్‌పై కొలిమిగుండ్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు, కేసు నమోదు
- ఇదే అదనుగా తన వక్రబుద్ధి బయటపెట్టిన రామోజీరావు
- రెండు దళిత వర్గాల ఘర్షణను అధికార పార్టీకి పులిమే కుట్ర
- తప్పుడు రాతలపై చర్యలు: ఎస్పీ

సాక్షి ప్రతినిధి కర్నూలు: తన కలం నిండా నిలువెల్లా విషం నింపుకున్న రామోజీరావు.. ప్రభుత్వానికి దళితులను దూరం చేయాలనే కుట్రపూరిత రాతలను నిరంతరం కొనసాగిస్తున్నారు. ఆ పరంపరలోనే.. దళితుల్లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణను ఎలాంటి సంబంధం లేకపోయినా అధికార వైఎస్సార్‌సీపీకి అంటగట్టేందుకు ప్రయత్నించారు. 'దళిత న్యాయవాదిపై వైకాపా కార్యకర్తల దాష్టీకం' శీర్షికతో ఓ తప్పుడు కథనాన్ని తన 'ఈనాడు'లో మంగళవారం అచ్చేశారు. దళితులపై వైఎస్సార్‌సీపీ దాడులు చేస్తోందనే దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి పంపే విఫలయత్నం చేశారు. రెండు దళిత వర్గాలు దాడులు చేసుకుంటే ఒక వర్గాన్నే దళితులుగా చిత్రీకరించి.. మరోవర్గం కూడా దళితులేనన్న విషయాన్ని మరుగుపర్చే ప్రయత్నాన్ని ఆ కథనంలో చేశారు. ఈనాడు దిగజారుడు రాతలను నంద్యాల జిల్లా పోలీసులు కూడా తీవ్రంగా ఖండించారు.

కమ్యూనిటీ హాలు భూమిపై కన్ను..

బనగానపల్లి నియోజకవర్గం కొలిమిగుండ్ల టీడీపీ కార్యాలయం సమీపంలో సర్వే నంబర్ 384, 385లో 16 సెంట్ల గ్రామకంఠం భూమి ఉంది. ఇందులో దళితులు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి గ్రామ పంచాయతీకి 2001లో దరఖాస్తు చేసుకుంటే.. 11 సెంట్లలో నిర్మాణానికి 2002లో గ్రామపంచాయతీ తీర్మానం చేసింది. దండోరా యువజన సంఘం పేరుతో అధికారులు పట్టా మంజూరు చేశారు. దళితవాడలోని ప్రజలు చందాలు వేసుకుని ఆ హాలు నిర్మించుకుంటున్నారు. ప్రస్తుతం దీని నిర్మాణం చివరి దశలో ఉంది. తన నివాసం ఎదురుగా ఉన్న ఆ భూమిని ఆక్రమించుకోవాలని గతంలో బనగానపల్లి టీడీపీ అధికార ప్రతినిధి విజయ్‌కుమార్ ప్రయత్నించారు. అతని నివాసంలోని ఓ ఫ్లోర్‌లో టీడీపీ కార్యాలయం కూడా ఉండటం విశేషం. తన ఆలోచనకు విరుద్ధంగా కమ్యూనిటీ హాలు నిర్మిస్తుండటంతో దానిని అడ్డుకునేందుకు ఏడాదిగా విఫలయత్నం చేస్తున్నాడు. తాను కూడా దళితుడైనా సాటి దళితులు నిర్మించుకునే కమ్యూనిటీ హాలును అడ్డుకునేందుకు విజయ్‌కుమార్ శతవిధాల ప్రయత్నించాడు. స్పందన, లోకాయుక్తతోపాటు అధికారులందరికీ ఫిర్యాదు చేశాడు. చివరకు సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలతో వీడియోలు కూడా పోస్టు చేశాడు. కమ్యూనిటీ హాలు నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన నాగేశ్వరరావు అనే దళితుడిపై మరింత తీవ్రమైన ఆరోపణలతో పోస్టులు చేశాడు. తాను కబ్జా చేయాలనుకున్న స్థలం దక్కకుండా పోయిందనే అక్కసుతో నాగేశ్వరరావు తమ్ముళ్లకు వచ్చే డప్పు కళాకారుల పింఛన్ రాకుండా విజయ్‌కుమార్ ఫిర్యాదు చేశాడు. దీంతో నాగేశ్వరరావు, అతని సోదరులు విజయ్‌ని ఫోన్‌లో నిలదీశారు. మాటామాట పెరగడంతో ఫోన్‌లో విజయ్‌కుమార్‌ను దూషించారు. ఈ మాటలను విజయ్ రికార్డు చేసి అనంతపురం కోర్టులో ప్రైవేట్ కంప్లయింట్ వేశాడు. అక్కడే త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఆరుగురిపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు కూడా కేసు (క్రైం నంబర్ 202/2023యూ/సెక్షన్ 506ఆర్/డబ్ల్యూ 34) నమోదు చేశారు.

ఐటీడీపీలో చురుగ్గా విజయ్‌కుమార్

అనంతపురంలో స్థిరపడి న్యాయవాద వృత్తి చేస్తున్న విజయ్‌కుమార్ ఐటీడీపీలో చురుగ్గా ఉంటాడు. సోషల్‌మీడియాలో ప్రభుత్వంపై వ్యతిరేక ప్రచారం చేస్తాడు. అలాగే వ్యతిరేక ప్రచారం చేస్తున్న వారికి మద్దతుగా పోస్టులు పెడుతుంటాడు. అనంతపురం నుంచి దీపావళికి విజయ్ కొలిమిగుండ్లకు వచ్చాడు. దీంతో నాగేశ్వరరావు, అతని సోదరులు, కుటుంబసభ్యులు ఈ నెల 12న విజయ్‌ని కలిసి తమపై కేసు పెట్టడాన్ని ప్రశ్నించారు. రెండు వర్గాల మధ్య మాటామాట పెరిగి ఘర్షణ చెలరేగింది. పరస్పరం దాడులు చేసుకున్నారు. నాగేశ్వరరావు, అతని కుటుంబసభ్యులు విజయ్‌ని పోలీసు స్టేషన్ వరకూ తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ మేరకు విజయ్‌పై పోలీసులు కేసు (క్రైం నంబర్ 158/2023యూ/సెక్షన్ 448,323, 355,506ఆర్/డబ్ల్యూ34 ఐపీసీ) నమోదు చేశారు. నాగేశ్వరరావు బంధువు రమాదేవి ఫిర్యాదు మేరకు క్రైం నంబర్ 159/2023యూ/సెక్షన్ 354(ఏ),323,509ఆర్/డబ్ల్యూ34 ఐపీసీగా కేసు నమోదు చేశారు.



వివాదానికి కారణమైన కమ్యూనిటీ హాల్

వాస్తవాలను విస్మరించి వక్ర రాతలు

ఈ ఘటన ఘర్షణ రెండు వర్గాల మధ్య జరిగింది. ఇందులో వైఎస్సార్‌సీపీకి సంబంధం లేదు. కానీ విజయ్‌కుమార్ దళితుడని రాసిన 'ఈనాడు'.. దాడి చేసిన వారు కూడా దళితులే అని రాయకపోవడం గమనార్హం. పంచాయతీ తీర్మానం మేరకు దళితులు నిర్మించుకుంటున్న కమ్యూనిటీ హాలు ప్రస్తావన లేకుండా భూమి ఆక్రమించారని తప్పుడు రాతలు రాసింది. 'ఈనాడు' అవాస్తవాలు అచ్చేస్తే.. దాన్ని టీడీపీ నేత లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు చేసి తప్పుడు ప్రచారానికి దిగారు. అలాగే బనగానపల్లి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి కూడా వాస్తవాలను వక్రీకరిస్తూ మాట్లాడారు. లోకేశ్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఈనాడు దుష్ప్రచారాన్ని స్థానిక దళితులు తీవ్రంగా ఖండించారు.

తప్పుడు రాతలపై చర్యలు



'ఈనాడు' కథనంపై నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి స్పందించారు. విలేకరుల సమావేశం నిర్వహించి ఘటనపై పూర్తి వివరాలు వెల్లడించారు. 'దళిత న్యాయవాదిపై దాడి పేరుతో ఈనాడులో ప్రచురితమైన కథనం పూర్తి అవాస్తవం. కమ్యూనిటీ హాలు విషయంలో రెండు దళిత వర్గాల మధ్య జరిగిన ఘర్షణ ఇది. దీన్ని రాజకీయ ఘటనగా, దళిత వ్యతిరేక ఘటనగా ఈనాడు చిత్రీకరించింది. అధికార పార్టీపై నిందలు మోపుతూ రాష్ట్ర ప్రజలకు తప్పుడు సమాచారం అందించే ప్రయత్నం చేసింది. తప్పుడు రాతలు రాసి శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా చేస్తే చర్యలు తప్పవు' అని ఎస్పీ స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీకి సంబంధం లేదు



కమ్యూనిటీ భవనం విషయంలో చోటు చేసుకున్న ఘర్షణ పూర్తిగా ఎస్సీలకు సంబంధించిన అంశం. ఈ ఘటనకు వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధం లేదు. 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్‌లో కొనసాగుతున్నాం. టీడీపీ నాయకుడిపై వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి చేశారని చిత్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి చూస్తున్నారు. ఈ ఘటనను అడ్డుపెట్టుకుని రాజకీయంగా సానుభూతి పొందేందుకు మాపై తప్పుడు ఆరోపణలు చేశాడు. బీసీ జనార్దన్ తన పలుకుబడిని ఉపయోగించి గొడవలోలేని వారిపై తప్పుడు కేసు పెట్టించారు.

– ఇరికిమాను నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు

స్థలాన్ని కబ్జా చేసేందుకే



బ్రిడ్జి పక్కనే ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉండేది. ఈ స్థలాన్ని మందా విజయ్ కుమార్ కబ్జా చేసేందుకు ప్రయత్నించాడు. కాలనీవాసుల కోసం ఈ స్థలంలో కమ్యూనిటీ భవనాన్ని నిర్మించుకునేందుకు చూస్తుంటే ఏడాది నుంచి అధికారులకు ఫిర్యాదు చేస్తూ అడ్డుపడుతూ వచ్చాడు. అధికారులను సైతం బెదిరించే ప్రయత్నం చేశాడు. పనులు మొదలు పెట్టినప్పటి నుంచి పలుమార్లు అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేశాడు. అన్ని అనుమతులతోనే బిల్డింగ్ కట్టుకున్నాం. చివరకు సోషల్ మీడియాలో ఇష్టానుసారం మాపై ఆరోపణలు చేశాడు.

– గూటం నాగన్న, ఎమ్మార్పీఎస్ నాయకుడు

నీ రాజకీయ పార్టీ చంద్రబాబును సీఎం చేయడానికా?

- పవన్ కళ్యాణ్‌పై మంత్రి అంబటి రాంబాబు విమర్శలు
- చంద్రబాబును జాతీయ స్థాయి నాయకులెవరూ పరామర్శించలేదేమి?




మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

కొవ్వూరు: రాజకీయ పార్టీ పెట్టిన ఏ నాయకుడైనా తాను సీఎం కావాలని ప్రయత్నిస్తారని.. పవన్ కళ్యాణ్ మాత్రం చంద్రబాబును సీఎం చేయాలని తాపత్రయ పడుతున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం పెనకనమెట్టలో మంగళవారం హోం మంత్రి తానేటి వనితతో కలిసి పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సీఎం పదవి కావాలన్న వ్యక్తి అన్ని సీట్లలో పోటీ చేయకుండా చంద్రబాబు చెప్పిన కొన్ని చోట్ల మాత్రమే పోటీ చేస్తున్నారని విమర్శించారు. తన ప్రభుత్వం మంచి చేస్తే ఓటు వేయాలని చెప్పిన మొదటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. తాను జాతీయ స్థాయిలో చక్రం తిప్పిన నాయకుడినని చంద్రబాబు గొప్పలు చెబుతారని.. స్కిల్ స్కామ్‌లో జైలుకు వెళ్లిన సమయంలో ఒక్క జాతీయ పార్టీ నాయకుడు కూడా ఆయన్ను పరామర్శించలేదని చెప్పారు. చంద్రబాబు దోపిడీల్లో పవన్‌కు కూడా వాటా ఉందంటూ ఆరోపించారు. కాపులను బీసీల్లో చేర్చుతామని చెప్పి చంద్రబాబు మోసం చేశారన్నారు. కాపు ఉద్యమం చేసిన ముద్రగడ కుటుంబాన్ని, కాపు నేతలపై కేసులు పెట్టి వేధించారన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క హామీ అమలు చేయనందునే 23 సీట్లకు ఆయన్ను ప్రజలు పరిమితం చేశారన్నారు. జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో దాదాపు వంద శాతం హామీలు అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు తదితరులు పాల్గొన్నారు.

అదేపనిగా అసత్యాల 'ఎత్తిపోతలు'

- చంద్రబాబు హయాంలోనే వరికపూడిశెల అయిపోయినట్టు 'ఈనాడు' కలరింగ్
- 2019 ఎన్నికల నోటిఫికేషన్‌కు నెల ముందు వరికపూడిశెల పేరుతో డ్రామా
- అటవీశాఖ అనుమతులు తీసుకోకుండానే పరిపాలనా అనుమతులు, టెండర్ల నాటకం
- పల్నాడులోని దుర్భిక్ష పరిస్థితులను తొలగించేందుకు సీఎం జగన్ సంకల్పం
- అభయారణ్యంలో పనులకు ఈ నెల 6న పూర్తి క్లియరెన్స్
- వెంటనే ప్రాజెక్టు పనులకు శ్రీకారం



వరికపూడిశెల ఎత్తిపోతల పనులకు అనుమతిస్తూ మే 19న కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ పరిధిలోని వన్యప్రాణి సంరక్షణ విభాగం జారీ చేసిన ఉత్తర్వులు



అభయారణ్యంలో పనులకు అనుమతిస్తూ ఈ నెల 6న కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ జారీ చేసిన ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: పల్నాడు ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతోంది. ఆరు దశాబ్దాలకు పైగా ఆశగానే మిగిలిన వరికపూడిశెల ప్రాజెక్టుకు రూట్ క్లియర్ అయ్యింది. సాగు, తాగు నీటి ఎద్దడి తీరుతుందని ప్రజలంతా సంతోషిస్తున్నారు. కానీ, పెత్తందారుల పైత్యాన్ని ప్రదర్శించే 'ఈనాడు'కు ఇది మింగుడు పడటంలేదు. అందుకే 'వరికపూడిశెల'పై అసత్యాల ఎత్తిపోతలు మొదలెట్టింది. ఐదేళ్లు అధికారం అనుభవించి ప్రాజెక్టును కాగితాలకే పరిమితం చేసిన చంద్రబాబును పల్లెత్తి మాట అనలేదు. ప్రజలకు నీటి కష్టం ఉందని చెప్పేందుకూ మనసు రాలేదు. ఇప్పుడు వరికపూడిశెల కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుంటే వక్రీకరణల డైవర్షన్ మొదలెట్టింది.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ బాబు!

వాస్తవానికి ప్రజలను మోసగించడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు. ఆ మోసాన్ని గొప్పగా చిత్రీకరించడంలో రామోజీరావు పెన్ను తిరిగిన వ్యక్తి. ఈ దొంగల ద్వయం ఎన్నికల ముందు హడావుడి చేసి ఓట్లు ఎత్తిపోసుకోవాలనే కుట్రతోనే ఆనాడు అంటే.. 2019 ఫిబ్రవరి 6న వరికపూడిశెల ప్రాజెక్టుకు పరిపాలన ఆమోదం ఇస్తున్నట్టు నాటకం ఆడారు. అసలు వరికపూడిశెల ఎత్తిపోతల ప్రాజెక్టుకు రిజర్వ్ ఫారెస్టులో పైప్ లైన్ పనులు చేయాలని అప్పటి ప్రభుత్వ పెద్దలకు తెలీదా? అందుకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు తీసుకోవాలి కదా! ఇవి లేకుండా పనులు ఎలా ప్రారంభిస్తారన్నది అసలు ప్రశ్న. ప్రజలకు మేలు చేయాలనే చిత్తశుద్ధి నాయకులకు ఉంటే ఇవన్నీ ఆలోచించేవారు. చంద్రబాబు మాత్రం ఓట్ల కోసమే ప్రజలను దగా చేశారు. గత ఎన్నికల నోటిఫికేషన్‌కు సరిగ్గా నెల ముందు పరిపాలనా ఆమోదం ఇస్తూ టెండర్లు పిలిచినట్టు పెద్ద షో చేశారు. దీని ఆధారంగానే 'ఈనాడు' ప్రాజెక్టు అంతా బాబు హయాంలోనే రూపుదిద్దుకున్నట్టు మంగళవారం వక్రభాష్యం పలికింది. వాస్తవానికి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే వరికపూడిశెల ఎత్తిపోతలకు అంకురార్పణ చేశారు.

చిత్తశుద్ధి ఎక్కడ బాబు!

రాష్ట్ర విభజన తర్వాత ఐదేళ్ల అధికారం అనుభవించిన చంద్రబాబు... ఈ ఎత్తిపోతలకు అత్యంత కీలకమైన వన్యప్రాణి, పర్యావరణ అనుమతులు కూడా సాధించకపోవడం ఆయన చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోంది. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం పల్నాడు వాసుల వరికపూడిశెల కలను సాకారం చేస్తున్నారు. పలు దఫాలు కేంద్రంతో చర్చించి అటవీ, పర్యావరణ అనుమతులు తీసుకొచ్చారు. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి తీసుకునే భూమికి బదులు వేరొక చోట భూమిని సమకూర్చి ప్రాజెక్టుకు ఆటంకం లేకుండా చేశారు.



నీటిని చూసి నేర్చుకోవాలి: చిన్న సెలయేరు తుళ్లుతూ ప్రవహిస్తుంది. కానీ మహాసముద్రాల లోతు నిశ్శబ్దంగా ఉంటుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 15 నవంబర్ 2023

మార్పుల వ్యూహంతో మేలెంత?!

మార్పు మంచికే! అయితే, అన్ని మార్పులూ మంచి చేస్తాయా? మంచిని ఆశించడమే తప్ప, ఆఖరికి ఏమవుతుందో అప్పటికప్పుడు చెప్పలేం. బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్ ప్రస్తుతం మార్పునే నమ్మారు. క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించారు. పాలస్తీనా అనుకూల నిరసన ప్రదర్శనలపై విరుచుకుపడిన హోమ్ మంత్రి సువెల్లా బ్రేవర్మన్‌ను పక్కకు తప్పించారు. ఆమె స్థానాన్ని విదేశాంగ మంత్రి జేమ్స్ క్లెవర్లీకి అప్పగించారు. మాజీ ప్రధాని అయిన 57 ఏళ్ళ డేవిడ్ కామెరాన్‌ను విదేశాంగ మంత్రిగా ముందుకు తెచ్చారు. భారతీయ సంతతికి చెందిన 43 ఏళ్ళ బ్రేవెర్మన్ ఛాందసవాద, వివాదాస్పద వ్యాఖ్యలకు పేరుపడడంతో, ఆమెకు ఉద్వాసన పలికి, మధ్యేవాదానికి జై కొడుతున్నట్టు కనిపించే యత్నం చేశారు. మునుపటి లిజ్ ట్రస్ హయాం నుంచి ప్రతికూలత మూటగట్టుకున్న కన్జర్వేటివ్ పార్టీ పట్ల మళ్ళీ నమ్మకం కలిగించడానికి సునాక్‌కు ఇవి సరిపోతాయా?

కన్జర్వేటివ్ పార్టీ తన సొంత ఉనికిని కాపాడుకొనేందుకు కిందా మీదా పడుతోందనడానికి తాజా ఉదాహరణ రిషీ సునాక్ తాజా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అని విశ్లేషకుల మాట. బ్రిటన్ మాజీ ప్రధాని డేవిడ్ కామెరాన్ ఒక్కరే కాక ఇంకా పలువురు పెద్ద పదవులు నిర్వహించినవారు సైతం ఈ మంత్రివర్గ మార్పులు చేర్పుల్లో చిన్న హోదాలు చేపట్టారు. గతంలో ప్రధానమంత్రి పదవికి రేసులో నిలబడ్డ నాయకురాలు, వ్యాపార శాఖ మంత్రి అయిన డేమ్ ఆండ్రియా లెడ్‌సమ్ ఇప్పుడు జూనియర్ హెల్త్ మినిస్టర్ పదవి చేపట్టారు. అలాగే ఇంకొందరు! సునాక్ వైపు నుంచి చూస్తే – ఇది మునుపటి లిజ్ ట్రస్ హయాం వారిని కొందరినైనా వదిలించుకొని, తనదైన జట్టును నిర్మించుకొనేందుకు ఆయన చేస్తున్న యత్నంగా కనిపిస్తుంది. మరోవైపు నుంచి చూస్తే – మునుపటి లిజ్ పాలన తలనొప్పులు తేవడంతో ఏడాది క్రితం ఆ స్థానంలోకి వచ్చిన సునాక్ తన సర్కార్‌పై నమ్మకం కలిగించడంలో విఫలమయ్యారనీ, అందుకే ఈ మార్పులనీ అనిపిస్తుంది.

ప్రధానిగా పదవి చేపట్టినప్పటి నుంచి సునాక్ తరచూ కామెరాన్‌తో సంభాషిస్తున్నారనీ, వారం రోజుల క్రితమే విదేశాంగ మంత్రిగా పగ్గాలు పట్టాల్సిందిగా కోరారనీ ఒక కథనం. ఇంతలోనే బ్రేవెర్మన్ దురుసు రాతలతో రచ్చ రేగింది. చివరకు సునాక్ అనుకుంటున్న మార్పే అనివార్యంగా, ముందుకు తోసుకొచ్చింది. 'డీసీ'గా అభిమానులు ముద్దుగా పిలుచుకొనే డేవిడ్ కామెరాన్ పునరాగమనంతో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి పాలకపక్షం చిక్కుల్లో పడి, బయటపడేందుకు మరో మార్గం లేనప్పుడు పాత కాపులను మళ్ళీ రంగంలోకి దింపి ఉన్నత పదవులివ్వడం, ఎంపీలు కాని వారిని ఎగువ సభ ద్వారా పార్లమెంట్‌లోకి తేవడం బ్రిటన్‌లో తరచూ ఉన్నదే! వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం వెన్నాడుతున్న వేళ సునాక్ సర్కార్ ఏదో ఒకటి చేయక తప్పని పరిస్థితి. అందులో భాగమే తాజా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, కామెరాన్ పునరాగమనం లాంటి చర్యలు.

మాటలతో ముగ్ధుల్ని చేయగల కామెరాన్‌ను జనం నమ్ముతారనీ, రాజకీయ వాతావరణం తమకు అనుకూలంగా మారుతుందనీ సునాక్ అంచనా. అయితే, పదకొండేళ్ళు పార్టీకి నేతగా, ఆరేళ్ళ కాలం ప్రధానిగా పనిచేసి, గత ఏడేళ్ళుగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరమైన కామెరాన్ అనుభవం కష్టాల్లో ఉన్న పార్టీకీ, సునాక్ ప్రభుత్వానికీ ఏ మేరకు ఉపయోగపడుతుందో చూడాలి. కామెరాన్‌కు పలువురు ప్రపంచ నేతలతో స్నేహం, అంతర్జాతీయ వ్యవహారాలపై పట్టు ఉన్నాయి. భౌగోళిక రాజకీయాలన్నీ అస్థిరంగా ఉన్న వర్తమానంలో అది బ్రిటన్ ప్రభుత్వానికి ఉపయుక్తమే. కానీ, వచ్చే ఎన్నికల్లో కలిసిరావడం మాత్రం కష్టమే. కేవలం 24 శాతం మంది బ్రిటన్ వయోజనులు కామెరాన్‌కు సానుకూలంగా ఉంటే, 45 శాతం మంది ఆయనకు ప్రతికూలంగా ఉన్నారని నెల కిందటి తాజా సర్వే. వెరసి కామెరాన్‌పై సునాక్ అతిగా ఆశలు పెట్టుకుంటే నిరుత్సాహం తప్పదు.

పదమూడేళ్ళ పాటు సొంత కన్జర్వేటివ్ పార్టీయే గద్దె మీద ఉన్నాక వచ్చే ఎన్నికలు సునాక్‌కు ఏటికి ఎదురీతే. ఆయన తనను తాను మార్పుకు ప్రతిరూపంగా, స్థిరచిత్తుడిగా జనానికి చూపుకోవడం అవసరం. అందుకని మాటల్లో, రాతల్లో జాత్యహంకార, వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న బ్రేవెర్మన్‌ను పదవిలో కొనసాగిస్తే కష్టం. గతంలో పలుమార్లు మాటల తూటాలు పేల్చిన ఆమె తాజాగా పాలస్తీనా అనుకూల నిరసన ప్రదర్శనపై నిర్లక్ష్యంగా, నొప్పించేలా 'ది టైమ్స్' పత్రికలో రాశారు. ప్రధాని ఆమోదం లేని ఆ వ్యాసంతో తన కథకు తానే ముగింపు రాసుకున్నారు. స్వతంత్ర పోలీసు వ్యవస్థను తప్పుబట్టడమే కాక, నిరసనను ప్రాథమిక హక్కుగా భావించే ఆధునిక బ్రిటన్ సమాజాన్నీ దూరం చేసుకున్నారు. పదవీచ్యుతురాలయ్యారు. అయితే, రానున్న రోజుల్లో ఆమె ఊరకుంటారని అనుకోలేం. సునాక్ పాలన అనంతరం అవసరమైతే పార్టీ పగ్గాలు చేపట్టగల ఛాందస వర్గ నేతగా ఆమె తనను తాను గట్టిగా నిలుపుకొన్నారు.

అయిదేళ్ళ లోపల 650 మంది సభ్యుల దిగువ సభకు ఎన్నికలు జరగడం బ్రిటన్ విధానం. ఆ లెక్కన 2025 జనవరి 28 లోపల ఎన్నికలు జరగాలి. ఏ తేదీన జరగాలో నిర్ణయించే అధికారం ప్రధానిదే. 2011లో చట్టం తెచ్చి, దాన్ని మార్చినా, 2019 ఎన్నికల్లో విజయం తర్వాత కన్జర్వేటివ్‌లు మళ్ళీ యథాపూర్వ స్థితిని పునరుద్ధరించారు. ఆ లెక్కన పార్లమెంట్‌ను ముందే రద్దు చేసి, ఎన్నికలు జరిపించమని సునాక్ కోరినా కోరవచ్చు. ఏడాది క్రితం సునాక్ పగ్గాలు చేపట్టినప్పటితో పోలిస్తే, కన్జర్వేటివ్‌ల ప్రతిష్ఠ కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అప్పటి అనుకూల వాతావరణమూ లేదు. మరి, సునాక్ చేసిన తాజా మార్పులు ఎన్నికల నాటికి అద్భుతాలు చేయగలవా? ఏమో గుర్రం ఎగరావచ్చు!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, **తిథి:** శు.విదియ ప.1.50 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** జ్యేష్ఠ తె.4.01 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి మూల, **వర్జ్యం:** ఉ.9.44 నుండి 11.19 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.21 నుండి 12.07 వరకు, **అమృత ఘడియలు:** రా.7.13 నుండి 8.52 వరకు, భగినీహస్త భోజనం.

సూర్యోదయం : 6.08
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

మొత్తం మానవాళికే సమస్య!

విశ్లేషణ



దొంతి నరసింహా రెడ్డి

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్‌లో నవంబర్ 30 నుంచి డిసెంబర్ 12 వరకు 'కాప్ 28' సదస్సు జరగనుంది. పూర్వ సగటు ఉష్ణోగ్రతల కంటే 2023లో 1.4 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ప్రపంచ వాతావరణ సంస్థ తెలిపింది. వాతావరణ మార్పుల సదస్సు కోసం ప్రభుత్వాలు, ఇతర భాగస్వాములు సమావేశమవుతున్నప్పుడు, ఇంతకంటే కీలక సమస్య వేరేదీ లేదు. ఇప్పటికే, ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. హిమాచల్ ప్రదేశ్, సిక్కిం తదితర రాష్ట్రాలలో వరద బీభత్సం విదితమే. దేశమంతటా వర్షాలు సకాలంలో పడలేదు. వ్యవసాయ రంగం తీవ్ర ఒత్తిడిలో ఉన్నది. పంటల విస్తీర్ణం, దిగుబడి మీద వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది.

వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ (యూఎన్ఎఫ్‌సీసీసీ)లోని అన్ని సభ్యత్వ పక్షాలు దుబాయ్‌లో నవంబర్ 30 నుంచి డిసెంబర్ 12 వరకు సమావేశం కానున్నాయి. 2015 పారిస్ ఒప్పందం ప్రకారం తొలి 'గ్లోబల్ స్టాక్ టేక్' (జీఎస్టీ) పూర్తి చేయడం ఈ సమావేశంలో మొదటి ప్రధాన అంశం. పారిస్ ఒప్పందం లక్ష్యాలను సాధించే దిశగా సమష్టి పురోగతిని అంచనా వేయడం, ముఖ్యంగా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు, అడాప్టేషన్ ప్రయత్నాల పురోగతి, నిధుల ప్రవాహం అంచనా వేయడం ఈ జీఎస్టీ లక్ష్యం. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ మదింపు తదుపరి పర్యావరణ, వాతావరణ మార్పుల నేపథ్యంలో తీసుకునే చర్యలకు మార్గనిర్దేశం చేయడానికి ఉద్దేశించబడింది.

శిలాజ ఇంధనాల వినియోగం తగ్గేనా?

2023 సెప్టెంబర్‌లో విడుదలైన మొదటి జీఎస్టీ అధ్యయన ఫలితం, స్పష్టంగా ఉన్నది: ప్రపంచం మొత్తం అనుకున్న లక్ష్యం నుంచి దారి తప్పింది. ఈ నేపథ్యంలో దుబాయ్‌లో జరగనున్న 'కాప్ 28'(కాన్ఫరెన్స్ ఆఫ్ ద పార్టీస్– భాగస్వామ్య పక్షాల 28వ సమావేశం)లో దీని దిద్దుబాటు మీద చర్చ జరుగుతుందని ఆశిస్తున్నారు. అనేక చర్యల మీద ఏకాభిప్రాయం లేదు. ఈ నివేదిక వల్ల కొన్ని చర్యల పైన విశాల ఒప్పందాలు జరుగుతాయని అంచనా. ప్రధానంగా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని మూడింతలు చేయాలనే లక్ష్యం ఒకటి కాగా, శిలాజ ఇంధనాల వినియోగం దశల వారీగా తగ్గించే లక్ష్యం పైన చర్చలు వివాదాస్పదంగా ఉన్నాయి. దుబాయ్ సమావేశం అధ్యక్షుడు ఒక చమురు కంపెనీ అధిపతి అయిన నేపథ్యంలో చమురు ఉపయోగం తగ్గించడానికి చర్చలు జరుగుతాయా అన్న అనుమానాలు ఉన్నాయి.

రెండవ పెద్ద అంశం, 'నష్టం మరియు హాని'. పేద దేశాలు, వెనుకబడిన దేశాల మీద వాతావరణ మార్పుల ప్రభావం ఎక్కువ ఉండడంతో భూగోళ కాలుష్యానికి కారక దేశాలు నష్ట పరిహారం అందించాలని చర్చలు జరుగుతున్నాయి. గత కాప్ 27 సమావేశంలో ఆఫ్రికన్ దేశాలు పట్టుబట్టి నష్టం మరియు హాని పరిహార నిధి ఏర్పాటును తీర్మానం చేశాయి. అటువంటి నిధిని ఏర్పాటు చేయాలనే నిర్ణయం ఆ సమావేశ పురోగతిగా వర్ణించారు. ఈ కీలక నిర్ణయం తీసుకున్నా, దాని ఏర్పాటు విషయం దశలలో తేలాల్సి ఉంది. ఇప్పటికే గత ఏడాది నుంచి ఈ విషయం మీద సమావేశాలు జరుగుతున్నాయి. పురోగతి ఆశాజనకంగానే ఉన్నది. కర్బన ఉద్గారాల వల్ల భౌగోళిక కాలుష్యం పెరిగి, సగటు ఉష్ణోగ్రత పెరిగి, వాతావరణ మార్పులు జరిగి నష్టపోతున్న దేశాలు, ప్రాంతాలు వాటిని ఎదుర్కొనే ప్రతి చర్యల మీద నిధులు సొంతంగా పెట్టుకునే సామర్థ్యం లేక ఈ ప్రపంచ నిధి గురించి ఆలోచించాయి. భారత దేశంలో ఇటీవల



హిమాచల్ ప్రదేశ్‌లో విపరీత వర్షాల వల్ల నదీ ప్రవాహం పెరిగి కొన్ని ఆనకట్టలు కొట్టుకుపోయి జరిగిన ఆస్తి నష్టం అంచనా లక్ష కోట్ల రూపాయలు. ఇటువంటి నష్ట భర్తీకి, పునర్నిర్మాణానికి సొమ్ములు ప్రపంచ నిధి నుంచి ఇవ్వాలని ఆశిస్తున్నారు. కానీ ఆ నిధికి డబ్బులు ఎవరు, ఎంత ఇవ్వాలి అనే విషయం నుంచి ఎవరికి, ఏ విధంగా, ఎంత ఇవ్వాలి అనే వరకు చర్చలు జరుగుతున్నాయి. అన్ని ప్రాథమిక దశలోనే ఉన్నాయి. నష్ట పరిహార నిధి పూర్తి స్థాయి ఏర్పాటుకు కనీసం 5 ఏళ్లు పడుతుందని అంచనా. వేగంగా నిర్ణయించాలని పేద దేశాల ఆకాంక్ష. ధనిక దేశాలకు ఈ నిధి ఏర్పాటు ఇష్టం లేదు. అది తమ ఆర్థిక రంగం మీద భారం అవుతుంది అని వారి భావన.

ఆహార, ఆరోగ్యాలపై ప్రభావం

2023 అంతటా వివిధ రూపాల్లో (రెండవ గ్లాస్గో సంభాషణ, ప్రత్యేక వర్క్ షాప్‌లు, మంత్రుల సంప్రదింపులతో సహా) దీనిపై చర్చలు జరిగాయి. కాల పరిమితులతో కూడిన లక్ష్యసాధన, అర్హత ప్రమాణాలు, ఆర్థిక వనరులు వంటి విషయాలపైన ఆలోచనలను రూపొందించడానికి ఒక పరివర్తన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ పని చిన్నదేమీ కాదు. గ్రీన్ క్లైమేట్ ఫండ్ పూర్తిస్థాయిలో పనిచేయడానికి ఐదేళ్లు పట్టింది. పరివర్తన కమిటీ పని తీరును పరిశీలిస్తే, పరిష్కరించవలసిన సాంకేతిక అంశాలు మాత్రమే కాకుండా, విభేదాలను పరిష్కరించడానికి రాజకీయ మార్గదర్శకత్వం అవసరమని తెలుస్తుంది.

యూఎన్ఎఫ్‌సీసీసీ కన్వెన్షన్, క్యోటో ప్రోటోకాల్, ప్యారిస్ ఒప్పందం, ఎస్బీఐ, ఎస్బీఎస్టీఏలకు సంబంధించిన ఐదు భారీ అంశాలతో పాటు అనేక ఇతర సమస్యలను కాప్ 28 ప్రస్తావించాల్సి ఉంది.

ఈ నేపథ్యంలో కాప్ 28 సమావేశ అధ్యక్ష (యూఏఈ) పాత్ర కీలకం అని భావిస్తున్నారు. ప్రత్యేకంగా శిలాజ ఇంధనాల ఉత్పత్తిని ఎలా పరిష్కరిస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొన్నది. వాతావరణ మార్పులకు, ఆహారం, ఆరోగ్యానికి మధ్య ఉన్న పరస్పర సంబంధాలను అర్థం చేసుకుని, తగిన చర్యల మీద దృష్టి పెంచడానికి ఈ సదస్సు ఒక వేదికగా ఉపయోగపడుతుంది.



స్థూలంగా, వాతావరణ మార్పుల సదస్సు అంటే కేవలం చెట్లు, అడవులు, కాలుష్యం గురించే కాదు. ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ అభివృద్ధి విధానాలు, ఆర్థిక విధానాలు, ఉత్పత్తి పద్ధతులు, జీవన శైలి మార్పులతో సహా సమస్త మానవాళి చర్యల మీద చర్చలు జరుగుతున్నాయి. ఇందులో సామాజిక న్యాయం, సమానత్వం, సహకారం, గౌరవం, మానవ హక్కులు వంటి సూత్రాలు విధిగా ఉంటాయి.

భారతదేశం పాత్ర

భారతదేశం వహించే పాత్ర కూడా అనేక అంతర్జాతీయ సమావేశాల మాదిరిగానే కాప్ 28 సదస్సులో కూడా ముఖ్యమైన అంశంగా మారుతున్నది. నిర్ణయాలు తీసుకోవడానికి, ఏకాభిప్రాయ సాధనకు, అంతర్గతంగా ఎదురు అవుతున్న ప్రకృతిపరమైన నష్టాలకు భారత ప్రతినిధి వర్గం పని తీరును కూడా నిశితంగా గమనించాల్సి ఉన్నది. ఈ ప్రతినిధి వర్గంలో ఎవరు ఉంటారు, వారికి ప్రభుత్వం ఇచ్చిన సందేశం లేదా ఆదేశాలు ఏమిటి అని మీడియా ద్వారా ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉన్నది. ఒక అభివృద్ధి చెందుతున్న దేశంగా, ధనిక దేశాలు, పేద దేశాల మధ్య వారధిగా, అమెరికా దేశాల కూటమికీ, రష్యా, చైనా దేశాల కూటమికీ మధ్య కీలకంగా పరిణమించిన భారత్ ఈ సదస్సులో వ్యవహరించే తీరు మీద ఆసక్తి ఉన్నది. 'అభివృద్ధి' మార్గం వివాదాస్పదం అవుతున్న సందర్భంలో, ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో, పేదరికం, అనారోగ్యం, ఆకలి వంటి అంశాలను పరిష్కరించే వివిధ మార్గాలు, చర్యలు కూడా అంతర్జాతీయ పరిణామాల ప్రభావానికి లోను అవుతున్నాయి. కాబట్టి అక్కడ జరిగేది వేరు, మనకు సంబంధం లేదు అనుకోవడానికి వీలు లేదు. మన రాజకీయ వ్యవస్థ, ప్రధానంగా రాజకీయ నాయకులు ఈ అంశాల మీద తమ పరిజ్ఞానం పెంచుకుంటేబాగుంటుంది.

వ్యాసకర్త విధాన విశ్లేషకులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అంతటి రుగ్మత



విద్య అనేది నేర్చుకోవడానికి సంబంధించినదన్న విషయం పోయింది. ఈ దృక్పథానికి సంబంధించి కోట (రాజస్థాన్) చిన్న శకలం మాత్రమే. చిన్నప్పటి నుంచే కృత్రిమ విజయాల పట్ల అధిక శ్రద్ధ చూపడం సృజనాత్మకతను నిర్వీర్యం చేస్తోంది. (విద్యార్థులు కోట కోచింగ్ సెంటర్లలో రోజుకు 6–7 గంటలుంటూ, అంతే సమయం సొంతంగా చదువుతూ ఒత్తిడికి గురవుతున్నారని ఒక సర్వే.) – సుహాస్ పల్శీకర్, ప్రొఫెసర్

కృతఘ్నత



ఆయన పుట్టారు, దేశం కోసం పోరాడారు, దేశానికి మొదటి ప్రధాని అయ్యారు– రాజ్యాంగం రూపు దిద్దుకోవడంలో సాయపడ్డారు. దానివల్ల మీరు (తథాగత రాయ్) గవర్నర్ కాగలిగారు. కనీసం దానికైనా కృతజ్ఞత చూపండి. (నెహ్రూ పుట్టకుండా ఉండాల్సింది అని వ్యాఖ్యానించిన నేపథ్యంలో.)

– అక్షర్ ధనాని, వ్యాఖ్యాత

ఉత్తమ క్రికెటర్



ఇప్పటివరకూ శ్రీలంక కన్న అత్యుత్తమ బ్యాట్స్‌మన్ అరవింద్ డిసిల్వాకు అభినందనలు. ఇది దేశానికి కూడా గర్వకారణం ('ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్' గౌరవం దక్కిన నేపథ్యంలో).

– ఏంజెలో మాథ్యూస్, శ్రీలంక క్రికెటర్

గొప్ప ప్రధాని



భారతదేశ అత్యంత గొప్ప ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 134వ జయంతి సందర్భంగా ఆయనకు వినయపూర్వక నివాళి. అలాగే, బాలల దినోత్సవ శుభాకాంక్షలు.

– అభిజిత్ చావ్డా, భౌతిక శాస్త్రవేత్త

చీదర మాటలు



ఇది అసహ్యకరం, సిగ్గు చేటు. ఆయన (నటి ఐశ్వర్యారాయ్ గురించి పాకిస్తాన్ క్రికెటర్ అబ్దుల్ రజాక్) అన్నది నిజమేనని నిర్ధారించుకోవడానికి రెండుసార్లు వినాల్సి వచ్చింది. ఎవరు గుణవతి అని తీర్పులిచ్చే హక్కు ఆయనకు ఎవరిచ్చారు? ఎంత చీదర! ఇది పాకిస్తాన్ పురుషుల సాధారణ అభిప్రాయమేమో అని జనాలు అనుకుంటారు.

– సమర అఫ్జల్, క్రికెట్ కామెంటేటర్

మారుతున్న ధోరణి



1980ల నుంచి మూడు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో పాల్గొన్న అనుభవాన్ని బట్టి ఇది చెబుతున్నా. 2000 సంవత్సరం వరకూ కేవలం భార్యలు మాత్రమే తమ భర్తల కోసం కిడ్నీలు దానం చేసేవాళ్లు. ఆ లెక్కలో మనది పురుషస్వామ్య వ్యవస్థ. కానీ గత ఇరవై ఏళ్లలో పరిస్థితి మారింది. భార్యలకు కిడ్నీలు ఇచ్చిన భర్తలు డజనుకు పైగా నాకు తెలుసు.

– సుందర్ శంకరన్, వైద్యుడు

బాధానందం



ఆహారం, శృంగారం అనేవి భూమ్మీద గొప్ప ఆనంద కారకాలని చెబుతుంటారు. అది తప్పు. బాధితుడిని అనుకోవడంలో గొప్ప ఆనందం ఉంది. 'ప్రపంచం నన్ను బాధపెడుతూనే ఉంది. నా జీవితమంతా పోరాటమే' అని చెప్పుకోవడానికి మించిన ఆనందం ఇంకెందులోనూ లేదు. ఇది మనం ధరించగలిగే బెస్ట్ ఫ్యాషన్ కూడా!

– సంజుక్తా బసు, జర్నలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

వనభోజనాల్లో ఉద్యమ స్ఫూర్తి

కార్తీక మాసపు వనభోజనాలు జరిగే ప్రదేశాన్ని స్వాతంత్ర్యోద్యమానికి వేదికగా మార్చిన స్వాతంత్ర్య సమరయోధురాలు దువ్వూరి సుబ్బమ్మ. ఆమె స్వాతంత్ర్య ఉద్యమంలో జైలుకెళ్లిన తొలి ఆంధ్ర మహిళగా గుర్తింపు పొందారు. గాంధీజీ 'దేశబాంధవి' అని ఆమెను కీర్తించారు. 1880 నవంబర్ 15న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా దాక్షారామంలో జన్మించారు. పదవ యేటే వివాహమయింది. భర్త దువ్వూరి వెంకట సుబ్బయ్య కొద్ది కాలానికే మరణించడంతో బాల వితంతువయ్యారామె. వారికి పిల్లలు లేరు. అప్పటికి తనకి పెద్దగా అక్షరజ్ఞానం లేకపోవడంతో కడియం వెళ్లి తన సమీప బంధువూ, కవీ అయిన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి దగ్గర శిష్యురాలుగా చేరారు. పట్టుదలతో సాహిత్యం నేర్చుకుని సంస్కృత, తెలుగు భాషల్లో విదుషీమణి అయ్యారు.



దువ్వూరి సుబ్బమ్మ

1921లో కాకినాడలో జరిగిన రాజకీయ సభలో పాల్గొని 'సంపూర్ణ స్వాతంత్ర్య లక్ష్యం' తీర్మానాన్ని బలపరుస్తూ అనర్గళంగా మాట్లాడారు. ఆ సభకు టంగుటూరి ప్రకాశం అధ్యక్షులు. విదేశీ వస్త్ర బహిష్కరణలో భాగంగా స్వయంగా ఖద్దరు బట్టలు నేచి, మూట నెత్తిని పెట్టుకొని ఊరూరా తిరిగి అమ్మేవారు. జనం గుమిగూడిన చోటల్లా స్వాతంత్ర్యోద్యమ జ్వాలలు రగిల్చేవారు. ఆమె మాటలూ, పాటలూ వినిపించకుండా బ్రిటిష్ రక్షక దళాలు డప్పులూ, డబ్బాలు వాయించేవారు. 'నేను గంగా భగీరథీ సమానురాలను. తలుచుకుంటే మిమ్మల్ని గంగలో ముంచెత్తగలను. కానీ గాంధీజీ ఆదేశానుసారం అహింసా వ్రతం చేపట్టాను. నా దగ్గర కాదు మీ కుప్పిగంతులు. జాగ్రత్త!' అని గర్జించేవారు. ఆ మాటలు వినగానే పోలీసులు చల్లగా జారుకొనేవారు. సహాయ నిరాకరణోద్యమం, ఉప్పుసత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో గాంధీజీతో కలిసి పాల్గొన్నారు. తన యావదాస్తినీ స్వాతంత్ర్య ఉద్యమం కోసం అర్పించారు. అవసాన దశలో కడియంలో ఒక చిన్న గదిలో కాలం గడిపేవారు. ముఖ్యమంత్రి హోదాలో టంగుటూరి ప్రకాశం సుబ్బమ్మని పలకరించడానికి వచ్చినప్పుడు 'ఒరేయ్ పంతులూ, ఎలా ఉందిరా ఈ నల్లోళ్ల పరిపాలన?' అని అందట. అహర్నిశలూ దేశం కోసం బతికినామె 1964 మే 31న తుదిశ్వాస విడిచారు.

– చిలుకూరి శ్రీనివాసరావు, కడియం
(నేడు దువ్వూరి సుబ్బమ్మ జయంతి)

క్రీడారంగంలో సరికొత్త అవకాశాలు!

సందర్భం



డా॥ గుబ్బల రాంబాబు

వినూత్నమైన పథకాలూ, పాలనతో ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రీడారంగంలోనూ తనదైన ముద్రకు శ్రీకారం చుట్టారు. 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో క్రీడల పండుగకు రూపకల్పన చేసి యువతకు క్రీడా రంగంలో సరికొత్త అవకాశాలు అందించేందుకు సిద్ధమయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వం 2023–28 క్రీడా పాలసీ ద్వారా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల సంబరానికి తెరలేపింది. గత జూన్ నెలలో దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీ వేసి క్రీడా పాలసీకి రూపకల్పన చేసింది. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 26 జిల్లాలు, 175 నియోజకవర్గాలు, 680 మండలాలు, 4000 సచివాలయాల పరిధిలో, 11 వేల గ్రామ పంచాయితీల స్థాయిలో మూడు లక్షల మ్యాచ్‌లు నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల మంత్రిత్వ శాఖ 'శాప్' కలిసి ఏర్పాటు చేయడం ఓ చారిత్రక ఘట్టం.

క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కోకోతో పాటు, యోగా, మారథాన్, టెన్నికాయిట్‌లలో పోటీలు జరుగుతాయి. నేటి యువత అత్యంత ఇష్టపడే క్రికెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం అగ్ర తాంబూలం ఇవ్వడం శుభపరిణామం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఐపీఎల్ తరహా టీమ్ తయారు చేయాలనీ, అందుకు అంబటి రాయుడును మెంటార్‌గా నియమించాలనీ, తదుపరి చెన్నై సూపర్ కింగ్స్‌తో వారికి ప్రత్యేక శిక్షణనివ్వాలనీ ముఖ్యమంత్రి జగన్ ఈ క్రీడా పాలసీని ఆవిష్కరిస్తూ అధికారులను ఆదేశించారు. ఈ పాలసీలో ఉన్న గొప్పతనం



ఏమిటంటే... చదువుకున్న వాళ్లే కాకుండా 17 సంవత్సరాలు నిండిన సాధారణ రాష్ట్ర పౌరులు అందరూ పాల్గొనేందుకు అర్హత కల్పించడం. బాల బాలికలకు వేరు వేరుగా ఈ పోటీలను నిర్వహిస్తారు. మొదటిగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పదకొండు వేల గ్రామాల నుండి క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ద్వారా శిక్షణ ఇస్తారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ కార్యాలయాల ద్వారా దీనికి సంబంధించిన ప్రకటన జారీ అయింది. ఇందు కోసం ఇప్పటికే హై స్కూల్స్, అందుబాటులో ఉన్న క్రీడా ప్రాంగణాలను ఉపయోగించుకొంటున్నారు. మండల స్థాయిలోనే క్రీడా సామగ్రి అందుబాటులో ఉంచారు. క్రీడల వల్ల మానసిక వికాసం, శారీరక దారుఢ్యంతో పాటు బృంద స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల క్రీడాకారులతో స్నేహ సౌభ్రాతృత్వాలు పెరుగుతాయని క్రీడా పాలసీ తెలుపుతోంది. 'ఆడుదాం ఆంధ్ర' క్రీడాపోటీల్లో రాష్ట్ర స్థాయిలో గెలిచిన వారికి మొదటి బహుమతిగా రూ. 50 వేలు, రెండో బహుమతిగా 30 వేలు, మూడవ బహుమతిగా 20 వేలు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా అందుకొంటారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన క్రీడాకారులకు రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి, శాప్ ఛైర్మన్ సమక్షంలో అభినందన పత్రాలు బహూకరిస్తారు.

'ఆడుదాం ఆంధ్ర' ద్వారా క్రీడా ఉపకరణాలు ఉచితంగా అందించడం, నియోజకవర్గం స్థాయిలో స్టేడియాలు నిర్మించడానికి సన్నాహాలు చేయడం, హైస్కూల్ స్థాయిలో గ్రౌండ్‌లను ఆధునీకీకరించడం ఆహ్వానించదగ్గ పరిణామాలు. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలన్నీ ఆంధ్రప్రదేశ్‌ను క్రీడా హబ్‌గా మారుస్తాయనడంలో సందేహం లేదు.

వ్యాసకర్త సామాజిక కార్యకర్త
మొబైల్: 98498 47489

నిష్కామకర్మతోనే...

కురుక్షేత్ర సంగ్రామంలో విజయం పొంది, అధికారాన్ని చేపట్టి రాజ్య పాలనం చేయాల్సిన ధర్మరాజును, ఆ విజయం కోసం తాను పోగొట్టుకున్న సకల బంధుజన నష్టంతో ఒక్కసారిగా నిర్వేదం ఆవహించింది. సర్వసంగ పరిత్యాగిగా శేష జీవితాన్ని గడపాలన్న కోరికను అతడి మనసులో కలగజేస్తుంది. అకస్మాత్తుగా ధర్మరాజు వెలిబుచ్చిన ఆ నిర్ణయాన్ని స్వాగతించలేని అర్జున భీమాదులు ధర్మజుడికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. అందులో భాగంగా వారి మధ్య జరిగిన సంభాషణలో క్షత్రియోచిత ధర్మాచరణ, ధనం, సుఖదుఃఖాలు మొదలైన విషయాలను గురించిన సంగతులెన్నో చర్చించ బడతాయి. ఈ సందర్భంలో ప్రవచన కుశలుడు, మహాతపస్వి అని పేరున్న దేవస్థానుడనే ఋషి, ఇంద్రుడికి దేవగురువైన బృహస్పతి ఇలా చెప్పాడని ధర్మరాజుకు బోధిస్తాడు:



సంతోషోవై స్వర్గతమః సంతోషః పరమం సుఖమ్॥
తుష్టేర్న కించిత్ పరతః సా సమ్యక్ ప్రతితిష్ఠతి॥

(వ్యాసభారతం, శాంతిపర్వం, 21వ అధ్యాయం, 2వ శ్లోకం)

'రాజా! ఒక మనిషి హృదయం పూర్తిగా సంతోషంతో నిండిపోవడం అన్నది ఆ క్షణానికి అతడు స్వర్గాన్ని దక్కించుకోవడం కంటే కూడా మిన్నయైనట్టిది. అందువలన సంతోషమే మనిషి సాధించగలిగిన అన్ని సుఖాల కంటే కూడా చాలా గొప్పది. సంతోషమనే గుణం మనసులో నిత్యమైనదిగా ప్రతిష్ఠించుకున్న మనిషికి, లోకంలో మరి సాధించవలసినదంటూ ఏదీ మిగిలి వుండదు' అని పై శ్లోకం భావం. అయితే పైన చెప్పిన మాటల్లో దేవగురువైన బృహస్పతి ఉద్దేశించిన 'సంతోషం' అనే మాటకు నిజమైన అర్థం ఏమిటో, ఆ సంతోషాన్ని పొందడానికి కావలసిన అర్హతలేమిటో, వ్యాసభారతంలోని శాంతిపర్వం, 26వ అధ్యాయం, 11, 12వ శ్లోకాలలో, ధర్మరాజు అర్జునుడితో చెప్పిన సంగతులలో విశదీకరిస్తాడు. ఎవరైతే క్రోధాన్ని, ఈర్ష్యను జయిస్తారో వారి హృదయంలో మాత్రమే వైరాగ్యంతో నిండినట్టిదైన సంతోషం, పరమ సుఖప్రదమైనదై స్థిరమైనదిగా ఉంటుంది. అట్టివారికి ఉత్తమమైన సిద్ధిని ఆ సంతోషం కలగజేస్తుంది' అనేది ధర్మరాజు విశదీకరణ సారాంశం.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

శ్రీశారదా పీఠంలో హీరో సుమంత్

- కొత్త సినిమాకు 'మహేంద్రగిరి వారాహి'గా నామకరణం



పెందుర్తి: విశాఖ శ్రీశారదా పీఠాన్ని ప్రముఖ సినీ హీరో సుమంత్, రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్ చిత్ర యూనిట్ సభ్యులు మంగళవారం సందర్శించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలను కలుసుకుని ఆశీస్సులు తీసుకున్నారు. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నూతనంగా నిర్మించనున్న చిత్రానికి 'మహేంద్రగిరి వారాహి'గా టైటిల్‌ను స్వామీజీ సమక్షంలో ప్రకటించారు. ముందుగా హీరో సుమంత్, హీరోయిన్ మీనాక్షి, దర్శకుడు జాగర్లపూడి సంతోష్, నిర్మాత కాలిపు మధు పీఠం ఆస్థాన దేవత శారద స్వరూప రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో కథకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా దర్శకుడు జాగర్లపూడి సంతోష్ మాట్లాడుతూ మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథాంశం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది జూన్‌లో చిత్ర నిర్మాణం ప్రారంభమైందని.. త్వరలోనే పూర్తవుతుందని చెప్పారు. నిర్మాతగా కాలిపు మధుకు ఇది రెండో చిత్రమన్నారు. చిత్ర బృందాన్ని స్వామీజీ ఘనంగా సత్కరించారు.

నిరుపేదను వరించిన వజ్రం

తుగ్గలి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన ఓ నిరుపేదను వజ్రం వరించింది. పొలంలో కంది పంటను చూసేందుకు వెళ్లిన రైతుకు మంగళవారం వజ్రం లభ్యమైనట్లు సమాచారం. దాదాపు 6 క్యారెట్లు పైగా ఉన్న ఈ వజ్రాన్ని ఓ వ్యాపారి రూ.8లక్షలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. వారం క్రితం ఇదే గ్రామంలో పొలం పనులకు వెళ్లిన కూలీకి రూ.11లక్షల విలువ చేసే వజ్రం లభ్యమైంది.

ఏసీబీ వలలో నర్సీపట్నం డీఎఫ్‌వో

టేకు రవాణాకు రూ.60,500 డిమాండ్



నర్సీపట్నం (అనకాపల్లి జిల్లా): లంచం తీసుకుంటూ అనకాపల్లి జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌వో) రాజారావు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ కాల్ సెంటర్‌కు నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లికి చెందిన బాలిరెడ్డి ఈశ్వరరావు చేసిన ఫిర్యాదు మేరకు వలపన్ని ఆయన్ని మంగళవారం రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ డీఎస్పీ శ్రావణి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఈశ్వరరావు చెందిన 280 టేక్ చెట్లు నరకడానికి, రవాణాకు అనుమతులు మంజూరు చేసేందుకు డీఎఫ్‌వో రూ.60,500 డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ సూచనల మేరకు ఈశ్వరరావు రూ. 50 వేల నగదును తీసుకువెళ్లి ఎఫ్ఆర్‌వో నారాయణ మూర్తి, ఆఫీస్ రైటర్ శ్రావణ్‌కుమార్‌కు అప్పగించాడు. వీరు ఆ నగదును డీఎఫ్‌వోకు ఇచ్చారు. డీఎఫ్‌వో రాజారావు నగదును లెక్కిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డీఎఫ్‌వో, రైటర్లను అరెస్టు చేసి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

కొత్త రాతియుగం నాటి చిత్రాల గుర్తింపు

యర్రగొండపాలెం: ప్రకాశంజిల్లా యర్రగొండపాలెం మండలంలోని బోయలపల్లి గ్రామానికి సమీపంలో గంగపాలెం పొలాల్లోని చక్రాలబోడు రాతిచెక్కలపై గీరుడు బొమ్మల(పెట్రోగ్లిఫ్స్)ను చరిత్ర పరిశోధకుడు తురిమెళ్ల శ్రీనివాసప్రసాద్ గుర్తించారు. రకరకాల ఆకృతుల్లో ఉన్న ఈ చెక్కుడు బొమ్మలు కొన్ని గుర్తించేందుకు వీల్లేకుండా ఉన్నాయి. ఒక రాతి చెక్కపై తెలుపు వర్ణంలో మూడు మూపురపు ఎడ్లను చిత్రించారు. మరో చోట వృత్తంతో కూడిన త్రిశూలాన్ని పురాతన మానవులు తమ సమూహ చిహ్నంగా గీశారు. చిత్రిత శిలాశ్రయంలో ఈ రాతి కళా చిత్రాలు వాటిలో చిత్రించిన మూపురపు ఎడ్ల ఆధారంగా అవి కొత్త రాతియుగం చివరిదశలో వేసినట్లు తెలుస్తోందని శ్రీనివాసప్రసాద్ తెలిపారు. చారిత్రక పరిశోధకుడు ప్రొఫెసర్ రామోజు హరగోపాల్, బీవీ భద్రగిరీష్ ఈ చిత్రాలు ఐదు వేల ఏళ్ల క్రితం చిత్రించినవిగా గుర్తించారని చెప్పారు.

'కాఫీ'తో నెహ్రూ చిత్రం



అన్నమయ్య జిల్లా రామాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఆర్ట్ మాస్టర్ ఆనందరాజు కాఫీ పొడితో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రాన్ని గీశారు. మంగళవారం నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గంటలో దీనిని రూపొందించి విద్యార్థులను అబ్బురపరిచారు.

–రామాపురం

ఇక కల్తీనీ ఇట్టే పసిగట్టొచ్చు

- పాల నుంచి ఫార్మా ఉత్పత్తుల వరకు..
- విషపూరిత రసాయనాలు, నాసిరకం గుర్తింపునకు మార్గం సుగమం
- అందుబాటులోకి పులివెందుల స్టేట్–సెంట్రల్ లేబొరేటరీ
- దేశంలోనే తొలి అతిపెద్ద అత్యాధునిక కేంద్రం
- 100కు పైగా పరీక్షలు..



సాక్షి, అమరావతి: పాలు, పాల ఉత్పతుల్లో విషపూరిత రసాయనాలు, ఆహార పదార్థాలు, మంచినీరు, మాంసం, గుడ్లు, రొయ్యలు, ఎరువులు, మందుల్లో కల్తీని ఇక ఇట్టే పసిగట్టవచ్చు. ఇందుకోసం రూ.11 కోట్లతో ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన దేశంలోనే తొలి అతిపెద్ద స్టేట్ సెంట్రల్ లేబొరేటరీ అందుబాటులోకి వచ్చింది. పులివెందులలోని ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఆన్ లైవ్‌స్టాక్ (ఏపీ కార్ల) ప్రాంగణంలో ఈ అత్యాధునిక లేబరేటరీని ఇటీవలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. దీంతో పాలల్లో నాణ్యతను అంచనా వేసేందుకు రాజమండ్రి, జి.కొత్తపల్లి, ఒంగోలు, మదనపల్లి, పులివెందుల, అనంతపురం సహకార పాల డెయిరీల్లో హై ఎండ్ ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం తాజాగా మరో అడుగు ముందుకేసినట్లయింది.

100కు పైగా పరీక్షలు చేసే వెసులుబాటు

రాష్ట్ర పరిధిలోని శాంపిల్స్‌ను పరీక్షించేందుకు ఇప్పటి వరకు కోల్‌కత్తా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు పంపేవారు. దూరాభారం కావడంతో ఒక్కో శాంపిల్‌కు రూ.2,500 నుంచి రూ.30 వేల వరకు ఖర్చయ్యేది. కాగా రూ.3కోట్లతో నిర్మించిన పులివెందుల లేబొరేటరీలో రూ.8 కోట్లతో ఇందుకు సంబంధించి అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేశారు. వందకుపైగా పరీక్షలు నిర్వహించేలా ఈ ల్యాబ్‌ను తీర్చిదిద్దారు. సుమారు 15 మంది నిష్ణాతులైన సిబ్బందిని నియమించారు. వీరిలో 8 మంది శాస్త్రవేత్తలతో పాటు జూనియర్, సీనియర్ ఎనలిస్టులు ఉంటారు. కాగా, ఆర్నెల్ల తర్వాత నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) నుంచి ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేస్తారు.

నిర్దేశిత గడువులోగా ఫలితాలు..

పాలు, పాల ఉత్పత్తులతో పాటు తేనె, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, ప్యాక్డ్ ఫుడ్, స్వీట్స్, జెల్లీ, కాన్ఫెక్షనరీస్, మాంసం, రొయ్యలు, గుడ్లు, గ్రాస్ సీడ్స్‌లలో కొవ్వు, ప్రొటీన్, ఎస్ఎన్ఎఫ్, నాన్ ప్రొటీన్ నైట్రోజెన్, పెస్టిసైడ్స్, యాంటి బయోటిక్స్, హెవీ మెటల్స్, కల్తీలు (అడాల్టరెంట్స్) ఇతర కలుషితాల (కంటామినెంట్ ఎలిమెంట్స్)ను 36–48 గంటల్లోపే పరీక్షిస్తారు. కాగా వీటిల్లో బ్యాక్టీరియల్ అవశేషాలను 4–5 గంటల్లో గుర్తిస్తారు. అదే మాంసం, రొయ్యలు, గుడ్లతో పాటు గ్రాస్ సీడ్స్, ఎరువులు, వేస్ట్ వాటర్‌లో ప్రొటీన్, నాన్ ప్రొటీన్ నైట్రోజెన్ అవశేషాలను 4–6 గంటల్లోనూ పసి గట్టవచ్చు. తాగునీరులో పోషక లోపాలు, కలుషితాలను 1–2 గంటల్లోనూ, ఫార్మా మందుల్లో 24గంటల్లో, ఇన్ప్యూరిటీ ఎనాలసిస్ (మలినాలు)ను 25 గంటల్లోనూ, ఖనిజాలు, పోషక లోపాలను 36 గంటల్లోనూ, ప్రీ క్లీనికల్, క్లినికల్ ఎనాలసిస్‌ను 15 రోజుల్లోనూ పరీక్షిస్తారు. తనిఖీల్లో గుర్తించిన శాంపిల్స్‌ను ఆయా డిపార్టుమెంట్లు ఈ లేబొరేటరీకి పంపితే నిర్దేశిత గడువులోగా విశ్లేషించి ఫలితాలతో కూడిన నివేదికలను అందజేస్తారు. ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు సైతం ఈ లేబోరేటరీ సేవలను ఉపయోగించుకోవచ్చు.

అవశేషాలను గుర్తించడం ఇక సులభం

అత్యాధునిక స్టేట్ సెంట్రల్ ల్యాబ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పాలు, పాల ఉత్పత్తులు, ఆహార పదార్థాలు, ఎరువులు,తాగునీరు, మందులు, మాంసం, గుడ్లు, రొయ్యల్లో పురుగు మందుల అవశేషాలు, యాంటీబయాటిక్, పశువైద్య అవశేషాలు, భారీలోహాలు, మైక్రో టాక్సిన్‌లు, వ్యాధి కారకాలను నిర్దేశిత గడువులోగా గుర్తించొచ్చు. భౌతిక, రసాయన, జీవ నాణ్యతను విశ్లేషించి ధ్రువీకరణ పత్రాలు పొందొచ్చు. కల్తీలకు ఇక పూర్తిగా చెక్ పెట్టొచ్చు.

– అహ్మద్‌బాబు, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్

మహాశక్తి యాగం ప్రారంభం

- శ్రీ పీఠంలో లలితాదేవికి ప్రత్యేక పూజలు
- కుంకుమార్చనకు తరలివచ్చిన మహిళలు



లలితాదేవి అమ్మవారి ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: జిల్లా కేంద్రం కాకినాడలోని శ్రీపీఠంలో మహాశక్తి యాగం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. శతకోటి లలితా కుంకుమార్చన ప్రాంగణంలో వేదికపై లలితా అమ్మవారి ప్రతిమ ఏర్పాటు చేసి పరిపూర్ణనంద స్వామి అంకురార్పణ చేశారు. నెల రోజుల పాటు శ్రీపీఠంలో శతకోటి లలితా కుంకుమార్చన, కోటి బగళాముఖి హోమం, మహా నక్షత్ర శాంతి, కోటి దీపోత్సవం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తొలి రోజు కుంకుమార్చనకు సుమారు 12వేల మంది మహిళలు హాజరయ్యారు. పరిపూర్ణానంద స్వామి లలితా సహస్ర నామాలు చదువుతుండగా మహిళలు కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కార్తీక మాసంలో ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాయాగంలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఒక్కో రోజు ఒక్కో దేవతను ఆవాహం చేసి పూజలు చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరికి సుఖశాంతులు, ఆయురారోగ్యం, ఇష్టకార్యసిద్ధి చేకూరాలనే సంకల్పంతో మహాశక్తి యాగం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

వైభవంగా పైడితల్లి ఉయ్యాల కంబాల ఉత్సవం



పైడితల్లి ఉత్సవ విగ్రహంతో ఊయల ఊగుతున్న సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం విజయనగరంలోని పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో చివరి ఘట్టమైన ఉయ్యాల కంబాల మహోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. పసుపు కుంకుమలు సమర్పించారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని చేతపట్టుకుని మూడు సార్లు ఊయలలో ఊపారు. అనంతరం ఊయలను తీసివేసి ఉత్సవానికి ముగింపు పలికారు. బుధవారం ఉదయం ఇరుముడులు ధరించిన పైడితల్లి దీక్షాపరులందరూ చదురుగుడి నుంచి కోట, బాలాజీ కూడలి, రామానాయుడు రోడ్డు, ఎన్‌సీఎస్ రోడ్డు, గాడీఖానా మీదుగా రైల్వేస్టేషన్ వద్ద నున్న వనంగుడికి యాత్రగా చేరుకుంటారు. అక్కడ నిర్వహించే చండీయాగం, పూర్ణాహుతి, దీక్షవిరమణలతో ఉత్సవం ముగుస్తుందని ఆలయ ఈవో సుధారాణి తెలిపారు. నాటి నుంచి ఆరు నెలల వరకూ అమ్మవారు వనంగుడిలోనే భక్తులకు దర్శనమిస్తారన్నారు.

గజ వాహనంపై శ్రీమహాలక్ష్మి దర్శనం

- వైభవంగా శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు
- జగన్మోహినిగా తిరువీధుల్లో ఊరేగిన అమ్మవారు



అమ్మవారి గజ వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి తదితరులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి అమ్మవారు శ్రీమహాలక్ష్మిగా గజ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఎనిమిది గంటలకు జగన్మోహిని అలంకరణలో తిరువీధుల్లో అమ్మవారు పల్లకీలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం అనంతరం అమ్మవారికి వసంతోత్సవం వేడుకగా జరిగింది. సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారి ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి 6.30 గంటలకు అమ్మవారిని వాహన మండపానికి వేంచేపుగా తీసుకొచ్చి గజ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం పట్టుపీతాంబర వజ్రవైఢూర్య స్వర్ణాభరణాలతో పాటు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తీసుకొచ్చిన సహస్ర లక్ష్మీ కాసుల హారాన్ని అమ్మవారికి అలంకరించారు. రాత్రి ఏడు గంటలకు సంప్రదాయ భక్తి సంగీత, భజన, కోలాట బృందాలు, మంగళ వాయిద్యాలు, జియ్యర్ స్వాముల ప్రబంధ పారాయణం, కళాకారుల విచిత్ర వేషధారణల నడుమ అమ్మవారు గజేంద్రునిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి కర్పూర హారతులు పట్టారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సర్వభూపాల వాహనం సేవ, రాత్రి గరుడ వాహన సేవ జరగనున్నాయి.

సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తాం

పౌర సన్మానంలో త్రిదండి చినజీయర్ స్వామి



లబ్బీపేట (విజయవాడ తూర్పు): జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో విద్య, వైద్య రంగాల్లో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి చెప్పారు. పద్మభూషణ్ అవార్డు తీసుకున్న సందర్భంగా మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ఆయనకు పౌర సన్మానం జరిగింది. పలువురు మాట్లాడుతూ చిన జీయర్ స్వామి ఆధ్యాత్మిక రంగంతో పాటు, సేవా రంగంలో కూడా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. చినజీయర్ స్వామి మాట్లాడుతూ రానున్న రోజుల్లో జీయర్ ట్రస్ట్ సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అంధ పాఠశాల నిర్వహిస్తుండగా, రానున్న రోజుల్లో న్యాయ కళాశాలను స్థాపించనున్నట్లు పేర్కొన్నారు. అంధ క్రికెట్ టీమ్‌లో సభ్యులైన ముగ్గురిని సత్కరించి వారికి రూ. 2 లక్షలు నగదు బహుమతులు అందజేశారు. అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారుడిని సత్కరించారు. శ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి, శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామిలతో పాటు, జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లిఖార్జునరావు, మైహోమ్ గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు టీసీఎస్‌కు బాంబు బెదిరింపు

కలకలం రేపిన మాజీ ఉద్యోగిని ఫోన్ కాల్

బనశంకరి: బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీలోని ప్రముఖ ఐటీ సంస్థ టీసీఎస్‌కు మంగళవారం బాంబు బెదిరింపు కాల్ రావడం కలకలం రేపింది. భవనం బీ బ్లాక్‌లో బాంబు పెట్టినట్లు ఓ ఆగంతకురాలు కాల్ చేయగా, అది తెలిసి ఉద్యోగులు బయటికి పరుగులు తీశారు. పరప్పన అగ్రహార పోలీసులకు సమాచారం అందించడంతో బాంబు స్క్వాడ్ వచ్చి తనిఖీలు చేసింది. అయితే ఎలాంటి అనుమానిత వస్తువులు దొరకలేదు. పోలీసులు కాల్ గురించి విచారణ చేపట్టగా అది మాజీ ఉద్యోగిని పని అని తేలింది. గతంలో ఈ కంపెనీలో పనిచేసిన బెళగావికి చెందిన మహిళ.. ఉన్నత విద్య కోసం రాజీనామా చేసి వెళ్లింది. చదువు పూర్తయ్యాక ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరగా, అందుకు కంపెనీ సమ్మతించలేదు. దీంతో ఆమె కోపం పట్టలేక బాంబు బెదిరింపు కాల్ చేసినట్లు గుర్తించారు. పోలీసులు ఆ మహిళను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

పాముకు ప్రాణదానం



పాముకు ఆక్సిజన్ అందిస్తున్న వైద్యులు

రాయచూరు రూరల్: పాము అంటేనే ప్రాణాలు తీస్తుందని భయపడతాం. కనిపిస్తే పరుగులు తీస్తాం... కానీ అస్వస్థతకు గురైన ఓ పామును వైద్యులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి వైద్యం చేసి ఊపిరిపోశారు. ఈ సంఘటన మంగళవారం కర్ణాటకలోని రాయచూరు జిల్లా లింగసూగూరులో చోటుచేసుకుంది. లింగసూగూరు తాలూకా హట్టి సమీపంలోని పామనకల్లూరు క్రాస్ వద్ద ఓ జెర్రిపోతు పాము కారులోకి దూరింది. హట్టి ఆస్పత్రి వైద్యుడు రవీంద్రనాథ్ ఆ పామును పట్టుకోవడానికి ప్రయత్నించగా దొరకలేదు. అది కారు నుంచి బయటకు రావాలని ఫినాయిల్ చల్లడంతో వాసన తట్టుకోలేక బయటకొచ్చింది. కానీ స్పృహ తప్పి అచేతనంగా పడిపోయింది. ఈ విషయం తెలుసుకున్న లింగసూగూరుకు చెందిన పాముల వైద్యుడు ఖాలిద్ చావుస్ వచ్చి ఆ పామును గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి బెడ్‌పై పడుకోబెట్టి చికిత్స అందించారు. పాము నోట్లో ఆక్సిజన్ పైపు పెట్టి చికిత్స చేయడంతో కోలుకుంది. తర్వాత ఆ పామును ఊరికి దూరంగా వదిలిపెట్టారు.

బీటెక్ రవి అరెస్టు

సాక్షి ప్రతినిధి, కడప: క్రికెట్ బెట్టింగ్ సహా పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి అలియాస్ బీటెక్ రవిని మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. రవిపై వల్లూరు పోలీసుస్టేషన్‌లో ఓ కేసు పెండింగ్‌లో ఉంది. టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో డ్యూటీలో ఉన్న ఓ పోలీసుపై దురుసుగా ప్రవర్తించి, కాలు ఫ్యాక్చర్ కావడానికి బీటెక్ రవి కారకుడైనట్లు అప్పట్లో కేసు నమోదయింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి రవిని అరెస్టు చేసిన పోలీసులు... రిమ్స్‌లో వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం కడప ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చారు. మేజిస్ట్రేటు14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారు. నిజానికి ఈ మధ్యే పోరుమామిళ్ల కేంద్రంగా భారీ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారం చోటు చేసుకున్నట్లు వెలుగు చూసింది. ఈ వ్యవహారంలో పోలీసులు సమగ్ర దర్యాప్తు చేయటంతో.. తీగలాగితే డొంక కదిలినట్లు మొత్తం వ్యవహారం బీటెక్ రవి చుట్టూనే చేరింది. క్రికెట్ బెట్టింగ్ విషయాల్లో వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ సీరియస్‌గా ఉండటంతో... స్థానికంగా పేరున్న లాడ్జిలను ఆయనే స్వయంగా తనిఖీలు సైతం చేశారు. బెట్టింగ్ అణిచివేతలో భాగంగా మూలాలపై దృష్టి సారించిన క్రమంలో పోరుమామిళ్ల బెట్టింగ్ రాకెట్ మొత్తం బీటెక్ రవి కనుసన్నుల్లో నడిచినట్లు రూఢీ అయ్యింది. పోలీసులకు పక్కా ఆధారాలు దొరకటంతో... బీటెక్ రవి తప్పించుకొని తిరుగుతున్నట్లుగా తెలియవచ్చింది. ఈ క్రమంలోనే యోగివేమన యూనివర్శిటీ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో బీటెక్ రవి ఉండడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంపై నోటీసులు జారీ చేసి, విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

నా బ్లడ్‌లోనే జూదం ఉంది..

బీటెక్ రవి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన తర్వాత విజయోత్సవ ర్యాలీలో సింహాద్రిపురం కేంద్రంగా 'జూదం మా బడ్లోనే ఉంది' అంటూ మరోసారి వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు పలుసార్లు వివిధ సందర్భాల్లో ఇవే తరహా వ్యాఖ్యలు చేశారు. చిన్నప్పటి నుంచి జూదం అలవాటు ఉన్నట్లుగా అప్పట్లో వచ్చిన ఆరోపణలపై స్వయంగా వివరణ ఇస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. తాజాగా ప్రపంచ కప్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతుండటంతో పోలీసులు బెట్టింగ్‌ను సీరియస్‌గా తీసుకుని తనిఖీలు చేశారు. జిల్లాలో పెద్ద ఎత్తున బెట్టింగ్‌కు పాల్పడే అలవాటున్న బెట్టింగ్ రాయుళ్లందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. పాత నేరస్థులను పిలిపించి, క్రికెట్ బెట్టింగ్ ఎక్కడా నిర్వహించరాదని హెచ్చరికలు చేశారు. ఈ క్రమంలోనే పోరుమామిళ్ల కేంద్రంగా బెట్టింగ్ జరుగుతోందని, ఇదంతా బీటెక్ రవి కనుసన్నల్లోనే నడుస్తోందని బయటపడినట్లు సమాచారం. ఆ మేరకు పోలీసులు నోటీసులు జారీ చేసి విచారణ చేస్తున్నట్లు తెలియవచ్చింది.

కిడ్నాప్ అంటూ హైడ్రామా....

పోలీసులు క్రికెట్ బెట్టింగ్‌లో బీటెక్ రవిని అదుపులోకి తీసుకోగానే టీడీపీ ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి.. బీటెక్ రవిని కిడ్నాప్ చేశారంటూ సోషల్ మీడియాలో ప్రకటన చేశారు. అంతే!! వాస్తవాలు ఏమాత్రం తెలుసుకోకుండా 'అదిగో పులి అంటే ఇదిగో తోక' అన్నట్లుగా ఎల్లో మీడియా కిడ్నాప్ కలకలం అంటూ కాసేపు ఊదరగొట్టింది. చివరకు పోలీసులు అరెస్టును ధ్రువీకరించటంతో ఈ గాసిప్‌లకు తెరపడింది.

తల్లి మరణ వార్త విని ఆగిన కొడుకు గుండె

- అరగంట వ్యవధిలో తల్లీ కొడుకులు మృతి
- నరసాపురం గోదావరి పంటిరేవు సమీపంలో విషాదం



మంగతాయారు (ఫైల్)



లక్ష్మణ్‌కుమార్ (ఫైల్)

నరసాపురం: తల్లి మరణ వార్త విని కొడుకు గుండెపోటుకు గురై మృతి చెందిన విషాద ఘటన మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం గోదావరి పంటిరేవు వద్ద చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... పంటిరేవు వద్ద ఆత్మూరి వెంకటరత్నం, అలివేలు మంగతాయారు (70) దంపతులు చాలాకాలంగా కిరాణా కొట్టు నడుపుతున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు లక్ష్మణ్‌కుమార్ (45) తల్లిదండ్రులతో ఉంటూ కిరాణా కొట్టు చూసుకుంటున్నాడు. లక్ష్మణ్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు. అంతా ఒకే ఇంట్లో ఉంటూ అదే ఇంట్లో కిరాణా కొట్టు నడుపుతున్నారు. కార్తీక మాసం ప్రారంభం కావడంతో మంగళవారం ఉదయం ఆరు గంటలకు కుటుంబ సభ్యులందరూ పక్కనే ఉన్న గోదావరి రేవులో స్నానం చేసి వచ్చారు. లక్ష్మణ్‌కుమార్ తన ఇద్దరు కుమార్తెలను పాఠశాలలో దింపేందుకు వెళ్లిన సమయంలో అలివేలు మంగతాయారు గుండెపోటుకు గురై ఒక్కసారిగా ఇంట్లో కుప్పకూలిపోయింది. ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే ఆమె మృతి చెందింది. పిల్లలను పాఠశాలలో దింపి ఇంటికి చేరుకున్న లక్ష్మణ్‌కుమార్ తల్లి మరణవార్త విని తట్టుకోలేకపోయాడు. అతను కూడా గుండెపోటుతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని 108లో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో పంటిరేవులలో విషాదచాయలు అలుముకున్నాయి. భార్య, కుమారుడి మరణాన్ని ఇంటి పెద్ద వెంకటరత్నం తట్టుకోలేకపోతున్నారు. ఆయన భోరున విలపించడం స్థానికంగా అందరినీ కలచివేసింది.

200 మందితో ఏకకాలంలో చెస్

రికార్డు తిరగరాసిన ఇంటర్‌నేషనల్ చెస్ మాస్టర్ పీడీఎస్ గిరినాథ్



సాక్షి, భీమవరం: ఏకకాలంలో 200మంది విద్యార్థులతో చెస్ ఆడి తన రికార్డును తానే బద్దలు కొట్టుకున్నారు పశ్చిమగోదావరి జిల్లా, భీమవరానికి చెందిన ఇంటర్‌నేషనల్ చెస్ మాస్టర్ పీడీఎస్ గిరినాథ్. మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. గతంలో ఇదే పాఠశాలలో ఆయన ఏకకాలంలో 108 మంది క్రీడాకారులతో చెస్ ఆడి రికార్డు సృష్టించగా, ఈసారి ఏకంగా 200 మందితో దాదాపు ఐదు గంటలకు పైగా చెస్ ఆడి తన రికార్డును తానే అధిగమించారు. ఈ పోటీలో ఐదో తరగతి విద్యార్థి పత్సమట్ల నాగశ్రీ ప్రద్యుమ్న వర్మ చివరి వరకు నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నాడు. జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు మాట్లాడుతూ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. స్కూల్ ప్రో వైస్ చైర్మన్ వత్సవాయి శ్రీనివాసరాజు ప్రసంగించారు. అనంతరం గిరినాథ్‌ను ఏఎస్పీ సుబ్బరాజు, శ్రీనివాసరాజు సత్కరించారు.

టీటీడీ నిధులతో నిర్మాణాలకు పెద్దపీట

▶ మొదటి పేజీ తరువాయి

తిరుపతికి పూర్తిగా ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పడుతుంది.

- ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రిలో రోగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు రూ.1.65 కోట్లతో గ్రౌండ్ ఫ్లోర్ అభివృద్ధి పనులకు టెండర్ ఆమోదం.
- తిరుపతిలో శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి రుయా ఆస్పత్రిలో నూతన టీబీ వార్డు నిర్మాణానికి రూ.1.79 కోట్లతో టెండర్ ఆమోదం.
- స్విమ్స్ ఆస్పత్రిలో మరింత మంది రోగుల సౌకర్యం కోసం రూ.3.35 కోట్లతో ప్రస్తుతం ఉన్న భవనంపై మరో రెండు అంతస్తుల నిర్మాణానికి టెండరు ఆమోదం.
- స్విమ్స్‌లో నూతన కార్డియో న్యూరో బ్లాక్ నిర్మాణానికి రూ.74.24 కోట్లతో టెండర్ ఖరారు.
- స్విమ్స్ ఆస్పత్రి భవనాల ఆధునికీకరణకు, పునర్నిర్మాణానికి రూ.197 కోట్లతో చేపట్టే పనులకు పరిపాలనా అనుమతికి ఆమోదం. మూడేళ్లలో దశలవారీగా చేపట్టేందుకు నిర్ణయం.
- నడక దారుల్లో భక్తుల భద్రత కోసం డిజిటల్ కెమెరా ట్రాప్‌లు, వైల్డ్ లైఫ్ మానిటరింగ్ సెల్, కంట్రోల్ రూమ్‌కు అవసరమైన పరికరాల కొనుగోలుకు రూ.3.5 కోట్ల మంజూరుకు ఆమోదం.
- శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం ఈ నెల 23న అలిపిరి వద్దగల సప్తగోప్రదక్షిణ మందిరంలో ప్రారంభం. ఇందుకోసం టికెట్ ధర రూ.1000గా నిర్ణయం. ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లో టికెట్లు కేటాయిస్తారు. ప్రత్యక్షంగా, వర్చువల్‌గా పాల్గొనవచ్చు. ఈనెల 16న టీటీడీ ఆన్‌లైన్‌లో టికెట్లు విడుదల చేస్తారు.
- టీటీడీలో కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వ జీవో 114 విధివిధానాలకు లోబడి టీటీడీలో అమలుకు నిర్ణయం.

అనారోగ్యంతో రిమాండ్ ఖైదీ మృతి

- నంద్యాల త్రీటౌన్, తాలుకా స్టేషన్లలో కేసులు

బొమ్మలసత్రం (నంద్యాల): నంద్యాల సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న కుర్రా వెంకటేశ్వర్లు (55) కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనకాపల్లి జిల్లా రోళ్లగుంట మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కొంత కాలంగా గంజాయి అక్రమ రవాణా చేస్తున్నాడు. ఈయనకు తోడుగా భార్య సరస్వతి, కుమారుడు అంజి ఉండేవారు. ఒడిశా రాష్ట్రంలో గంజాయిని తక్కువ రేటుకు కొనుగోలు చేసి నంద్యాల జిల్లాలో వీరు విక్రయాలు చేసేవారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి, జులై నెలలో త్రీటౌన్ పోలీసులు వెంకటేశ్వర్లుపై కేసులు నమోదు చేశారు. గత నెల 28న బెయిల్ రావడంతో అదే రోజు త్రీటౌన్ పోలీసులు కోర్టులో వెంకటేశ్వర్లుపై పాత కేసులో పీటీ వారెంట్‌పై తిరిగి నంద్యాల సబ్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. అక్కడ వెంకటేశ్వర్లు సోమవారం తీవ్ర అస్వస్థతకు లోనుకావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, వెంకటేశ్వర్లు భార్య సరస్వతి కర్నూలు సబ్‌జైలులో గంజాయి కేసులో రిమాండ్‌కు వెళ్లి బెయిల్‌పై బయటకు రాగా.. కుమారుడు విశాఖపట్నం జైలులో గంజాయి కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

క్లుప్తంగా...

బాలికపై అత్యాచారం, హత్య.. దోషికి మరణ శిక్ష

కొచ్చి: ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి, పాశవికంగా హత్య చేసిన బిహార్ వలస కూలీకి కేరళలోని ప్రత్యేక పోక్సో కోర్టు ఐపీసీ సెక్షన్ 302 కింద మరణ శిక్ష విధించింది. చనిపోయేదాకా అతడిని ఉరి తీయాలని ఆదేశించింది. అంతే కాకుండా దోషికి రూ.7.3 లక్షల జరిమానా విధించింది. నేరం జరిగిన తర్వాత 110 రోజుల్లో ఈ మేరకు మంగళవారం తీర్పు వెలువరించింది. అష్ఫాక్ అలం(28) బిహార్ నుంచి కేరళకు వలస వచ్చాడు. అలూవా పట్టణంలో కూలీగా పనిచేస్తున్నాడు. స్థానికంగా ఉండే ఐదేళ్ల బాలికపై కన్నేశాడు. ఎవరూ లేని సమయంలో ఆమెను అపహరించాడు. బలవంతంగా మద్యం తాగించి, పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి పట్ల రాక్షసంగా ప్రవర్తించాడు. ఆమె చనిపోయిన తర్వాత మృతదేహాన్ని చెత్తకుండీలో దాచిపెట్టాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టి, అష్ఫాక్ అలంను దోషిగా గుర్తించారు. పోక్సో ప్రత్యేక కోర్టు అతడికి మరణ శిక్ష ఖరారు చేసింది. ఇది అత్యంత అరుదైన కేసు అని న్యాయమూర్తి కె.సోమన్ వెల్లడించారు. కోర్టు తీర్పును కేరళ ముఖ్యమంత్రి కె.విజయన్, మంత్రులు స్వాగతించారు. కోర్టు తీర్పు పట్ల అలూవా పట్టణంలో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. బాలల దినోత్సవం రోజే కోర్టు నుంచి తీర్పు రావడం విశేషం. అంతేకాదు పోక్సో చట్టానికి మంగళవారమే 11వ వార్షికోత్సవం.

ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డివిజనల్ కమిషనర్‌ను తొలగించండి

కేజ్రీవాల్‌కు మంత్రి అతీశీ సిఫార్సు

న్యూఢిల్లీ: భూకుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేశ్ కుమార్, డివిజనల్ కమిషనర్ అశ్వనీ కుమార్‌ను తక్షణమే పదవుల నుంచి తొలగించాలని ఢిల్లీ విజిలెన్స్ మంత్రి అతీశీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మంగళవారం ప్రతిపాదించారు. ఈ మేరకు ఆమె ఒక నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించారు. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) రైతుల నుంచి భూములు సేకరించింది. బామ్నోలీ గ్రామంలో భూసేకరణలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. నరేశ్ కుమార్ కుమారుడు కరణ్ చౌహాన్‌కు చెందిన కంపెనీకి లబ్ధి కలిగేలా నష్టపరిహారాన్ని భారీగా పెంచేశారు. భూములు కోల్పోతున్న రైతులకు వాస్తవంగా ప్రభుత్వం ఇవ్వదల్చుకున్న నష్ట పరిహారం రూ.312 కోట్లు కాగా, దీన్ని ఉద్దేశపూర్వకంగా రూ.850 కోట్లకు పెంచేశారు. ఈ వ్యవహారంపై ఢిల్లీ విజిలెన్స్ శాఖ దర్యాప్తు చేపట్టింది. అవకతవకలు జరిగినట్లు గుర్తించింది.

శ్రీలంకలో భూకంపం

కొలంబో: శ్రీలంకలో మంగళవారం మధ్యాహ్నం 12.31 గంటల సమయంలో సంభవించిన శక్తివంతమైన భూకంపం ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురి చేసింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.2గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రకంపనలతో భయకంపితులైన ప్రజలు ఇళ్లను వదిలి వీధుల్లోకి పరుగులు తీశారు. రాజధాని కొలంబోకు 1,326 కిలోమీటర్ల దూరంలో హిందూ మహాసముద్రంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉందని చెప్పారు. ప్రాణనష్టం సంభవించినట్లు ఎటువంటి సమాచారం లేదని వెల్లడించారు.

మండల పూజలకు శబరిమల సిద్ధం

తిరువనంతపురం: ప్రఖ్యాత శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 17వ తేదీ నుంచి మొదలయ్యే మండలం-మకరవిలక్కు పూజలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర దేవస్వామ్ మంత్రి కె.రాధాకృష్ణన్ చెప్పారు. భక్తుల సందర్శన సజావుగా సాగేందుకు అత్యాధునిక టెక్నాలజీని వాడుతున్నామన్నారు. సన్నిధానమ్, ఆలయ కాంప్లెక్స్‌ల్లో భక్తుల రద్దీని క్రమబద్ధం చేసేందుకు డైనమిక్ క్యూ కంట్రోల్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. నీలక్కల్, పంపా, సన్నిధానమ్ ప్రాంతాల్లో భక్తులకు రద్దీని గురించి తెలిపేందుకు వీడియో వాల్‌లను ఏర్పాటు చేశామన్నారు. మరింత సమగ్రమైన ఈ-పూజా సౌకర్యాన్ని కూడా ఈసారి ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఈ ఆలయాన్ని ఏటా మలయాళీల వృశ్చిక మాసం మొదటిరోజు మొదలు దాదాపు రెండు నెలలపాటు తెరచి ఉంచుతారు.

రన్‌వే పైకి వీధి కుక్క.. వెనక్కి మళ్లిన విమానం

పణజి: రన్‌వే పైకి వీధి శునకం రావడంపై విమానం వెనక్కి వెళ్లిపోయిన సంఘటన గోవాలోని డబోలిమ్ ఎయిర్‌పోర్టులో జరిగింది. విస్తారా యూకే 881 విమానం బెంగళూరులోని కెంపేగౌడ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి సోమవారం మధ్యాహ్నం 12.55 గంటలకు బయలుదేరింది. డబోలిమ్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావాల్సి ఉంది. కానీ, ఈ ఎయిర్‌పోర్టు రన్‌వే పై ఒక శునకం ఉన్నట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ గుర్తించారు. బెంగళూరు నుంచి వస్తున్న విస్తారా విమానం ల్యాండ్ అయ్యేందుకు అనుమతి ఇవ్వలేదు. దాంతో ఆ విమానం వెనక్కి మళ్లింది. మధ్యాహ్నం 3.05 గంటలకు బెంగళూరుకు చేరుకుంది. సమాచారం అందుకున్న డబోలిమ్ ఎయిర్‌పోర్టు సిబ్బంది ఆ శునకాన్ని రన్‌వే నుంచి దూరంగా తరిమేశారు. ఆ తర్వాత ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ క్లియరెన్స్ ఇవ్వడంతో విస్తారా విమానం సాయంత్రం 4.55 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి 6.15 గంటలకు డబోలిమ్ ఎయిర్‌పోర్టులో క్షేమంగా ల్యాండయ్యింది.

గాజా.. మరుభూమి!

మృత్యుదిబ్బలుగా ఆస్పత్రులు! అల్ షిఫాలో 179 మృతదేహాల ఖననం

- తీవ్ర అపరిశుభ్రత, ప్రాణాంతక రోగాలు
- పని చేస్తున్నది అల్ అహ్లి ఆస్పత్రి ఒక్కటే
- గాజా పార్లమెంటును ఆక్రమించిన ఇజ్రాయెల్

డెయిర్ అల్ బలాహ్/జెరూసలేం/టెల్ అవీవ్: గాజాలో పరిస్థితులు నానాటికీ విషమిస్తున్నాయి. కరెంటు తదితర సదుపాయాలతో పాటు నిత్యావసరాలన్నీ పూర్తిగా నిండుకోవడంతో కొద్ది రోజుల క్రితం నుంచే పూర్తిగా పడకేసిన ఆస్పత్రులు క్రమంగా మృత్యుదిబ్బలుగా మారుతున్నాయి. రోగులు, నవజాత శిశువుల నిస్సహాయ సామూహిక మరణాలకు వేదికలుగా మారుతున్నాయి. గాజాలోని ప్రధాన ఆస్పత్రి అల్ షిఫాలో మృతుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నట్టు తెలుస్తోంది. ఏకంగా 179 మృతదేహాలను ప్రాంగణంలోనే ఒకే చోట సామూహికంగా ఖననం చేసినట్టు ఆస్పత్రి డైరెక్టర్ అబూ సలామియా తాజాగా నిర్ధారించడం పరిస్థితికి అద్దం పడుతోంది! వీరిలో చాలామంది ఐసీయూ రోగులు, నవజాత శిశువులేనని సమాచారం. అక్కడ 30కి పైగా శవాలను ఖననం చేస్తుండగా చూసినట్టు అక్కణ్నుంచి బయటపడ్డ ప్రత్యక్ష సాక్షి కూడా వెల్లడించారు. పలు ఇతర ఆస్పత్రుల్లోనైతే మృతదేహాలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఉత్తర గాజాలో అల్ అహ్లి బాప్టిస్ట్ ఆస్పత్రి మాత్రమే కాస్తో కూస్తో పని చేస్తోందని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. ఒక్క మంగళవారమే 500 మందికి పైగా క్షతగాత్రులు అందులో చేరినట్టు వివరించింది. కరెంటు లేకపోవడం, ఆక్సిజన్, ఇంధనంతో పాటు ఆహార పదార్థాలు, నిత్యావసరాలన్నీ నిండుకుంటుండటంతో అది కూడా ఏ క్షణమైనా పూర్తిగా మూతబడే పరిస్థితి నెలకొందని ఆవేదన వెలిబుచ్చింది. మరోవైపు గాజా అంతటా ఎటు చూసినా వ్యర్థాల కుప్పలే కనిపిస్తున్నాయి. ఎటు చూసినా మురుగు నీరు పొంగి పొర్లుతోంది. వాటిద్వారా ఇప్పటికే పలు అంటు రోగాలు ప్రబలుతున్నాయి. ఇవి మరింత విజృంభిస్తే గాజా మరుభూమిగా మారుతుందంటూ ఆందోళన వ్యక్తమవుతోంది. చలి, చెదురుమదురు వర్షాలతో పరిస్థితి మరింతగా దిగజారుతోంది.

జబాలియాలో 30 మంది మృతి: మరోవైపు, గాజాలో ఇజ్రాయెల్ యుద్ధ బీభత్సం మంగళవారం కూడా యథాతథంగా కొనసాగింది. ఆస్పత్రులతో పాటు ఇంకా చెదురుమదురుగా మిగిలి ఉన్న భవనాలన్నీ క్షిపణి, బాంబు దాడులు, కాల్పులతో అల్లాడిపోయాయి. ఉత్తర గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపై జరిగిన బాంబు దాడులు మరో 30 మందిని బలిగొన్నట్టు తెలుస్తోంది. గాజాలోని పార్లమెంటు భవనాన్ని ఇజ్రాయెల్ సైనికులు ఆక్రమించారు. భవనం లోపల ఇజ్రాయెల్ పతాకాలతో ఉన్న సైనికుల ఫొటోలు ఆ దేశ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్)కు చెందిన గోల్డెన్ బ్రిగేడ్ గాజా పార్లమెంటును స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. మరోవైపు ఇప్పటిదాకా 100 మందికి పైగా ఐరాస వర్కర్లు యుద్ధానికి బలయ్యారు. మరణించిన పాలస్తీనా వాసుల సంఖ్య 11,550 దాటినట్టు గాజా ఆరోగ్య శాఖ చెబుతోంది. వీరిలో మూడొంతులు మహిళలు, పిల్లలేనని పేర్కొంది.

ఆస్పత్రులను కాపాడాలి: బైడెన్

బందీల విడుదలకు కృషి చేస్తున్నట్టు తాము కూడా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. అల్ షిఫాతో పాటు గాజాలో ఆస్పత్రులన్నింటినీ ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తిగా కాపాడాలన్నారు. ఏ ఆస్పత్రి మీదా ఇజ్రాయెల్ సైన్యం దుందుడుకు చర్యలకు పాల్పడరాదని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో, పట్టు వీడేందుకు ఇప్పటిదాకా ససేమిరా అంటున్న ఇజ్రాయెల్ కూడా కాస్త దిగొస్తున్నట్టు కన్పిస్తోంది. గాజా ఆస్పత్రుల్లో మృత్యుముఖంలో ఉన్న నవజాత శిశువులను సురక్షితంగా తరలించేందుకు ఇంక్యుబేటర్లను పంపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తాజాగా ఆ దేశ ఆరోగ్య శాఖ తెలిపింది.

ఆస్పత్రులే కమాండ్ సెంటర్లు: ఇజ్రాయెల్

ఆస్పత్రులను హమాస్ తన స్థావరాలుగా మార్చుకుందని ఇజ్రాయెల్ మరోసారి ఆరోపించింది. ఇందుకు ఆధారాలున్నట్టు పేర్కొంది. రంటిసీ పిల్లల ఆస్పత్రిలో గ్రెనేడ్లు, పేలుడు పదార్థాలతో కూడిన కమాండ్ సెంటర్‌ను గుర్తించామంటూ సంబంధిత వీడియోలు, ఫొటోలు విడుదల చేసింది. ఇజ్రాయెల్ బందీలను కూడా అక్కడే దాచారని అనుమానం వెలిబుచ్చింది. వీటిని హమాస్ మరోసారి ఖండించింది. ఆస్పత్రులపై నిస్సిగ్గు దాడులను సమర్థించుకునేందుకే ఇజ్రాయెల్ నిరాధారణ ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టింది.

వాళ్లు రోగులు.. జంతువులు కాదు!

కంటతడి పెట్టిస్తున్న డాక్టర్ ఇంటర్వ్యూ



అల్ షిఫా ఆస్పత్రిని తక్షణం వీడాలన్న ఇజ్రాయెల్ ఆదేశాలను వైద్య సిబ్బంది మంగళవారం కూడా తిరస్కరించారు. 700 మందికి పైగా నిస్సహాయులైన రోగులను ప్రాణాపాయ పరిస్థితుల్లో వదిలి వెళ్లలేమని స్పష్టం చేశారు! ఈ క్రమంలో ఆస్పత్రికి చెందిన హమామ్ అల్లో అనే నెఫ్రాలజిస్టు మరణానికి ముందు ఇచ్చిన ఇంటర్వ్యూ ఇప్పుడందరినీ కంటతడి పెట్టిస్తోంది. ''ఆస్పత్రిలో, ఐసీయూ వార్డుల్లో అంతమంది ఉన్నారు. వారంతా రోగులు. జంతువులు కారు. నేను వెళ్లిపోతే వారికి చికిత్స అందించేదెవరు? చికిత్స పొందడం వారి హక్కు. వారి కర్మకు వారిని వదిలి వెళ్లలేం. 14 ఏళ్ల పాటు వైద్య విద్య నేర్చుకున్నది ఇలా కేవలం నా జీవితాన్ని కాపాడుకునేందుకు రోగులను నిస్సహాయ స్థితిలో వదిలేసి వెళ్లిపోయేందుకు కాదు'' అంటూ కొద్ది రోజుల క్రితం డెమొక్రసీ నౌ అనే స్వతంత్ర పోర్టల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కుండబద్దలు కొట్టారు. కుటుంబంతో పాటు దక్షిణ గాజాకు వెళ్లిపోవాలన్న ఇజ్రాయెల్ హెచ్చరికలను హమామ్‌తో పాటు ఆయన కుటుంబం కూడా బుట్టదాఖలు చేసింది. అత్తగారింట్లో ఉండగా ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో హమామ్‌తో పాటు ఆయన తండ్రి, మామ, బావమరిది దుర్మరణం పాలయ్యారు! స్వేచ్ఛాయుత పాలస్తీనా కోసం హమామ్ నిత్యం కలలు కనేవాడని గుర్తు చేసుకుంటూ తోటి నెఫ్రాలజిస్టు బెన్ థామ్సన్ కన్నీటి పర్యంతమయ్యాడు.



గాజా స్ట్రిప్‌లోని ఖాన్‌యూనిస్ ఆస్పత్రిలో తమ వారిని కోల్పోయి రోదిస్తున్న చిన్నారులు

కాల్పులాపితే బందీల విడుదల: హమాస్

యుద్ధానికి ముగింపు ఇప్పట్లో కనిపించని పరిస్థితుల్లో, కనీసం కాల్పుల విరామం కోసం హమాస్ ప్రయత్నిస్తోంది. ఐదు రోజుల పాటు కాల్పులాపితే తమ వద్ద ఉన్న ఇజ్రాయెలీ బందీల్లో 70 మంది మహిళలు, చిన్నారులను విడుదల చేసేందుకు సంసిద్ధత వెలిబుచ్చింది. ఖతార్ మధ్యవర్తుల ద్వారా దీన్నిప్పటికే ఇజ్రాయెల్‌కు చేరవేసినట్టు తెలిపింది. ఇజ్రాయెల్ చెరలో ఉన్న 200 మంది పాలస్తీనా చిన్నారులు, 75 మంది మహిళలను వదిలేస్తే తమ వద్ద ఉన్న బందీల్లో మహిళలు, పిల్లలను విడుదల చేస్తామని గత వారం కూడా హమాస్ ప్రకటించడం తెలిసిందే. హమాస్ చెరలో 240 మందికి పైగా ఇజ్రాయెలీలున్నట్టు సమాచారం. అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ అధ్యక్షురాలు మిర్జానా స్పొల్జారిక్ మంగళవారం ఇజ్రాయెల్లో వారి కుటుంబాలను కలుసుకుని ధైర్యం చెప్పారు.

మరణానంతర ప్రసవాలు!

ఆస్పత్రులపై ఇజ్రాయెల్ దాడులు అంతులేని దారుణాలతో పాటు పలు విషాదాలకూ కారణంగా మారుతున్నాయి. సౌకర్యాల లేమి తదితరాల కారణంగా ఆస్పత్రుల్లో ఎందరో నిండు గర్భిణులు దుర్మరణం పాలైనట్టు హమాస్ ఆరోగ్య శాఖ ఆవేదన వెలిబుచ్చింది. ''అలాంటి పరిస్థితుల్లో కూడా వైద్యులు తమ వృత్తి ధర్మం మరవలేదు. ఎప్పటికప్పుడు ఆ మృతదేహాలకు హుటాహుటిన సిజేరియన్ చేసి వీలైనంత మంది శిశువులను బయటికి తీసి కాపాడుతూ వచ్చారు'' అని పేర్కొంది. ఇంక్యుబేటర్లతో పాటు ఏ సదుపాయాలూ లేక ఆ నవజాత శిశువులు కూడా మృత్యువుకు చేరువవుతున్నట్టు చెప్పింది.

బయటపడ్డ కశ్మీరీ మహిళ

లుబ్నా నజీర్ షాబూ అనే కశ్మీరీ మహిళ తన కూతురు కరీమాతో పాటు గాజా నుంచి మంగళవారం సురక్షితంగా బయట పడింది. వారిద్దరూ ఈజిప్టు చేరినట్టు భర్త వెల్లడించారు. ఈజిప్టులోని భారత మిషన్ల కృషి వల్లే తాను, తన కూతురు గాజా నుంచి బయట పడ్డట్టు లుబ్నా చెప్పారు. గాజాలో సర్వం నేలమట్టమైందని ఆవేదన వెలిబుచ్చారు.

ప్రియాంకకు ఈసీ షోకాజ్ నోటీసు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ తప్పుడు వ్యాఖ్యానాలు చేశారన్న ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. గురువారం రాత్రి ఎనిమిది గంటలలోపు వివరణ ఇవ్వాలంటూ ఆమెకు షోకాజ్ నోటీసు ఇచ్చింది. ''ఇటీవల మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారసభలో మోదీపై తప్పుడు ప్రకటనలు చేశారు. బీహెచ్‌ఈఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ తన స్నేహితులైన బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టారని సభలో ప్రియాంక ప్రకటించారు' అని ఈసీకి బీజేపీ ఫిర్యాదుచేసింది. దీంతో 'జాతీయ పార్టీలో సీనియర్ నేతలు ప్రజల సమక్షంలో ఏదైనా మాట్లాడితే అవి వాస్తవమే అని ప్రజానీకం భావిస్తారు. అందుకే వాస్తవాలు, ఓటర్లను తప్పుదోవ పట్టించని రీతిలోనే ప్రకటనలు చేయాలి' అని ప్రియాంకకు పంపిన నోటీసులో ఈసీ పేర్కొంది. 'వ్యక్తిత్వ హననానికి పాల్పడకండి. వైరి పక్ష నేతలపై దిగజారుడు వ్యాఖ్యానాలు, ఆరోపణలు చేయకండి. ఎన్నికల క్రతువులో సభ్యతగా ప్రవర్తించండి' అంటూ అన్ని నేతలకు ఈసీ ఇటీవలే హితబోధ చేయడం తెల్సిందే.

కేజ్రీవాల్‌కు ఈసీ నోటీసు

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షోకాజ్ నోటీసు జారీ చేసింది. ప్రధాని మోదీని కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో ఆప్ చేసిన వ్యాఖ్యలపై ఈ నెల 16వ తేదీలోగా సమాధానమివ్వాలని అందులో పేర్కొంది. ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో ఆప్ విడుదల చేసిన వీడియో అనైతికమని, ఆ పార్టీపై చర్య తీసుకోవాలంటూ బీజేపీ ఈ నెల 10న ఈసీని ఆశ్రయించింది. ''ఆప్ జాతీయ కన్వీనర్‌గా ఉంటూ మరో పార్టీ స్టార్ క్యాంపెయినర్ అయిన పీఎం మోదీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కోరుతున్నాం. జాతీయ పార్టీకి, ఎన్నికల అభ్యర్థులకు వ్యతిరేకంగా ఆరోపణలు, దూషణల ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు తగిన చర్య ఎందుకు తీసుకోకూడదో తెలపండి'' అని నోటీసులో ఈసీ పేర్కొంది. స్పందించకుంటే వివరణ ఇచ్చేందుకు ఏమీ లేనట్టుగా భావించి తగు చర్యలకు ఉపక్రమిస్తామని వివరించింది.

రష్యా నుంచి ఇగ్లా-ఎస్ కొనుగోలు

భారత అమ్ముల పొదిలో శక్తివంతమైన యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ మిస్సైల్


న్యూఢిల్లీ: రష్యా నుంచి శక్తివంతమైన యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ క్షిపణి వ్యవస్థ 'ఇగ్లా-ఎస్' కొనుగోలుకు రంగం సిద్ధమైంది. ఈ వ్యవస్థ రాకతో భారత్-చైనా, భారత్-పాకిస్తాన్ సరిహద్దుల్లో భారత రక్షణ దళాలకు మరింత బలం చేకూరనుంది. ఇగ్లా-ఎస్ కొనుగోలు విషయంలో రష్యా, భారత్ మధ్య ఒప్పందం కుదిరినట్లు రష్యా వార్తా సంస్థ వెల్లడించింది. కాంట్రాక్టుపై రష్యా సంతకం చేసినట్లు తెలియజేసింది. ఆయుధాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలని, దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని భారత్ నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. అయినప్పటికీ కొన్ని అత్యాధునిక ఆయుధాల కోసం విదేశాలపై ఆధారపడక తప్పడం లేదు. ప్రధానంగా రష్యా నుంచి అధికంగా ఆయుధాలను దిగుమతి చేసుకుంటోంది. 2018 నుంచి 2022 వరకు భారత్ దిగుమతి చేసుకున్న ఆయుధాల్లో రష్యా ఆయుధాల వాటా 45 శాతం కాగా, ఫ్రాన్స్ ఆయుధాల వాటా 29 శాతం, అమెరికా ఆయుధాల వాటా 11 శాతంగా ఉంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇగ్లా-ఎస్ యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ క్షిపణి వ్యవస్థ అవసరాన్ని భారత్ గుర్తించింది.

ఏమిటీ ఇగ్లా-ఎస్?

- ఇది శత్రు దేశాల యుద్ధ విమానాలను, హెలికాప్టర్లను కూల్చివేసే వ్యవస్థ
- ఒక వ్యక్తి గానీ, బృందాలు గానీ ఆపరేట్ చేసే ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్.
- తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలు, హెలికాప్టర్లను సులభంగా నేలకూల్చవచ్చు.
- క్రూయిజ్ మిస్సైళ్లు, డ్రోన్లను కూడా కచ్చితంగా గుర్తించి, గాల్లోనే ధ్వంసం చేస్తుంది.
- ఒక్కో ఇగ్లా-ఎస్ సిస్టమ్‌లో 9ఎం342 మిస్సైల్, 9పీ522 లాంచింగ్ మెకానిజమ్, 9వీ866-2 మొబైల్ టెస్టు స్టేషన్, 9ఎఫ్719-2 టెస్టు సెట్ ఉంటాయి.

కర్ణాటక మాజీ సీఎంపై విద్యుత్ చౌర్యం కేసు

దొడ్డబళ్లాపురం: దీపావళి సందర్భంగా ఇంటికి విద్యుద్దీపాలంకరణ కర్ణాటక మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామికి చిక్కులు తెచ్చింది. దానికోసం ఇంటి ముందున్న స్తంభం నుంచి అక్రమంగా కనెక్షన్ తీసుకున్నారంటూ విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆయనపై కేసు పెట్టారు. మంగళవారం జేపీ నగరలోని ఇంట్లో తనిఖీలు చేశారు. ఎంత అక్రమ విద్యుత్ వాడారో లెక్కగట్టి అధికారులకు నివేదిస్తామన్నారు. నోటీసిస్తే జరిమానా చెల్లిస్తానని, విషయాన్ని కాంగ్రెస్ సర్కారు పెద్దది చేస్తోందని కుమారస్వామి అన్నారు.



సొరంగం కుప్పకూలిన ఘటన.. డ్రిల్లింగ్ పనుల్లో అంతరాయం

టన్నెల్‌లో ఉన్న తండ్రితో మాట్లాడిన కొడుకు

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్‌లోని ఛార్‌ధామ్ మార్గంలో సొరంగం కుప్పకూలి 60 గంటలకు పైగా లోపల చిక్కుబడిపోయిన 40 మంది కార్మికులను రక్షించే పనుల్లో మంగళవారం రాత్రి అంతరాయం ఏర్పడింది. కుప్పకూలిన టన్నెల శిథిలాల గుండా ఆగర్ మెషీన్ సాయంతో వెడల్పాటి స్టీల్ పైపులను లోపలికి పంపే పనులు మంగళవారం మొదలైనట్లు తెలిపారు. డ్రిల్లింగ్ పరికరాలను ఉపయోగించి 800, 900 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన స్టీలు పైపులను ఒకదాని తర్వాత ఒకటి లోపలికి పంపించి వాటి గుండా కార్మికులను వెలుపలికి తీసుకురావడమే ఈ పథకం ఉద్దేశమన్నారు. అన్నీ సజావుగా సాగితే బుధవారాని కల్లా అందరినీ వెలుపలికి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. అయితే, రాత్రి వేళ డ్రిల్లింగ్ పనులు జరుగుతున్న సమయంలో మరోసారి టన్నెల్ శిథిలాలు విరిగిపడటంతో ఇద్దరు సిబ్బంది గాయపడ్డారు. వారిని వెంటనే అక్కడే ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. క్షతగాత్రులకు ఎలాంటి ప్రమాదం లేనప్పటికీ పనులకు మాత్రం అంతరాయం ఏర్పడిందని అధికారులు చెప్పారు.

ఎటువంటి అపాయం లేదు

సొరంగం లోపల చిక్కుకున్న కార్మికులకు ఆక్సిజన్, మంచి నీరు, టీ, ఆహారం ప్యాకెట్లు, మందులను ట్యూబుల ద్వారా లోపలికి పంపిస్తున్నామని అధికారులు వివరించారు. కార్మికులు 400 మీటర్ల వెడల్పుండే బఫర్ జోన్‌లో చిక్కుబడి పోయారన్నారు. వారు తేలిగ్గా, నడవొచ్చు, గాలి పీల్చుకోవచ్చు అని వివరించారు. అందరూ ఆరోగ్యంగా, చురుగ్గా ఉన్నారన్నారు. ఛార్‌ధామ్ ప్రాజెక్టులో భాగంగా బ్రహ్మఖాల్-యమునోత్రి జాతీయ రహదారిలో సిల్‌క్యారా- దండల్‌గావ్ మధ్య నిర్మిస్తున్న సొరంగం ఆదివారం ఉదయం సిల్‌క్యారా వైపు కూలిన విషయం తెలిసిందే. సొరంగంలో చిక్కుబడిన వారిలో బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన వలస కార్మికులున్నారు.

ధైర్యంగా ఉండండి

టన్నెల్‌లో చిక్కుబడిపోయిన 40 మందిలో ఒకరైన ఉత్తరాఖండ్‌కు చెందిన కార్మికుడితో ఆయన కుమారుడు కొద్ది సెకన్ల పాటు మాట్లాడి యోగక్షేమాలను తెలుసుకున్నాడు. భయపడాల్సిన అవసరం లేదని, తనతోపాటు ఉన్న తోటి వారికి కూడా ధైర్యం చెబుతున్నానని అతడు పేర్కొన్నాడు. సొరంగం కుప్పకూలడంతో ఆదివారం ఉదయం నుంచి లోపలే ఉండిపోయిన 40 మందిలో ఉత్తరాఖండ్‌లోని కొట్‌ద్వార్‌కు చెందిన గబ్బర్ సింగ్ నేగి కూడా ఉన్నారు. నేగి సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. ఘటనా స్థలి వద్దకు మంగళవారం ఉదయం నేగి కొడుకు ఆకాశ్, అన్న మహరాజ్ చేరుకున్నాడు. అధికారులు పైపు ద్వారా ఆకాశ్‌కు తండ్రితో మాట్లాడే అవకాశం కల్పించారు. తమకు ఆక్సిజన్ అందుతోందని, భయపడొద్దని కుమారుడికి నేగి ధైర్యం చెప్పారు. ఇంట్లో వాళ్లకి కూడా ఇదే విషయం చెప్పాలని కోరారు. 'సొరంగం కూలిన ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. మాకు చాలినంత ఆహారం, నీరు అందుతున్నాయి. మరికొద్ది గంటల్లోనే సురక్షితంగా బయటకు వచ్చేందుకు ఇంజినీర్లు కృషి చేస్తున్నారు'అని కూడా నేగి తన కుమారుడికి తెలిపారు.



టన్నెల్ కూలిన ప్రాంతంలో రక్షణ, సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న సిబ్బంది

సునాక్‌కు పదవీ గండం!

అవిశ్వాస లేఖ రాసిన సొంత పార్టీ ఎంపీ ● పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్

లండన్: తన మంత్రివర్గంలో అనూహ్యంగా మార్పులు చేసి, కొత్త వివాదానికి తెరలేపిన యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి రిషి సునాక్ అవిశ్వాస పరీక్షను ఎదుర్కోవాల్సిన పరిస్థితి తప్పేలా లేదు. అవిశ్వాస పరీక్షను ఎదుర్కోవాలని, పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ సొంత పార్టీ(కన్జర్వేటివ్) ఎంపీ ఆండ్రియా జెన్‌కిన్స్ తాజాగా '1922 కమిటీ' చైర్మన్ సర్ గ్రాహమ్ బ్రాడీకి లేఖ రాశారు. రిషి సునాక్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇలాంటి డిమాండ్ తెరపైకి రావడం ఇదే మొదటిసారి. సొంత పార్టీ నుంచే ఆయనపై వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. యూకే మాజీ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్‌ను వీరవిధేయుడిగా పేరుగాంచిన ఎంపీ ఆండ్రియా జెన్‌కిన్స్ రాసిన అవిశ్వాస లేఖ చర్చనీయాంశంగా మారింది. సునాక్ పదవి నుంచి తప్పుకోవాలని, ఆ స్థానంలో అసలు సిసలైన కన్జర్వేటివ్ పార్టీ నాయకుడిని నియమించాలని జెన్‌కిన్స్ తేల్చిచెప్పారు. ''జరిగింది ఇక చాలు. రిషి సునాక్ ఇంటికెళ్లాల్సిన సమయం వచ్చింది'' అని 'ఎక్స్'లో జెన్‌కిన్స్ పోస్టు చేశారు. అవిశ్వాస లేఖను కూడా జతచేశారు. ప్రధానమంత్రిగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన బోరిస్ జాన్సన్ పదవి ఊడడానికి ముమ్మాటికీ సునాక్ కారణమని ఆయన ఆరోపించారు. సుయెల్లా బ్రేవర్మన్‌ను హోంమంత్రి పోస్టు నుంచి తొలగించడాన్ని జెన్‌కిన్స్ తప్పుపట్టారు. నిజాలు మాట్లాడినందుకే ఆమెపై వేటు వేశారని ఆక్షేపించారు. సునాక్ రాజీనామా కోసం తన సహచర ఎంపీలు కూడా గళమెత్తుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశం కోసం తాము పోరాడుతున్నామని పేర్కొన్నారు.

అవిశ్వాసం సాధ్యమేనా?

అధికార కన్జర్వేటివ్ పార్టీ ఎంపీల్లో 15 శాతం మంది ఎంపీలు అవిశ్వాసాన్ని కోరుతూ లేఖలు రాస్తే సునాక్‌కు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయి. పార్లమెంట్‌లో అవిశ్వాస పరీక్ష ఎదుర్కోక తప్పదు.

నైపుణ్యం, అనుభవానికి పెద్దపీట: సునాక్

మంతివర్గంలో మార్పులపై ప్రధాని రిషి సునాక్ స్పందించారు. తన ప్రతిస్పందనను 'ఎక్స్'లో పోస్టుచేశారు. దేశానికి దీర్ఘకాలంలో అవసరమైన మార్పులకు శ్రీకారం చుట్టడానికి సిద్ధంగా ఉండే ఒక ఉమ్మడి బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. నైపుణ్యం, అనుభవం, సమగ్రతకు పెద్దపీట వేశామన్నారు. దేశ కోసం సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడానికి ఈ బృందం తోడ్పడుతుందని వివరించారు.

ఎస్సైని ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపేశారు

- బిహార్‌లో ఇసుక మాఫియా బరితెగింపు
- ఘటనలో హోం గార్డుకు తీవ్ర గాయాలు
- కొత్తేమీ కాదంటూ మంత్రి వ్యాఖ్యలు

జముయీ: బిహార్‌లో ఇసుక మాఫియా మరోసారి తెగబడింది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు యత్నించిన పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌ను ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపేసింది. ఈ ఘటనలో హోం గార్డు సైతం తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం బిహార్‌లోని జముయీ జిల్లా గర్హి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇసుక అక్రమ రవాణా విషయం తెలుసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాత్ రంజన్ తన సిబ్బందితో మహులియా టండ్ గ్రామానికి వెళ్లారు. అనుమతి లేకుండా తవ్విన ఇసుకతో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపేందుకు యత్నించారు. అయితే, డ్రైవర్ ట్రాక్టర్‌ను ఆపకుండా ఆయనపైకి పోనిచ్చారు. ఈ ఘటనలో ఎస్సైతోపాటు ఒక హోంగార్డుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఎస్సై ప్రభాత్ రంజన్ మృతి చెంచారు. హోంగార్డు రాజేశ్‌కుమార్ సావో పరిస్థితి విషమంగా ఉన్నట్లు జముయీ ఎస్పీ శౌర్య సుమన్ తెలిపారు. పరారీలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ కోసం గాలింపు చేపట్టినట్లు చెప్పారు. ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. ఘటన సమయంలో ట్రాక్టర్‌పై కూర్చున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎస్సై ప్రభాత్ రంజన్‌కు భార్య, నాలుగేళ్ల కూతురు, ఆరు నెలల కొడుకు ఉన్నారు.

ఇవి జరుగుతూనే ఉంటాయి..!

దాడి ఘటనలు కొత్తవేం కావంటూ బిహార్ విద్యామంత్రి చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి 'ఇలాంటివి కొత్త కాదు. జరుగుతూనే ఉంటాయి. గతంలో యూపీ, మధ్యప్రదేశ్‌ల్లోనూ చోటుచేసు కున్నాయి'అని ఆయన అన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కెనడాలో దీపావళి వేళ ఖలిస్తానీల ఆగడాలు

బ్రాంప్టన్: కెనడాలో ఖలిస్తానీ మద్దతుదారులు మరోసారి పేట్రేగిపోయారు. దీపావళి వేడుకలు జరుపుకుంటున్న హిందువులపైకి రాళ్లు రువ్వారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఖలిస్తానీ జెండాలు పట్టుకున్న కొందరు నేలపై వస్తువులను తీసుకుని, హిందువులపైకి విసురుతుండటం, వారిని పోలీసులు వెనక్కి వెళ్లిపోవాలంటునట్టుగా ఉన్న వీడియోను ఓ వ్యక్తి 'ఎక్స్'లో పోస్ట్ చేశాడు. ఈ ఘటన ఒంటారియో శివారు నగరం బ్రాంప్టన్‌లోని వెస్ట్‌వుడ్ మాల్ వద్ద జరిగినట్లు అతడు తెలిపాడు. దర్యాప్తు చేపట్టినట్లు పీల్ ఏరియా పోలీసులు తెలిపారు. హింసను ప్రేరేపించడం, ప్రార్థనా స్థలాలు, మైనారిటీలపై దాడులు, విద్వేష నేరాలకు తెగబడటం, విద్వేష ప్రసంగాలిస్తూ వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగపరిచే వారిపై చర్యలు తీసుకోవాలని కెనడాను భారత్ కోరింది. గత వారం జెనీవాలో జరిగిన ఐరాస మానవ హక్కుల సంఘం సమావేశంలో భారత్ ప్రతినిధి కేఎస్ మహ్మద్ హుస్సేన్ కెనడాకు సూచించారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
బుధవారం : 15 : నవంబర్ : 2023

ఆస్పత్రిలో స్వాతంత్ర్య సమరయోధుడు శంకరయ్య



సాక్షి, చెన్నై: సీపీఎం సీనియర్ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు శంకరయ్య(102)కు శ్వాస సమస్య తలెత్తడంతో చెన్నైలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చెన్నై శివారులోని క్రోంపేటలో శంకరయ్య నివాసం ఉన్న విషయం తెలిసిందే. గత రెండు మూడు రోజులుగా ఆయన జ్వరం, దగ్గుతో బాధ పడుతూ వచ్చారు. సోమవారం రాత్రి ఆయనకు శ్వాస సమస్య తలెత్తింది. దీంతో ఆయన్ని చికిత్స నిమిత్తం అపోలో ఆసుపత్రికి తరలించారు. ఆయనకు కృత్రిమ శ్వాస అందిస్తున్నారు. వైద్యులు ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. సీపీఎం నేతలు బాలకృష్ణన్, రామకృష్ణన్ ఆసుపత్రికి చేరుకుని శంకరయ్య ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో ఆరా తీశారు.

న్యూస్‌రీల్

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి దామో అన్బరసు

కాంచీపురం: గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి దామో అన్బరసు అధికారులకు సూచించారు. కాంచీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ప్రజాప్రతినిధుల కోర్కెలు పరిష్కరించే విధంగా ప్రతివారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా నుంచి ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా సూక్ష్మ, చిన్న సన్నకారు పరిశ్రమల శాఖమంత్రి దామో అన్బరసు పాల్గొని ప్రజా ప్రతినిధుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రధానంగా రోడ్లు, వీధి దీపాలు, మౌలిక సదుపాయాలు, ఉచిత ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ కట్టడాల ఏర్పాటుకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా కలెక్టర్ కలైసెల్వి, కాంచీపురం ఎంపీ సెల్వం, శ్రీపెరంబదూరు ఎమ్మెల్యే సెల్వపెరందగై ఇతర అధికారులు పాల్గొన్నారు.

హైకోర్టుకు ఇద్దరు న్యాయమూర్తులు

సాక్షి, చెన్నై : మద్రాసు హైకోర్టుకు కొత్తగా ఇద్దరు న్యాయమూర్తులు నియమితులయ్యారు. ఇందులో ఒకరు అలహాబాద్, మరొకరు తెలంగాణ హైకోర్టుల నుంచి బదిలీపై వచ్చారు. మద్రాసు హైకోర్టులో మొత్తం 75 మంది న్యాయమూర్తులు అవసరం అన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం 64 మంది ఉన్నారు. మరో 11 మంది అవసరం ఉంది. ఈ నేపథ్యంలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి వివేక్‌కుమార్ సింగ్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఎం. సుధీర్‌కుమార్‌ను మద్రాసు హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఇందుక రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోద ముద్ర వేశారు. ఈ నియామకంతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 66కు చేరింది. మరో తొమ్మిది మంది న్యాయమూర్తులు అవసరం ఉంది.

ద్విచక్ర వాహనాలు ఢీ

- ఇద్దరు మృతి, మరొకరికి గాయాలు

తిరువళ్లూరు: గుమ్మిడిపూండి సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా మరో బాలుడు చెన్నై ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలోని పొన్నియమ్మన్‌మేడు ప్రాంతానికి చెందిన మహేష్(32). ఇతను తన అక్క కొడుకులు నితీష్(12), ఆకాష్(14)తో కలిసి ద్విచక్ర వాహనంలో గుమ్మిడిపూండి నుండి బజారుకు బయలుదేరాడు. ఇదే సమయంలో తేరువాయి కండ్రిగ గ్రామానికి చెందిన సత్య(32) మరో బైక్‌లో గుమ్మిడిపూండికి వస్తున్న సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు నేరుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహేష్‌ను స్థానికంగా వున్న ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సత్య(32)ను చెన్నై స్టాన్లీ వైద్యశాలలో మరణించాడు. నితీష్(12)కు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై మహేష్ సోదరుడు రాజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుమ్మిడిపూండి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుత్తణిలో స్కందషష్టి ఉత్సవాలు ప్రారంభం



షణ్ముఖర్‌కు బిల్వార్చన

తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం లక్షార్చనతో స్కందషష్టి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు మురుగన్ మాలధారణచేసి స్కంధషష్టి కవచం పఠనంతో ఉపవాస దీక్షలు ప్రారంభించారు. మూలవిరాట్‌కు సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు చేపట్టి బంగారు. వజ్రాభరణాలతో అలంకరించి మహాదీపారాధన పూజలు చేశారు. భక్తులు మాలధారణ చేసి దీక్షలు చేపట్టి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం 9 గంటలకు కావడి మండపంలో షణ్ముఖర్‌కు పుష్పలంకరణతో మహాదీపారాధన పూజలు చేపట్టి బిల్వార్చనతో స్కందషష్టి వేడుకలకు శ్రీకారం చుట్టారు. వేడుకలు జరుగనున్న ఏడు రోజుల పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామికి బిల్వార్చన నిర్వహిస్తారు. 18న సాయంత్రం వివిధ పుష్పాలతో షణ్ముఖర్‌కు పుష్పసేవ నిర్వహిస్తారు. 19న కల్యాణోత్సవం ఉంటుంది. ఉత్సవ వేడుకలు సందర్భంగా స్కందషష్టి పారాయణం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, భక్తి గీతాలాపన, భరతనాట్యం వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ఆలయ ధర్మపాలక మండలి అధ్యక్షుడు శ్రీధరన్, ధర్మపాక మండలి సభ్యులు ఉషారవి, మోహనన్, సురేష్ బాబు, నాగన్ బృందం వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

డెల్టా జిల్లాల్లో రెడ్ అలర్ట్!

బంగాళాఖాతంలో మంగళవారం ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా బుధవారం నుంచి డెల్టా జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతం చెన్నై, శివారు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అధికారుల హెచ్చరికల నేపథ్యంలో అరక్కోణంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అన్ని రకాల సహాయక సామగ్రితో సిద్ధమయ్యాయి. ఇక కలెక్టర్లను అప్రమత్తం చేస్తూ రెవెన్యూ శాఖ హెచ్చరిక లేఖ రాసింది. ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనే విధంగా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు రెవెన్యూ శాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ వెల్లడించారు.

- బంగాళాఖాతంలో వాయుగుండంగా మారనున్న అల్పపీడనం?
- నేటి నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- చెన్నై శివార్లలో మోస్తరు గానే..
- ముందస్తు చర్యలు చేపట్టాలని 27 జిల్లాల కలెక్టర్లకు రెవెన్యూ శాఖ లేఖ
- రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు
- అప్రమత్తంగా ఉన్నామని రెవెన్యూశాఖ మంత్రి ప్రకటన



కంట్రోల్ రూం నుంచి అధికారులకు సూచనలు చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

సాక్షి, చెన్నై: ఈశాన్య రుతు పవనాల ప్రభావం అక్టోబర్‌లో సాధారణం శాతం కంటే తక్కువ వర్షపాతమే నమోదైంది. ఇక నవంబర్‌లో ఇప్పటి వరకు ఆశించిన మేరకు వర్షాలు పడ లేదు. కేవలం పశ్చిమ కనుమల్లో మాత్రమే అధిక వర్షం పడింది. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో రాష్ట్రంలోని డెల్టా జిల్లాలైన నాగపట్నం, మైలాడుతురై, తిరువారూర్, తంజావూరు, కడలూరులతోపాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి, కారైక్కాల్‌లో సోమవారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. కాగా మరో రెండు రోజులు ఈ జిల్లాలో అతి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఈ మేరకు రెడ్ అలర్ట్ ప్రకటించింది.

జలదిగ్బంధంలో..

డెల్టా జిల్లాలలో అతి భారీ వర్షాలు అనేక చోట్ల పడే అవకాశాలు ఉన్నాయి. ఈ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. మంగళవారం నాగపట్నం జిల్లా వేలాంకన్నీలో 17 సెం.మీ వర్షం పడింది. కారైక్కాల్‌లో 14 సెం.మీ వర్షం పడింది. వేలాంకన్నీ పరిసరాలలో అతిభారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కాయి. మేరీ మాత ఆలయం సందర్శనకు వచ్చిన భక్తులు హోటళ్ల నుంచి బయటకు అడుగు బయట పెట్ట లేని పరిస్థితి నెలకొంది. నాగపట్నం జిల్లా యంత్రాంగం సహాయక చర్యలు ముమ్మరం చేసింది. విల్లుపురం, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల్లోనూ వర్షాలు పడుతున్నాయి. కాసేపు భారీగా, మరికాసేపు తేలిక పాటిగా వర్షాలు కొనసాగుతున్నాయి. చెన్నైలో చిరు జల్లుల వాన పడుతోంది. ఆకాశం మేఘావృతం కావడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. రెడ్ అలర్ట్ నేపథ్యంలో ఎలాంటి విపత్తులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా అన్ని రకాల సహాయక సామగ్రితో అరక్కోణంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధమయ్యాయి. తమిళనాడు సముద్రతీరం, కన్యాకుమారి, మన్నార్ వలి గుండా, శ్రీలంక తీరం వైపుగా ఈదురు గాలుల ప్రభావం ఎక్కువగా ఉండడంతో వేటకు వెళ్ల వద్దని జాలర్లకు హెచ్చరికలు జారీ అయ్యాయి. డెల్టాలో వర్షాల నేపథ్యంలో అనేక జిల్లాలలోని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. అలాగే మంగళవారం నుంచి జరగాల్సిన పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల పరీక్షలను వాయిదా వేశారు. వర్షాల నేపథ్యంలో ముందు జాగ్రత్తలు సిద్ధం చేసి ఉంచాలని, ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని 27 జిల్లాల కలెక్టర్లకు రెవిన్యూ శాఖ అప్రమత్తం చేస్తూ లేఖ రాసింది.

అధికారులతో మంత్రి సమీక్ష

తమిళనాడులో ఈశాన్య రుతుపవనాలు తీవ్రతరం అయ్యే అవకాశాల నేపథ్యంలో అల్పపీడనం బయలుదేరడంతో ఇప్పటి వరకు చేపట్టిన ముందు జాగ్రత్తలపై రెవెన్యూ శాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ అధికారులతో సమీక్షించారు. ఎళిలగంలో వార్ రూమ్ పేరిట ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ఇప్పటి వరకు 8 జిల్లాలో మోస్తరుగా, 7 జిల్లాల్లో సాధారణ సాఅథయిలో వర్షం పడినట్లు, మరో 23 జిల్లాలలో వర్షపాతం తక్కువగా ఉన్నట్లు వివరించారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో 35 జిల్లాల్లో 24 గంటల్లో భారీ వర్షం పడుతోందని పేర్కొన్నారు. ఇందులో నాగపట్నం జిల్లావ్యాప్తంగా 11.3 సెం.మీ వర్షం పడిందని, 5 చోట్ల అతిభారీ వర్షం, 30 చోట్ల భారీ వర్షం కురిసినట్లు వివరించారు. వర్షాలతో ముందు జాగ్రత్త చర్యల గురించి అన్ని శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు.

పాఠశాలలకు సెలవు..

అరియలూరు, కడలూరు, నాగపట్నం, తంజావూరు, తిరువారూర్, మైలాడుతురై జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించామన్నారు. చెన్నైలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో 24 గంటల సేవలతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ప్రజలు టోల్ ఫ్రీ నంబర్లు 1070 మరియు 1077, వాట్సాప్ నెంబరు 94458 69848లను సంప్రదించవచ్చని సూచించారు. 424 తీర ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు సిద్ధం చేశామని, ఏదేని విపత్తు ఎదురైన పక్షంలో ఇవి ప్రజలను అప్రమత్తం చేస్తాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఏర్పాట్లతో 4,967 శిబిరాలను ఏర్పాటు చేశామని, చెన్నైలో 169 సహాయక శిబిరాలను సిద్ధం చేశామన్నారు. వర్షపు నీటిని తొలగించేందుకు 260 మోటారు పంపు సెట్లను సిద్ధం చేసి ఉంచామన్నారు. ముందుజాగ్రత్తగా దిండుగల్ జిల్లా పళణి, మణిముత్తారు, కోయంబత్తూర్, తిరునెల్వేలి, తిరుచ్చి జిల్లాలోని తమిళనాడు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌కు చెందిన 400 మంది సిబ్బందితో 12 బృందాలను రంగంలోకి దించామన్నారు. అలాగే అరక్కోణం, చెన్నైలో 200 మంది ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నట్టు వివరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.కె. ప్రభాకర్, రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ డైరెక్టర్ సీపీ రామన్, తదితరులు పాల్గొన్నారు. ఇలా ఉండగా చెన్నైలో సహాయక చర్యలకు కార్పొరేషన్ నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వర్షం కారణంగా అత్యవసర సేవలకు 044-25619206, 07, 08 నంబర్లను సంప్రదించవచ్చునని సూచించారు. అలాగే మురుగునీటి తొలగింపు, తాగునీటి సేవల కోసం 1916, 044-45674567 నంబర్లను ప్రకటించారు.

13 జిల్లాలకు ఐఏఎస్‌లు

భారీ వర్షాల నేపథ్యంలో చెన్నై ఎళిలగంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సీఎం స్టాలిన్ మంగళవారం సందర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. నాగపట్నం, కడలూరు, మైలాడుతురై జిల్లాలో అతి భారీ వర్షాలతో ఇక్కడ పరిస్థితిని సమీక్షించారు. ఈ జిల్లాల్లో ముందు జాగ్రత్త చర్యలు, సహాయక చర్యలను విస్తృతం చేయడానికి మంత్రుల బృందాన్ని పంపించారు. అలాగే మరో 13 జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారుల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.



విల్లుపురంలో లోతట్టు ప్రాంతాల జలమయం





చెన్నైలో..



వేలాంగనిలో..



మహాబలిపురంలో నేలకూలిన చెట్లు



కారైక్కాల్‌లో జలమయమైన రోడ్డు



చెన్నైలో భారీ వర్షం



మాట్లాడుతున్న మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్,



అరక్కోణంలో సిద్ధంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

బంగారుగుడిలో.. దీపారాధన



బంగారు గుడిలో నక్షత్ర ఆకారంలో వెలిగించిన 10,008 దీపాలు

వేలూరు: వేలూరు శ్రీపురం బంగారుగుడిలో ప్రపంచ శాంతి కోసం 10,008 దీపాల పూజ సోమవారం రాత్రి కనులపండువగా జరిగింది. దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం దీపారాధన పూజలను శ్రీనారాయణి పీఠాధిపతి శక్తిఅమ్మ అధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా బంగారుగుడిలో నక్షత్ర ఆకారంలో 10,008 నేతి దీపాలను వెలిగించారు. ముందుగా శ్రీనారాయణి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ, గోపూజ, తులసి పూజ, యాగపూజ, ఆశ్వపూజలు అతి వైభవంగా జరిగింది. అనంతరం నారాయణి అమ్మవారికి ఊంజల్ సేవను శక్తిఅమ్మ చేతుల మీదుగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పీఠాధిపతి శక్తిఅమ్మ నక్షత్ర ఆకారంలో వెలిగించిన దీపాల వద్దకు వెళ్లి ప్రత్యేక యాగం చేశారు. ప్రపంచంలో దీపావళి పండుగ రోజున ఎటువంటి అలజడి, ప్రమాదాలు జరకుండా కాపాడాలని, ప్రజలను సుఖ సంతోషాలతో వుంచాలని యాగ పూజలు నిర్వహించారు. బంగారుగుడి మేనేజర్ సంపత్, నారాయణి ఆసుపత్రి డైరెక్టర్ బాలాజీ, శక్తి అమ్మ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శక్తి అమ్మకు పుష్పాలు సమర్పించి స్వామి వారి ఆశీర్వాదం అందుకున్నారు.

జనం.. తిరుగు ప్రయాణం!

- కిక్కిరిసిన రహదారులు
- టోల్‌గేట్ల వద్ద బారులుదీరిన వాహనాలు
- తప్పని ట్రాఫిక్ కష్టాలు



చెన్నై శివార్లలో స్తంభించిన ట్రాఫిక్

సాక్షి, చెన్నై: దీపావళి పండుగను ముగించుకుని స్వస్థలాల నుంచి జనం చెన్నైకు తిరుగు ప్రయణమయ్యారు. ఫలితంగా సోమవారం అర్ధరాత్రి నుంచే జాతీయ రహదారి, రాష్ట్ర రహదారుల్లోని టోల్ గేట్ల వద్ద వాహనాలు కిలో మీటర్ల కొద్ది బారులుదీరాయి. ఏ రోడ్డు చూసినా వాహనాలతో నిండిపోవడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. వివరాలు.. చెన్నైలో ఉద్యోగ, వివిధ పనులు నిమిత్తం నివాసం ఉంటున్న వారు ఆదివారం దీపావళి పర్వదినాన్ని తమ కుటుంబాలతో జరుపుకునేందుకు స్వస్థలా లు, స్వగ్రామాలకు బయలుదేరి వెళ్లిన విషయం తెలిసిందే. మూడు రోజుల సెలవులను ముగించుకుని ప్రజలు మంగళవారం మళ్లీ చెన్నైకు చేరుకున్నారు. చెన్నై వైపుగా ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు కదిలాయి. ప్రైవేటు వాహనాలు, సొంత వాహనాలలో వెళ్లి వారంతా ఒక్క సారిగా తిరుగు పయనం కావడంతో అర్ధరాత్రి నుంచి అన్ని టోల్ గేట్ల వద్ద వాహనాలు బారులుదీరాయి. ఇక ఉదయాన్నే ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు చెన్నై వైపు ఒక్కసారిగా దూసుకొచ్చాయి. ఈ బస్సులన్నీ ఉదయాన్నే నగర శివారుల్లోకి ప్రవేశించడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ సమస్య తప్పలేదు.

వాహనదారుల ఇక్కట్లు

తాంబరం బైపాస్‌రోడ్డు మీదుగా కోయంబేడుకు వెళ్లే వాహనాలు పెరుంగళత్తూరు, వండలూరు, గూడువాంజేరి వరకు కిలో మీటర్ల కొద్ది బారులుదీరాయి. ఈ ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని ఛేదించేందుకు వాహనాలకు గంట సమయం పట్టింది. చెంగల్పట్టు సమీపంలోని పరనూరు టోల్ గేట్‌ల వద్ద అయితే కిలో మీటర్ల కొద్ది వాహనాలు బారులు తీరాల్సి వచ్చింది. ట్రాఫిక్ రద్దీతో పలువురు ఆయా మార్గాలకు సమీపంలోని రైల్వే స్టేషన్‌ను ఆశ్రయించి ఎలక్ట్రిక్ రైళ్ల ద్వారా గమ్యస్థానాలకు వెళ్లారు. స్కూళ్లు సైతం ప్రారంభం కావడంతో పిల్లలను బడికి పంపించడం కోసం తల్లిదండ్రులు పరుగులు తీశారు. ఈ ట్రాఫిక్ కష్టాలతో తాంబరం - కోయంబేడు జీఎస్టీ రోడ్డు, గిండి - ప్యారిస్ వరకు అన్నాసాలై, మైలాపూర్, అడయార్ తదితర మార్గాల్లో వాహనాలు నత్తనడకన సాగాయి. కోయంబేడు బస్టాండ్, ఎగ్మూర్, సెంట్రల్ రైల్వే స్టేషన్లు జనంతో కిట కిటలాడాయి. మధ్యాహ్నం వరకు అనేక మార్గాల్లో ట్రాఫిక్ తిప్పలు తప్పలేదు. దక్షిణ తమిళనాడు నుంచి చెన్నై వైపుగా ఒక్క రోజు 45 వేల వాహనాలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

'సీఎం'కు జువెనెల్ హోం నిర్వహణ నివేదిక

- సమర్పించిన జస్టిస్ చంద్రూ



సీఎం స్టాలిన్‌కు నివేదిక సమర్పిస్తున్న జస్టిస్ చంద్రూ



ఆవిన్ గిడ్డంగులను ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని జువెనెల్ హోం, అబ్జర్వేషన్ కేర్ హోమ్‌ల నిర్వహణ, అభివృద్ధికి సంబంధించి జస్టిస్ చంద్రూ నేతృత్వంలోని ఏక సభ్య కమిషన్ నివేదికను సిద్ధం చేసింది. మంగళవారం ఈ నివేదికను సీఎం స్టాలిన్‌కు చంద్రూ అందజేశారు. రాష్ట్రంలోని జువెనల్ హోమ్, అబ్జర్వేషన్ కేర్ హోమ్, ప్రత్యేక గృహాల అభివృద్ధి, నిర్వహణ తదితర అంశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఇటీవల హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రూ నేతృత్వంలో ఏక సభ్య కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. జువైనల్ జస్టిస్ సిస్టమ్ కింద పనిచేసే అబ్జర్వేషన్ హోమ్, జువైనెల్ హోమ్‌లలో ఈ కమిటీ స్వయంగా పరిశీలించింది. ఇక్కడ చేపట్టాల్సిన పనులు, నిర్వహణ, నైపుణ్యాల మెరుగు తదితర అంశాలపై సమగ్ర అధ్యయనం చేసింది. ఈ మేరకు నివేదికను జస్టిస్ చంద్రూ సిద్ధం చేశారు. దీనిని ఉదయం సచివాలయంలో సీఎం స్టాలిన్‌కు అందజేశారు.

రూ.12 కోట్లతో ఆవిన్‌కు భవనాలు

పాడి పరిశ్రమలు, డెయిరీ శాఖ నేతృత్వంలో ఈరోడ్‌లో రూ. 2.14 కోట్లతో 1500 మెట్రిక్ టన్ను పాడి ఉత్పత్తులను నిల్వ ఉంచేందుకు వీలుగా గిడ్డంగి నిర్మించారు. అలాగే తిరునల్వేలిలో రూ. కోటితో మహిళా పాల ఉత్పత్తిదారులను ప్రోత్సహించేందుకు లైబ్రరీ, లేబొరేటరీ, హాస్టల్ వంటి సౌకర్యాలతో కూడిన శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ధర్మపురిలో రూ.2.72 లక్షలతో ఆవిన్ సంస్థకు భవనాలు, పాల సేకరణ యూనిట్ భవనం, రూ. 2.93 కోట్లతో తిరువణ్ణామలైలో మిల్క్ పౌడర్ ప్లాంట్‌ను నిర్మించారు. తిరుపూర్‌లో రూ. 3 కోట్లతో పాల తయారీ దారుల కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేశారు. మొత్తం రూ. 12 కోట్లతో వివిధ ప్రాంతాలలో నిర్మించిన భవనాలు, గిడ్డంగులను సీఎం స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సచివాలయం నుంచి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు స్వామినాథన్, ఏవీ వేలు, మనో తంగరాజ్, సీఎస్‌శివదాస్ మీన తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని నెహ్రూకు ఘన నివాళి



నెహ్రూ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న గవర్నర్, మంత్రులు

- గవర్నర్ పుష్పాంజలి

సాక్షి, చెన్నై: మాజీ ప్రధాని నెహ్రూ జయంతిని వాడవాడల్లో మంగళవారం ఘనంగా కాంగ్రెస్ వర్గాలు జరుపుకున్నాయి. చెన్నై గిండిలోని నెహ్రూ విగ్రహానికి రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్‌రవి పూల మాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. వివరాలు.. భారత తొలి ప్రధాని నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటూ వస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం నెహ్రూ 135వ జయంతిని వాడవాడల్లో కాంగ్రెస్ వర్గాలు ఘనంగా జరుపుకున్నాయి. ఆయన విగ్రహాలకు, చిత్ర పటాలకు పూల మాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఇక రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోనూ నెహ్రూను స్మరిస్తూ బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి. ఇక గిండి కత్తిపార వంతెన వద్ద ఉన్న నెహ్రూ విగ్రహానికి ఉదయాన్నే గవర్నర్ ఆర్ఎన్‌రవి, మంత్రులు పీకే శేఖర్‌బాబు, అన్బరసన్, స్వామినాథన్, ఎంపీ తమిళచ్చి తంగ పాండియన్ తదితరులు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ అళగిరితో పాటు ఆ పార్టీ వర్గాలు నివాళులర్పించాయి. ఇక, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సత్యమూర్తి భవన్‌లోనూ వేడుకలు జరిగాయి. వివిధ పార్టీల నేతల నెహ్రూకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. సీఎం స్టాలిన్ ట్వీట్ చేస్తూ, జవహరలాల్ నెహ్రూ సేవలను గుర్తు చేశారు. బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నేటి బాలలే రేపటి నవ భారత నిర్మాతలు అని, వారిని చక్కగా పెంచే విధానమే వారి భవిష్యత్తును నిర్ణయిస్తుందని పేర్కొన్నారు.

చెన్నై బుధవారం । 15 । నవంబర్ । 2023 సాక్షి

క్లుప్తంగా

తండ్రి మందలించాడని ఆత్మహత్య

తిరువళ్లూరు: అర్ధరాత్రి వరకు సెల్‌ఫోన్ చూడొద్దని తండ్రి మందలించడంతో ప్లస్–1 విద్యార్థిని పురుగుల మందును తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపంలోని మడిమకండ్రిగ గ్రామానికి చెందిన రామకృష్ణన్ కుమార్తె లోకేశ్వరి(17). ఈమె పొన్నేరిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ వుంది. గత నెల 29న అర్ధరాత్రి వరకు లోకేశ్వరి సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతూ కనిపించింది. విషయాన్ని గమనించిన తండ్రి కుమార్తెను మందలించడంతో పాటు చదువుపై ధ్యాసపెట్టాలని కోరాడు. దీంతో మనస్థాపం చెందిన లోకేశ్వరి ఇంట్లోని పురుగుల మందును తాగి ఆత్మహత్య యత్నం చేసింది. బంధువులు ఆమెను పొన్నేరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించింది. పొన్నేరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ బలవన్మరణం

అన్నానగర్: చెన్నైలోని సైదాపేటకు చెందిన జాకబ్ (30) చెన్నైలోని శ్వేత ఇంజినీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం దీపావళి సెలవుల సందర్భంగా కొడైకెనాల్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. తర్వాత దిండుక్కల్ బస్ స్టేషన్ సమీపంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో ఉన్నాడు. మంగళవారం ఉదయం చాలాసేపు అతని గది తలుపులు తెరవలేదు. దీంతో అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది నగర్ నార్త్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి వచ్చిన పోలీసులు తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లారు. అక్కడ ఫ్యాన్‌కు ఉరివేసుకుని జాకబ్ మృతి చెందాడు. అతని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం దిండుక్కల్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనులకు వెళ్లిన మహిళ అదృశ్యం

తిరువళ్లూరు: ఉపాధి హామీ పనులకు వెళ్లిన వివాహిత అదృశ్యమైన ఘటనపై కనకమ్మసత్రం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా వల్లిమాపేట గ్రామానికి చెందిన ముత్తు భార్య పూర్ణిమ (36). ఈనెల 6వ తేదీన ఉపాధి హామీ పనులకు వెళ్లి తర్వాత కనిపించకుండా పోయింది. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఉదయం కనకమ్మసత్రం పోలీసులకు భర్త ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్



ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రారంభిస్తున్న మంత్రి సుబ్రమణియన్

తిరుత్తణి: ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందాలనే సంకల్పంతో డీఎంకే ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తోందని ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ తెలిపారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని బీరకుప్పంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనసవు భవనాలతో పాటు ఆర్కేపేట యూనియన్ వీరమంగళం, పళ్లిపట్టు యూనియన్ పాండ్రవేడు సహా జిల్లా వ్యాప్తంగా 12 ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రారంభోత్సవం మంగళవారం నిర్వహించారు. బీరకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వేదికగా నిర్వహించిన కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ అధ్యక్షత వహించారు. ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్, చేనేత పరిశ్రమశాఖ మంత్రి గాంధీ ఆయా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పదేళ్లలో ఆరోగ్యశాఖ రంగానికి అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో పాత భవనాల్లో ఆరోగ్య సేవలు కల్పించాల్సి ఉండేదని, చాలీచాలని వైద్యులు, వైద్య ఉపకరణాలు, మందుల కొరతతో వైద్య సేవలు సామాన్యులకు కష్టంగా మారిందన్నారు. అయితే ముఖ్యమంత్రి స్టాలిన్ అధికారం చేపట్టిన తరువాత ఆరోగ్యశాఖలో మార్పులు తీసుకొచ్చి ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందేందుకు వీలుగా వైద్య రంగంలో మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. ఇందు కోసం ఇంటి వద్దకే వైద్య సేవలు పథకంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణులకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. కరోనా తరువాత హృద్రోగ సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రతి ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సైతం హృదయ సమస్య తలెత్తితే తాత్కాలికంగా 14 మాత్రలు కిట్‌బాక్స్ ప్రతి ఆరోగ్య కేంద్రంలో సిద్ధంగా ఉంచినట్లు.. తద్వారా ప్రాణాలు కాపాడే అవకాశం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఏటా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వాకింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్, ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మధుమేహం నియంత్రణపై అవగాహన



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సాక్షి, చెన్నై : మధుమేహంపై అవగాహనను విస్తృతం చేస్తూ చెన్నై స్లిమ్ అండ్‌ఫిట్ 2.ఓ నినాదంతో కార్యక్రమాలకు ఎంవీ డయాబెటిస్ మంగళవారం శ్రీకారంచుట్టింది. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రొఫెసర్‌ఎం విశ్వనాథన్ డయాబెటిస్ రీసెర్చ్ సెంటర్‌లో హెల్త్ కాన్కే లవ్ ఫర్ ఏ హెల్తీ మైండ్ అండ్ బారీ పేరిట కార్యక్రమం జరిగింది. ఇందులో మధుమేహం నివారణ, ప్రజలకు అవగాహన కల్పించే విధంగా బ్రోచర్‌ను సవేరా హోటల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ నీనా రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంవీ డయాబెటిస్ హెడ్ డాక్టర్ విజయ్ విశ్వనాథన్ మాట్లాడుతూ, పిల్లలు సైతం మధుమేహం బారీన పడుతున్నారని వివరించారు. అందుకే పాఠశాలల పిల్లలకు స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌లను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మధుమేహం వల్ల ఎదురయ్యే అనార్థాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాలను సీబీఎస్ఈ బోర్డు సహకారంతో చేపట్టనున్నామన్నారు. చెన్నైలోని అన్ని జోన్లలోని పాఠశాలలో సీఎస్‌హెచ్‌ఎం కార్యకలాపాలు విస్తృతం చేస్తామని తెలిపారు.

వేతనాలు పెంచాలని పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

అన్నానగర్: పళని మున్సిపాలిటీలో 30 వార్డులు ఉన్నాయి. ఇక్కడ 300 మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. కొత్త వేతన ఒప్పందం ప్రకారం వారికి జీతాలు చెల్లించడంలేదు. సకాలంలో జీతం చెల్లించకుండా 10 రోజులు ఆలస్యం చేస్తున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. దీంతో మంగళవారం ఉదయం 200 మంది పారిశుద్ధ్య కార్మికులు కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులతో చర్చలు జరిపినా వినకుండా నిరసనకు దిగడంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా కలకలం రేగింది. 2 రోజులుగా పళనిలో భక్తుల రద్దీ పెరగడంతో పాటు దీపావళి పండుగ సందర్భంగా ఎక్కడ చూసినా టపాకాయల చెత్తాచెదారం భారీగా పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంది. ఈ సమయంలో పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తొలగించకుండా ధర్నాకు దిగడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది.

ప్రభుత్వాస్పత్రుల్లోని క్యాంటీన్లకు
కొత్త మార్గదర్శకాలు

కొరుక్కుపేట: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని క్యాంటీన్లలో అనుసరించాల్సిన కొత్త మార్గదర్శకాలను ఆహార భద్రత శాఖ విడుదల చేసింది. స్టాన్లీ ప్రభుత్వ మెడికల్ సెంటర్‌లోని క్యాంటిన్‌లో ఉంచిన బొండా, బజ్జి కోసం ఎలుక పరిగెత్తుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయమై ఆస్పత్రి నిర్వాహకులకు ప్రజలు ఫిర్యాదు చేయడంతో క్యాంటీన్‌ను తాత్కాలికంగా మూసివేయాలని ఆస్పత్రి ప్రిన్సిపల్ బాలాజీ ఆదేశించారు. ఈ పరిస్థితిలో తమిళనాడులోని ప్రభుత్వ వైద్య కళాశాలలన్నింటిల్లోనూ, జిల్లా, ప్రాంతీయ ఆస్పత్రుల్లో పాటించాల్సిన మార్గదర్శకాలను ఆహార భద్రత శాఖ విడుదల చేసింది. క్యాంటీన్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని.. క్రిమిసంహారక మందును పిచికారీ చేయాలని పేర్కొంది. కీటకాలు, జంతువులు ప్రవేశించకుండా రెస్టారెంట్ల సమీపంలో రంధ్రాలు, కాలువలు మొదలైన వాటిని మూసివేయాలని ఆదేశించింది. అలాగే జంతువులు, పక్షులు, పెంపుడు జంతువులను ఫుడ్ స్టాల్స్ ప్రాంగణంలోకి అనుమతించకూడదని పేర్కొంది. ప్యాక్ చేసిన ఆహార పదార్థాలకు గడువు ముగింపు వ్యవధిలోపు మాత్రమే సేకరించి విక్రయించాలని.. మిగిలిపోయిన ఆహార నిల్వను రెస్టారెంట్ నుంచి కీటకాలు, జంతువులకు దూరంగా ఉన్న గదుల్లో ఉంచాలని నిబంధనలు విధించింది.

కొలనులో మునిగి విద్యార్థి మృతి



మృతదేహాన్ని వెలికితీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అన్నానగర్: ముదుకులత్తూరు ప్రాంతానికి చెందిన పాండి కుమారుడు నికాష్ కన్నన్ (14). అక్కడి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఆ ప్రాంతంలోని కొలను సమీపంలో స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతున్నాడు. అప్పుడు అతని స్నేహితులు కొట్టిన బంతి కొలనులో పడింది. దీన్ని తీయడానికి నికాష్ కన్నన్ నీటిలోకి దిగి బంతిని తీయడానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో అనూహ్యంగా నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు నికాష్ కన్నన్‌ను కాపాడేందుకు యత్నించారు. కానీ ఫలితం లేకపోయింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని నికాష్ కన్నన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముత్తుకులత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు గ్లెనెగల్స్ వైద్యసేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సాక్షి, చెన్నై: తాంబరం కమిషనరేట్ పరిధిలోని పోలీసులకు గ్లెనెగల్స్ హెల్త్ సిటీలో మంగళవారం స్క్రీనింగ్ క్యాంపును ఏర్పాటు చేశారు. మధుమేహం తదితర వ్యాధులకు సంబంధించిన స్క్రీనింగ్‌ను 150 మందికి పైగా పోలీసులకు నిర్వహించారు. పోలీసులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆహార అలవాట్లు, వ్యాయామ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో తాంబరం పోలీసు కమిషనర్ అమల్ రాజ్, హెల్త్ సిటీ సీఈఓ అలోక్ ఖుల్లార్, మార్కెటింగ్ హెడ్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నపిల్లలను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచండి



రోగులకు పండ్లు, బ్రెడ్ అందజేస్తున్న సేవాలయ నిర్వాహకులు

తిరువళ్లూరు: చిన్నపిల్లలను సెల్‌ఫోన్‌లకు దూరంగా పెట్టడానికి యత్నించాలని చిన్నపిల్లల వైద్యనిపుణుడు ప్రభుశంకర్ సూచించారు. తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం చిల్డ్రన్స్‌డే నిర్వహించారు. చిన్నపిల్లల వైద్యవిభాగం హెచ్‌ఓడీ శ్రీదేవీ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా చిన్నపిల్లల వైద్యనిపుణులు ప్రభుశంకర్, జగదీష్ ప్రసంగించారు. చిన్నపిల్లలను వారి ఇష్టప్రకారం ఆడుకునే స్వేచ్ఛను కల్పించడంతో పాటు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలన్నారు. పిల్లలు ఆడుకోవడం వల్ల మానసికంగా, శారీరకంగా ఎదుగుతారని తెలిపారు. ఇష్టమైన ఆహారాన్ని ఇవ్వడానికి యత్నించాలని సూచించారు. అనంతరం సేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీధరన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాలలోని చిన్నపిల్లల వార్డును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడానికి గోడలపై బొమ్మలు, కార్టూన్స్‌ను వేస్తామన్నారు. అనంతరం చిన్నారులకు బ్రెడ్, పండ్లు, బిస్కెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో సంతోష్‌జైన్, అశోక్‌కుమార్ జైన్, అమిత్‌చంద్‌జైన్ పాల్గొన్నారు.

పాన్ ఇండియా స్థాయికి
సాక్షి అగర్వాల్

తమిళసినిమా: ప్రస్తుతం అరడజనుకు పైగా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నా నటి సాక్షి అగర్వాల్. ఇందులో తమిళం, మలయాళం, కన్నడం వంటి పలు భాషా చిత్రాలు ఉన్నాయి. బిగ్ బాస్ రియాల్టీ గేమ్ షో ద్వారా పాపులర్ అయిన సాక్షీ అగర్వాల్ హీరోయిన్, గ్లామర్, యాక్షన్, విలనిజం, గ్రామీణ యువతీ అంటూ అన్ని రక రకాల పాత్రలో నటిస్తూ దుమ్మురేపుతున్నారు. ప్రస్తుతం తమిళంలో రజిత్ కన్నా దర్శకత్వం వహిస్తున్న హీరోయిన్ ఓరియంటెడ్ కథా చిత్రం సారా లో నటిస్తున్నారు. అదేవిధంగా 8 తోట్టాగల్ చిత్రం ఫేమ్ వెట్రికి జంటగా నటించిన చిత్రంను పూర్తి చేశారు. అదేవిధంగా గెస్ట్ –2 తదితర అరడజను చిత్రాలు ప్రస్తుతం ఈమె చేతిలో ఉన్నాయి. కాగా మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి మేనల్లుడు హీరోగా నటిస్తున్న చిత్రంలో సాక్షి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో ఈమె పల్లెటూరి యువతిగా నటిస్తున్నారు. అదేవిధంగా ప్రముఖ కన్నడ సంగీత దర్శకుడు బి అజనీష్ లోకనాథ్ నిర్మిస్తున్న చిత్రంలోనూ ఈమె చాలా ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. ఇలా తమిళం, మలయాళం, కన్నడం భాషల్లో నటిస్తూ బిజీగా ఉన్న సాక్షి అగర్వాల్ తాజాగా బాలీవుడ్ అవకాశాలు వస్తున్నాయట. త్వరలోనే బాలీవుడ్లో రంగ ప్రవేశం చేస్తానని సాక్షి అగర్వాల్ పేర్కొన్నారు. మొత్తం మీద ఈ దీపావళి ఈ బ్యూటీకి కొత్త ఆనందాన్నే తీసుకొచ్చినట్లుంది.



కోలీవుడ్ టాక్స్

లోకనాయకుడితో దర్శకుడు అట్లీ



కమలహాసన్‌తో దర్శకుడు అట్లీ, భార్య ప్రియ

తమిళసినిమా: నాలుగవ చిత్రంతోనే పాన్ ఇండియా దర్శకుడు అయిపోయారు అట్లీ. దర్శకుడు శంకర్ శిష్యుడైన ఈయన రాజారాణి చిత్రంతో దర్శకుడిగా అవతారం ఎత్తారు. ఆ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. ఆ తర్వాత విజయ్ కథానాయకుడిగా మెర్సల్, బిగిల్ చిత్రాలు చేసి సూపర్ హిట్ కొట్టారు. ఇక నాలుగో చిత్రంతోనే బాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చి బాద్షా షారుక్ ఖాన్ కథానాయకుడిగా జవాన్ చిత్రాన్ని తెరకెక్కించి సంచలన విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు ఐదవ చిత్రం ఏంటన్నదాని గురించే చర్చ జరుగుతోంది. ఈయనతో చిత్రాల చేయడానికి కోలీవుడ్, టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ నిర్మాతలు క్యూలో ఉన్నారని చెప్పవచ్చు. జవాన్ వంటి బ్లాక్ బస్టర్ చిత్రం తర్వాత షారుక్ ఖాన్ మళ్లీ అట్లీ దర్శకత్వంలో నటించడానికి సిద్ధం అన్నారు. నటుడు విజయ్ కూడా షారుక్ ఖాన్ తో కలిసి నటించడానికి రెడీ అన్నారు. దీంతో వీరిద్దరిని కలిపి చిత్రం చేయడానికి కథను రెడీ చేస్తున్నట్లు అట్లీ ఇటీవల ఓ భేటీలో పేర్కొన్నారు. అలాంటిది అనూహ్యంగా ఈయన లోకనాయకుడు కమలహాసన్ కలవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నటుడు కమలహాసన్ కు అట్లీ కథ చెప్పినట్లు ఆయన చాలా ఇంప్రెస్స్ అయినట్లు సమాచారం. అంతేకాకుండా కమలహాసన్ పారితోషికం తదితర విషయాలు గురించి చర్చ జరిగినట్లు, త్వరలోనే అగ్రిమెంట్ చేసుకున్నట్లు సమాచారం. కాగా షారుక్ ఖాన్, విజయ్ కలిసి నటించిన చిత్రంలో కమలహాసన్ నటించనున్నారా? లేక అట్లీ దర్శకత్వంలో హాలీవుడ్ సంస్థ నిర్మించనున్న చిత్రంలో కమలహాసన్ నటించనున్నారా? అన్న విషయంపై క్లారిటీ రావాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే కాగా కమలహాసన్ ప్రస్తుతం బిగ్ బాస్ రియాల్టీ గేమ్ షో లో హోస్ట్ గా వ్యవహరిస్తూనే మరోపక్క చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఇండియన్ 2 చిత్రాన్ని కంప్లీట్ చేసిన కమల్ ఇండియన్ –3 చిత్రానికి సిద్ధమవుతున్నారు. అదే విధంగా తెలుగులో నాగ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న కల్కి 2898ఏడీ చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో ఈయన ప్రతి నాయకుడిగా పవర్ ఫుల్ పాత్రను పోషిస్తున్నట్లు టాక్ స్ప్రెడ్ అయింది. ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న ఇందులో అమితాబచ్చన్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. కాగా హెచ్ వినోద్ దర్శకత్వంలో తన 233 చిత్రంలో, మణిరత్నం దర్శకత్వంలో తన 234వ చిత్రంలోనూ నటించడానికి సిద్ధమవుతున్నారు. కాగా అట్లీ దర్శకత్వంలో నటించే విషయం నిజమైతే అది కమలహాసన్ 235వ చిత్రం అవుతుంది.

అజయన్ బాల దర్శకత్వంతో కొత్త చిత్రం



అజయన్ బాలావిన్ మైలాంజి చిత్ర యూనిట్

తమిళసినిమా: అజయ్ అర్జున్ ప్రొడక్షన్స్ పతాకంపై డాక్టర్ అర్జున్ నిర్మిస్తున్న చిత్రం అజయన్ బాలావిన్ మైలాంజి. ప్రముఖ రచయిత అజయన్ బాల కథ, మాటలు రాసి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నటుడు శ్రీరామ్ కార్తీక్ ,గిరీష కురూప్, సింగం పులి, మునీష్ కాంత్, తంగదొరై తదితరులు ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తి పూర్తి అయ్యిందని మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో యూనిట్ వర్గాలు తెలిపారు. దీని గురించి దర్శకుడు పేర్కొంటూ ఇది కొండ పరిసర ప్రాంతాల నేపథ్యంలో సాగే సరికొత్త ప్రేమ కథ చిత్రం గా ఉంటుందన్నారు. ముఖ్యంగా పర్యాటక పరిరక్షణ గురించి తెలిపే చిత్రంగా ఉంటుందన్నారు. చిత్ర షూటింగ్ ను నెల రోజుల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. కాగా మైలాంజి అనే టైటిల్ తో ఇప్పటికే ఒక చిత్రం విడుదల కావడంతో తమ చిత్రానికి అజయన్ బాలావిన్ మైలాంజి అని పేరు మార్చినట్లు వివరించారు. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ చిత్ర కథను విన్న సంగీత దర్శకుడు ఇళయరాజా చాలా ఇంప్రెస్ అయ్యి చిత్రంలోని నాలుగు పాటలను ఆయనే రాసి సంగీతాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. కథను నమ్మి ప్రముఖ సాంకేతిక వర్గంతో రూపొందిస్తున్న చిత్రం ఇదని చెప్పారు. దీనికి చెళియన్ ఛాయాగ్రహణం, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిత్రాన్ని 2024 ఫిబ్రవరి నెలలో ప్రేమికుల రోజు సందర్భంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాత తెలిపారు.

ఇప్పటి వరకు
చేసింది చాలు



తమిళసినిమా: నటన కంటే, గ్లామర్ డాల్ గానే ముద్ర వేసుకున్న హీరోయిన్లలో తమన్నా భాటియా ముందుంటుంది. అలాగని ఈమెలో మంచి నటి లేదని చెప్పలేం. బాహుబలి లాంటి చిత్రాల్లో తమన్నా ఇరగదీసింది. అయితే ప్రతిభను చాటే అవకాశాలు ఎక్కువగా ఈమెకు రాలేదన్నది వాస్తవం. అందుకు కారణం ఈమెలోని అందం, అభినయాన్ని డామినేట్ చేయడమే. ఇక నిజం చెప్పుకోవాలంటే గ్లామరస్ పాత్రలే ఈ మిల్కీ బ్యూటీని ఈ స్థాయిలో నిలబెట్టాయి. ఏదేమైనా 18 ఏళ్లుగా కథానాయకిగా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో అగ్ర కథానాయకిగా రాణిస్తున్న తమన్నా తాజాగా మలయాళం ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. అక్కడ మరిన్ని అవకాశాలు వస్తున్నాయని అంటున్నారు కానీ, నిజానికి ఈ అమ్మడికి అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. మరో పక్క ఇప్పటి వరకూ నటనపైనే దృష్టి పెట్టినట్లు స్టేట్‌మెంట్స్ ఇచ్చిన తమన్నా ఇప్పుడు తన బాయ్‌ఫ్రెండ్‌తో ఎక్కువ టైమ్ స్పెండ్ చేస్తోందనిపిస్తోంది. బాలీవుడ్ నటుడు విజయవర్మతో చాలాకాలంగా సీక్రెట్ లవ్‌ను మెయింటైన్ చేస్తూ వచ్చిన ఈ జాణ ఇటీవలే తన ప్రేమ గుట్టును విప్పింది. ఆ తరువాత పార్టీలకు, ప్రైవేట్ ఫంక్షన్ లకు విచ్చలవిడిగా తిరిగేస్తున్నారు జంట. ఇక అసలు విషయానికి వస్తే ఈ సంచలన జంట కోసం పెళ్లి పీటలు ఎదురు చూస్తున్నాయని తాజా సమాచారం. ఇప్పటివరకు చేసిన డేటింగ్ చాలు, ఇకనైనా పెళ్లి చేసుకోమని తమన్నా భాటియా ఇంట్లో ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. దీంతో బ్యూటీ కూడా తాళి కట్టు శుభవేళకు సిద్ధం అవుతున్నారనే టాక్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కాగా దీపావళి పండుగను ఈ జంట కలిసి జరుపుకోవడం కూడా తమన్నా భాటియా పెళ్లికి సిద్ధం అవుతున్నట్లు వస్తున్న వార్తలకు బలాన్ని చేకూర్చుతోంది.

ప్రియుడికి ప్రేమతో..!



ప్రియుడు శాంతను హజారికతో శృతిహాసన్

తమిళసినిమా: సాధారణంగా దీపావళి పర్వదినం ప్రజల్లో నూతనోత్సాహాన్ని, కాంతులను విరజిమ్ముతోంది. అయితే ఈ దీపావళి ప్రేమ జంటల్లో వెలుగు తీసుకొచ్చిందని చెప్పక తప్పదు. ముఖ్యంగా సినీ రంగంలో పలువురి ప్రేమను బహిరంగంగా వ్యక్తం చేయడానికి దోహదం చేసింది. అలాంటి వారిలో నటి శృతిహాసన్ ఒకరు. స్వేచ్ఛ అనే పదానికి మారుపేరు ఈ సంచలన నటి. ఈమె పెరిగిన వాతావరణం అలాంటిది. తమకు స్వేచ్ఛను తమ తండ్రి కమలహాసన్ నే కల్పించారని ధైర్యంగా చెప్పే శృతిహాసన్ నటిగానూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ఇంకా చెప్పాలంటే తమిళ నటి ఐనా తెలుగులోనే సక్సెస్ ఫుల్ హీరోయిన్‌గా రాణిస్తున్నారు. నటుడు ప్రభాస్ సరసన పాన్ ఇండియా చిత్రం సలార్‌లో నటించిన శృతిహాసన్ ఆ చిత్రం అందించే రిజల్ట్ కోసం చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ది ఐ అనే హాలీవుడ్ చిత్రంలో నటిస్తున్న ఈ బ్యూటీ ప్రేమ వ్యవహారంలో చాలా డేర్ అని చెప్పక తప్పదు. ఇప్పటికీ ఒకరిద్దరు ప్రియుళ్లను మార్చిన శృతిహాసన్ తాజాగా శాంతను హజారిక అనే విజువల్ ఆర్టిస్ట్ ప్రేమలో పడ్డారు. ఇటీవల వీరిద్దరూ సన్నిహితంగా ఉండే ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదలై హల్‌చల్ చేస్తున్నాయి.కాగా తాజాగా దీపావళి పండుగ సందర్భంగా అభిమానులకు శుభాకాంక్షలు తెలుపుతూ శృతి హాసన్ తన ప్రియుడు శాంతను హజారికకు ప్రేమతో ముద్దులు పెట్టిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. దీంతో వీరిపై నెటిజన్లు రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. ముఖ్యంగా పెళ్లెప్పుడు అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఆ విధంగా నటి శృతిహాసన్ తన తాజా ప్రియుడితో ట్రెండింగ్‌లో ఉన్నారన్న మాట.

క్లుప్తంగా

తండ్రి హత్య.. కుమారుడి అరెస్ట్

తిరువొత్తియూరు: తూత్తుకుడి జిల్లాలో తండ్రిని హత్య చేసిన తనయుడుని పోలీసులు అరెస్టు చేశారు. ఏరల్ సమీపంలోని మాంగోటాపురానికి చెందిన పండారం (69) కుమారుడు వేల్ మురుగన్ (25) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి తాగుడు అలవాటు ఉంది. దీపావళి రోజున రాత్రి 9.30 గంటల సమయంలో ఇంటిలో ఉన్న తండ్రి పండారం, తల్లి చందనమారి, అక్క అంజలితో మద్యం మత్తులో గొడవ పడ్డాడు. మద్యం తాగడానికి నగదు అడిగాడు. పండారం తన వద్ద నగదు లేదని చెప్పడంతో తండ్రి కుమారుడు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహించిన వేల్ మురుగన్ ఇంటి బయట ఉన్న ఒక బండరాయి తీసుకుని పండారం తలపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన పండారంను బంధువులు శ్రీవైకుంఠం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి వేల్ మురుగన్‌ను సోమవారం అరెస్టు చేశారు.

యువకుడు అనుమానాస్పద మృతి

తిరువొత్తియూరు: ఎన్నూరులో ఓ యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చెన్నై సమీపంలోని ఎన్నూరు వద్ద ఉన్న భారత్‌నగర్‌కు చెందిన రాజీ అలియాస్ రాజా (30) కూలీ. సోమవారం రాత్రి రామకృష్ణ నగర్ రోడ్డు పక్కన తలకు తీవ్ర గాయంతో అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. స్థానికులు ఎన్నూరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఇన్‌స్పెక్టర్ జగన్నాథం నేతృత్వంలో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నై స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహం వద్ద మోటార్ సైకిల్ కిందపడి ఉంది. అతను మద్యం మత్తులో కిందపడి మృతి చెందాడా? లేదా మరి ఏదైనా కారణమా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్ట్ తర్వాతే మృతికి కారణాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.


ఆర్టీసీ బస్సు, వ్యాను ఢీ



ప్రమాదంలో బోల్తా పడిన వ్యాన్

కొరుక్కుపేట: చెన్నై మీనంబాక్కం సమీపంలోని జీఎస్టీ రోడ్డులో ఆర్టీసీ బస్సును వ్యాన్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈకాట్టుతాంగల్‌లోని లాజిస్టిక్ కంపెనీ నుంచి బంగారు, వెండి ఆభరణాలతో కూడిన వ్యాన్ మీనంబాక్కం విమానాశ్రయానికి బయలుదేరింది. పాత ఎయిర్‌పోర్ట్ సిగ్నల్ దగ్గర వ్యాన్ మలుపు తిరుగుతుండగా తిరుచ్చి నుంచి చెన్నై వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఫారెస్ట్ సూపర్‌వైజర్ మణికంఠన్ (47) అక్కడికక్కడే మృతి చెందారు. వ్యాన్ డ్రైవర్ సురేంద్రన్ (52) తీవ్రంగా గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తీవ్రంగా గాయపడిన అంసరుద్దీన్ (50)ని క్రోమ్‌పేట్ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వ బస్సులో ప్రయాణిస్తున్న 40 మంది సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంపై సెయింట్ థామస్ మౌంట్ ట్రాన్స్‌పోర్ట్ ఇన్వెస్టిగేషన్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ తంగరాజ్, ఎస్ఐ సంపత్ కేసు నమోదు చేసి బస్సు డ్రైవర్ వేలు(47), కండక్టర్ కృష్ణరాజ్(50)లను విచారిస్తున్నారు.

విద్యార్థులకు డిగ్రీ పట్టాల ప్రదానం



పట్టాలను అందజేస్తున్న కాగందీప్ సింగ్

వేలూరు: వైద్య విద్యార్థులు రోగులపై సేవాభావంతో నడుచుకోవాలని ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కాగందీప్ సింగ్ అన్నారు. వేలూరు క్రిస్టియన్ మెడికల్ కళాశాల స్నాతకోత్సవ ఆసుపత్రి డైరెక్టర్ విక్రమ్ మ్యాథ్యూ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థినులకు పట్టాలను అందజేశారు. వివిధ రోగాలతో వచ్చే రోగులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. వారి సమస్యను ఓపికతో వినాలని సూచించారు. సేవా భావంతోనే ఆత్మసంతృప్తి లభిస్తుందని తెలిపారు. అనంతరం అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు బంగారు పతకాలను అందజేశారు. ప్రిన్సిపల్ సాలుమోన్ సతీష్‌కుమార్, డాక్టర్‌లు పాల్గొన్నారు.

ఇళ్ల ముందున్న 20 వాహనాలు ధ్వంసం

కొరుక్కుపేట: చెన్నై కొడుంగయూర్–ఆర్ఆర్ నగర్ బీబ్లాక్‌లో ఇళ్ల ముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలు, ఆటోలను సోమవారం రాత్రి కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. పెద్ద శబ్దం రావడంతో కొందరు ఇంటి నుంచి బయటకు వచ్చి చూశారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు పార్క్ చేసిన వాహనాలను ఒక్కొక్కటిగా ధ్వంసం చేశారు. యజమానులను చూసి పరారయ్యారు. 14 ఆటోలు, మినీ వ్యాన్, ఐదు బైక్‌లతో సహా మొత్తం 20కి పైగా వాహనాలు ధ్వంసమయ్యాయి. చెన్నై వ్యాసర్‌పాడి కెన్నెడీ నగర్ 5వ వీధికి చెందిన రంజిత్ కుమార్ (32), గౌతమ్ (30) ఆటోల అద్దాలు సైతం పగులగొట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు వ్యాసర్‌పాడి పోలీసులు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా ఇద్దరు బాలురుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

హెల్మెట్‌తో ప్రాణానికి రక్ష

- మంత్రి శేఖర్ బాబు



విజేతలతో మంత్రి శేఖర్ బాబు

కొరుక్కుపేట: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాలకు శ్రీరామ రక్షణగా నిలుస్తుందని దేవదాయశాఖ మంత్రి పీకే శేఖర్ బాబు అన్నారు. అపోలో షైన్ ఫౌండేషన్ తరఫున రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు, రోడ్డు ప్రమాదాల నుంచి పిల్లలను రక్షించే ప్రయత్నంలో ×పిల్లల కోసం హెల్మెట్౹౹ అనే అవగాహన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. చెన్నైలోని మ్యూజిక్ అకాడమీ వేదికగా జరిగిన కార్యక్రమంలో మంత్రి శేఖర్ బాబు అతిథిగా పాల్గొన్నారు. అపోలో షైన్ ఫౌండేషన్ డైరెక్టర్ హర్షద్ రెడ్డి, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉపేంద్ర కింజవడేకర్ తదితరులు పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుదల, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ×నో ఎక్స్‌క్యూజ్ ఓకే, వేర్ ఎ హెల్మెట్౹ అనే నినాదంపై సాగిన ఈ ప్రచారం, హెల్మెట్ అందించే రక్షణ గురించి పిల్లలు తెలుసుకోవాలని, ద్విచక్ర వాహనం నడుపుతున్నప్పుడు ఎల్లప్పుడూ హెల్మెట్ ధరించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా అపోలో షైన్ ఫౌండేషన్‌కు చెందిన బృందం అనేక పాఠశాలలను సందర్శించి, విద్యార్థులకు శిరస్త్రాణాలను బహుమతులుగా అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించడానికి పోస్టర్–మేకింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మంత్రి శేఖర్ బాబు మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించడం వల్ల తలకు గాయం అయ్యే ప్రమాదాన్ని 85 శాతం తగ్గించవచ్చని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని అదే ప్రాణానికి శ్రీరామ రక్ష అని చెప్పారు. హర్షద్ రెడ్డి మాట్లాడుతూ.. అపోలో షైన్ నేతృత్వంలో రోడ్డు భద్రతను పెంపొందించడానికి, పిల్లల కోసం శిరస్త్రాణాల కార్యక్రమాన్ని ప్రారంభించడంపై సంతోషం వ్యక్తం చేశారు. అపోలో పిల్లల ఆసుపత్రి మార్కెటింగ్ హెడ్ రోహిత్, అపోలో షైన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ కిషోర్ మనోహర్, మెడికల్ డైరెక్టర్ ఇంద్ర జైకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్

వేలూరు: పుస్తకాలు చదవడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వేలూరు అన్నా రోడ్డులోని సెంట్రల్ లైబ్రరీలో పుస్తక ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయంలో సాధారణ పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను ఉంచారని తెలిపారు. పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తకాలతో పాటు దిన పత్రికలు చదవడం వల్ల మేధాశక్తి పెరుగుతుందన్నారు. జిల్లా గ్రంథాలయ అధికారి పయణి, అసిస్టెంట్ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

నేడు కన్యాకుమారిలో భారీ బైక్ ర్యాలీ

- ప్రారంభించనున్న మంత్రి ఉదయనిధి

కొరుక్కుపేట: సేలంలో డిసెంబర్ 17వ తేదీ జరగనున్న 2వ యువజన సదస్సుకు సంబంధించి బుధవారం భారీ బైక్ ర్యాలీని నిర్వహించేందుకు డీఎంకే నిర్ణయించింది. ఉదయం 11 గంటలకు కన్యాకుమారిలో డీఎంకే యువజన విభాగం రాష్ట్ర సెక్రటరీ ఉదయనిధి స్టాలిన్ ప్రారంభించనున్నారు. కాగా సేలంలో జరిగే సదస్సుకు ఉదయనిధి స్టాలిన్ అధ్యక్షత వహిస్తారు. ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, మంత్రులు, ఎమ్మెల్యేలను ఆహ్వానించనున్నారు. కార్యదర్శులు, ఎంకే యూత్ టీమ్ మేనేజర్లు అంతర్గత ప్రచారాల్లో పాల్గొంటారు. అలాగే తమిళనాడు నలుమూలల నుంచి యువజన నాయకులు, వలంటీర్లు ఈ సదస్సులో పాల్గొంటారు. సదస్సులో 10 లక్షల మంది యువతను సమీకరించాలని నిర్ణయించారు. రాష్ట్రం మొత్తం 8,647 కి.మీ ప్రయాణించి దాదాపు 3 లక్షల మంది యువకులను సదస్సు కోసం వ్యక్తిగతంగా కలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

శబరిమలై భక్తుల కోసం ప్రత్యేక రైలు

- తిరునల్వేలి– చెన్నై మధ్య ప్రయాణం

కొరుక్కుపేట: అయ్యప్ప మాలధారణ సమయం కావడంతో శబరిమలై భక్తుల కోసం ప్రతి గురువారం తిరునల్వేలి– చెన్నై మధ్య వందేభారత్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. కార్తీక మాసం ఈ నెల 17వ తేదీ నుంచి మొదలు కానున్న నేపథ్యంలో ఉపవాస దీక్షలు ప్రారంభిస్తారు. భక్తులు బస్సులు, రైళ్లు, ప్రైవేట్ వాహనాల్లో అయ్యప్ప దర్శనం కోసం శబరిమలైకు వెళుతుంటారు. సీజన్‌కు ముందు రద్దీని తగ్గించడానికి ప్రతి వారం తిరునల్వేలి–చెన్నై మధ్య ప్రత్యేక వందే భారత్ రైలును నడపాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. ఈ రైలుకు భారీ స్పందన లభిస్తున్నందున ఈ ప్రత్యేక రైలు అదనంగా నడుస్తోంది. దీని ప్రకారం డిసెంబర్ 16 నుంచి 28వ తేదీ వరకు ప్రతి గురువారం వందేభారత్ ప్రత్యేక రైలు నడపనున్నారు. ఈ ప్రత్యేక రైలు (నం.06067) ప్రతి గురువారం ఉదయం 6 గంటలకు చెన్నై నుంచి బయలుదేరుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2.15 గంటలకు నెల్‌లై సాందీపురై స్టేషన్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరునల్వేలి నుంచి (నంబర్: 06068) మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి రాత్రి 11.15 గంటలకు చెన్నై చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు తాంబరం, విల్లుపురం, తిరుచ్చి, దిండుగల్, మదురై, విరుదునగర్ రైల్వే స్టేషన్లలో ఆగుతుంది. నీటి రీఫిల్లింగ్ కోసం తిరుచ్చి రైల్వే స్టేషన్‌లో రెండు వైపులా అదనంగా 5 నిమిషాలు హాల్ట్ చేస్తారు. ఈ మేరకు దక్షిణ రైల్వే మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమే



నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నేతలు

వేలూరు: ప్రాథమిక విద్య నుంచే చిన్నారులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కాట్పాడి జూనియర్ రెడ్‌క్రాస్ కార్యదర్శి సేనా జనార్ధనన్ అన్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని వేలూరు జిల్లా కాట్పాడిలోని తులీర్ పాఠశాలలో చిన్నారుల దినోత్సవం నిర్వహించారు. చిన్నారులకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు ఉంటుందని వక్తలు సూచించారు. అలాగే వేలూరు అన్నారోడ్డులోని కామరాజర్ ట్రస్ట్ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి టీకారామన్ పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసి స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు వాహీద్ బాషా, జయప్రకాష్, చంద్ర ప్రకాష్, చిత్తరంజన్ పాల్గొన్నారు.

సముద్రంలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

తిరువొత్తియూరు: కాశిమేడు సముద్ర తీరంలో స్నేహితులతో కలిసి సరదాగా దిగిన ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. వివరాలు.. కొత్త చాకలిపేట నాగురాన్ తోట తొమ్మిదో బ్లాక్‌కు చెందిన చార్లెస్ కుమారుడు సామువేలు (13), నాగురాన్ తోట 12వ బ్లాక్‌కు చెందిన భాగ్య కుమారుడు తరుణ్ (12) స్నేహితులు. వీరిద్దరూ అదే ప్రాంతంలోని పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. సోమవారం కాశిమేడు సముద్రం వద్ద స్నానం చేస్తున్నారు. పెద్ద అలకు ఇద్దరు సముద్రంలోకి వెళ్లిపోయారు. ఇది చూసిన అక్కడున్నవారు వారిని కాపాడేందుకు యత్నించారు. అయినా వీలుకాలేదు. సమాచారం అందుకున్న రాయపురం అగ్నిమాపక సిబ్బంది, జాలర్ల సహాయంతో సముద్రంలోకి దిగి విద్యార్థుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి కావడంతో సహాయక చర్యలు కొనసాగించలేకపోయారు. మంగళవారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు ప్రారంభించారు. ఈ ఘటనపై కాశిమేడు హార్బర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

సర్పంచ్‌పై ఆర్డీఓకు ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన చెరక్కనూరు గ్రామస్తులు

తిరుత్తణి: రియల్ ఎస్టేట్ వ్యాపారుల స్వలాభం కోసం పంట పొలాల్లో రోడ్డు నిర్మించి నష్టపరిహారం చెల్లించకుండా మోసగిస్తున్న పంచాయతీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని చెరక్కనూరు గ్రామస్తులు మంగళవారం ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. తిరుత్తణి యూనియన్ చెరక్కనూరు దళితవాడ సమీపంలోని శ్మశానానికి వెళ్లే మార్గంలో రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయతీ సర్పంచ్ చిన్నతంబి పనులు ప్రారంభించారు. ప్రైవేటు పంట పొలంలో ముందస్తు అనుమతి లేకుండా రోడ్డు ఏర్పాటును రైతులు వ్యతిరేకించినట్లు, అయితే బాధితులకు నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి రోడ్డు వేసినట్లు తెలిపారు. కొద్ది రోజులకు అదే ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ప్లాట్లు వేయడంతో శ్మశానానికి రోడ్డు వేస్తున్నట్లు చెప్పి మోసగించినట్లు వాపోయారు. నష్టపరిహారం చెల్లించక మోసగించినట్లు గుర్తించామని, తమ పొలంలో రోడ్డు వేసి నష్టపరిహారం చెల్లించకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రోడ్డు నిర్మించిన పంచాయతీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆర్డీఓ దీపకు ఫిర్యాదు చేశారు. దళిత ప్రజాఫ్రంట్ అధ్యక్షుడు తిరునావుక్కరసు పాల్గొన్నారు.

అన్ని శనివారాలు పాఠశాలల నిర్వహణ

కొరుక్కుపేట: భారీ వర్షాల కారణంగా ఈ నెలలో వివిధ జిల్లాల్లో పాఠశాలలు తరచూ మూతపడ్డాయి. అలాగే మంగళవారం కూడా 8 జిల్లాలు, కొన్ని తాలూకాలలో పాఠశాలలను మూసివేశారు. ఈ నేపథ్యంలో ఈ నెలలోని అన్ని శనివారాల్లో పాఠశాలలను తెరవాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. పాఠశాల విద్యాశాఖ తరఫున జిల్లా ప్రధాన విద్యాశాఖాధికారులకు లేఖ పంపారు. శనివారాల్లో పాఠశాలలు నిర్వహించేలా నిర్ణయం తీసుకోవచ్చని విద్యాశాఖ సూచించింది.

నెహ్రూ జయంతి వేడుకలు



తిరుత్తణిలో నెహ్రూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుత్తణి: దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా తిరుత్తణిలో కాంగ్రెస్ నాయకులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. తిరుత్తణి మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని నెహ్రూ విగ్రహానికి రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ నేత విభాగం అధ్యక్షుడు సుందరవేలు పార్టీ నాయకులతో కలిసి పుష్పాంజలి ఘటించారు. స్వీట్లు పంచిపెట్టారు. నెహ్రూ ఆశయాల కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త శ్రమించాలని, మతవాదుల నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు పాండురంగన్, మురుగన్, రమేష్, రాజేంద్రన్, వెంకటేశులు, నటేశన్, సెల్వం, భూపాలన్, కామరాజ్ పాల్గొన్నారు.

రైతుపై దుండగుడి కాల్పులు

కొరుక్కుపేట: సేలం జిల్లా పెద్దనాయకన్‌పాళయం సమీపంలోని మలై వెలంపట్టికి చెందిన రాజు(33) మేకలు పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం రాజు అడవికి వెళ్లి మేకల కోసం గడ్డి సేకరించాడు. అకస్మాత్తుగా తుపాకీ పేలుళ్లు జరిగాయి. రాజు కుడి మోకాలు, కుడి కాలికి బుల్లెట్ గాయాలయ్యాయి. స్పృహ తప్పి పడిపోయాడు. కొంతసేపటికి స్పృహలోకి వచ్చి బంధువు రామన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. రామన్ సంఘటనా స్థలానికి వెళ్లి రాజును వజపాడిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గరిబత్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అతని కాలుపై తుపాకీ గాయం ఉండడంతో వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై కరియాకోవిల్ పోలీసులు రాజును విచారించారు. కేసు నమోదు చేసి అడవిలో రాజును కాల్చిన వ్యక్తిని గుర్తించారు.

అగ్నికి ఆహుతైన మూడు ట్రక్కులు

కొరుక్కుపేట: నామక్కల్‌లో మంగళవారం మూడు ట్రక్కులు అగ్నికి ఆహుతయ్యాయి. లక్షల విలువ చేసే దుస్తులు కాలిపోయాయి. వివరాలు.. నామక్కల్‌లోని మూలాయిబ్‌పట్టి ప్రాంతంలో ఓ ప్రైవేటు టైర్ల కంపెనీ ఉంది. దాని వెనుక 3 లారీ ట్రక్కులు ఆగి ఉన్నాయి. రెండు లారీల్లో ఏమీ లేదు. ఓ లారీలో బట్టలు ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఒక్కసారిగా నిప్పు రవ్వ పడి మంటలు ప్రారంభమయ్యాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కానీ అప్పటికే రూ. లక్షల విలువైన దుస్తులు దగ్ధమయ్యాయి. నల్లిపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులను ఆశ్రయించిన ఆంధ్రా ప్రేమ జంట



పెళ్లి దుస్తులతో ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ప్రేమ జంట

వేలూరు: వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని అశోక్‌నగర్‌కు చెందిన నందకుమార్ ఆంధ్ర రాష్ట్రం చిత్తూరులోని అపోలో ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. అదే ఆసుపత్రిలో చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన స్వాతి కూడా విధులు నిర్వహిస్తోంది. ఇక్కడ ఇద్దరి పరిచయం ప్రేమగా మారింది. గత ఆరు సంవత్సరాలుగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. వేర్వేరు కులాలకు చెందిన కావడంతో వివాహానికి పెద్దలు అంగీకరించలేదు. దీంతో ఇద్దరూ గత శుక్రవారం ఇంటి నుంచి బయటకు వచ్చి వేలూరు కొత్త బస్టాండ్ సమీపంలోని ఆలయంలో వివాహం చేసుకొని మంగళవారం ఉదయం వేలూరు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తమకు తమ పెద్దల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ పిల్లల్లో ఆనందం



వైద్యులతో చిన్నారుల ఆనందం

సాక్షి, చెన్నై: కంచి కామకోటి చైల్డ్ ట్రస్ట్ ఆసుపత్రిలో బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్‌లో సర్వైవర్ చిల్డ్రన్స్ మీట్ మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ శస్త్రచికిత్స విజయవంతంతో ఆరోగ్యవంతులైన పిల్లలు తమ ఆనందాన్ని పంచుకుంటూ కేరింతలు కొట్టారు. బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా అరుదైన హెమటోలాజికల్ డిజార్డర్‌ల గురించి అవగాహన కల్పించే విధంగా, బ్లడ్ క్యాన్సర్ పూర్తిగా నయం చేయగలమన్న ధీమాను చాటే రీతిలో ఎబిఎమ్‌టీ సర్వైవర్ చిల్డ్రన్స్ మీట్‌ను ఏర్పాటు చేశామని కేకేసీటీ హెచ్ హెమోటాలజిస్టు డాక్టర్ దీన దయాళన్ తెలిపారు. రక్త క్యాన్సర్‌కు మించి ఎముక మజ్జ మార్పిడి అరుదైన రక్త రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాటం అని వివరించారు. డాక్టర్ మీనా శివ శంకరన్ మాట్లాడుతూ, తమిళనాడు సీఎం సమగ్ర ఆరోగ్య బీమా పథకం, తెలంగాణ ఆరోగ్యశ్రీ సమగ్ర ఆరోగ్య బీమా పథకాలు బీఎంటీ కోసం ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు వివరించారు. ప్రైమరీ ఇమ్యునో డిఫిషియోన్సీ ఉన్న పిల్లలకు ప్రాణహాని కలిగించే ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడేందుకు తమ వంతుగా కార్యక్రమాలను విస్తృతంచేశామన్నారు. ఈ వేడుకల్లో 25 మంది పిల్లలు తమ తల్లిదండ్రులతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరై తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సరళా రాజాజీ, ఇలంకుమరన్, సుందరలింగం వెంకటేషన్, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌కు టపాసులు కట్టి వీలింగ్



బైక్‌కు టపాసులు కట్టి స్టంట్లు వేస్తున్న యువకుడు (ఇన్‌సెట్‌లో మణికందన్, సుజిన్)

కొరుక్కుపేట: తిరునల్వేలిలో బైక్‌కు టపాసులు కట్టి స్టంట్లు వేస్తున్న ఇద్దరు యువకులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. దీపావళి సందర్భంగా నెల్‌లై జిల్లా వెక్టార్‌విల్లైలో బైక్ చుట్టూ బాణసంచా కట్టి, దానిని వెలిగించి, రహదారిపై ప్రమాదకరమైన రీతిలో స్టంట్లు వేశారు. ఈ వీడియోను అజిత్ ‘దీపావళి తల దీపావళి’ అనే ట్యాగ్‌తో సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. ఈ దృశ్యాలు పోలీసుల దృష్టికి రావడంతో ఉడిసైయస్‌కు చెందిన రాజేంద్రన కుమారులు మణికందన్(28), సుజిన్(22)ను అదుపులోకి తీసుకున్నారు. వారు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రిజర్వాయర్లకు నీటి కళ

- తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం
- అత్యధికంగా పొన్నేరిలో 35 మి.మీ
- అత్యల్పంగా పూండిలో 5 మి.మీ
- పెరుగుతున్న రిజర్వాయర్ల నీటి మట్టం



తిరువళ్లూరులో కురుస్తున్న వర్షం

తిరువళ్లూరు: జిల్లా వ్యాప్తంగా 148.80 వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా పొన్నేరిలో 35 మి.మీ వర్షపాతం.. అత్యల్పంగా పూండీలో 5 మి.మీ వర్షపాతం నమోదైంది. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల నుంచి మోస్తరు వర్షం కురుస్తోంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు గుమ్మిడిపూండీలో 9 మి.మీ, చోళవరంలో 13 మి.మీ, పొన్నేరిలో 35మి.మీ, రెడ్‌హిల్స్‌లో 9.80మి. మీ, జమీన్‌కొరట్టూరులో 3 మి. మీ, పూందమల్లిలో 10 మి.మీ, తిరువేళాంగాడులో 7మి. మీ, పూండీలో 5మి.మీ, తామరపాక్కంలో 12 మి.మీ, తిరువళ్లూరులో 10 మి.మీ, ఊత్తుకోటలో 21 మి.మీ, ఆవడిలో 14మి.మీ వర్షపాతం సహా మొత్తానికి 148.80 మి.మీ వర్షపాతం నమోదైంది. తిరుత్తణి, పళ్లిపట్టు, ఆర్కేపేట యూనియన్లలో వర్షపాతం నమోదు కాలేదు. కాగా సరాసరిన 9.92 శాతం నమోదయినట్లు అధికారులు వెల్లడించారు.

స్వల్పంగా పెరిగిన రిజర్వాయర్ల నీటి మట్టం

రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో జిల్లాలోని ప్రధాన రిజర్వాయర్‌ల నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. చెన్నైకు తాగునీటిని అందించే రిజర్వాయర్‌లో రెడ్‌హిల్స్ కూడా ఒకటి. ఈ రిజర్వాయర్ నీటి మట్టం 21.20 అడుగులు కాగా ప్రస్తుతం 18.50 అడుగుల నీరు ఉంది. ఇక్కడ 3.30 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉండగా ప్రస్తుతం 2.709 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 65 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 189 క్యూసెక్కులుగా ఉంది. రిజర్వాయర్ నుంచి 159 క్యూసెక్కుల నీటిని చెన్నై తాగునీటి అవసరాల కోసం ఉపయోగిస్తున్నారు.

చోళవరంలో 14.24 అడుగులు

చోళవరం రిజర్వాయర్ మొత్తం నీటి నిల్వ 18.86 అడుగులు కాగా ప్రస్తుతం 14.24 అడుగులు ఉంది. ఇక్కడ 1.081 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉండగా ప్రస్తుతం 0.629 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 35 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 12 క్యూసెక్కులుగా ఉంది.

చెమరంబాక్కంలో..

చెమరంబాక్కం రిజర్వాయర్ మొత్తం నీటి సామర్థ్యం 24 అడుగులు కాగా ప్రస్తుతం 21.99 అడుగులు ఉంది. నీటి సామర్థ్యం 3.645 టీఎంసీలు. ఇన్‌ఫ్లో 278 క్యూసెక్కులుగా, అవుట్‌ఫ్లో 162 క్యూసెక్కులుగా ఉంది. రిజర్వాయర్ నుంచి 104 క్యూసెక్కుల నీటిని శుద్ధీకరణ చేసి తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తున్నారు.

పూండీలో..

ఆంధ్ర నుంచి వచ్చే కృష్ణాజలాలతో పాటు సమీప ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరే ఈ రిజర్వాయర్‌కు ప్రధాన ఆధారం. కృష్ణా జలాలను పూండీలో నిల్వ ఉంచి అక్కడి నుంచి చోళవరం, రెడ్‌హిల్స్ చెమరంబాక్కం తదితర రిజర్వాయర్‌లకు తరలించి చెన్నై తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తున్నారు. ఈ రిజర్వాయర్ మొత్తం నీటి సామర్థ్యం 35 అడుగులు కాగా ప్రస్తుతం 30.50 అడుగుల మేరకు నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 60 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 68 క్యూసెక్కులుగా ఉంది.

కన్నన్‌కోట–తేరువాయికండ్రిగ

ఈ రిజర్వాయర్ నీటి సామర్థ్యం 36.61 అడుగులు కాగా, ప్రస్తుతం 34.50 అడుగుల మేరకు నీరు నిల్వ ఉంది. ఇక్కడ 0.500 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉండగా ప్రస్తుతం 0.431 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మహిళా పోలీసు ఆత్మహత్య

అన్నానగర్: భర్త నుంచి విడిపోయామన్న బాధతో సాయుధ దళ మహిళా పోలీసు సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పుదుచ్చేరి సమీపంలోని విల్లియనూర్ పత్తుక్కన్ను సప్తగిరి నగర్‌కు చెందిన వినోద్ (30) ఎలక్ట్రికల్ ఉద్యోగి. ఇతని భార్య సత్య (26) ఇటీవల పోలీసు శిక్షణ పూర్తి చేసుకుని పుదువై కోరిమెట్‌లోని ఏయూ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వినోద్, సత్య 2017లో పెళ్లి చేసుకున్నారు. వీరికి 4 ఏళ్ల కుమార్తె ఉంది. 12 నెలలుగా కుటుంబ సమస్యలపై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో వినోద్ తిరువనైలోని తల్లిదండ్రుల ఇంటికి వెళ్లాడు. సత్య తన బిడ్డ, తల్లి ఉమా మహేశ్వరితో కలిసి పత్తుకన్నులోని ఓ ఇంట్లో నివసిస్తోంది. సోమవారం ఉదయం ఉమా మహేశ్వరి బయటకు వెళ్లింది. సత్య తన బిడ్డను తిరుభువనైలోని భర్త ఇంట్లో వదిలి వచ్చి ఇంట్లో ఒంటరిగా ఉంది. బయటకు వెళ్లిన ఉమా మహేశ్వరి ఇంటికి వచ్చింది. ఇంట్లోని ఫ్యాన్‌కు వేలాడుతున్న సత్యను చూసి షాక్‌కు గురైంది. విల్లియనూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సమస్యల కారణంగానే సత్య ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

క్లుప్తంగా...

ఈ క్రాప్ రైతులకు పేపరు రశీదులు ఇవ్వండి

వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్ ఆదేశం

సాక్షి, అమరావతి: ఖరీఫ్ ఈ–క్రాప్ ముగిసినందున రైతులకు పంట వివరాల నమోదుకు సంబంధించి పేపరు రశీదులను అందించాలని అధికారులను వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరి హరికిరణ్ ఆదేశించారు. జిల్లా, మండల వ్యవసాయాధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులతో మంగళవారం మంగళగిరి క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాధ్యమైనంత త్వరగా భౌతిక రసీదుల జారీని పూర్తి చేయాలని సూచించారు. రబీ కార్యాచరణ ప్రణాళికలో వ్యవసాయ సలహా మండళ్లు, సాగు నీటి సలహా మండళ్ల సభ్యుల సమన్వయంతో నీటి సరఫరాను నిర్ధారించుకోవాలని చెప్పారు. రబీలో వరిపంటకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి వసతితో సాగయ్యే మొక్కజొన్న, అపరాలు, ఇతర ఆరు తడి పంటలు సాగు చేసే దిశగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆర్బీకేల్లో వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు (కస్టమ్ హైరింగ్ సెంటర్ల) అమలు మెరుగుపడిందని తెలిపారు. 500 మందికి కిసాన్ డ్రోన్ పైలట్ శిక్షణ అందజేశామన్నారు. మండలానికో కిసాన్ డ్రోన్ పైలట్ ఉండాలన్నారు. 20 జిల్లాల్లో గ్యాప్ సర్టిఫికేషన్ చేపడుతున్నామని, ఎంపిక చేసిన రైతు క్షేత్రాల్లో నమూనా సేకరించి దానికి నాణ్యతా నిర్ధారణ సర్టిఫికెట్ అందిస్తామన్నారు.

12న మహిళా రిజర్వేషన్ అమలు కోసం ఢిల్లీలో దీక్ష

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): మూడు దశాబ్దాల నుంచి జాప్యం చేస్తున్న చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని కోరుతూ డిసెంబరు 12న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన దీక్ష చేయనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. విజయవాడలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత జనగణన, నియోజకవర్గాల పునర్విభజన చేసిన అనంతరం మహిళా రిజర్వేషన్‌ను అమలు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించడం సరికాదన్నారు. ఎన్నికల ముందు మహిళలను మభ్యపెట్టేందుకే బిల్లును ఆమోదించి, అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. జంతర్‌మంతర్ వద్ద జరిగే దీక్షకు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

గుండెపోటుతో గుండె వైద్యుడు మృతి



డాక్టర్ పాటిమళ్ల శ్రీనివాసప్రసాద్ (ఫైల్)

లబ్బీపేట (విజయవాడ తూర్పు): విజయవాడలోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పాటిమళ్ల శ్రీనివాసప్రసాద్ సోమవారం రాత్రి సైలెంట్ హార్ట్ ఎటాక్‌తో మృతి చెందారు. కార్డియాలజిస్ట్ శ్రీనివాస్‌గా ప్రసిద్ధి గాంచి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వేల మంది గుండెజబ్బుల రోగులకు విశేష సేవలు అందించారు. గత 25 సంవత్సరాలుగా 30 వేలకు పైగా యాంజియోగ్రామ్‌లు, యాంజియోప్లాస్టీలు నిర్వహించారు. తీవ్రమైన గుండెపోటుతో వచ్చిన వారికి ఎమెర్జెన్సీ యాంజియోప్లాస్టీల ద్వారా ఎంతో మందికి పునర్జన్మను ప్రసాదించారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు, చైర్మన్ సీతారామ్మోహనరావు, పలువురు వైద్యులు, నగర ప్రముఖులు నివాళులర్పించారు.

గ్రంథాలయాల్లో డిజిటల్ విప్లవం తెచ్చిన సీఎం జగన్

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు



గుంటూరు ఎడ్యుకేషన్: దశాబ్దాలుగా ప్రభుత్వాల నిరాదరణకు గురైన గ్రంథాలయాల్లో డిజిటల్ విప్లవాన్ని తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. శేషగిరిరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పుస్తకాలు కొనుగోలు చేయకపోవడంతో గ్రంథాలయాలు వెలవెలబోయాయని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రంథాలయాలకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేసి పాఠకులు, విద్యార్థులు, ఉద్యోగార్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను కొనుగోలు చేయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్లు, ట్యాబ్‌ల ద్వారా ఈ–గ్రంథాలయంలోని పుస్తకాలను చదివే వీలు కల్పించినట్లు వివరించారు. రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ పయ్యావుల పార్వతి మాట్లాడుతూ పుస్తకపఠనం విద్యార్థుల మనోవికాసానికి దోహదపడుతుందని చెప్పారు. కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ పుస్తకపఠనంతో జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కందుల ఝాన్సీలక్ష్మి, ఉద్యోగులు ఎం.సీతారామయ్య, చిన్నపరెడ్డి, నాగిరెడ్డి, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

‘ఆహార’ ఉత్పత్తులకు ఊతం

ఏపీలో 32 ట్రెడిషన్ ఫుడ్ క్లస్టర్స్ ఏర్పాటు

- పరిశ్రమల విస్తరణకు 35% సబ్సిడీపై రుణాలు
- నైపుణ్యత పెంపునకు శిక్షణ కార్యక్రమాలు
- ప్యాకేజింగ్, బ్రాండింగ్ డిజైన్‌కు సహకారం
- దశల వారీగా భౌగోళిక గుర్తింపు..జనవరి నుంచి రిటైల్ మార్కెట్‌లోకి

సాక్షి, అమరావతి: ఆత్రేయపురం పూతరేకులు.. తాపేశ్వరం మడత కాజా..కాకినాడ గొట్టం కాజా.. కంద్రిక పాలకోవా..నగరం గరాచీ..అనకాపల్లి బెల్లం..మాడుగుల హల్వా..గువ్వలచెరువు పాలకోవా, బందరు తొక్కుడు లడ్డు..నన్నారీ ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రంలో ఏ మారుమూల పల్లెకు వెళ్లినా స్థానికంగా పేరొందిన ఎన్నో సంప్రదాయ ఆహార ఉత్పత్తులున్నాయి. శతాబ్దాల చరిత్ర కలిగిన అద్భుతమైన ఈ ఆంధ్ర వంటకాలకు దశల వారీగా భౌగోళిక గుర్తింపు తీసుకురావడం, ప్రతీ ఉత్పత్తికి ప్రత్యేక బ్రాండింగ్‌తో అంతర్జాతీయ మార్కెటింగ్, తద్వారా వీటి తయారీపై ఆధారపడిన వారికి మెరుగైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సంప్రదాయ ఆహార ఉత్పత్తుల్లో ఇప్పటివరకు తిరుపతిలడ్డూతో పాటు బందరు తొక్కుడు లడ్డు, గుంటూరు సన్నమిరపకాయ, బంగినపల్లి మామిడికి మాత్రమే భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) లభించింది. వందల కోట్ల టర్నోవర్ ఉన్నప్పటికీ మిగిలిన వాటికి తగిన ప్రోత్సాహం లేక గుర్తింపునకు నోచుకోలేకపోతున్నాయి. ఈ పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం అంతరించిపోతున్న సంప్రదాయ ఆహార ఉత్పత్తులకు పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా కార్యాచరణ సిద్ధం చేసింది. ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) కింద 60:40 శాతం నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. ఈ తరహా ఆహార ఉత్పత్తులను తయారు చేసే ప్రాంతాలను కలుపుతూ 32 ట్రెడిషన్ ఫుడ్ క్లస్టర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది.

35 శాతం సబ్సిడీపై రుణాలు

ఒక్కో క్లస్టర్ పరిధిలో 50–100కి పైగా కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. వీరికి తమ వ్యాపార అవసరాల కోసం అవసరమైన పెట్టుబడిని సమకూరుస్తారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల స్థాయికి వీటిని తీర్చిదిద్దేందుకు వీలుగా రూ.కోటి వరకు ఆర్థికసాయం అందజేస్తారు. ఈ మొత్తంలో 35% సబ్సిడీ లేదా గరిష్టంగా రూ.10 లక్షల వరకు సబ్సిడీ ఇస్తారు. ఆధునిక సాంకేతిక ట వైపు అడుగులు వేసే విధంగా వీరికి అవసరమైన తోడ్పాటునిస్తారు. వృత్తి నైపుణ్యతలో నూతన సాంకేతికత పద్ధతులపై శిక్షణ కూడా ఇస్తారు. తయారు చేసుకున్న ఆహార ఉత్పత్తుల నిల్వ, మార్కెటింగ్ కోసం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల కల్పనకు చేయూతనిస్తారు.

రూ.10 కోట్లతో ఉమ్మడి మౌలిక వసతుల కల్పన

ఆహార ఉత్పత్తుల తయారీలో అదనపు విలువను చేకూర్చడమే లక్ష్యంగా ఇంక్యూబేషన్ సెంటర్స్ నిరిృస్తారు. సరుకులు నిల్వ చేసుకునేందుకు వీలుగా స్థానికంగా గోదాములు, కోల్డ్ రూమ్స్ వంటి వాటి నిర్మాణానికి ఉమ్మడి మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్ట్ కింద రూ.10 కోట్ల వరకు ఆహార తయారీ ఉత్పత్తిదారుల సంఘాలు(ఎఫ్‌పీవో)కు లేదా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక చేయూతనిస్తారు. ప్యాకేజ్ డిజైనింగ్, మార్కెటింగ్, బ్రాండింగ్‌తో పాటు రవాణ, నిల్వ ఖర్చులు, ఎడ్వర్‌టైజ్‌మెంట్, ట్రేడ్‌మార్క్ కాపీ రైట్, జీఐ ట్యాగ్ గుర్తింపు కోసం అయ్యే ఖర్చుల్లో కూడా 50% గ్రాంట్ రూపంలో సమకూరుస్తారు. మిగిలిన 50% ఆయా తయారీదారులు సొంతంగా సమకూర్చుకోవచ్చు లేని పక్షంలో దాన్ని రుణంగా అందిస్తారు. దీంట్లో గరిష్టంగా రూ.3 కోట్ల వరకు సబ్సిడీ ఇస్తారు.



వరల్డ్ ఫుడ్ ఇండియా ఇంటర్నేషనల్ వర్క్ షాప్ లో మాడుగుల హల్వా స్టాల్...

మాడుగుల హల్వాకు చేయూత



1890లో మా పూర్వీకులు తయారు చేసిన మాడుగుల హల్వాకు ప్రభుత్వం చేయూతనిస్తుండడం ఆనందంగా ఉంది. ఏటా రూ.24 కోట్లకుపైగా టర్నోవర్ జరుగుతున్న మాడుగుల హల్వాకు జీఐ ట్యాగ్‌తో పాటు ప్రత్యేక బ్రాండింగ్‌తో రిటైల్ మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఇస్తోన్న సహకారం మరువలేనిది. వరల్డ్ ఫుడ్ ఇండియా–2023లో మాడుగుల హల్వా స్టాల్‌కు అనూహ్య స్పందన లభించింది. కేంద్రమంత్రితో సహా వివిధ రాష్ట్రాల ప్రముఖులు హల్వా రుచి చూశారు.

– దంగేటి మోహన్, మాడుగుల హల్వా సృష్టికర్త మునిమనవడు

ఆహార ఉత్పత్తులకు పూర్వవైభవం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా సంప్రదాయ ఆహార ఉత్పత్తులకు పూర్వవైభవం తీసుకురావాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్‌లో 32 ట్రెడిషన్ ఫుడ్ క్లస్టర్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాటి పరిధిలో గుర్తించిన ఆహార ఉత్పత్తుల తయారీదారులకు అవసరమైన ఆర్థిక చేయూతను అందజేయనుంది. దీంతో పాటు వాటికి భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగింగ్), బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

– చిరంజీవి చౌదరి, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ



ప్రత్యేక బ్రాండింగ్‌తో రిటైల్ మార్కెట్‌లోకి

ఉత్పత్తుల వారీగా ప్రత్యేక బ్రాండింగ్‌తో మార్కెట్‌లోకి తీసుకురావడమే కాదు బహుళ జాతి సంస్థలకు చెందిన రిటైల్ అవుట్ లెట్స్ అమ్మకాలకూ చేయూతనిస్తారు. ఆ తర్వాత దశల వారీగా ఆన్‌లైన్ అమ్మకాలకు శ్రీకారం చుడతారు. తొలిదశలో మాడుగుల హల్వాను జనవరి నుంచి ప్రత్యేక బ్రాండింగ్‌తో జనవరి నుంచి రిటైల్ మార్కెట్‌లోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆహార ఉత్పత్తులకు బ్రాండింగ్, భౌగోళిక గుర్తింపు తెచ్చేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు వీలుగా ఇటీవలే దామోదరం సంజీవయ్య లా వర్సిటీతో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ ఎంవోయూ చేసుకున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఆత్రేయపురం పూతరేకులకూ జీఐ ట్యాగ్ వచ్చింది. అదే రీతిలో త్వరలో మాడుగుల హల్వాకు జీఐ ట్యాగ్ తీసుకొచ్చే దిశగా చర్యలు చేపట్టారు. ఆ తర్వాత దశల వారీగా మిగిలిన ఉత్పత్తులకు కూడా జీఐ ట్యాగ్ తీసుకురానున్నారు.

జాతీయ క్రీడల్లో ఏపీకి 27 పతకాలు

ఏపీవోఏ అధ్యక్షుడు ఆర్కే పురుషోత్తం



మాట్లాడుతున్న పురుషోత్తం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇటీవల గోవాలో ముగిసిన జాతీయ క్రీడల్లో రాష్ట్ర క్రీడాకారులు 11 క్రీడాంశాల్లో పాల్గొని 27 పతకాలు (ఏడు బంగారు, ఐదు రజత, 15 కాంస్య పతకాలు) సాధించారని, దేశంలో ఏపీ 19వ స్థానంలో నిలిచిందని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ (ఏపీవోఏ) అధ్యక్షుడు ఆర్కే పురుషోత్తం తెలిపారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాప్ అధికారులు సహకరించి ఉంటే మన క్రీడాకారులు ఇంకా మరిన్ని పతకాలు సాధించేవారని చెప్పారు. రాష్ట్రంలో 2027 సంవత్సరంలో జాతీయ క్రీడల నిర్వహణకు అవకాశం ఉందని, ఇందుకోసం సాధ్యమైనంత త్వరగా ఏపీవోఏతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడిగా భారత ఒలింపిక్ సంఘం(ఐవోఏ)తో పరస్పర అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకోవాల్సి ఉందన్నారు. జాతీయ క్రీడల నిర్వహణకు అనుకూలంగా రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతితోపాటు కాకినాడ నగరాల్లో అవుట్ డోర్, ఇండోర్ స్టేడియాలు, స్విమ్మింగ్ పూల్స్ నిర్మించడంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. ఇందుకోసం సుమారు రూ.5వేల కోట్లు అవసరమని, ఏపీవోఏ, రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడిగా ఐవోఏతో ఎంవోయూ కుదుర్చుకుంటేనే కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. శాప్‌లోని కొందరు అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని, అందువల్ల క్రీడలకు సంబంధించిన అన్ని విషయాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి వెళ్లడం లేదని భావిస్తున్నానని పురుషోత్తం చెప్పారు. ఇప్పటికైనా సీఎం వైఎస్ జగన్ జోక్యం చేసుకుని రాష్ట్రంలో జాతీయ క్రీడల నిర్వహణకు, ఏపీవోఏతో శాప్ కలిసి పని చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వి.శివకుమార్, నాదెండ్ల బ్రహ్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.

■ పక్షి గుడ్డుపై వరల్డ్ కప్ లోగో





పావురం జాతికి చెందిన గువ్వ పక్షి గుడ్డుపై ఎన్టీఆర్ జిల్లా యనమలకుదురు గ్రామానికి చెందిన గృహిణి నడకుదిటి సుజాత ఐసీసీ మెన్స్ వరల్డ్ కప్-2023 లోగోను చిత్రించి అబ్బురపరిచారు. రెండున్నర సెంటీ మీటర్ల పొడవున్న గుడ్డుపై ఆమె క్రికెట్ లోగోతో పాటు ఐసీసీ మెన్స్ క్రికెట్ వరల్డ్ కప్-ఇండియా-2023 అనే ఆంగ్ల అక్షరాలను రాశారు.

–మొగల్రాజపురం(విజయవాడ తూర్పు)

పైకి పొత్తులు.. లోపల కత్తులు



పిఠాపురంలో జరిగిన సంయుక్త సమావేశంలో బాహాబాహీగా తలపడుతున్న టీడీపీ, జనసేన శ్రేణులు

- ఉమ్మడి తూర్పు గోదావరి టీడీపీ, జనసేన పార్టీల తీరిది
- పిఠాపురం సంయుక్త సమావేశంలో బాహాబాహి
- పిఠాపురం టీడీపీ ఇన్‌చార్జి వర్మపై విరుచుకుపడిన జనసేన నేతలు
- పవన్ ఎక్కడా గెలవలేదని ఎద్దేవా చేసిన వర్మ
- బూతులు తిట్టుకుంటూ కుర్చీలు, బల్లలతో తలపడిన శ్రేణులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ/పిఠాపురం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో టీడీపీ, జనసేన పార్టీల మధ్య పొత్తు మాట దేవుడెరుగు.. కనీసం సమన్వయం కూడా కుదరడం లేదు. రెండు పార్టీ నాయకులు పైకి పొత్తులు.. లోపల కత్తులు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. శ్రేణులు సైతం ధృతరాష్ట్ర కౌగిలి తరహాలోనే వ్యవహరిస్తున్నాయి. సమన్వయం కోసం నిర్వహిస్తున్న సంయుక్త సమావేశాలు రచ్చరచ్చ అవుతున్నాయి. రెండు పార్టీల మధ్య పొత్తు ఉంటుందని.. వచ్చే ఎన్నికల్లో కలిసే పోటీ చేస్తామని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వెలుపల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించిన నాటినుంచి ఇదే తీరు కనిపిస్తోంది. తాజాగా మంగళవారం కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన సమన్వయ సమావేశంలో టీడీపీ, జనసేన నేతలు ఒకరిపై ఒకరు బండబూతులు తిట్టుకుంటూ కొట్లాటకు దిగడం చర్చనీయాంశమైంది. సమన్వయ సమావేశమని ప్రకటించినా.. ఇరుపక్షాలు ఎదురెదురుగా బల్లలు, కుర్చీలు వేసుకుని వాదోపవాదాలకు దిగడం చర్చనీయాంశమైంది.

ఇలా మొదలైంది

పిఠాపురం పట్టణ టీడీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రెండు పార్టీల నేతలు సమన్వయ సమావేశం పేరిట భేటీ అయ్యారు. టీడీపీ తరఫున నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ వర్మ, జనసేన నుంచి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ పార్టీ నేతలతో కలసి సమావేశానికి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ వర్మ ప్రారంభోపన్యాసం చేస్తూ.. నియోజకవర్గంలో రూ.2,800 కోట్లతో అభివృద్ధి పనులు చేశానని చెప్పుకున్నారు. మరి అంత అభివృద్ధి చేస్తే నియోజకవర్గ ప్రజలు ఎందుకు ఓడించారని జనసేన ఇన్‌చార్జి తంగెళ్ల శ్రీనివాస్ ప్రశ్నించారు. టీడీపీ తరఫున గెలిపించినా.. చేసిన అభివృద్ధి ఏమీ లేదని వర్మను ఉద్దేశించి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. అభివృద్ధి చేయకపోవడంతోనే గత ఎన్నికల్లో ఓడిపోయారని, వచ్చే ఎన్నికల్లో జనసేనకు మద్దతిచ్చి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు.

‘మీ పవన్ అన్నిచోట్లా ఓడిపోయారు’

జనసేన ఇన్‌చార్జి శ్రీనివాస్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన టీడీపీ ఇన్‌చార్జి వర్మ రాష్ట్రంలో తానొక్కడినే ఓడిపోలేదని అతిరథ మహారథులు సైతం ఓడిపోయారన్నారు. ‘మా నాయకుడు చంద్రబాబు ఎప్పుడూ ఓటమి చూడలేదు. కానీ.. మీ నాయకుడు పవన్ కళ్యాణ్ అన్నిచోట్లా ఓడిపోయార’ని వర్మ కౌంటర్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో తనకు 75 వేలు ఓట్లు వస్తే.. జనసేనకు కేవలం 35 వేలు మాత్రమే వచ్చాయని గుర్తు చేసుకోవాలన్నారు. దీనిని బట్టి మీ సత్తా ఏపాటిదో.. మా సత్తా ఏపాటిదో ప్రజలే నిర్ణయించారన్నారు. ఈ తరుణంలో జనసేన నేతలు వర్మకు వ్యతిరేకంగా కేకలు వేయడంతో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ‘అప్పట్లో టీడీపీ సీటు ఇవ్వకుండా బయటకు గెంటేస్తే దొంగ ఏడుపులు ఏడ్చిన విషయం గుర్తు లేదా. జాలిపడి జనసేన సహా అంతా కలిసి ఓటేసి గెలిపించిన విషయం గుర్తు లేదా’ అని జనసేన నేతలు వర్మను నిలదీశారు.

బల్లలు, కుర్చీలు తన్నేసిన జనసేన

టీడీపీ నాయకుడు కొండేపూడి ప్రకాశ్ మాట్లాడుతూ.. టీడీపీ నేతలను జనసేనలో జాయిన్ చేసుకోవద్దని.. జనసేన వారిని టీడీపీలో చేర్చుకోవద్దని సూచించగా మరోసారి గందరగోళం నెలకొంది. ఇంతలో జనసేన నాయకులు కల్పించుకుని దిక్కులేని పరిస్థితుల్లో టీడీపీ వాళ్లే జనసేనలోకి వచ్చి చేరుతున్నారని, తమ పార్టీ నుంచి ఎవరూ బయటకు వెళ్లడం లేదన్నారు. దీంతో టీడీపీ ఇన్‌చార్జి వర్మ సహా తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోయారు. టీడీపీ నేత వర్మతో మనకు పనిలేదంటూ జనసేన ఇన్‌చార్జి ఉదయశ్రీనివాస్ సహా జనసేన నేతలు, ఆ పార్టీ శ్రేణులు అంతా కలిసి మూకుమ్మడిగా సమావేశంలో బల్లలు, కుర్చీలు తన్నేసి బయటకు వెళ్లిపోయారు. అనంతరం టీడీపీ నేతలు కూడా అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఇరుపార్టీల సమన్వయ సమావేశం రసాభాసగా ముగిసింది.

మధుమేహానికి అవగాహనే మందు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య

లబ్బీపేట (విజయవాడతూర్పు): విస్తృత అవగాహన కలిగించడం ద్వారానే మధుమేహాన్ని నియంత్రించగలుగుతామని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య అన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ వీజీఆర్ డయాబెటీస్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జస్టిస్ జయసూర్య ముఖ్య అతిథిగా, సినీ నటుడు బ్రహ్మానందం గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయసూర్య మాట్లాడుతూ.. మధుమేహంపై అవగాహన కలిగించేందుకు వీజీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతి ఏటా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. మంచి ఆలోచనతో డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. మధుమేహంపై విద్యార్థి దశ నుంచే అవగాహన ఉంటే వారి తల్లిదండ్రులకు సూచనలు ఇస్తారని అభిప్రాయపడ్డారు. బ్రహ్మానందం మాట్లాడుతూ.. మధుమేహం వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే, రాకుండా ముందు జాగ్రత్త పడాలని సూచించారు. డాక్టర్ కె వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ.. మధుమేహంపై అవగాహనకోసం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో సుమారు 55 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, 3 వేల మందిని విజేతలుగా ప్రకటించి బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్యుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి, హిందీ అకాడమీ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆదాయపు పన్నుశాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిళ్ల, సీనియర్ సర్జన్ డాక్టర్ టీజే ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మానందం, హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్.జయసూర్య ముచ్చట్లు

భవిష్యత్‌లో అంతరిక్షం నుంచే యుద్ధాలు

బీఈఎంఎల్ డైరెక్టర్ శివకుమార్ మకుటం



శివకుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: అనూహ్యంగా పెరుగుతున్న సాంకేతిక విప్లవంతో రాబోయే కాలంలో అంతరిక్షం నుంచే యుద్ధాలు జరిగే అవకాశం ఉందని భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) స్వతంత్ర డైరెక్టర్, ఇన్విెకాస్ టెక్నాలజీస్ సీనియర్ డైరెక్టర్ శివకుమార్ మకుటం అన్నారు. వివేక విద్యాసంస్థల ఆధ్వర్యంలో బాలల దినోత్సవం మంగళవారం గుంటూరు జిల్లా తెనాలి బుర్రిపాలెంరోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూలు ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ప్రారంభ సభకు వివేక డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షత వహించారు. ‘వివేక’ పూర్వవిద్యార్థి అయిన శివకుమార్ మకుటం విద్యార్థుల కెరీర్‌పై ప్రత్యేక ప్రసంగం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ గురించి సోదాహరణంగా వివరించారు. టెక్నాలజీలో వస్తున్న మార్పులను ముందుగానే అంచనా వేసి, అందుకనుగుణంగా విద్యార్థులు ముందుకెళితే విజయం తథ్యమన్నారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుంటూ, ప్రభుత్వ ఆశయాన్ని నెరవేరేలా చూడాలని కోరారు. స్కూల్ సీఈఓ ఆర్ వెంకటరామ్ మాట్లాడారు.

పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): కార్తీక మాసంలో శైవ క్షేత్రాల సందర్శన నిమిత్తం ఎన్టీఆర్ జిల్లా నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. శని, ఆది, సోమవారాలతో పాటు పర్వదినాల్లో విజయవాడ ఆటోనగర్‌లో తెల్లవారు జామున 3 గంటలకు, విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుంచి తెల్లవారు జామున 4 గంటలకు బయలు దేరి అమరావతి చేరుకుంటాయి. అక్కడ అమరేశ్వరస్వామి దర్శనం అనంతరం భీమవరంలోని సోమారామము, పాలకొల్లులోని క్షీరారామము, రామచంద్రాపురంలోని ద్రాక్షారామము, సామర్లకోట కుమార భీమేశ్వర స్వామి ఆలయాలను చుట్టి వస్తాయి. పంచారామాల ప్రత్యేక బస్సుల్లో సూపర్ లగ్జరీ రూ.1,120, అల్ట్రా డీలక్స్ రూ.1,070గా ఆర్టీసీ అధికారులు ధర నిర్ణయించారు. ఈ నెల 18, 19, 20, 25, 26, 27, డిసెంబర్ 2, 3, 4, 9, 10, 11వ తేదీల్లో పంచారామాల బస్సులను నడపనున్నారు.

సామాజిక సాధికారతకు సీఎం పెద్దపీట

1,143వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇచ్చినందునే సామాజిక సాధికారత సాధ్యమయ్యిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,143వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. చంద్రబాబు అధికారంలో ఉండగా కులవాదంతో ముందుకెళుతూ పేదలను అణగదొక్కడమే ధ్యేయంగా బాబు అండ్ కో పనిచేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. పేదవాడికి ఇంగ్లిష్ మీడియం విద్య, రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు, అన్ని ప్రాంతాల సమానాభివృద్ధి ద్వారా పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం అడుగులు ముందుకేస్తుంటే.. తప్పుడు కేసులు వేసి అడ్డుకుంటున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అల్లర్లకు కుట్ర పన్నుతున్న చంద్రబాబు తాత్కాలిక బెయిల్‌ను సైతం రద్దు చేసి వెంటనే జైలుకు పంపాలని న్యాయవ్యవస్థకు విజ్ఞప్తి చేశారు. కులవాదమే అజెండాగా రాజకీయాలు మారుతుంటే సామాన్యుడికి డాక్టర్ బాబా సాహెబ్ రాజ్యాంగం ద్వారా అందించిన బహుజన ఫలాలు ఎప్పటికి అందుతాయని ప్రశ్నించారు. రాజ్యాంగం ద్వారా తమకు ప్రసాదించిన హక్కులను సాధించుకోవడం కోసం ఎందాకైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. నాయకులు ఈపూరి ఆదాం, పెరికే వరప్రసాద్, పులి దాసు, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.



ఆ అమ్మాయి వయొలిన్ సాధన చేస్తుంటే ఇరుగు పొరుగు వారు ఇల్లు ఖాళీ చేయమని గోల చేశారు. కాని ఇప్పుడు మొత్తం కేరళ ఆ అమ్మాయిని చూసి గర్విస్తోంది. 14 ఏళ్ల వయసులో ప్రతిష్ఠాత్మక 'ట్రినిటీ కాలేజ్ లండన్' వారి ఫెలోషిప్‌కు ఎంపికై రికార్డు సృష్టించింది మార్టినా. ఈ వయసులో ఈ ఫెలోషిప్ సాధించిన వారు దేశంలో లేరు. ఏ వయసు వారైనా కేరళలో లేరు. సంగీతంతో ఆరోహణ దిశలో పయనిస్తోంది మార్టినా.

న్యూస్‌మేకర్

కేరళ నుంచి ట్రినిటీ కాలేజీకి

సుప్రసిద్ధ రచయిత చాగంటి సోమయాజులు రాసిన 'వాయులీనం' కథలో భార్య తీవ్రంగా జబ్బు పడితే ఆమెను కాపాడుకోవడానికి భర్త ఆమె ఎన్నాళ్లుగానో కాపాడుకుంటూ వస్తున్న వయొలిన్‌ని అమ్మేస్తాడు. ఆమె బతుకుతుంది. అమ్మకానికి వెళ్లిపోయిన వయొలిన్‌ని తలుచుకుని, మిగిలిన డబ్బుతో భర్త కొన్న చీరను చూస్తూ 'పోనీలేండి జ్ఞాపకంగా పడి ఉంటుంది' అంటుంది వేదనగా. జీవితంలో కళాసాధన, కళాసాధనకు ఎదురు నిలిచే జీవితం గురించి చెప్పిన కథ ఇది.

మార్టినా జీవితంలో తండ్రి కూడా ఇలాంటి త్యాగమే చేశాడు.



● తల్లిదండ్రులతో మార్టినా

మొదలైన ప్రయాణం

14 ఏళ్ల మార్టినా ఇప్పుడు వయొలిన్‌లో గొప్ప పేరు సంపాదించి 'ట్రినిటీ కాలేజ్ లండన్' ఫెలోషిప్ పొందిందిగాని ఇక్కడి వరకూ చేరడానికి ఆమె తండ్రి పడిన కష్టం ఉంది. మార్టినాది కన్నూరు జిల్లాలోని పెరవూర్. తండ్రి చార్లెస్‌కు బాల్యంలో గొప్ప మ్యుజీషియన్ కావాలని ఉండేది కాని ఇంట్లో పరిస్థితులు బాగాలేక కొద్దోగొప్పో నేర్చుకున్న కీబోర్డుతో చర్చ్‌లో సంగీతం వాయించేవాడు. ఆ డబ్బు సరిపోక మిగిలిన సమయాల్లో ఆటో నడిపేవాడు. భార్య షైనీ గృహిణిగా ఉన్నంతలో సంసారాన్ని లాక్కువచ్చేది. అయితే ఐదారేళ్ల వయసు నుంచే కూతురు మార్టినా సంగీతంలో విశేష ప్రతిభ చూపడం వారికి ఒకవైపు ఆనందం, మరొక వైపు ఆందోళన కలిగించాయి. ఆనందం కూతురికి సంగీతం వచ్చినందుకు, ఆందోళన అందుకు తగ్గట్టుగా నేర్పేందుకు వనరులు లేనందుకు. ఎనిమిదవ తరగతి వరకూ పెరవూర్‌లోనే చదువుకున్న మార్టినా అక్కడే ఉన్న 'రాగం స్కూల్ ఆఫ్ మ్యూజిక్'లో వయొలిన్ నేర్చుకుంది. కానీ తర్వాతి స్థాయి వయొలిన్ నేర్చుకోవాలంటే త్రిశూర్‌లో చేరాలి. అంటే కుటుంబం మొత్తం త్రిశూర్‌కు మారాలి. అక్కడ మొదలైంది సమస్య.

ఆటో అమ్మేసిన తండ్రి

ఉంటున్న పెరవూర్ నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న త్రిశూర్‌కు కాపురం మారాలంటే చాలా ఖర్చు. సాధనకు వీలైన ఇల్లు తీసుకోవాలి. ముఖ్యంగా కనీసం లక్ష రూపాయల విలువైన కొత్త వయొలిన్ కొనాలి. ఇవన్నీ ఆలోచించి తండ్రి ఆటో అమ్మేశాడు. అంతేకాదు తమ చిన్నపాటి ఇంటిని కూడా అమ్మేద్దామనుకున్నాడు. కాని బంధువులకు సంగతి తెలిసి వారు తలా ఒక చేయి వేశారు. 2019లో త్రిశూర్‌కు షిఫ్ట్ అయినప్పటి నుంచి మార్టినా సాధన పెంచింది. ఉదయం ఐదు గంటలకు లేచి స్కూల్ సమయం అయ్యే వరకు సాధన చేసేది. అయితే ఇరుగు పొరుగు వారు ఇల్లు ఖాళీ చేయమని గోల చేశారు. దాంతో మరో ఇంట్లోకి మారాల్సి వచ్చింది. ఏమైనా సరే కూతురిని గొప్ప వయొలినిస్ట్ చేయాలని చార్లెస్ సంకల్పం బూనాడు.

జాతీయ విజేత

త్రిశూర్‌లో, కొచ్చిలో గొప్ప గొప్ప గురువుల దగ్గర సాధన చేసి వయొలిన్ నేర్చుకుంది మార్టినా. తీగలను మీటి మీటి ఆమె చేతి వేలి కొసలు రక్తాన్ని చిమ్మేవి. మెడ మీద వయొలిన్ ఉంచి ఉంచి కదుములు కట్టేవి. అయినా సరే మార్టినా తన సాధన మానలేదు. ఫలితం? ఆల్ ఇండియా వయొలిన్ కాంటెస్ట్ 2022, 2023... రెండు సంవత్సరాలూ ఆమే విజేతగా నిలిచింది. 100 మంది వయొలినిస్ట్‌లను ఓడించి మరీ! ఆ తర్వాత 'సౌత్ ఏసియన్ సింఫనీ'లో సభ్యురాలు కాగలిగింది. ఈ సింఫనీ కోసం 11 దేశాల వయొలినిస్ట్‌లు పోటీ పడుతుంటారు. చివరగా ప్రతిష్ఠాత్మక ట్రినిటీ కాలేజ్ లండన్ ఫెలోషిప్ పొందింది. 14 ఏళ్ల వయసులో ఈ ఫెలోషిప్‌ను పొందిన వారు లేరు. చార్లెస్, షైనీల ఆనందానికి అవధులు లేవు.

ఈ గొప్ప కళాకారిణి సంగీతానికి కొత్త శోభను తేవాలని కోరుకుందాం.

యూత్ పల్స్



యూత్‌ఫుల్ బ్లాక్‌బస్టర్

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఇండియా గేమ్ డెవలప్ కాన్ఫరెన్స్ (ఐజీడీసీ)లో విడుదల చేసిన 'లుమికై స్టేట్ ఆఫ్ ఇండియా గేమింగ్ రిపోర్ట్' మన దేశంలో డిజిటల్ గేమింగ్ ఇండస్ట్రీ ఉజ్వలభవిష్యత్తు గురించి చెప్పకనే చెప్పింది. డిజిటల్ గేమ్స్‌కు యూత్ మహారాజ పోషకులే అయినప్పటికీ 'యూజర్' స్థానానికి మాత్రమే పరిమితం కావడం లేదు. గేమింగ్ ఇండస్ట్రీ ముఖ చిత్రాన్ని మార్చడంలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. సొంతంగా గేమ్ బిల్డింగ్ కంపెనీలు స్టార్ట్ చేస్తున్నారు.

ఇండియా గేమ్ డెవలప్ కాన్ఫరెన్స్(ఐజీడీసీ)లో గేమింగ్ వెంచర్ క్యాపిటల్ ఫర్మ్ లుమికై గూగుల్‌తో కలిసి 'లుమికై స్టేట్ ఆఫ్ ఇండియా గేమింగ్ రిపోర్ట్' విడుదల చేసింది. మన దేశంలో గేమింగ్ ఇండస్ట్రీ స్పీడ్‌కు ఇది అద్దం పడుతుంది. మన గేమింగ్ ఇండస్ట్రీ 2028 నాటికి అరవై రెండు వేల కోట్లను దాటుతుందని ఈ రిపోర్ట్ తెలియజేస్తుంది.

'డిజిటల్ గేమ్స్' అనగానే గుర్తుకు వచ్చేది యువతరమే. వారు డిజిటల్ గేమ్స్ వైపు ఆకర్షితం కావడానికి ప్రధాన కారణాలు...

- **సోషల్ కనెక్షన్:** ఫోర్ట్‌నైట్, మైన్‌క్రాఫ్ట్‌లాంటి గేమ్స్ ఫిజికల్ లొకేషన్‌తో పనిలేకుండా వర్చువల్ ఎన్విరాన్‌మెంట్‌లో ప్లేయర్స్ ఇతరులతో ఇంటరాక్ట్ అయ్యే, స్నేహం చేసే, ఆన్‌లైన్ కమ్యూనిటీలను నిర్మించుకునే అవకాశాన్ని కలిగిస్తున్నాయి. జెన్ జెడ్ హైలీ సోషల్ జెనరేషన్‌గా పేరు తెచ్చుకుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్లేయర్స్ ఒకరితో ఒకరు కనెక్ట్ కావడానికి, పోటీ పడడానికి తమ గేమ్స్‌లో సోషల్ ఫీచర్స్‌ను తీసుకువస్తున్నాయి కంపెనీలు.
- **యూజర్-జనరేటెడ్ కంటెంట్:** యూజర్‌లు తమ సొంత కంటెంట్‌ను క్రియేట్ చేసుకోవడానికి ఎన్నో పాపులర్ గేమ్స్ అనుమతిస్తున్నాయి. తమ స్వీయ అనుభవాలను ఉపయోగించి యూజర్-జనరేటెడ్ కంటెంట్‌ను వర్చువల్ వరల్డ్‌లో వైబ్రెంట్ అండ్ డైనమిక్‌గా క్రియేట్ చేయడానికి వీలవుతుంది.
- **ఎన్నో ఎన్నెన్నో:** యూత్ ప్లేయర్స్‌కు మోడ్రన్ గేమ్స్ కాంపిటీటివ్, కో-ఆపరేటివ్ గేమ్‌ప్లే, ఎక్స్‌ప్లొరేషన్, స్టోరీ టెల్లింగ్‌కు సంబంధించి సరికొత్త అనుభవాలను అందిస్తున్నాయి. ప్లేయర్స్‌కు గ్రాఫిక్స్, సౌండ్, గేమ్ ప్లే మెకానిక్స్‌ను చేరువచేయడంపై దృష్టి పెడుతున్నాయి.
- **స్ట్రెస్ ఫ్రీ-క్రియేటివిటీ:** యూత్‌లో కొద్ది మంది ఒత్తిడి నుంచి బయట పడడానికి గేమింగ్‌కు దగ్గరవుతున్నారు. ఆర్ట్, డిజైన్, స్టోరీ టెల్లింగ్ లాంటి సృజనాత్మక ప్రక్రియలను ఇష్టపడే యువతరం క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్స్ కోసం వీడియో గేమ్స్ ఆడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కంపెనీలు తమ గేమ్స్‌లో ప్లేయర్స్‌కు సొంత గేమ్ మోడ్స్, మ్యాప్స్ క్రియేట్ చేయడానికి అనుమతిస్తున్నాయి.

యువతరమే కారణం...

మొబైల్ డివైజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మొబైల్ గేమింగ్ అభివృద్ధికి యూత్ ఉపయోగపడుతుంది. సంప్రదాయ గేమింగ్ కన్సోల్స్ కంటే అఫర్డబుల్ అండ్ యాక్సెసబుల్‌గా ఉండే మొబైల్ డివైజ్‌లకే ప్రాధాన్యత ఇస్తోంది యువతరం. ఇ-స్పోర్ట్స్ లేదా కాంపిటీటివ్ గేమింగ్ మెయిన్ స్ట్రీమ్‌లోకి రావడానికి ప్రధాన కారణం యువత. యువతరం చూపిస్తున్న ఆసక్తి వల్ల ఎన్నో టెలివిజన్ నెట్‌వర్క్‌లు ఇ-స్పోర్ట్స్‌ను నిర్వహిస్తున్నాయి. ప్రొఫెషనల్ ఇ-స్పోర్ట్స్ ప్లేయర్స్ తయారవుతున్నారు.

బోలెడు ఉపాధి అవకాశాలు...

గేమ్స్ నుంచి అపారమైన ఆనందాన్ని సొంతం చేసుకోవడమే కాదు గేమింగ్ ఇండస్ట్రీ నుంచి ఉపాధి అవకాశాలను కూడా వెదుక్కుంటోంది యువతరం. ఇ-స్పోర్ట్స్ ఇటీవల కాలంలో మల్టీ-బిలియన్-డాలర్ ఇండస్ట్రీగా ఎదిగింది. ప్రొఫెషనల్ ప్లేయర్స్‌కు జీతాలతో పాటు స్పాన్సర్‌షిప్ అవకాశాలు కూడా వస్తున్నాయి. గేమింగ్ ఇండస్ట్రీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష ఉద్యోగావకాశాలు ఉన్నాయి అంటుంది టీమ్‌లీజ్ డిజిటల్ ఫర్మ్ రిపోర్ట్ 'గేమింగ్: టుమారోస్ బ్లాక్‌బస్టర్'. ప్రోగ్రామింగ్ (గేమ్ డెవలపర్స్, యూనిటీ డెవలపర్స్), టెస్టింగ్ (గేమ్స్ టెస్ట్ ఇంజనీరింగ్, క్వాలిటీ అండ్ అసూరెన్స్), యానిమేషన్, డిజైన్(మోషన్ గ్రాఫిక్ డిజైనర్స్, వర్చువల్ రియాలిటీ డిజైనర్స్), ఆర్టిస్ట్స్ (వీఎఫ్‌ఎక్స్ అండ్ కాన్సెప్ట్ ఆర్టిస్ట్స్), కంటెంట్ రైటింగ్, గేమింగ్ జర్నలిజం మొదలైన విభాగాలలో యువతకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

స్ఫూర్తిదాయక సూపర్‌స్టార్స్

యువతలో ఎంతోమందిలాగే ఈ ముగ్గురికి గేమ్స్ అంటే చాలా ఇష్టం. గేమింగ్‌ను వీరు అభిరుచిగా మాత్రమే చూడలేదు. గేమింగ్ రంగంలో తమ వ్యాపారదక్షతను నిరూపించుకోవాలనుకున్నారు. సొంతంగా గేమ్ బిల్డింగ్ కంపెనీ ప్రారంభించి తమ సత్తా చాటారు. యువతరంలో ఎంతో మందికి స్ఫూర్తి ఇస్తున్నారు.



సూపర్ గేమింగ్

యూనివర్శిటీ ఆఫ్ ముంబైలో కంప్యూటర్ ఇంజనీరింగ్ చేసింది క్రిస్టెల్ డీక్రూజ్. ఆ తరువాత కొలరాడో స్టేట్ యూనివర్శిటీ(యూఎస్)లో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేసింది. 'టాప్‌టూలెర్న్'లో ఎడ్యుకేషనల్ గేమ్ డెవలపర్‌గా ఉన్నప్పుడు గేమ్స్‌కు ఉండే పవర్ ఏమిటో దగ్గర నుంచి చూసింది. ఆ కంపెనీలో చేరిన తొలి మహిళా ఉద్యోగి క్రిస్టెల్. ఆ తరువాత ఫ్రెండ్స్‌తో కలిసి 'సూపర్ గేమింగ్' అనే గేమ్‌బిల్డింగ్ కంపెనీ స్టార్ట్ చేసింది.

అపార్ గేమ్స్

ముంబై యూనివర్శిటీలో ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేసిన లక్ష్మీ కానోల్కర్ ముంబైలోని వెలింగ్‌కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఇంటరాక్టివ్ ఇ-లెర్నింగ్ చిల్డ్రన్స్ కంటెంట్‌ను డిజైనింగ్ చేయడం ద్వారా గేమింగ్ ప్రపంచంలోకి అడుగు పెట్టింది. గేమింగ్ ఇండస్ట్రీలో ఎన్నో సంవత్సరాలు పనిచేసిన అనుభవంతో సొంతంగా గేమ్ డెవలపింగ్ కంపెనీ 'అపార్ గేమ్స్'ప్రారంభించింది.



వినో జో

ది యూనివర్శిటీ ఆఫ్ మాంచెస్టర్(ఇంగ్లాండ్)లో సైకాలజీలో మాస్టర్స్ చేసిన తరువాత కేపీఎంజీ కన్సల్టింగ్ వింగ్‌లో చేరింది సౌమ్యా సింగ్ రాథోడ్. టైమ్స్ గ్రూప్‌లో పనిచేసిన తరువాత 'వినో జో' పేరుతో సొంతంగా ఆన్‌లైన్ సోషల్ గేమింగ్ కంపెనీని మొదలు పెట్టింది. 'ఒక విషయంపై మనకు ఇష్టం ఉన్నప్పుడు అదే మన బలంగా మారుతుంది. ఆ బలంతోనే విజయం సాధించవచ్చు' అంటుంది సౌమ్యా సింగ్.



త్రినేత్రం



● శుభా భట్

పక్షులకు శుభ సమయం

పచ్చటి ఊరు వదిలి కాంక్రీట్ జంగిల్‌లోకి అడుగు పెట్టిన శుభా భట్‌కు బెంగళూరులోని 'ఐఐఎస్‌సీ' క్యాంపస్ రూపంలో ప్రకృతి ప్రపంచం దగ్గరైంది. ఎన్నో పక్షులు నేస్తాలు అయ్యాయి. 'పక్షులను ప్రేమించడానికి వాటి శాస్త్రీయ నామాలతో పనిలేదు' అని హాస్యానికి అన్నా, శుభాభట్ విషయంలో అది నిజం. ఎన్నో పక్షులకు సంబంధించి శాస్త్రీయ నామాలు, పుట్టు పూర్వోత్తరాలు తెలియకపోయినా వాటిని ప్రేమించింది.

పక్షులను చూస్తున్నంతసేపూ తనకు శుభ సమయమే. శాస్త్రీయ కోణం కంటే అనుభూతులు, భావోద్వేగాల కోణంలో రెండు వందల జాతుల పక్షులకు సంబంధించి తన పరిశీలనలను 'పక్షి జల' పేరుతో ఫొటో డాక్యుమెంటేషన్ చేసింది శుభా భట్...









పెళ్లయిన తరువాత బెంగళూరు మహానగరంలోకి అడుగు పెట్టింది శుభా భట్. పచ్చని పల్లెటూరి నుంచి వచ్చిన తనకు వాహనాల రణగొణధ్వనులు తప్ప పక్షుల కిలకిలారావాలేవీ వినిపించేవి కాదు. దీంతో ఇంటి నాలుగు గోడల మధ్య నేషనల్ జాగ్రఫీ చానల్ చూడడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది.

అలాంటి పరిస్థితుల్లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ) క్యాంపస్‌లోకి అడుగు పెట్టడం మళ్లీ పుట్టింటికి వచ్చినట్లుగా అనిపించింది శుభా భట్‌కు. ఆమె భర్త నవకాంత్ భట్ పరిశోధకుడు.

ఐఐఎస్‌సీ క్యాంపస్‌లోకి ఎన్నో పక్షులు వచ్చిపోతుంటాయి. వాటిలో ఎప్పుడూ వచ్చే పక్షులతో పాటు అరుదైన అతిథుల్లాంటి పక్షులు కూడా ఉంటాయి. దాహార్తితో ఉన్న పక్షుల కోసం తన ఇంటిముందు మట్టిపాత్రలో నీళ్లు పెట్టి దూరంగా కూర్చునేది. దురదృష్టవశాత్తు ఒక్క పక్షి కూడా వచ్చేది కాదు. క్యాంపస్‌లోనే మరో చోటికి మకాం మార్చినప్పుడు కూడా ఇంటిముందు మట్టిపాత్రలలో నీళ్లు పెట్టి కూర్చొనేది.

ఈసారి మాత్రం అదృష్టం తలుపు తట్టింది. కాకులు, పిచ్చుకలు... రకరకాల పక్షులు వచ్చి నీళ్లు తాగి వెళ్లేవి. ఈ ఉత్సాహంతో మరిన్ని మట్టిపాత్రలు ఇంటి చుట్టూ పెట్టేది. పేరు తెలిసిన పక్షులతో పాటు బొత్తిగా అపరిచితమైన పక్షులూ వచ్చి నీళ్లు తాగి వెళ్లేవి. అవి నీళ్లు తాగే దృశ్యం శుభకు అపురూపంగా అనిపించేది. నీటికి, పక్షులకు మధ్య ఉండే సంబంధాన్ని గురించి లోతుగా ఆలోచించేలా చేసేది. ఒకరోజు ఒక పక్షి చెట్టు కొమ్మల్లో నుంచి రాలిపడుతున్న నీటిబిందువులలో ఆనందంగా జలకాలాడుతున్న దృశ్యం చూసిన తరువాత చెట్లపై కూడా నీళ్లు పోయడం అలవాటు చేసుకుంది.

మొత్తానికైతే శుభ ఉండే ఇల్లు పక్షులకు నచ్చిన ఇల్లు అయింది. 'ఇక్కడికి వస్తే మనకు ప్రమాదమేమీ లేదు' అనే నమ్మకం వాటికి కలిగింది. కొన్ని సంవత్సరాల క్రితం కశ్మీర్‌కు చెందిన అరుదైన కశ్మీర్ ఫ్లైక్యాచర్ శుభ కంటపడింది. కర్ణాటక గడ్డపై అరుదైన కశ్మీర్ పక్షిని వీడియో రికార్డ్ చేసిన ఘనత దక్కించుకుంది శుభ.

ఫొటోగ్రాఫర్ కావాలని ఎప్పుడూ అనుకోలేదు శుభ. అయితే రకరకాల పక్షులు నీళ్లు తాగుతున్న అందమైన దృశ్యాలు కనువిందు చేస్తున్న రోజుల్లో కెమెరాను చేతుల్లోకి తీసుకుంది. 'పక్షి జల' పుస్తకంతో రచయిత్రిగా కూడా మారింది. ఈ పుస్తకాన్ని ఐఐఎస్‌సీ ప్రెస్ ప్రచురించింది.

'పుస్తకం రాయాలని ఎప్పుడూ అనుకోలేదు. బాటనీ, బయోలజీ బ్యాక్‌గ్రౌండ్ నుంచి రాకపోయినా ఈ పుస్తకం రాశానంటే కారణం ప్రకృతిపై నాకు ఉన్న ప్రేమ. దీంట్లో నా పరిశీలనలు, భావాలు, అనుభవాలు కనిపిస్తాయి. పక్షి జల చదివిన వాళ్లు ఎవరైనా తమ ఇంటి పరిసరాలలో పక్షుల దాహార్తిని తీర్చడానికి, వాటి జలకేళిని దర్శించడానికి నీటితో నిండిన మట్టిపాత్రలు ఏర్పాటు చేస్తే ఈ పుస్తకం ప్రయోజనం నెరవేరినట్లే' అంటుంది శుభ.

మనది కాని ప్రపంచంలోకి తొంగిచూడాలంటే అద్భుతశక్తులేవీ అవసరం లేకపోవచ్చుగానీ ఆసక్తి మాత్రం ఉండాలి. శుభా భట్‌కు ఆసక్తి అనే శక్తి ఉంది. ఆ ఆసక్తే ఆమెని పక్షుల ప్రపంచంలోకి వెళ్లేలా చేసింది.

ఇంటిప్స్



- గాజుసీసాలో నీళ్లుపోసి స్ప్రింగ్ ఆనియన్స్ వేర్లు మునిగేలా పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి. పచ్చని భాగం పెరుగుతూ ఉంటుంది కాబట్టి అవసరం ఉన్నప్పుడల్లా కాస్త కట్ చేసుకొని వాడుకోవచ్చు.



- క్యాప్సికాన్ని పేపర్ బ్యాగ్‌లో చుట్టిపెట్టి, రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజుల పాటు తాజాగా ఉంటుంది.
- మిగిలిపోయిన బ్రెడ్ స్లైసులను మిక్సీ పట్టుకోవాలి. ఈ పొడిని దోరగా వేయించి గాలి చొరబడని డబ్బాలో నిల్వచేసుకోవాలి. మార్కెట్లో దొరికే బ్రెడ్ క్రంబ్స్‌లా ఇది ఉపయోగపడుతుంది. క్రిస్పీ వెజ్ నాన్‌వెజ్ డిష్‌లకు ఇది బాగా ఉపయోగపడుతుంది.



- బేకింగ్ సోడాలో కాస్త వెనిగర్ వేసి నల్లగా జిడ్డుపట్టిన పాత్రలపైన రాసి పది నిమిషాలు నానబెట్టాలి. తరువాత డిష్ వాషర్‌తో తోమితే నలుపంతా పోయి పాత్ర కొత్తదానిలా మెరుస్తుంది.

బ్యూటిప్

ఇన్‌స్టంట్ గ్లో ప్యాక్



ఎంత మంచి డ్రెస్, దానికి తగ్గ యాక్సెసరీస్ ధరించినా, ముఖం ప్రకాశవంతంగా ఉంటేనే ఆకర్షణీయంగా ఉంటుంది. క్షణాల్లో మెరుపులీనేలా కనిపించే ఇన్‌స్టంట్ గ్లో ప్యాక్‌ను ప్రయత్నించి చక్కగా మెరిసిపోండి. ● రెండు టేబుల్ స్పూన్ల బియ్యప్పిండిలో టీస్పూను తేనె, రెండు టేబుల్ స్పూన్ల చల్లటి పాలు పోసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు రాసుకుని రెండు నిమిషాలు మర్దన చేయాలి. ఆరిన తరువాత నీటితో కడిగేయాలి. తడిలేకుండా తుడుచుకుని మాయిశ్చరైజర్ రాసుకుంటే ముఖం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.

స్ఫూర్తి

వ్యాపారం చేయాలంటే లక్షల్లో పెట్టుబడులు పెట్టాలనుకుంటారు. కానీ, అహ్మదాబాద్ వాసులైన ప్రియాంషి, యశ్వి అక్కాచెల్లెళ్లు ఐదేళ్ల క్రితం తల్లి ఇచ్చిన పాకెట్‌మనీ 2,500 రూపాయలతో జార్ క్యాండిల్స్ తయారీని ప్రారంభించారు. నేడు ఏడాదికి 25 లక్షల టర్నోవర్‌ని సాధిస్తున్నారు. కాలేజీలో చదువుకుంటూనే జాయిస్ బీమ్ క్యాండిల్ వ్యవస్థాపకులుగా, వ్యాపారవేత్తలుగా మారిన ఈ అక్కాచెల్లెళ్లు నవతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. 'మా జీవితాల్లో మేమే వెలుగులను నింపుకుంటున్నాం' అని తమ వెంచర్ గురించి ప్రస్తావిస్తూ ఎన్నో విషయాలను ఇలా మన ముందుంచుతున్నారు.



● అక్కాచెల్లెళ్లు ప్రియాంషి, యశ్వి

క్యాండిల్ సిస్టర్స్







అక్కా చెల్లెళ్లలో ముందుగా యశ్వి మాట్లాడుతూ – 'అహ్మదాబాద్‌లోని సెయింట్ జేవియర్స్ కాలేజీలో ఇండస్ట్రియల్ కెమిస్ట్రీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ చదివాను. కోర్సులో పారిశ్రామిక శిక్షణ యూనిట్ అనే సబ్జెక్ట్ కూడా ఉంది. ఇందులో మెలకువలు నేర్చుకున్నాను. ఏడాది పొడవునా సీజన్‌కు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేసే వాళ్లం. వీటి ద్వారా మొదట్లో నెలకు వెయ్యి రూపాయలే వచ్చేది. ఆ తర్వాత ఈ పనే ప్రధానంగా చేసుకున్నాం. దీపావళి సమయంలో కొవ్వొత్తులతో పాటు సోప్ సొల్యూషన్స్, లిప్ బామ్‌లు అమ్మేవాళ్లం. చాలా సార్లు పెద్ద కంపెనీలకు, ఇంటింటికీ వెళ్లి ఉత్పత్తులను డోర్ టు డోర్ మార్కెటింగ్ చేసేదానిని. ఈ సమయంలో మా స్వంత కలను గుర్తించాం. కాలేజీ సమయంలో మూడేళ్ల పాటు చేసిన ఈ ప్రయత్నానికి మా అక్క ఆలోచనలు కూడా తోడయ్యాయి. అమ్మ కూడా మాకు సపోర్ట్‌గా నిలిచింది. ఐదుగురితో క్యాండిల్స్ తయారీ ప్రారంభించి, 50 కొవ్వొత్తులను మాత్రమే తయారు చేశాం. వాటిని ఒక ఫెయిర్‌లో ప్రదర్శించాను. అన్ని ఖర్చులు తీసివేస్తే 700 రూపాయల లాభం వచ్చింది. నేను చేస్తున్న ఈ ప్రయత్నం మా నాన్నకు నచ్చలేదు. ఇరవై ఏళ్లు దాటుతూనే అమ్మాయిలకు పెళ్లిళ్లు చేయడమే ప్రధానంగా భావించేవారు. ఆడపిల్లలు సొంతంగా ఆలోచించడానికి వీలు లేని చోటు. దీంతో నాన్న మమ్మల్ని ఆదుకోలేదు. కానీ, ఈ రోజు మమ్మల్ని చూసి గర్వపడుతున్నారు. మొదట్లో మా బంధువుల్లో ఫలానా వాళ్ల కూతుళ్లు ఇంట్లో టైమ్ పాస్ చేస్తున్నారు అనుకునేవారు. కానీ, ఈ రోజు మా ఎదుగుదల చూసి బంధువులకు కూడా మా బలం ఏంటో అర్థమైంది. ఆంక్షలు ఉన్నప్పటికీ సాధించాలన్న మా తపనకు అవేవీ అడ్డంకి కాలేదు' అని వివరిస్తుంది.

నిశితంగా పరిశీలన

ముడిపదార్థాలను కలపడం, మ్యాజికల్ ఫార్ములాను సెట్ చేయడం యశ్వి చూస్తుంటే, ఆన్‌లైన్-ఆఫ్‌లైన్ ప్రచారాల మార్కెటింగ్ వ్యూహాలను రూపొందించే బాధ్యత అక్క ప్రియాంషి తీసుకుంది. తమ ఉత్పత్తుల గురించి ప్రియాంషి మాట్లాడుతూ – 'మా చేతితో తయారుచేసిన జార్ కాండిల్స్ మాకో ప్రత్యేకతను తీసుకువచ్చాయి. ఆర్గానిక్, నాన్ టాక్సిక్ ముడి పదార్థాలను మాత్రమే ఈ తయారీలో ఉపయోగించడం వల్ల పర్యావరణ అనుకూలమైనవని మా అభిప్రాయం. ఇందుకు మేం గర్వపడుతున్నాం. తయారీ నుంచి ప్యాకేజ్, కస్టమర్లకు మా ఉత్పత్తులను చేర్చడం వరకు ప్రతి దశను నిశితంగా పర్యవేక్షిస్తాం. కచ్చితమైన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా మా జాడీలను ఎనిమిదిసార్లు క్షుణ్ణంగా పరిశీలిస్తాం. దీని వల్ల కస్టమర్లకు నాణ్యమైన జార్ క్యాండీలను అందించగలుగుతున్నాం.



కొవ్వొత్తులు కేవలం కాంతిని మాత్రమే అందించవు. మేం తయారు చేసే క్యాండిళ్లలోని కంటికి ఇంపైన రంగులు, హాయి గొలిపే పరిమళాలు మనసును ఆనందానికి లోను చేస్తాయి. ఈ పనిలో శ్రద్ధ చాలా కీలకం. నమ్మి చేస్తాం కనుక ఫలితం కూడా చూస్తున్నాం' అని ఆనందంగా వివరిస్తుంది.

ఒక చిన్న ఆలోచనను అమలులో పెట్టి, దానికి సృజనాత్మకతను జోడించి అంచెలంచెలుగా ఎదుగుతున్న ఈ అక్కాచెల్లెళ్లు నవతరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

సెమీస్ 'ప్రతీకార' సమయం


రోహిత్ శర్మ
విలియమ్సన్

నేడు ప్రపంచకప్ తొలి సెమీఫైనల్ ● న్యూజిలాండ్‌తో భారత్ ఢీ
అద్భుత ఫామ్‌లో టీమిండియా ● ఆత్మవిశ్వాసంతో కివీస్ బృందం
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

9 మంది ప్రత్యర్థులు... 9 విజయాలు... అదిరిపోయే బ్యాటింగ్ బలగం... పేసర్ల అద్భుత ప్రదర్శన... స్పిన్నర్ల జోరు... ఫీల్డింగ్ మెరుపులు... వెరసి ఇప్పటివరకు టీమిండియా అజేయ యాత్ర సాగిపోయింది. ఏమాత్రం పోటీ, ఎదురన్నదే లేకుండా దూసుకుపోయి ప్రపంచకప్ లీగ్ దశను అజేయంగా ముగించిన భారత్ జట్టు అసలైన సమరానికి సిద్ధమైంది. లీగ్ దశలో చూపించిన జోరును మరో రెండు మ్యాచ్‌లలో కొనసాగిస్తే చాలు... భారత్ మూడోసారి వరల్డ్ కప్ సగర్వంగా గెలిచి కోట్లాది అభిమానుల కోరిక నెరవేరడం ఖాయం. అయితే ఇప్పుడు గత 9 మ్యాచ్‌ల ఫలితాలతో సంబంధం లేదు. మళ్లీ కొత్తగా మొదలు పెట్టాల్సిందే. తీవ్ర ఒత్తిడి, ఒక్క క్షణం కూడా అలసత్వం ప్రదర్శించినా కోలుకునే అవకాశం ఉండని నాకౌట్ మ్యాచ్‌లో పూర్తి స్థాయిలో సత్తా చాటాల్సిందే.

ఎదురుగా ఉన్నది అణువణువూ పోరాటతత్వం నింపుకున్న న్యూజిలాండ్ జట్టు. ప్రత్యర్థి ఎవరైనా ఆఖరి బంతి వరకు పట్టు వీడని కివీస్‌తో పోరు అంత సులువు కాదు. నాలుగేళ్ల క్రితం సెమీఫైనల్లోనే కివీస్ కొట్టిన దెబ్బను సగటు భారత క్రికెట్ అభిమాని మరచిపోలేదు... ప్రత్యర్థితో పోలిస్తే మన జట్టుదే అన్ని రకాలుగా పైచేయిగా కనిపిస్తున్నా కీలక సమయంలో పట్టుదలగా నిలవడమే ప్రధానం. ఈ నేపథ్యంలో ప్రపంచకప్ తొలి సెమీఫైనల్‌కు రంగం సిద్ధమైంది. వరుసగా గత రెండు ప్రపంచకప్‌లలో సెమీఫైనల్‌కే పరిమితమైన భారత్ ఈసారి ఈ అడ్డంకి దాటి ఫైనల్ చేరుతుందా లేక గత రెండు టోర్నీల్లో ఫైనల్లోనే ఓడిన న్యూజిలాండ్ మరోసారి తుది పోరుకు అర్హత సాధిస్తుందా అనేది ఆసక్తికరం.

ముంబై: ప్రపంచకప్‌లో భారత్ గెలిచిన 9 మ్యాచ్‌లలో కాస్త ఇబ్బంది పడిన, తడబాటుకు గురైన మ్యాచ్ ఏదైనా ఉందంటే అది న్యూజిలాండ్‌తోనే. 274 పరుగుల లక్ష్యఛేదనలో చివరికి 4 వికెట్ల తేడాతో మ్యాచ్ గెలిచి టీమిండియా గట్టెక్కింది. ఇప్పుడు అదే న్యూజిలాండ్‌తోనే రోహిత్ బృందం సెమీఫైనల్లో అమీతుమీకి సై అంటోంది. వాంఖెడే మైదానంలో నేడు జరిగే తొలి సెమీస్ పోరులో కివీస్‌తో భారత్ తలపడుతుంది. లీగ్ దశ ఆరంభంలో అద్భుతంగా ఆడి ఆ తర్వాత వెనుకబడినా చివర్లో రాణించి టాప్-4లో చోటు దక్కించుకున్న న్యూజిలాండ్ మరోసారి సెమీస్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. టీమిండియా ఫేవరెట్‌గా కనిపిస్తున్నా నాకౌట్ మ్యాచ్ కావడంతో అంచనాలకు భిన్నంగానూ సాగే అవకాశం ఉంది.

మార్పుల్లేకుండా...


బుమ్రా, షమీ


మిచెల్, రచిన్

వరల్డ్‌కప్‌లో తొలి నాలుగు మ్యాచ్‌ల తర్వాత ధర్మశాలలో న్యూజిలాండ్ జరిగిన ఐదో మ్యాచ్ కోసం టీమిండియా స్వల్ప మార్పులు చేసింది. ఆ తర్వాతి నుంచి ఎలాంటి మార్పు లేకుండా అదే తుది జట్టును కొనసాగిస్తోంది. జట్టు ఫామ్‌ను బట్టి చూస్తే ఇప్పుడూ అదే కొనసాగించడం ఖాయం. టీమ్ మొత్తం తమదైన రీతిలో సత్తా చాటి జట్టును నడిపిస్తున్నారు. ఎలాంటి ఆందోళన లేకుండా ఏ విషయంలోనూ లోపాలు లేకుండా జట్టు గొప్పగా కనిపిస్తోంది. విరాట్ కోహ్లి టోర్నీలో టాప్ స్కోరర్‌గా (594 పరుగులు) కొనసాగుతుండగా, రోహిత్ శర్మ 503, శ్రేయస్ 421 పరుగులతో జట్టు బ్యాటింగ్‌ను నడిపిస్తున్నారు. గిల్, రాహుల్‌లకు కూడా విజయాల్లో ప్రధాన భాగస్వామ్యం ఉంది. మిడిలార్డర్‌లో సూర్యకుమార్, జడేజాల బ్యాటింగ్ భారత్‌కు అదనపు బలంగా మారింది. ముగ్గురు పేసర్లు బుమ్రా, షమీ, సిరాజ్‌లను ఎదుర్కోవడం ప్రత్యర్థులకు దాదాపు అసాధ్యంగా మారగా... కుల్దీప్, జడేజా స్పిన్‌ను కూడా వారు అర్థం చేసుకోలేకపోతున్నారు. ఇలాంటి స్థితిలో భారత్‌ను నిలువరించాలంటే ఏ జట్టయినా అసాధారణ ఆటతీరు కనబర్చాల్సి ఉంటుంది.

ఆల్‌రౌండ్ నైపుణ్యంతో...

న్యూజిలాండ్ కూడా అంచనాలకు మించి రాణించి భారత్‌ను ఓడించాలని పట్టుదలగా ఉంది. ఆటగాళ్లంతా పూర్తి ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నారు. ఓపెనర్లు కాన్వే, రచిన్ రవీంద్ర వరుసగా జట్టుకు శుభారంభాలు అందిస్తున్నారు. రచిన్ 565 పరుగులతో మూడో స్థానంలో ఉండగా, మిడిలార్డర్ బ్యాటర్ డరైల్ మిచెల్ కూడా 418 పరుగులు సాధించాడు. 359 పరుగులు చేసిన కాన్వే దూకుడుగా ఆడటంలో మేటి. కెప్టెన్ కేన్ విలియమ్సన్ తన బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌ను సమర్థంగా నడిపించగలడు. టామ్ లాథమ్ కూడా చక్కటి బ్యాటర్ కాగా... మెరుపు బ్యాటింగ్ చేయగల ఫిలిప్స్, చాప్‌మన్ ఆ జట్టు మిడిలార్డర్‌లో ఉండటం అదనపు బలం. స్పిన్నర్ సాన్‌ట్నర్‌పై భారత్‌పై మంచి రికార్డు ఉండగా... కివీస్ కూడా తమ పేస్ బలాన్ని నమ్ముకుంటోంది. ముఖ్యంగా ఆరంభ ఓవర్లలో ట్రెంట్ బౌల్ట్ చెలరేగితే భారత్‌కు కష్టాలు తప్పవు. ఫెర్గూసన్ కూడా ఫామ్‌లో ఉండగా సౌతీ అనుభవం జట్టుకు ఉపయోగపడగలదు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, కేఎల్ రాహుల్, సూర్యకుమార్, జడేజా, షమీ, కుల్దీప్, బుమ్రా, సిరాజ్. **న్యూజిలాండ్:** విలియమ్సన్ (కెప్టెన్), కాన్వే, రచిన్ రవీంద్ర, మిచెల్, లాథమ్, ఫిలిప్స్, చాప్‌మన్, సాన్‌ట్నర్, సౌతీ, ఫెర్గూసన్, బౌల్ట్.

భారత్‌తో మ్యాచ్ మాకు పెద్ద సవాల్ అనేది వాస్తవం. ఆ టీమ్ చాలా బాగా ఆడుతోంది. అయితే టోర్నీలో ప్రతీ మ్యాచ్ భిన్నమైందే. తమదైన రోజున ఏ జట్టయినా ఎలాంటి జట్టునైనా ఓడించగలదు. జట్టు బలంతో పాటు అప్పటి పరిస్థితులు, వాటి ప్రభావం కూడా అందుకు కారణమవుతాయి. లీగ్‌లో ఎంత కష్టపడి ఇక్కడికి వచ్చామన్నది ముఖ్యం కాదు. నాకౌట్ దశను మళ్లీ కొత్తగా మొదలు పెట్టాల్సిందే. వరుసగా గత రెండు వరల్డ్ కప్‌లలో మేం ఫైనల్ చేరినా మమ్మల్ని ఇంకా అండర్‌డాగ్స్‌గానే చూస్తుంటారు. మేం వీటికి అలవాటుపడిపోయాం కాబట్టి ఇబ్బందేమీ లేదు. మా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తే ఇక్కడా గెలవగలం కాబట్టి ఏదైనా జరగొచ్చు. 2019లాగే ఈసారి కూడా మైదానంలో అంతా భారత అభిమానులే ఉంటారు. మాకు మద్దతు పలకకపోయినా ఆ వాతావరణం మాత్రం చాలా బాగుంటుంది. మా జట్టులో చాలా మందికి ఇది అలవాటే. అయినా భారత గడ్డపై భారత్‌తో సెమీస్‌లో తలపడటమే ఎంతో ప్రత్యేకం. -కేన్ విలియమ్సన్, న్యూజిలాండ్ కెప్టెన్

నాడు ఏం జరిగిందంటే...



2019 జూన్ 9-10... మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రఫోర్డ్ మైదానం... భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి సెమీస్ మ్యాచ్... భారత్ కట్టుదిట్టమైన బౌలింగ్‌కు కివీస్ 46.1 ఓవర్లలో 5 వికెట్లకు 211 పరుగులు చేసింది. అయితే వర్షం కారణంగా మ్యాచ్ ఆగిపోవడంతో తర్వాతి రోజు ఆట కొనసాగగా, చివరకు 50 ఓవర్లలో 8 వికెట్లకు 239 పరుగులతో న్యూజిలాండ్ ముగించింది. ఎలా చూసినా ఇది టీమిండియా ఛేదించదగ్గ స్కోరే. అయితే 5 పరుగులకే రోహిత్, కోహ్లి, రాహుల్ వెనుదిరగడంతో పేలవ ఆరంభం లభించగా... ఒకదశలో జట్టు 92/6తో ఓటమికి చేరువైంది. జడేజా 59 బంతుల్లోనే 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో ఎదురుదాడి చేయడంతో గెలుపుపై ఆశలు రేగాయి. అయితే కివీస్ తమ బౌలింగ్‌తో మళ్లీ మ్యాచ్‌ను అదుపులోకి తెచ్చుకుంది. 14 బంతుల్లో 32 పరుగులు చేయాల్సిన స్థితిలో జడేజా వెనుదిరగ్గా... మరో మూడు బంతుల తర్వాత ధోని రనౌట్ భారత అభిమానుల గుండె పగిలేలా చేసింది. అయితే ఏ దశలోనూ దూకుడు చూపించని, అభిమానులు కూడా నివ్వెరపోయేలా సాగిన ధోని ఇన్నింగ్స్ (72 బంతుల్లో 50; 1 ఫోర్, 1 సిక్స్) ఓటమికి కారణాల్లో ఒకటనేది వాస్తవం!

ధైర్యవంతులకే అదృష్టం కూడా అండగా నిలుస్తుంది. మేం ఇప్పుడు పూర్తి నమ్మకంతో, ధైర్యంతో బరిలోకి దిగుతున్నాం. ఇలాంటప్పుడే కాస్త అదృష్టం కూడా కలిసి రావాలి. టోర్నీలో తొలి ఐదు మ్యాచ్‌లలో మేం లక్ష్యాన్ని ఛేదించగా, తర్వాతి నాలుగు మ్యాచ్‌లలో ముందుగా బ్యాటింగ్ చేశాం. కాబట్టి అన్ని రకాలుగా మమ్మల్ని మేం పరీక్షించుకున్నట్లే. వాటితో పోలిస్తే ఈ మ్యాచ్ ప్రాధాన్యత ఏమిటో మాకు తెలుసు. అయినా సరే మేం ఏమీ కొత్తగా ప్రయత్నించాల్సిన అవసరం లేదు. ఇప్పటి వరకు ఎలా ఆడామో అలా ఆడితే చాలు. ఒత్తిడి కొత్త కాదు. ప్రపంచకప్‌లో సెమీస్ అయినా లీగ్ మ్యాచ్ అయినా ఒత్తిడి ఎలాగూ ఉంటుంది. భారత క్రికెటర్లపై ఇది మరీ ఎక్కువ. ఆటగాళ్లంతా ఆ స్థితిని దాటుకునే వచ్చారు కాబట్టి ఆడటమే అన్నింటికంటే ముఖ్యం. న్యూజిలాండ్ ఎంతో తెలివైన, క్రమశిక్షణ బాగా కలిగిన జట్టు. ప్రత్యర్థిని బాగా అర్థం చేసుకొని తమ వ్యూహాలు సిద్ధం చేసుకుంటారు. 1983లో భారత్ వరల్డ్ కప్ గెలిచినప్పుడు ప్రస్తుత జట్టులోని సగం మంది పుట్టనే లేదు. 2011లో సగం మంది క్రికెట్ మొదలు పెట్టలేదు. కాబట్టి ఈ జట్టు సభ్యులంతా గతం గురించి కాకుండా వర్తమానంపై, తమ ఆటపై మాత్రమే దృష్టి పెడుతున్నారు. గతంలో నాకౌట్ మ్యాచ్‌లలో, నాలుగేళ్ల క్రితం ఏం జరిగిందనేది కూడా మాకు అనవసరం. -మీడియా సమావేశంలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ

పిచ్, వాతావరణం

ఈ వరల్డ్ కప్‌లో వాంఖెడే మైదానంలో పరుగుల వరద పారింది. ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో అన్ని జట్లూ భారీ స్కోర్లు చేశాయి. రెండో అర్ధ భాగం ఆరంభంలో పేస్ బౌలింగ్‌కు పిచ్ అనుకూలిస్తోంది. సెమీస్ ఒత్తిడిని కూడా దృష్టిలో ఉంచుకొని చూస్తే టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవడం ఖాయం. వర్ష సూచన లేదు. ఒకవేళ అవాంతరం ఎదురైనా సెమీస్‌కు రిజర్వ్ డే కూడా ఉంది.

4 నేడు న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌తో విరాట్ కోహ్లి అత్యధికంగా నాలుగుసార్లు (2011, 2015, 2019, 2023) వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్ మ్యాచ్‌లు ఆడిన భారత ప్లేయర్‌గా గుర్తింపు పొందుతాడు. సచిన్ టెండూల్కర్ (1996, 2003, 2011), ధోని (2011, 2015, 2019) మూడుసార్లు చొప్పున వరల్డ్‌కప్ సెమీఫైనల్స్ ఆడారు.

11 మూడు వరల్డ్‌కప్ సెమీఫైనల్స్‌లో కలిపి కోహ్లి చేసిన పరుగులు. 2011 పాక్‌తో సెమీస్‌లో 9 పరుగులు... 2015 ఆస్ట్రేలియాతో సెమీస్‌లో 1 పరుగు... 2019 న్యూజిలాండ్‌తో సెమీస్‌లో 1 పరుగు చేశాడు. ఈ మూడు సెమీఫైనల్స్‌లో ఎడంచేతి వాటం పేస్ బౌలర్ల (వహాబ్ రియాజ్, మిచెల్ జాన్సన్, ట్రెంట్ బౌల్ట్) చేతిలోనే కోహ్లి అవుట్ కావడం గమనార్హం.



117 భారత్, న్యూజిలాండ్ జట్లు ఇప్పటి వరకు 117 వన్డేల్లో తలపడ్డాయి. 59 మ్యాచ్‌ల్లో భారత్... 50 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ గెలిచాయి. ఒక మ్యాచ్ 'టై' అయింది. 7 మ్యాచ్‌లు రద్దయ్యాయి.

8 వన్డే ప్రపంచకప్ చరిత్రలో భారత జట్టుకిది ఎనిమిదో సెమీఫైనల్ కానుంది. మూడుసార్లు (1983లో ఇంగ్లండ్‌పై; 2003లో కెన్యాపై; 2011లో పాకిస్తాన్‌పై) సెమీఫైనల్స్‌లో నెగ్గిన భారత్.... నాలుగుసార్లు (1987లో ఇంగ్లండ్ చేతిలో; 1996లో శ్రీలంక చేతిలో; 2015లో ఆస్ట్రేలియా చేతిలో; 2019లో న్యూజిలాండ్ చేతిలో) సెమీఫైనల్లో ఓటమి పాలైంది.

9 వన్డే ప్రపంచకప్ చరిత్రలో న్యూజిలాండ్ జట్టుకిది తొమ్మిదో సెమీఫైనల్ కానుంది. రెండుసార్లు (2015లో దక్షిణాఫ్రికాపై, 2019లో భారత్‌పై) నెగ్గిన న్యూజిలాండ్.. ఆరుసార్లు (1975లో వెస్టిండీస్ చేతిలో; 1979లో ఇంగ్లండ్ చేతిలో; 1992లో పాకిస్తాన్ చేతిలో; 1999లో పాకిస్తాన్ చేతిలో; 2007లో శ్రీలంక చేతిలో; 2011లో శ్రీలంక చేతిలో) పరాజయం పాలైంది.

5 వాంఖెడే స్టేడియంలో భారత్ ఇప్పటి వరకు ఐదుసార్లు వన్డే వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ఆడింది. 3 మ్యాచ్‌ల్లో (1987లో జింబాబ్వేపై, 2011లో శ్రీలంకపై, 2023లో శ్రీలంకపై) నెగ్గి, 2 మ్యాచ్‌ల్లో (1987లో ఇంగ్లండ్ చేతిలో, 1996లో ఆస్ట్రేలియా చేతిలో) ఓటమి పాలైంది.

9 వన్డే వరల్డ్‌కప్ చరిత్రలో భారత్, న్యూజిలాండ్ జట్లు 9 సార్లు ముఖాముఖిగా తలపడ్డాయి. 4 మ్యాచ్‌ల్లో భారత్... 5 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ విజయం సాధించాయి.

1 వాంఖెడె స్టేడియంలో భారత్‌తో జరిగిన ఏకైక మ్యాచ్‌లో (2017లో) న్యూజిలాండ్ గెలిచింది.



21 వాంఖెడే స్టేడియంలో భారత జట్టు ఇప్పటి వరకు 21 మ్యాచ్‌లు ఆడింది. 12 మ్యాచ్‌ల్లో గెలిచి, 9 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

బోపన్న జోడీ ఓటమితో మొదలు



టురిన్ (ఇటలీ): పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌ను రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ఓటమితో ప్రారంభించింది. రాజీవ్ రామ్ (అమెరికా)-జో సాలిస్‌బరీ (బ్రిటన్) జోడీతో జరిగిన రెడ్ గ్రూప్ తొలి లీగ్ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 3-6, 4-6తో ఓడిపోయింది. గంటపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ ఎనిమిది ఏస్‌లు సంధించి తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయింది.

తొలి రౌండ్‌లోనే సాత్విక్-చిరాగ్ జోడీకి చుక్కెదురు



కుమమోటో: జపాన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి టాప్ సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ ఐదో ర్యాంక్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 21-16, 18-21, 16-21తో ప్రపంచ 21వ ర్యాంక్ జంట లూ చింగ్ యావో-యాంగ్ పో హాన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలైంది. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాత్విక్, చిరాగ్ తొలి గేమ్ గెలిచినా ఆ తర్వాత తడబడి మూల్యం చెల్లించుకున్నారు. నేడు జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో మూడో సీడ్ కొడాయ్ నరోకా (జపాన్)తో లక్ష్య సేన్; లీ చెయుక్ యి (హాంకాంగ్)తో హెచ్ఎస్ ప్రణయ్; లిన్ చున్‌యి (చైనీస్ తైపీ)తో ప్రియాన్షు రజావత్ తలపడతారు.

పంకజ్ అద్వానీ పరాజయం



దోహా: ప్రపంచ 6-రెడ్ స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల కథ ముగిసింది. భారత దిగ్గజం, 24 సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన పంకజ్ అద్వానీతోపాటు కమల్ చావ్లా, శ్రీకృష్ణ సూర్యనారాయణన్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. మంగళవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో పంకజ్ అద్వానీ 0-5 (28-41, 10-38, 14-42, 10-44, 28-32) ఫ్రేమ్‌ల తేడాతో అహసాన్ రంజాన్ (పాకిస్తాన్) చేతిలో... కమల్ చావ్లా 2-5 (7-39, 2-41, 66-0, 0-31, 39-19, 0-47, 14-36)తో చౌ హాన్ మాన్ (హాంకాంగ్) చేతిలో... శ్రీకృష్ణ 2-5 (38-18, 5-44, 59-6, 0-70, 26-34, 0-60, 0-63)తో మైకేల్ జార్జియు (సైప్రస్) చేతిలో ఓటమి పాలయ్యారు.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ మ్యాచ్ 'డ్రా'

షిల్లాంగ్: ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) తొలి 'డ్రా' నమోదు చేసింది. షిల్లాంగ్ లాజోంగ్ ఎఫ్‌సీతో జరిగిన మ్యాచ్‌ను శ్రీనిధి 2-2తో 'డ్రా' చేసుకుంది. శ్రీనిధి జట్టుకు రోసెన్‌బర్గ్ (7వ, 63వ ని.లో) రెండు గోల్స్ అందించాడు.

'వరల్డ్ అథ్లెట్ ఆఫ్ ద ఇయర్' ఫైనల్లో నీరజ్ చోప్రా



మోంటికార్లో: ఈ ఏడాది ప్రపంచ పురుషుల అత్యుత్తమ అథ్లెట్ పురస్కారం తుది జాబితాలో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు స్థానం లభించింది. నెల రోజుల క్రితం ప్రపంచ అథ్లెటిక్స్ ఈ అవార్డు కోసం 11 మందిని నామినేట్ చేసింది. అక్టోబర్ 28తో ఓటింగ్ ముగిసింది. సామాజిక మాధ్యమాల్లో నిర్వహించిన ఓటింగ్‌లో 20 లక్షల మంది పాల్గొన్నారు. ఓటింగ్ అనంతరం ఈ జాబితాను 11 నుంచి కుదించి టాప్-5 ఆటగాళ్లను ఎంపిక చేశారు. ఈ ఐదుగురిలో ఒకరికి డిసెంబర్ 11న 'వరల్డ్ అథ్లెట్ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభిస్తుంది. ఈ ఏడాది నీరజ్ అద్భుత ప్రదర్శన చేశాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తొలిసారి స్వర్ణ పతకం సాధించడంతోపాటు ఆసియా క్రీడల్లో తన పసిడి పతకాన్ని నిలబెట్టుకున్నాడు. నీరజ్‌తోపాటు రియాన్ క్రుసెర్ (అమెరికా; షాట్‌పుట్), డుప్లాంటిస్ (స్వీడన్; పోల్‌వాల్ట్), కిప్టుమ్ (కెన్యా; మారథాన్), నోవా లైల్స్ (అమెరికా; 100, 200 మీటర్లు) 'వరల్డ్ అథ్లెట్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం రేసులో ఉన్నారు.

సినిమా

స్నేహానికి వ్యాపారాన్ని ముడిపెట్టలేను

- స్వాతీరెడ్డి గునుపాటి


● స్వాతీ రెడ్డి గునుపాటి, సురేశ్ వర్మ

పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమర్ ప్రధాన పాత్రధారులుగా, నందితా శ్వేత, దివ్యా పిళ్లై, రవీంద్ర విజయ్, అజయ్ ఘోష్, శ్రీ తేజ్, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మంగళవారం'. అజయ్ భూపతికి చెందిన 'ఏ' క్రియేటివ్ వర్క్స్, ముద్ర మీడియా వర్క్స్‌పై స్వాతీరెడ్డి గునుపాటి (వ్యాపారవేత్త నిమ్మగడ్డ ప్రసాద్ కుమార్తె), ఎం. సురేష్ వర్మ కలిసి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ చిత్రనిర్మాతలు మాట్లాడారు.

స్వాతీరెడ్డి గునుపాటి మాట్లాడుతూ – ''అజయ్ భూపతిగారు చెప్పిన 'మంగళవారం' కథ విని, ఈ సినిమా చేస్తే బాగుంటుందనిపించి చేశాను. ఓ సెన్సిటివ్ ఇష్యూని ఆయన సందేశాత్మకంగా చెప్పిన విధానం నాకు నచ్చింది. పాయల్‌కు హ్యాట్సాఫ్ చెప్పాలి. ఈ సినిమా కోసం ఎంతగానో కష్టపడింది. అజనీష్ మ్యూజిక్ బాగుంటుంది. ఇండస్ట్రీలో నాకు అల్లు అర్జున్, రామ్ చరణ్.. ఇలా అగ్రతారలతో పరిచయం ఉంది. నేను అడిగితే వారు నాతో సినిమాలు చేస్తారు. కానీ నిర్మాతగా ముందు నన్ను నేను నిరూపించుకోవాలి. వాళ్ల స్థాయికి తగ్గ సినిమాలను నిర్మించే అవకాశం ఉన్నప్పుడు వారితో నేను సినిమాలు చేస్తాను. ఎందుకంటే స్నేహాన్ని, వ్యాపారాన్ని ముడిపెట్టడం ఇష్టం లేదు'' అన్నారు.

మరో నిర్మాత సురేష్ వర్మ మాట్లాడుతూ– ''మంగళవారం' సినిమాలో లవ్, కామెడీ, యాక్షన్.. ఇలా అన్ని రకాల భావోద్వేగాలు ఉన్నాయి. ఈ సినిమా తొలి రోజు నుంచే అల్లు అర్జున్‌గారు మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. ఇక చిన్నతనం నుంచి చిరంజీవిగారికి నేను పెద్ద అభిమానిని. ఆయన మా ట్రైలర్‌ను విడుదల చేయడం మర్చిపోలేని అనుభూతి'' అన్నారు.

ఫైట్‌తో ప్రారంభం


● నాని

'అంటే..సుందరానికీ!' చిత్రం తర్వాత హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా సినిమా 'సరిపోదా శనివారం'. ప్రియాంకా అరుళ్ మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య ఓ కీలక పాత్రధారి. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఓ యాక్షన్ సీక్వెన్స్‌తో మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఫైట్ మాస్టర్ రామ్-లక్ష్మణ్ ఈ ఫైట్ ఎపిసోడ్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో కొన్ని యాక్షన్ సన్నివేశాలతో పాటు నాని, ఇతర ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్.



నాగార్జున హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్‌లో నాగార్జున, కీరవాణి, పాటల రచయిత చంద్రబోస్ కలిశారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ మూవీ 2024 సంక్రాంతికి రిలీజ్ కానుంది.

ఆ రోజు సౌండ్ పార్టీ

వీజే సన్నీ, హ్రితికా శ్రీనివాస్ జంటగా నటించిన చిత్రం 'సౌండ్ పార్టీ'. శివన్నారాయణ, అలీ, సప్తగిరి, థర్టీ ఇయర్స్ పృథ్వీ, 'మిర్చి' ప్రియ కీలక పాత్రల్లో నటించారు. సంజయ్ శేరి దర్శకత్వంలో జయశంకర్ సమర్పణలో రవి పోలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 24న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ మంగళవారం ప్రకటించింది. ''ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్‌కు మంచి స్పందన లభిస్తోంది. సినిమా కూడా ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు దర్శక- నిర్మాతలు. ఈ సినిమాకు సంగీతం: మోహిత్ రెహమానిక్.


● 'సౌండ్ పార్టీ' పోస్టర్

సాక్షి బిజినెస్
బుధవారం
15-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (సోమవారం ముగింపు)

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
326	82
64,934	19,444

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,048	△	280
డోజోన్స్	34,784	△	446
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,440	△	15
డాక్స్	15,614	△	269
షాంఘై	3,056	△	10
నికాయ్	32,696	△	111

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.55	84.22
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	100.29	103.62
€	యూరో	ఒకటికి	87.53	90.64
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	54.14	55.81
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	51.92	54.21
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	60.29	62.24
SAR	సౌదీ రియాల్	ఒకటికి	21.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటికి	21.79	23.59
¥	చైనా యువాన్	ఒకటికి	10.31	12.38

800 మందికి టాటా స్టీల్ ఉద్వాసన

TATA STEEL

న్యూఢిల్లీ: నిర్మాణాత్మక పోటీతత్వం, లాభదాయకతలో భాగంగా టాటా స్టీల్ కీలక నిర్ణయం తీసుకుంది. నెదర్లాండ్స్‌లో 800 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్లు తెలిపింది. వీరిలో 300 మంది తాత్కాలిక సిబ్బంది ఉన్నారు. టాటా స్టీల్ యూరప్ నుండి రెండు స్వతంత్ర కంపెనీలుగా టాటా స్టీల్ యూకే, టాటా స్టీల్ నెదర్లాండ్స్‌ను వేరు చేసే ప్రక్రియను 2021 అక్టోబరులో టాటా స్టీల్ పూర్తి చేసింది. నెదర్లాండ్స్‌లో కంపెనీకి ఏటా ఏడు మిలియన్ టన్నుల సామర్థ్యంగల తయారీ ప్లాంట్ ఉంది.

తెలుగులో ఆహార నాణ్యత ప్రమాణాల పోర్టల్



న్యూఢిల్లీ: ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ తాజాగా ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల పాటింపు వ్యవస్థ (ఎఫ్‌వోఎస్‌సీవోఎస్) పోర్టల్‌ను నాలుగు ప్రాంతీయ భాషల్లో ఆవిష్కరించింది. దీంతో హిందీ, ఇంగ్లిష్ సహా ఇకపై తెలుగు, తమిళం, గుజరాతీ, మరాఠీ భాషల్లో ఇది అందుబాటులో ఉంటుంది. త్వరలోనే కన్నడ, పంజాబీ తదితర భాషల్లోనూ పోర్టల్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ ఒక ప్రకటనలో తెలిపింది. నిబంధనలను పాటించడంలో స్థానిక ఆహార విక్రేతలకు ఇది సహాయకరంగా ఉంటుందని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-11-2023	
విశాఖ	540-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	72.00
14-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

టాప్‌గేర్‌లో టెస్లా దిగుమతులు..!

- భారత్ నుంచి రెట్టింపు...
- కేంద్ర మంత్రి గోయల్ వెల్లడి
- అమెరికాలో కంపెనీ ప్లాంటు సందర్శన



టెస్లా ప్లాంట్ సందర్శనలో కారును పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి పియూష్ గోయల్

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా.. భారత్ నుంచి ఆటో విడిభాగాల దిగుమతిని రెట్టింపు చేసుకునే యోచనలో ఉంది. నాలుగు రోజుల అమెరికా పర్యటనలో భాగంగా ఫ్రీమాంట్ (కాలిఫోర్నియా)లోని కంపెనీ ప్లాంటును సందర్శించిన సందర్భంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ ఈ విషయం తెలిపారు. అనారోగ్య కారణాల రీత్యా గోయల్‌ను టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ కలవలేకపోయారు. 'టెస్లా అధునాతన ప్లాంటును సందర్శించాను. మొబిలిటీ ముఖచిత్రాన్ని మారుస్తున్న టెస్లా వృద్ధి ప్రస్థానంలో పలువురు భారతీయ ఇంజనీర్లు, ఫైనాన్స్ నిపుణులు సీనియర్ల స్థాయిలో పాలు పంచుకుంటూ ఉండటం సంతోషం కలిగించింది. అలాగే టెస్లా సరఫరా వ్యవస్థలో భారతీయ ఆటో విడిభాగాల సరఫరా సంస్థలకు ప్రాధాన్యం పెరుగుతుండటం గర్వకారణం. భారత్ నుంచి టెస్లా దిగుమతులను రెట్టింపు చేసుకునే దిశగా ముందుకెడుతోంది. మస్క్ వేగంగా కోలుకోవాలని ఆశిస్తున్నాను' అని సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఎక్స్‌లో గోయల్ ట్వీట్ చేశారు. 'మీరు టెస్లా ప్లాంటును సందర్శించడం సంతోషం కలిగించింది. కాలిఫోర్నియాకు రాలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. భవిష్యత్తులో మిమ్మల్ని తప్పకుండా కలుస్తాను' అని దానికి ప్రతిస్పందనగా మస్క్ ట్వీట్ చేశారు. టెస్లా 2022లో భారత్ నుంచి 1 బిలియన్ డాలర్ల విలువ చేసే విడిభాగాలను దిగుమతి చేసుకోగా, ఈసారి 1.9 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని భావిస్తున్నట్లు గోయల్ ఇటీవలే తెలిపారు.

పరిశీలనలో మినహాయింపులు..

టెస్లా భారత మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ముందుగా దిగుమతులతో ప్రారంభించి ఇక్కడ డిమాండ్‌ను బట్టి ప్లాంటును నెలకొల్పే యోచనలో ఉన్నట్లు రెండేళ్ల క్రితం మస్క్ చెప్పారు. అయితే, భారీ స్థాయి దిగుమతి సుంకాల విషయంలో భారత్ తమకు కొంత మినహాయింపు కల్పించాలని కోరారు. కానీ, టెస్లా కూడా ఇతర సంస్థల బాటలోనే రావాల్సి ఉంటుందని కేంద్రం అప్పట్లో స్పష్టం చేసింది. ఈ ఏడాది జూన్‌లో అమెరికాలో ప్రధాని మోదీతో మస్క్ సమావేశం అనంతరం.. దిగ్గజ ఎలక్ట్రిక్ కార్ల కంపెనీలను ఆకర్షించేందుకు తగిన విధానాన్ని రూపొందిస్తామంటూ కేంద్రం వెల్లడించడం గమనార్హం. దీనితో టెస్లా ఎంట్రీకి మార్గం సుగమం చేసేలా కంపెనీకి వెసులుబాట్లునిచ్చే అవకాశాలు ఉన్నాయంటూ అంచనాలు నెలకొన్నాయి.

సుబ్రతా రాయ్ కన్నుమూత



ముంబై: సహారా ఇండియా పరివార్ వ్యవస్థాపకుడు సుబ్రతా రాయ్ కన్నుమూశారు. 75 సంవత్సరాల రాయ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బీహార్‌లోని అరారియాలో జన్మించిన రాయ్ భారతీయ వ్యాపార రంగంలో ప్రముఖ వ్యక్తి. ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, మీడియా, హాస్పిటాలిటీతో సహా వివిధ రంగాలలో ఆయన వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. గోరఖ్‌పూర్‌లోని ప్రభుత్వ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో మెకానికల్ ఇంజనీరింగ్‌లో విద్యను అభ్యసించడంతో రాయ్ కెరీర్ ప్రారంభమైంది. 1976లో కష్టాల్లో ఉన్న చిట్ ఫండ్ కంపెనీ సహారా ఫైనాన్స్‌ను సొంతం చేసుకున్నారు. 1978 నాటికి ఈ సంస్థను సహారా ఇండియా పరివార్‌గా మార్చారు. ఈ సంస్థ భారత్‌లోని అతిపెద్ద వ్యాపార దిగ్గజ సంస్థల్లో ఒకటిగా ఎదిగింది.

వ్యాపార విస్తరణ..

రాయ్ నేతృత్వంలో సహారా అనేక వ్యాపారాల్లోకి విస్తరించింది. ఈ సంస్థ 1992లో హిందీ భాషా వార్తాపత్రిక రాష్ట్రీయ సహారాను ప్రారంభించింది. 1990ల చివరలో పూణే సమీపంలో ప్రతిష్టాత్మకమైన ఆంబీ వ్యాలీ సిటీ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. సహారా టీవీతో టెలివిజన్ రంగంలోకి ప్రవేశించింది. తర్వాత దీనిని సహారా వన్‌గా మార్చారు. 2000వ దశకంలో సహారా లండన్‌లోని గ్రోస్వెనర్ హౌస్ హోటల్, న్యూయార్క్ నగరంలోని ప్లాజా హోటల్ వంటి ఐకానిక్ ప్రాపర్టీలను కొనుగోలు చేయడంతో అంతర్జాతీయ ఖ్యాతిని పొందింది. సహారా ఇండియా పరివార్‌ను టైమ్ మ్యాగజైన్ ఒకప్పుడు భారతీయ రైల్వేల తర్వాత భారతదేశంలో రెండవ అతిపెద్ద ఉపాధి సంస్థగా ప్రశంసించింది. దాదాపు 12 లక్షల మంది శ్రామిక శక్తిని కలిగిఉన్న సంస్థగా ఎదిగింది. భారతీయ కుటుంబాల్లో గణనీయమైన భాగస్వామ్యంతో 9 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడిదారులను కలిగి ఉన్నట్లు ఒకప్పుడు సగర్వంగా సంస్థ ప్రకటించింది. అయితే రెండు గ్రూప్ సంస్థలు- నిబంధనలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా దాదాపు రూ.25,000 కోట్లు వసూలు చేశాయన్న ఆరోపణలు, ఈ మొత్తం తిరిగి వసూళ్ల దిశలో ఆయన తీహార్ జైలుకు వెళ్లడం రాయ్ ప్రతిష్టను దెబ్బతీశాయి.

అసెట్ మానిటైజేషన్‌తో రూ. 4 వేల కోట్లు

వైజాగ్ స్టీల్ ఆశాభావం



కోల్‌కతా: రుణ భారం తగ్గించుకుని, ఉత్పత్తిని పెంచుకోవడం, టర్న్‌అరౌండ్ సాధించడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు వైజాగ్ స్టీల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ - ఆర్ఐఎన్ఎల్) సీఎండీ అతుల్ భట్ తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంటు, విశాఖలోని స్థలాల మానిటైజేషన్‌తో పాటు వ్యయ నియంత్రణ చర్యలతో దాదాపు రూ. 3,000- 4,000 కోట్లు సమీకరించుకోగలిగితే ఇందుకు సహాయకరంగా ఉండగలదని ఆయన చెప్పారు. ఉక్కు, మెటలర్జీ సదస్సులో పాల్గొన్న సందర్భంగా సంస్థ సీఎండీ అతుల్ భట్ ఈ విషయాలు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే మానిటైజేషన్ (విక్రయం, లీజుకివ్వడం తదితర మార్గాల్లో అసెట్లపై ఆదాయం ఆర్జించడం) చేపట్టగలిగితే ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 2022-23లో ఆర్ఐఎన్ఎల్ సుమారు రూ. 3,000 కోట్లు నష్టం నమోదు చేసింది. అంతర్జాతీయంగా మందగమనంతో నిల్వలు పేరుకుపోవడం, ఉక్కుపై ఎగుమతి సుంకాలు, ముడి వనరుల లభ్యతకు భద్రత లేకపోవడం తదితర అంశాలు ఇందుకు కారణమని భట్ వివరించారు. ఓపెన్ మార్కెట్ నుంచి ముడి ఇనుము కొనాల్సి రావడం వల్ల ప్రతి టన్నుకు రూ. 6,000 మేర ఎక్కువ వెచ్చించాల్సి వస్తోందని, దీనికి తోడు రూ. 23,000 కోట్ల భారీ రుణ భారం ఉందని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో మానిటైజేషన్ ప్రణాళికతో రుణభారం తగ్గి, నిర్వహణ మూలధన పరిస్థితి మెరుగుపడగలదన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో ఉన్న ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంటుపై ఆర్ఐఎన్ఎల్ రూ. 2,000 కోట్లు ఇన్వెస్ట్ చేసింది.

ఒబెరాయ్ ఇక లేరు



న్యూఢిల్లీ: హోటల్ పరిశ్రమలో సుపరిచితుడు, దిగ్గజ పారిశ్రామికవేత్త, ఒబెరాయ్ హోటల్స్ గౌరవ చైర్మన్ పృథ్వీరాజ్ సింగ్ (పీఆర్ఎస్) ఒబెరాయ్, 94 ఏళ్ల వయసులో అనారోగ్య సమస్యలతో మంగళవారం తుదిశ్వాస విడిచారు. 'బికీ'గా అందరూ పిలుచుకునే పీఆర్ఎస్ ఒబెరాయ్ తండ్రి వారసత్వాన్ని పుచ్చుకుని హోటల్ వ్యాపారంలోకి ప్రవేశించారు. తన తండ్రి, ఒబెరాయ్ గ్రూప్ వ్యవస్థాపకుడు రాయ్ బహదూర్ మోహన్ సింగ్ ఒబెరాయ్ నుంచి 1984లో హోటళ్ల వ్యాపారాన్ని స్వీకరించారు. ఆ తర్వాత పీఆర్ఎస్ ఒబెరాయ్ తన గ్రూప్‌ను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారు. ఒబెరాయ్ గ్రూప్ ఇప్పుడు ఏడు దేశాల్లో హోటల్స్, క్రూయిజ్‌లు, రిసార్ట్‌లు కలిగి ఉంది. ఒబెరాయ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్, ట్రైడెంట్ హోటల్స్, మెయిడెన్ హోటల్ బ్రాండ్లపై ఆతిథ్య సేవలను అందిస్తోంది.

టోకు ద్రవ్యోల్బణం.. 7వ నెలా రివర్స్..

అక్టోబర్‌లో మైనస్ 0.52 శాతం



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం వరుసగా ఏడవనెల అక్టోబర్‌లోనూ మైనస్‌లోనే నిలిచింది. సమీక్షా నెల్లో సూచీ మైనస్ (-)0.52 వద్ద ఉంది. సూచీలో అసలు పెరుగుదల లేకపోగా, క్షీణతలో ఉండే ఈ తరహా పరిస్థితిని ప్రతిద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు. కొన్ని కీలక ఉత్పత్తుల ధరలు పెరక్కపోవడం ఈ పరిస్థితికి ప్రధాన కారణం. వ్యవస్థలో తగిన డిమాండ్ లేని పరిస్థితితో పాటు, వార్షికంగా హైబేస్ కూడా ఈ పరిస్థితికి కారణంగా ఉంటుంది. ఇక్కడ గత ఏడాది అక్టోబర్‌ను చూస్తే టోకు ద్రవ్యోల్బణం 8.67 శాతం (హైబేస్‌తో)గా ఉంది.

నాట్కో డివిడెండ్ రూ.1.25

NATCO

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ సంస్థ నాట్కో ఫార్మా 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రెండవ మధ్యంతర డివిడెండ్ కింద రూ.1.25 ప్రకటించింది. సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం ఆరింతలకుపైగా పెరిగి రూ.57 కోట్ల నుంచి రూ.369 కోట్లకు చేరింది. టర్నోవర్ 134 శాతం అధికమై రూ.452 కోట్ల నుంచి రూ.1,061 కోట్లను తాకింది.

ఎన్ఎండీసీ లాభం అప్

క్యూ2లో రూ. 1,025 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2లో) నికర లాభం 16 శాతం ఎగసి రూ. 1,025 కోట్లకు చేరింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 886 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇక మొత్తం ఆదాయం సైతం రూ. 3,755 కోట్ల నుంచి రూ. 4,335 కోట్లకు జంప్ చేసింది.

టీడీపీ ఖాతాలోకి రూ.27 కోట్ల స్కిల్ స్కామ్ నిధులు

▶ మొదటి పేజీ తరువాయి

టీడీపీ ప్రధాన కార్యాలయానికి చేరింది. ఈ మేరకు సీఐడీ దర్యాప్తులో వెల్లడైనట్టు సమాచారం. దీంతో టీడీపీ ఖాతాల్లో చేరిన నిధుల లోగుట్టును రట్టు చేసే దిశగా సీఐడీ దర్యాప్తు వేగవంతం చేస్తోంది. అందులో మొదటగా స్కిల్ స్కామ్ కేసులో కార్యాచరణకు ఉపక్రమించింది. ఈ కేసులో టీడీపీ ప్రధాన కార్యాలయానికి మంగళవారం నోటీసులు జారీ చేసింది. తాము కోరిన వివరాలతో ఈ నెల 18న సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కార్యాలయానికి రావాలని ఆ నోటీసుల్లో పేర్కొంది.

హవాలా మార్గంలో రూ.27 కోట్లు

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో కొల్లగొట్టిన రూ.241 కోట్లలో రూ.27 కోట్లు టీడీపీ ప్రధాన కార్యాలయానికి చేరినట్టు సీఐడీ గుర్తించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా చెల్లించిన రూ.371 కోట్లలో రూ.241 కోట్లను డిజైన్ టెక్ వివిధ మార్గాల ద్వారా చంద్రబాబుకు చేర్చినట్టు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. అందులో రూ.27 కోట్లను టీడీపీ ఖాతాలో జమ చేసినట్టు సీఐడీ ఇటీవల గుర్తించింది. ఆ నిధులు పార్టీ బ్యాంకు ఖాతాలోకి ఎలా వచ్చాయన్నదానిపై స్పష్టత లేకపోవడం గమనార్హం. దీనిపై ప్రాథమిక ఆధారాలు సేకరించాక సీఐడీ నెల క్రితం టీడీపీ ప్రధాన కార్యాలయానికి నోటీసులు జారీ చేసింది. బ్యాంకు ఖాతాల లావాదేవీలు వివరాలు తెలపాలని పోస్టు ద్వారా నోటీసులు పంపించింది. దీంతో కంగుతిన్న టీడీపీ బ్యాంకు లావాదేవీల వివరాలను తెలిపేందుకు నాలుగు వారాల గడువు కావాలని సీఐడీకి సమాధానం ఇచ్చింది. నాలుగు వారాల గడువు ముగిశాక కూడా టీడీపీ ఆ నోటీసులకు సమాధానం ఇవ్వలేదు. అంటే టీడీపీ బ్యాంకు ఖాతాల్లో చేరిన నిధుల్లో ఏదో గూడుపుఠాణి ఉందన్నది స్పష్టమైంది. దాంతో సీఐడీ మరింత దూకుడు పెంచింది. టీడీపీ బ్యాంకు ఖాతాల లావాదేవీల వివరాలను తెలపాలని టీడీపీ ప్రధాన కార్యాలయానికి మంగళవారం నోటీసులు పంపింది. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పేరిట ఆ నోటీసులు జారీ చేసింది.

ఇతర కుంభకోణాలపైనా..

నెల క్రితం పోస్టులో పంపిన నోటీసులపై స్పందించని టీడీపీ.. ప్రస్తుతం ప్రత్యక్షంగా పంపిన నోటీసులపై ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. కేవలం స్కిల్ స్కామ్‌కు సంబంధించిన రూ.27 కోట్ల వివరాలే కాకుండా మొత్తం బ్యాంకు లావాదేవీల వివరాలు సీఐడీకి వెల్లడించాల్సిన అనివార్యత ఏర్పడింది. తద్వారా టీడీపీ అక్రమ నిధుల తరలింపు నెట్ వర్క్ గుట్టురట్టు కానుంది. ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్ రోడ్, అసైన్డ్ భూములు, మద్యం, ఇసుక కుంభకోణాల ద్వారా కొల్లగొట్టిన ప్రజాధనంలో టీడీపీ ప్రధాన కార్యాలయానికి ఎంతమేర తరలించారో నిగ్గు తేల్చే అవకాశాలున్నాయి. దీంతో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉండనున్నాయనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

'ఆరడుగుల' వేదన తీరింది!


ప్రభుత్వం మంజూరు చేసిన శ్మశాన భూమిలో పెదపాలెం గ్రామస్తులు

▶ మొదటి పేజీ తరువాయి

ఆరు అడుగుల నేల వెతుక్కుని అక్కడ అంత్యక్రియలు చేసేవారు. శ్మశానం కోసం భూమి ఇవ్వాలని ఆ ఊరి వాళ్లు అనేక సంవత్సరాలుగా పాలకులను అడుగుతూనే ఉన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆ ఊరికి మాత్రం శ్మశానం ఏర్పడలేదు. దళితుల కష్టాలకు చరమగీతం పాడుతూ, వారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం చేస్తున్న అనేక కార్యక్రమాలు వారికి కొండంత భరోసా ఇస్తున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఎక్కడా శ్మశాన వాటికలు లేని దళిత వాడలు ఉండకూడదనే సీఎం నిర్ణయం ఆ గ్రామ ప్రజల కష్టాలు తీర్చింది. గ్రామానికి ఆనుకుని సర్వే నంబర్ 273/2, 3లో శ్మశానం కోసం ఇటీవలే ప్రభుత్వం ఎకరం భూమి కేటాయించింది. ఇన్నాళ్లకు గ్రామానికి బాధ తప్పిందని, జగన్ వల్లే తమ కష్టాలు తీరాయని ఆ గ్రామానికి చెందిన యాజలి లూకయ్య సంతోషంగా చెప్పాడు.

సీఎం లక్ష్యంతో నెరవేరిన కల

ఎన్నితరాలు మారినా ఇంకా రాష్ట్రంలోని అనేక దళితవాడల్లో శ్మశానాలు లేవు. ఇప్పటి వరకు వారికి ఆ ఆరడుగుల వేదన తీరలేదు. అంతిమ సంస్కారాలు నిర్వహించుకునేందుకు అనేక దళిత వాడలు చెట్లూ, పుట్టలు, రోడ్ల పక్కన ఖాళీ స్థలాలపై ఆధారపడే దుర్భర పరిస్థితుల్లోనే ఉన్నాయి. ఈ సమస్య తన దృష్టికి వచ్చిన మరుక్షణం నుంచే వైఎస్ జగన్ రాష్ట్రంలో శ్మశాన వాటిక లేని దళితవాడ ఉండకూడదని నిర్ణయించారు. సమాజంలో వెనుకబడిన వారికోసం ఆ గ్రామాల్లోనే శ్మశాన వాటికల సదుపాయం కల్పించడానికి చకచకా ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో శ్మశాన వాటికలు లేని దళితవాడలను గుర్తించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో 1,854 గ్రామాల్లో శ్మశానాలు లేవని, వాటి కోసం 1,230 ఎకరాల భూమి అవసరమని ప్రభుత్వ యంత్రాంగం గుర్తించింది. ఆ గ్రామాల జనాభాను బట్టి అర ఎకరం నుంచి ఎకరం భూమిని శ్మశాన వాటికల కోసం ఇచ్చే అధికారాన్ని కలెక్టర్లకు ప్రభుత్వం ఇచ్చింది. దీంతో ఇప్పటికే 1,563 గ్రామాల్లో 951 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి గ్రామ పంచాయతీలకు అప్పగించారు. ఈ నెల 17న ఏలూరు జిల్లా నూజివీడులో జరిగే సభలో సీఎం వైఎస్ జగన్ ఆ శ్మశాన వాటికల కోసం భూమి కేటాయింపు పత్రాలను ఆ గ్రామాల వారికి ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

భూ సమీకరణ చేసైనా..

దళితవాడలను అనేక సంవత్సరాలుగా శ్మశాన వాటికల సమస్య పీడిస్తున్న గత పాలకులు వాటిపై దృష్టి పెట్టలేదు. తమ గ్రామానికి శ్మశాన వాటికల కోసం భూమి ఇవ్వాలని దళిత వాడల ప్రజలు ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు అడిగినా ఎవరూ స్పందించలేదు. చూద్దాం, చేద్దామనే వారే తప్ప వారి బాధను అర్థం చేసుకున్న వారే లేరు. మొట్టమొదటిసారి ఈ సమస్య మళ్లీ వినపడకుండా చేయాలనే సంకల్పంతో సీఎం జగన్ ఒకేసారి శ్మశాన వాటికలు లేని దళిత వాడలన్నింటికీ భూమి కేటాయించి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారు. ప్రభుత్వ భూమి లేని చోట భూ సమీకరణ చేసైనా శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఆరు అడుగుల కోసం వెతికేవాళ్లం



మా ఊళ్లో ఎవరైనా చనిపోతే మా పరిస్థితి దారుణంగా తయారయ్యేది. చివరి కార్యక్రమాల కోసం గ్రామం చుట్టు పక్కల ఆరు అడుగుల భూమి కోసం వెతికేవాళ్లం. నలుగురూ నాలుగు దిక్కులకు వెళ్లి రోడ్డు పక్కన ఎక్కడైనా అనువైన స్థలం ఉందేమో చూసేవాళ్లం. ఎవరైనా అడ్డు చెబితే మళ్లీ వేరే స్థలం వెతికేవాళ్లం. పొదల్లోనో, చెట్ల చాటునో ఎక్కడో ఒక చోట భూమిని వెతికి అలాంటి దారుణమైన స్థితిలోనే ఇప్పటివరకు అంత్యక్రియలు చేస్తున్నాం. మా గ్రామానికి శ్మశానం కోసం భూమి ఇవ్వాలని ఎంతమందిని అడిగామో లెక్కే లేదు. ఓట్ల కోసం మా ఊరు వచ్చినప్పుడు ఆ పని చేస్తామని చెప్పేవారు. ఆ తర్వాత మమ్మల్ని పట్టించుకునే వారు కాదు. పెద్దల చుట్టూ తిరిగి అలిసిపోయాం. జగన్ వచ్చి మా కష్టాలు తీర్చారు. మమ్మల్ని తలెత్తుకునేలా చేశాడు. మా గ్రామానికి శ్మశానం కోసం ఎకరం భూమి ఇచ్చారు.

– యాజల రఘుబాబు, పెదపాలెం దళితవాడ, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా

జగనన్న మాకు గౌరవాన్ని కల్పించారు



మా తాతల కాలం నుంచి శ్మశానం కోసం భూమి ఇవ్వాలని అడుగుతూనే ఉన్నాం. ఎన్ని కష్టాలు పడ్డామో చెప్పలేం. చనిపోయిన వాళ్లకి అంత్యక్రియలు కూడా గౌరవంగా చేయలేకపోతున్నామే అని బాధపడేవాళ్లం. ఇన్నాళ్లకి ఆ సమస్యని జగనన్న పట్టించుకుని ఇబ్బంది తీర్చారు. ఇకపై మా ఊరికి శ్మశానం లేదనే బాధ లేదు. అంతకుముందు ఎంతమందిని శ్మశానం కోసం స్థలం ఇవ్వాలని అడిగినా పట్టించుకోలేదు. కాళ్లావేళ్లా పడితే అదెంత పని అనేవాళ్లు. తీరా చూస్తే ఏమీ పని జరిగేది కాదు. మా కష్టం ఇప్పటికి తీరింది.

– పోతర్లంక సుజని, పెదపాలెం దళితవాడ, భట్టిప్రోలు మండలం, బాపట్ల జిల్లా

జగన్‌తోనే నిజమైన సామాజిక సాధికారత

చిలకలపూడి(మచిలీపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే రాష్ట్రంలో నిజమైన సామాజిక సాధికారత సాధ్యమైందని మాజీ మంత్రి, బందరు ఎమ్మెల్యే పేర్ని నాని చెప్పారు. ఆయన మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రల్లో సీఎం జగన్ లేకపోయినా జనం వేలాదిగా పాల్గొనటం చూసి ప్రతిపక్ష పార్టీలకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ సామాజిక సాధికారత సాధించలేదని చెప్పారు. సీఎం జగన్ మంత్రివర్గంలో, ఇతర అన్ని పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే పెద్దపీట వేసి, సంపూర్ణ రాజ్యాధికారం అందించారని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవుల్లో ఓసీ స్థానాల్లో కూడా బీసీలను చైర్‌పర్సన్లను చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మనసున్న ముఖ్యమంత్రిగా జనాభా దామాషా ప్రకారం అన్ని సామాజికవర్గాల వారికి పదవులు ఇచ్చారని వివరించారు. బీసీలు అధిక సంఖ్యలో ఉన్న రాష్ట్రాల్లో కూడా వారికి పట్టం కట్టలేదన్నారు. చంద్రబాబు హయాంలో అన్నీ అగ్రవర్ణాలకే కట్టబెట్టేవారని, 25 మంది మంత్రివర్గంలో ఉంటే 17 మంది అగ్రవర్ణాల వారు ఉన్నారని, రాజ్యసభ స్థానాలను కూడా అగ్రవర్ణాల వారికే కట్టబెట్టారని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు దూలం నాగేశ్వరరావు, సింహాద్రి రమేష్ పాల్గొన్నారు.

నేడు వాయుగుండం.. రేపటికి తీవ్రం

- నేడు సీమ, దక్షిణ కోస్తాలకు భారీ వర్షాలు
- తిరుపతి జిల్లా వాకాడు తీరంలో అలజడి
- ఒడ్డుకు చేరిన బోట్లు, వేట సామగ్రి


ఒడ్డుకు చేరిన పడవలు, మత్స్యకారులు

సాక్షి, విశాఖపట్నం/వాకాడు: ఆగ్నేయ బంగాళాఖాతంలో అండమాన్, నికోబార్ దీవులకు ఆనుకుని మంగళవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ బుధవారం నాటికి వాయుగుండంగా మారనుంది. ఆపై వాయవ్య దిశగా పయనిస్తూ పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆంధ్రప్రదేశ్ తీరానికి కాస్త దూరంలో గురువారం నాటికి తీవ్ర వాయుగుండంగా బలపడుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మంగళవారం రాత్రి నివేదికలో వెల్లడించింది. అనంతరం ఉత్తర, ఈశాన్య దిశగా మలుపు తిరిగి 17వ తేదీకి ఒడిశా తీరానికి చేరుకుంటుందని తెలిపింది.

కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ ఆవర్తనం నుంచి అల్పపీడనం ప్రాంతం వరకు మరో ద్రోణి విస్తరించి ఉంది. వీటి ఫలితంగా బుధ, గురువారాల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, బుధవారం అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో ఉరుములు, మెరుపులు సంభవించి.. పిడుగులు పడే ప్రమాదం కూడా ఉందని, ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రానున్న రెండు రోజులు గంటకు 40-50 కి.మీ.లు, గరిష్టంగా 60 కి.మీ.ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించింది.

ఎగసిపడుతున్న అలలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళవారం వాతావరణంలో ఒక్కసారిగా పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. తిరుపతి జిల్లా వాకాడు మండలం తూపిలిపాలెంలోని సముద్ర తీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. దాదాపు 3 నుంచి 5 మీటర్ల ఎత్తుకు అలలు ఎగసి పడుతుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. జిల్లాలోని చిల్లకూరు, కోట, వాకాడు, తడ, సూళ్లూరుపేట మండలాలకు చెందిన మత్స్యకారులు సముద్రంలో చేపల వేటను అర్ధంతరంగా నిలిపేసి బోట్లు, వేట సామగ్రిని ఒడ్డుకు చేర్చారు. సముద్ర తీరంలో జల్లులు పడుతున్నాయి. ఈదురు గాలులు వీస్తున్నాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి భీకరమైన శబ్దాలతో అలలు తీరాన్ని తాకడంతో మత్స్యకారులు వేట సామగ్రి వద్ద కాపలా ఉంటున్నారు.

ఏరో స్పేస్ శిక్షణకు విశాఖ విద్యార్థులు

20 మంది ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులకు దక్కిన అరుదైన అవకాశం


మెకానికల్ విద్యార్థులు

విశాఖ విద్య: విశాఖలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. 6 నెలల ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లో భాగంగా 20 మంది మెకానికల్ విద్యార్థులు ఏరోస్పేస్ శిక్షణకు ఎంపికయ్యారు. వీరిలో 8 మంది బాలికలున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద, ప్రతిష్టాత్మకమైన బోయింగ్ ఏరో స్పేస్ కంపెనీ విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ మెకానికల్ విద్యార్థులను ఎంపిక చేసుకోవడం విశేషం. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. దీనికయ్యే వ్యయాన్ని న్యూఢిల్లీకి చెందిన లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ (ఎల్ఎల్ఎఫ్) చెల్లించేందుకు ముందుకు వచ్చింది. ఈ తరహా శిక్షణకు ఏపీలోని విద్యార్థులు ఎంపిక కావటం ఇదే తొలిసారి. విద్యార్థులను సాంకేతిక విద్యా శాఖ జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ మూర్తి, కళాశాల మెకానికల్ విభాగం హెచ్‌వోడీ మధుకుమార్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నరసింహారావు అభినందించారు.

జనవరిలో పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాల భర్తీకి రాత పరీక్ష

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్ల (ఇంజినీరింగ్, నాన్-ఇంజినీరింగ్) పోస్టుల భర్తీ కోసం జనవరి 4న కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష నిర్వహించనున్నట్టు ఏపీపీఎస్సీ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 2018లో జారీచేసిన నోటిఫికేషన్‌కు అనుబంధంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించిన ఈ పరీక్ష ఉమ్మడి 13 జిల్లా కేంద్రాల్లో జరుగుతుందన్నారు. జనవరి 4న ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ(పేపర్-1), మధ్యాహ్నం 2.30-5 గంటల వరకు సంబంధిత సబ్జెక్టు (పేపర్-2) పేపర్ ఉంటాయన్నారు. హాల్ టికెట్లను వెబ్‌సైట్ https: //psc.ap.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

గిరిజనుల సంక్షేమానికి రూ.24,000 కోట్ల పథకం

- మోదీ గ్యారంటీల ముందు కాంగ్రెస్ హామీలు పని చేయవు
- మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి



బేతుల్: గిరిజనుల సంక్షేమ కోసం రూ.24,000 కోట్లతో కొత్త పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆయన మంగళవారం మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాలో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో బీజేపీ ఘన విజయం సాధించడం ఖాయమని పునరుద్ఘాటించారు. తమ పార్టీ సభలకు జనం భారీ ఎత్తున తరలివస్తున్నారని చెప్పారు. మధ్యప్రదేశ్‌లో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు తమ పార్టీ పట్ల అపూర్వమైన విశ్వాసం, మమకారం చూపుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం 'జనజాతీయ గౌరవ్ దివస్'ను జరుపుకోబోతున్నామని, జార్ఖండ్‌లో భగవాన్ బిర్సాముండాకు నివాళులు అర్పించబోతున్నానని తెలిపారు. గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా రూ.24,000 కోట్ల పథకాన్ని ప్రటించనున్నట్లు వివరించారు.

మోదీ ఇస్తున్న గ్యారంటీ

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష కాంగ్రెస్ పరాజయాన్ని ఇప్పటికే అంగీకరించిందని ప్రధాని మోదీ చెప్పారు. మోదీ గ్యారంటీల ముందు కాంగ్రెస్ నకిలీ హామీలు పని చేయవని తేల్చిచెప్పారు. ఆ విషయం కాంగ్రెస్‌కు కూడా తెలుసని అన్నారు. ఆ పార్టీ ఇక అదృష్టాన్ని నమ్ముకోవాల్సిందేనని స్పష్టం చేశారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాఖ్ రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం గురించి కాంగ్రెస్ ఏనాడూ ఆలోచించలేదని తప్పుపట్టారు. వాటన్నింటినీ తమ ప్రభుత్వం ఆచరణలో చేసి చూపించిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా అమలు చేస్తామని, ఇది మోదీ ఇస్తున్న గ్యారంటీ అని వ్యాఖ్యానించారు.

మూర్ఖుల సర్దార్ రాహుల్ గాంధీ

ప్రజల జేబుల్లో 'మేడ్ ఇన్ చైనా'ఫోన్లు మాత్రమే కనిపిస్తున్నాయంటూ కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ తిప్పికొట్టారు. మొబైల్ ఫోన్ల తయారీలో మన దేశం ప్రపంచంలోనే రెండో స్థానానికి చేరుకుందని వెల్లడించారు. అలాంటి మూర్ఖుల సర్దార్ ప్రపంచంలో ఉంటారా? అని రాహుల్‌పై మండిపడ్డారు. భారత్ నుంచి ఏటా రూ.లక్ష కోట్ల విలువైన ఫోన్లు ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. ఆకాశంలో విహరిస్తున్న కాంగ్రెస్ నాయకులకు వాస్తవాలు ఏమిటో తెలియవని ఎద్దేవా చేశారు. మన దేశం సాధిస్తున్న విజయాలను కళ్లతో చూడలేని జబ్బు వారికి ఉందని విమర్శించారు. భారత్ వోకల్ ఫర్ లోకల్‌గా మారిందన్నారు. స్వదేశీ ఉత్పత్తులు మార్కెట్లను ముంచెత్తుతున్నాయని, ఈ పరిణామంపై వ్యాపార, వాణిజ్య వర్గాలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నాయని ప్రధానమంత్రి వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విధ్వంసమే మిగులుతుదందని ఓటర్లను అప్రమత్తం చేశారు.

పంచతంత్రం

ఛత్తీస్‌గఢ్‌లో రాజకీయంగా కీలక ప్రాంతమైన సర్గుజాలో అధికార కాంగ్రెస్ ఈసారి ఎదురీదుతోంది. ఇక్కడ 14 అసెంబ్లీ స్థానాలున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నింటినీ కాంగ్రెసే నెగ్గింది. ఈ ప్రాంతంలో ఒక పార్టీ ఇలా క్లీన్ స్వీప్ చేయడం రాష్ట్ర చరిత్రలో అదే తొలిసారి. అదే ఊపులో మొత్తం 90 సీట్లకు గాను కాంగ్రెస్ ఏకంగా 68 స్థానాలు నెగ్గి 15 ఏళ్ల అనంతరం బీజేపీని గద్దె దింపింది. కానీ ఈసారి మాత్రం సర్గుజాలో పరిస్థితులు కాంగ్రెస్‌కు అంత సానుకూలంగా లేవన్న అభిప్రాయం వినిపిస్తోంది...!

- ఛత్తీస్‌గఢ్‌లో కీలక ప్రాంతం
- గత ఎన్నికల్లో క్లీన్‌స్వీప్
- ఈసారి అధికార వ్యతిరేకత, అంతర్గత పోరుతో సతమతం

సర్గుజాలో కాంగ్రెస్ ఎదురీత!

కారణాలెన్నో...

ఉత్తర ఛత్తీసగఢ్‌లోని సర్గుజా ఉత్తరాన యూపీ, పశ్చిమాన మధ్యప్రదేశ్, తూర్పున జార్ఖండ్‌తో సరిహద్దులు పంచుకుంటుంది! ఒకప్పుడు నక్సల్ ప్రాబల్యముండేది. ఇప్పుడది బాగా తగ్గుముఖం పట్టింది. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ కష్టకాలం ఎదుర్కొంటుండటం వెనక పలు కారణాలున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. వాటిలో ముఖ్యమైనది ఈ ప్రాంతానికి చెందిన డిప్యూటీ సీఎం టి.ఎస్.సింగ్‌దేవ్‌కు ముఖ్యమంత్రి భూపేశ్ బఘెల్‌తో ఉన్న తీవ్ర విభేదాలు. రాచ కుటుంబీకుడైన సింగ్‌దేవ్‌కు సర్గుజాలో తిరుగులేని ఆదరణ ఉంది. అయితే ఈసారి మాత్రం టికెట్లు దక్కని పలువురు అసంతృప్తులు నేరుగా ఆయనపైనే ఆరోపణలు సంధిస్తున్నారు. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సభ్యునిగా తమకు అవకాశం రాకుండా అడ్డుపుల్ల వేశారంటూ మండిపడుతున్నారు. పక్కాగా



సర్వేలు చేయించి, వాటి ఆధారంగానే టికెట్లిచ్చామని, బృహస్పత్‌సింగ్ వంటి ఒకరిద్దరిని మాత్రం పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించినందుకు పక్కన పెట్టినట్టు సింగ్‌దేవ్ చెబుతున్నారు. అయితే, ఈసారి సర్గుజాలో కాంగ్రెస్‌కు సీట్లు తగ్గుతాయని ఆయన స్వయంగా అంగీకరించడం విశేషం. ''ఈసారి ఇక్కడ 10 సీట్లకు తగ్గకుండా నెగ్గుతామన్న నమ్మకముంది. ఎందుకంటే క్లీన్‌స్వీప్ అన్నిసార్లూ సాధ్యమా?'' అని నర్మగర్భంగా ప్రశ్నించారు. ప్రతి మ్యాచ్‌లోనూ ట్రిపుల్ సెంచరీ కొట్టలేం కదా అంటూ ముక్తాయించారు!

బరిలోకి బీజేపీ ఎంపీలు

2018లో సర్గుజా ఓటర్లు తనకు పూర్తిగా మొండిచేయి చూపిన నేపథ్యంలో బీజేపీ ఈసారి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఏకంగా ఇద్దరు సిట్టింగ్ ఎంపీలను ఇక్కడ అసెంబ్లీ బరిలో దింపింది. వారిలో ఒకరు కేంద్ర మంత్రి రేణుకా సింగ్ కావడం విశేషం. అలాగే సీతాపూర్ స్థానంలో మంత్రి అమర్జిత్ భగత్‌పై సీఆర్పీఎఫ్‌కు రాజీనామా చేసి రాజకీయ తీర్థం పుచ్చుకున్న 33 ఏళ్ల రామ్‌కుమార్ టిప్పోను బీజేపీ బరిలో దింపింది. ఈ చర్య సీతాపూర్‌తో పాటు సర్గుజాలోని ఇతర అసెంబ్లీ స్థానాల్లో కూడా తమకు భారీగా యువతరం ఓట్లను సాధించి పెడుతుందని ఆశిస్తోంది. సింగ్‌దేవ్ సీఎం అవుతారన్న సంకేతాలివ్వడం గత ఎన్నికల్లో సర్గుజాలో కాంగ్రెస్‌కు భారీగా లాభించింది. తీరా ఫలితాలొచ్చాక బఘెల్‌ను అందలమెక్కించడం సర్గుజావాసులకు బాగా అసంతృప్తి కలిగించిందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. దీనికి తోడు సింగ్‌దేవ్ కంచుకోట అనే ఉద్దేశంతో అక్కడ బఘేల్ ప్రత్యేకించి పెద్దగా అభివృద్ధి పనులేమీ చేయలేదంటున్నారు. ఇది కూడా ఈసారి కాంగ్రెస్‌కు మరింత మైనస్‌గా మారేలా ఉందన్న అభిప్రాయాలు విన్పిస్తున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇదీ సర్గుజా స్వరూపం...	ఈ ప్రాంతంలో మొత్తం జిల్లాలు	జష్‌పూర్, కోరియా, సూరజ్‌పూర్, సర్గుజా, బలరాంపూర్, మనేంద్రగఢ్-చిర్మరి-భరత్‌పూర్	అసెంబ్లీ స్థానాలు	ఎస్టీ రిజర్వుడు స్థానాలు
	6		14	9

సర్గుజాలో గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు (మొత్తం అసెంబ్లీ స్థానాలు 14)	పార్టీ	2008	2013	2018
	బీజేపీ	9	7	0
	కాంగ్రెస్	5	7	14



ఐదేళ్లలో ఆస్తులు 'పెంచేసుకున్నారు'

- ఛత్తీస్‌గఢ్‌లో 60 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల ఆస్తుల్లో వృద్ధి
- ఎన్నికల బరిలో 66 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు
- 5% నుంచి అత్యధికంగా 3,340% వరకు పెరిగిన ఆస్తులు
- రూ.10.33 కోట్లు పెరిగిన సీఎం భూపేశ్ బఘేల్ సంపద



సాక్షి, న్యూఢిల్లీ: గత ఐదేళ్లలో ఛత్తీస్‌గఢ్ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కొందరి సంపద ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. అసెంబ్లీలోని మొత్తం 90 మందికిగాను 66 మంది తిరిగి పోటీ చేస్తున్నారు. వీరిలో 60 మంది అంటే సుమారు 91 శాతం మంది ఆస్తుల్లో 5 శాతం నుంచి అనూహ్యంగా 3,340 శాతం వరకు పెరుగుదల నమోదు చేసుకుంది. అయితే, ఇందుకు విరుద్ధంగా మిగతా ఆరుగురి సంపదలో తగ్గుదల 4 శాతం నుంచి 35 శాతం వరకు నమోదు కావడం గమనార్హం. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫారమ్స్ (ఏడీఆర్), ఛత్తీస్‌గఢ్ ఎలక్షన్ వాచ్–2023 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో తిరిగి పోటీ చేస్తున్న 66 మంది ఎమ్మెల్యేలు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్లను విశ్లేషించి ఈ మేరకు మంగళవారం నివేదికను విడుదల చేశాయి.

2018లో స్వతంత్రులతో సహా వివిధ పార్టీల తరఫున మరోసారి పోటీ చేసిన ఈ 66 మంది ఎమ్మెల్యేల సగటు ఆస్తుల విలువ రూ.12.98 కోట్లుగా ఉంది. కాగా, 2023లో ఎన్నికల బరిలో నిలిచిన సిట్టింగ్ ఎమ్మెల్యేల సగటు ఆస్తి రూ.13.74 కోట్లకు పెరిగింది. అంటే సగటు ఆస్తి వృద్ధి రూ.76.45 లక్షలుగా ఉంది. అత్యధికంగా ఆస్తులు పెరిగిన ఎమ్మెల్యేల జాబితాలో తఖత్‌పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కు చెందిన రష్మీ ఆశిష్ సింగ్ మొదటి వరుసలో నిలిచారు. ఈమె ఆస్తుల విలువ అత్యధికంగా రూ.12.70 కోట్ల మేర పెరిగాయి. ఈమె ఆస్తుల విలువ 2018లో రూ.8.73 కోట్లు కాగా 2023లో ఈ విలువ రూ.21.44 కోట్లకు చేరింది. ఆ తర్వాత ఆరాంగ్ (ఎస్సీ) నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కి చెందిన డాక్టర్ శివకుమార్ దహరియా ఆస్తులు రూ.2.37 కోట్ల నుంచి రూ.13.37 కోట్లకు చేరడంతో రూ.10.99 కోట్లు పెరుగుదల నమోదైంది. పటాన్ నియోజకవర్గం నుంచి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ సంపద రూ.23.05 కోట్ల నుంచి రూ.33.38 కోట్లకు చేరింది. దీంతో ఆయన ఆస్తుల్లో రూ.10.33 కోట్ల పెరుగుదల నమోదైంది. అదేవిధంగా, అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన 49 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల ఆస్తుల్లో 3.19%, ప్రతిపక్ష బీజేపీకి చెందిన 12 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేల సంపదలో 19.05% వృద్ధి నమోదైంది. అయితే, కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజిం సిట్టింగ్ ఎమ్మెల్యే అమితేశ్ శుక్లా ఆస్తుల్లో మాత్రం తగ్గుదల నమోదైంది. ఈయన ఆస్తుల విలువ రూ.74 కోట్ల నుంచి రూ.48 కోట్లకు తగ్గడంతో రూ.25 కోట్ల క్షీణత నమోదైందని ఏడీఆర్ నివేదిక వివరించింది.

మధ్యప్రదేశ్ మాదే: రాహుల్

తమ ఎమ్మెల్యేలను బీజేపీ కొనేసిందని ధ్వజం



భోపాల్: మధ్యప్రదేశ్‌లో విజయం కాంగ్రెస్‌దేనని ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 230 సీట్లకు గాను తాము ఏకంగా 150కి పైగా సాధిస్తామని ధీ మా వెలిబుచ్చారు. మంగళవారం రాష్ట్రంలోని విదిశలో ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రమంతటా కాంగ్రెస్ గాలి వీస్తోందన్నారు. ''ఐదేళ్ల క్రితం మధ్యప్రదేశ్ ప్రజలు కాంగ్రెస్‌కు అధికారమిచ్చారు. కానీ మోదీ, అమిత్ షా, శివరాజ్‌సింగ్ చౌహాన్ కలిసి మా ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని పడగొట్టారు'' అంటూ దుయ్యబట్టారు. ''వారిది విద్వేషపు మార్గం. మేం మాత్రం ప్రేమనే నమ్ముకుని హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటకల్లో బీజేపీని మట్టికరిపించాం. కర్ణాటకలో ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తున్నాం.'' అని వివరించారు. మధ్యప్రదేశ్‌లో 500 పరిశ్రమలు స్థాపించా మని మోదీ అడ్డంగా అబద్ధాలాడారని రాహుల్ అన్నారు. యూపీఏ హయాంలో బుందేల్‌ఖండ్ అభ్యున్నతికి రూ. 7,000 కోట్ల ప్యాకేజీని ఆమోదిస్తే మోదీ సర్కారు అందులోంచి ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని తికంగఢ్ ర్యాలీలో ఆయన ఆరోపించారు. బీజేపీ నేతలే దాన్ని పంచుకు తిన్నారని మండిపడ్డారు. సూటు, బూట్లు వేసుకునే సంపన్నుల కోసం మాత్రమే మోదీ సర్కారు పని చేస్తోందని ఎద్దేవా చేశారు.

రాగ పరిమళం.. నృత్య నీరాజనం

50 ఏళ్లకు పైగా కళామతల్లి సేవ • సంగీతంపై మక్కువ పెంచుతున్న కళాశాల

- ప్రత్యేక కార్యక్రమాల్లో విద్యార్థుల ప్రదర్శన
- అనువైన సమయాల్లో శిక్షణ
- మానసిక ప్రశాంతతో పాటు ఉద్యోగ అవకాశం
- గృహిణులతో పాటు ఉద్యోగుల ఆసక్తి

వయస్సు అంకె మాత్రమే..

కళాశాలకు వచ్చే విద్యార్థులను చూస్తే వయస్సు ఒక అంకె మాత్రమే అనే విషయం ఇట్టే అర్థమవుతుంది. ఈ వయస్సులోనే చదువుకోవాలి, ఆ వయస్సులోనే ఏదైనా సాధ్యమనే భావనను చెరిపేస్తున్నరు ఇక్కడి విద్యార్థులు. 60 ఏళ్లకు పైబడిన వృద్ధులతో పాటు నాలుగైదేళ్ల చిన్నారులు సైతం ఇక్కడ శిక్షణ పొందుతుండటం విశేషం. కుల మతాలకు అతీతంగా, వయస్సు భేదం లేకుండా ఇక్కడ పలుకుతున్న రాగాలు.. కదులుతున్న అందియలను చూస్తే ఎంతో ముచ్చటేస్తుంది.



వయోలిన్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారి



సంగీతం పేరు చెప్పగానే జిల్లా ప్రజలకు ముందుగా గుర్తుకొచ్చే పేరు పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినాకపాణి. ఈయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా అయినప్పటికీ వైద్యులుగా కర్నూలు మెడికల్ కళాశాలలో పనిచేస్తూ ఇక్కడే పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత తుదిశ్వాస విడిచే వరకు కర్నూలులోనే ఉండిపోయారు. రోగాలను, రాగాలను సరిచేసిన సవ్యసాచిగా పేరుగడించారు. శాస్త్రీయ సంగీతానికి ఊపిరి పోసిన ఆయన ఎంతో మందిని వైద్య నిష్ణాతులుగా, సంగీత శిఖామణులుగా తీర్చిదిద్దడం విశేషం.



దాసరి పార్వతి. వెల్దుర్తి మండలం లక్కసాగరం గ్రామానికి చెందిన ఈ యువతి పాటతోనే ప్రపంచానికి పరిచయమైంది. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఈమె ఒకప్పుడు సంగీతం నేర్చుకోవడానికి మరో ప్రాంతానికి నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. అలాంటిది ఈమె గొంతులో పలికిన పాట తన గ్రామం ఎప్పుడూ చూడని బస్సును పరిచయం చేయగలిగింది. ఈమె ఒక్కరే కాదు.. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జిల్లాకు చెందిన ఎంతో మంది ఇటీవల కాలంలో టెలివిజన్ కార్యక్రమాలతో తమ పతిభను చాటుతున్నారు.



గాత్రంలో శిక్షణ

ఒకప్పుడు పెళ్లి చూపులు అనగానే సంగీతం వచ్చా అని అడిగేవారు. ఏదమ్మా ఓ పాట పాడమని అడిగి మరీ మైమరిచిపోయేవారు. ఆ తర్వాత.. సంగీతం ఏముందిలే, పిల్లలకు జోలపాట పాడితే చాలనుకున్నారు. ఇప్పుడిక అమ్మాయిలు దొరకడమే కష్టమవుతున్న పరిస్థితుల్లో సంగీతం మాటే మర్చి సర్దుకుపోతున్నారు. పిల్లలకు కనీస సంగీత జ్ఞానం నేర్పుదామని కొందరు తల్లిదండ్రులు భావిస్తున్నా.. ఆ దిశగా గొంతు విప్పేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి. కనీసం టీవీల్లో పాత పాటలు చూద్దామన్నా.. పిల్లలు రిమోట్ లాగేసుకొని మార్చేయడం ప్రతి ఇంట్లో కనిపించే తంతే. పండగలు పబ్బాల సమయంలో ఏ గుడిలోనో, లేక ప్రత్యేక కార్యక్రమాల్లోనో తప్ప కచేరీల ఊసే ఉండటం లేదు. ఇక కొన్ని వాయిద్యాల పేర్లు కూడా ఇప్పటి తరం తెలుసుకోలేకపోవడం చూస్తే సంగీతం ఏస్థాయిలో కనుమరుగవుతుందో అర్థమవుతోంది. ఇలాంటి రోజుల్లో కూడా కర్నూలు నగరంలోని ప్రభుత్వ శారద సంగీత, నృత్య కళాశాల సంగీత పరిమళాలను వెదజల్లుతోంది. ఆ భవనం నుంచి ప్రతి రోజూ వినిపించే రాగాలను వింటే ఎప్పుడో ఒకప్పుడు తిరిగి పూర్వ వైభవం వస్తుందనే ఆశ కలుగుతుంది.

- సాక్షి, కర్నూలు డెస్క్

గత ఐదు సంవత్సరాల్లో విద్యార్థుల సంఖ్య	
2018-19	230
2019-20	225
2020-21	232
2021-22	284
2022-23	325
2023-24	253

ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలలో అందుబాటులోని కోర్సులు

గాత్రం, కూచిపూడి, డోలు, మృదంగం, వీణ, నాదస్వరం

అందరికీ అనువైన సమయంలో..

ఇప్పుడున్న పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను ర్యాంకుల వెంట పరుగులు తీయిస్తున్నారు. ఆ దిశగానే పిల్లల బుర్రలను పదును పెడుతున్నారు. పాఠశాలకు వెళ్లామా.. ఇంటికి వచ్చామా.. ఇలానే సాగుతోంది జీవనం. చాలా అరుదుగా పిల్లలను సంగీతంలోనూ తీర్చిదిద్దాలనే ఆలోచనకు వేదికగా నిలిచిన శారద సంగీత కళాశాల అనువైన సమయాల్లోనే శిక్షణ ఇస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో కర్నూలు పాత బస్టాండ్ ప్రాంతంలోని ఓ భవనం ఎన్నో రాగాలను పలుకుతోంది. పాటలు పాడించడమే కాదు వివిధ రకాల వాయిద్యాలను పలికించడంలోనూ నిష్ణాతులను చేస్తోంది. అనుభవజ్ఞులైన అధ్యాపకులు కూడా తోడు కావడంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.



కర్నూలులోని ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాల



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జీవితంలో స్థిరపడే దిశగా..

సంగీతం నేర్చుకుంటే ఏమొస్తుంది, మహా అయితే ఇంట్లో కూనిరాగాలు తీయడం మినహా అనే భావనను ఈ కళాశాల తొలగిస్తోంది. తీరిక సమయాల్లో తీసుకునే శిక్షణ జీవితంలో స్థిరపడేందుకు బాటలు కూడా వేస్తోంది. ఇక్కడ సర్టిఫికెట్ కోర్సులతో పాటు డిగ్రీలు కూడా చేసే అవకాశం ఉండటంతో పాఠశాలల్లో ఆయా విభాగాల ఉపాధ్యాయులుగా కూడా రాణిస్తున్నారు. శారద కళాశాల నుంచి ఇప్పటి వరకు 50 మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో, అంతకు మించి ప్రయివేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్నారు.

ఎన్నో వ్యాధులను నయం చేసే శక్తి

పాటకు రాళ్లను కరిగించే శక్తి కూడా ఉందంటారు. అంతేకాదు.. ఇటీవల కాలంలో పెద్ద పెద్ద ఆపరేషన్లు కూడా ఎలాంటి మత్తు ఇంజక్షన్ ఇవ్వకుండా కేవలం మ్యూజిక్ వింటూనే చేయించుకున్న ఉదాహరణలు కూడా ఉన్నాయి. ఎలాంటి వ్యాధినైనా సంగీతం నయం చేస్తుందనే విషయం ఎన్నో పరిశోధనలు రుజువు చేశాయి. అమెరికాలో నిర్వహించిన ఓ పరిశోధన ఇదే విషయాన్ని వెల్లడి చేస్తోంది. రెండు రూములను ఎంచుకొని, ఒకే విధమైన విత్తనాలను వాటిలో పెంచడం మొదలుపెట్టారు. వీటిలో ఒక రూములో శాస్త్రీయ సంగీతం అదనంగా ఏర్పాటు చేశారు. అనూహ్యంగా ఈ మొక్కల ఎదుగుదల ఆరోగ్యకరంగా ఉన్నట్లు పరిశోధన ఫలితం వెల్లడైంది.

మానసిక ప్రశాంతత లభిస్తుంది

వైద్య వృత్తి కావడంతో మానసికంగా ఎంతో ఒత్తిడి ఉంటుంది. చిన్నప్పటి నుంచి నృత్యం నేర్చుకోవాలనే ఆసక్తి ఉండటంతో ఎండీ పూర్తయ్యాక రెండేళ్ల పాటు శిక్షణ తీసుకున్నా. ఆ సమయంలోనే శ్రీశైలం, అహోబిళం, విజయవాడలో ప్రదర్శనలు కూడా ఇవ్వడం మర్చిపోలేని అనుభూతిని ఇచ్చింది. నృత్యం చేయడం ద్వారా మానసికంగా, శారీరకంగా కూడా దృఢంగా ఉండగలుగుతాం. మా పాప వయస్సు ఇప్పుడు ఐదున్నర సంవత్సరాలు. నృత్యం, సంగీతం విలువ తెలుసు కాబట్టే ఇప్పటి నుంచే శిక్షణ ఇప్పిస్తున్నా. నేను కూడా ఇప్పటికీ శిక్షణకు వెళ్తున్నా. యోగా, వాకింగ్, వ్యాయామం కూడా చేస్తున్నా నృత్యం చేయడం ద్వారా కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేం.

– చందన రాజారామ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కర్నూలు మెడికల్ కళాశాల

రోజంతా ఉత్సాహం

నా భర్త ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లే వరకు ఒకటే హడావుడి ఉంటుంది. ఆ తర్వాత ఇంటి పనులు ఉండనే ఉంటాయి. చిన్నప్పటి నుంచి పాటలు పాడటం అంటే ఎంతో ఇష్టం. పెళ్లయిన 14 ఏళ్లకు మా ఆయన ప్రోత్సాహంతో శారద కళాశాలలో చేరి గాత్రంలో రెండేళ్లుగా శిక్షణ పొందుతున్నా. మానసిక ప్రశాంతతో పాటు రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతున్నా. – అంబిక, గృహిణి, కర్నూలు

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943